# ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009 - నాణ్యతా అంశాలు

## Right to Free and Compulsory Education Act 2009 – Quality Issues

# ఉపాధ్యాయుల కరదీపిక

# Teachers Handbook


రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆం.ప్ర, హైదరాబాదు.

State Council of Educational Research & Training (S.C.E.R.T),
A.P, Hyderabad.

**రూపొందించినవారు.....**

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, పాఠ్యపుస్తక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

**శ్రీ కె.రాజేందర్ రెడ్డి,** కోఆర్డినేటర్, పాఠ్యపుస్తక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

**డా॥ టి.వి.ఎస్. రమేశ్,** కోఆర్డినేటర్, పాఠ్యపుస్తక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

**శ్రీ కె. రమేశ్ రావు,** ఎస్.ఎ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హుజూరాబాద్, కరీంనగర్

**శ్రీ ఇ.డి. మధుసూదన్ రెడ్డి,** ఎస్.ఎ, జిల్లా ఉన్నత పాఠశాల, కోస్గి, మహబూబ్‌నగర్

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** ఉపాధ్యాయురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

## ఎడిటింగ్ - సమన్వయం

**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి,** ప్రొఫెసర్, విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తక విభాగం,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు

## సలహాదారులు

**శ్రీ జి. గోపాల్ రెడ్డి,** సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

## ప్రధాన సలహాదారులు

**శ్రీమతి వి. ఉషారాణి, ఐ.ఏ.ఎస్,**
రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

# ముందుమాట

అందరికీ విద్యాభివందనాలు ....

మానవ ప్రగతికి విద్య ఎంతో దోహదపడుతుంది. భారతదేశ స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం రూపొందించిన చట్టాలలో అతి ముఖ్యమైనది. బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కుచట్టం. ఇది దేశ ప్రగతిలో ఒక మైలురాయి అని చెప్పవచ్చు. బడి ఈడు పిల్లలందరూ బడిలోచేరి పూర్తికాలం కొనసాగి తరగతిస్థాయిని సాధించడం లక్ష్యంగా ఈ చట్టం రూపొందించబడింది. బడి అంటే పిల్లల చదువులకు సంబంధించిన అంశమే కాకుండా పిల్లలు ఉండవలసిన చోటు, సర్వతోముఖాభివృద్ధికి అవకాశం కల్పించేది అని గుర్తించాలి. 1 ఏప్రిల్, 2010 నుండి అమల్లోకి వచ్చిన RTE-2009 బాలలందరికి విద్యను సాధించడానికి తోడ్పడుతుంది. RTE-2009 ప్రకారం రాష్ట్రంలోని బడులన్ని ఈ చట్ట పరిధిలో చట్ట ప్రకారం పనిచేయవలసి ఉంటుంది. బాలలందరూ బడిలో చేరి వారి సామర్థ్యాలకనుగుణంగా అభ్యసించడానికి సమాజ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడానికి పాఠశాల కృషిచేయాలి. పాఠశాల బాలల హక్కులకు రక్షణగా ఉండాలి. బాలల హక్కులకు రక్షణగా ఉండాలి. బాలలు తమకు సురక్షిత ప్రదేశం 'పాఠశాల' అని భావించాలి. అందుకు అనుగుణంగా పాఠశాల కార్యక్రమాలుండాలి. బాలల హక్కుల రక్షణకు తగిన వాతావరణం ఏర్పాటు చేయబడి హక్కుల పరిరక్షణకు కృషిచేయవలసి ఉంది. ఈ ప్రక్రియలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమవంతు సహకారం అందిస్తాయి. పాఠశాలల్లో తల్లిదండ్రుల, సమాజ భాగస్వామ్యాన్ని చట్టం అధికారికంగా ప్రోత్సహించింది. విద్యాసాధనలో భాగంగా చట్టపరంగా బడులు, టీచర్లు నిర్వర్తించవలసిన బాధ్యతలను చట్టం పేర్కొన్నది. అందుకు అవసరమైన ప్రామాణికాలను, నియమాలను రూపొందించింది. దానితోపాటు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కారణమైన కరికులం సిలబస్, పాఠ్యపుస్తకాలు మూల్యాంకనం వంటి వాటిని గురించి చర్చించింది.

జాతీయ విద్యా ప్రణాళిక చట్రం – 2005లో పేర్కొన్న అంశాలు, మార్గదర్శకాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం–2011 ను రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించారు. తదనుగుణంగా సిలబస్, 1 నుండి 9 తరగతుల వరకు నూతన పాఠ్యపుస్తకాలు రూపొందించారు. RTE-2009 స్ఫూర్తికి అనుగుణంగా వీటిని తరగతిగదుల్లో ప్రవేశపెట్టాలి. ఇందుకోసం ఈ కరదీపికలో అనుసరించాల్సిన బోధనాభ్యసన ప్రక్రియలు/ వ్యూహాలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పాత్ర గురించి విస్పష్టంగా చర్చించడం జరిగింది. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు సంబంధించిన వ్యక్తులందరికీ అంటే ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పాఠశాల విద్యావ్యవస్థలో భాగస్వాములయ్యే అధికారులువంటి అందరికీ RTE-2009 గురించి వివరించడం జరిగింది.

పాఠశాల విద్యాలక్ష్యాల సాధనలో ప్రగతి సాధనకు RTE-2009 తోడ్పడుతుంది. ప్రస్తుతం బాలలకు అందుబాటులో పాఠశాలలు ఏర్పాటు చేశారు. దీనివల్ల పాఠశాలల్లో నమోదు బాగా పెరిగినప్పటికీ, నాణ్యమైన విద్య మాత్రం పూర్తిస్థాయిలో సాధించబడలేదు. ఇందుకోసం ఉపాధ్యాయుల పనితీరు, వసతుల కల్పన, సమాజ భాగస్వామ్యం వంటి అంశాలలో మరింత ప్రగతి సాధనకు RTE-2009 తోడ్పడుతుంది. పాఠశాల లక్ష్యాలపట్ల, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిపట్ల, తమ పనితీరుపట్ల పాఠశాల విద్యా వ్యవస్థలోని వారందరూ సమీక్షించుకొని,లక్ష్యాలు నిర్ధారించుకొని పనిచేయవలసి ఉన్నది.

RTE-2009 లోని అంశాల గురించి పాఠశాల విద్యావ్యవస్థలోని వారందరూ అవగాహన ఏర్పరచుకుని, చట్టంలోని అంశాల అమలుకు కృషిచేయాల్సి ఉంటుంది. దానిలో భాగంగా RTE-2009 లోని అంశాలు, పనిదినాలు, పనిగంటలు, బాలల భావవ్యక్తీకరణకు స్వేచ్ఛ, భయరహిత వాతావరణం, పాఠశాల యాజమాన్య సభ్యులు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, నిరంతర సమగ్ర మూల్యాంకనం వంటి అంశాల గురించి ఈ కరదీపికలో చర్చించారు. కాబట్టి వీటిని ఆకళింపు చేసుకొని RTE-2009 సమర్థవంతమైన అమలుకు ఈ కరదీపికను ఉపయోగించుకుంటారని ఆశిస్తూ...

**జి. గోపాల్ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ
ఆంధ్రప్రదేశ్

తేది: 09.08.2013
స్థలం: హైదరాబాదు.

## విషయ సూచిక


| క్ర. సం. | అధ్యాయం | పేజీలు |
|---|---|---|
| 1. | ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం - 2009 ఆవశ్యకత - అవగాహన<br>**(RTE Act - 2009 - Importance - Awareness)** | 7 |
| 2. | బాలల సర్వతోముఖాభివృద్ధి - బాలల జ్ఞానం - సామర్థ్యాలు - నైపుణ్యాలు, వైఖరులు పూర్తిగా పెంపొందించుట<br>**(All Round Development of Children - Developing, Knowledge, Abilities, Skills, Attitudes to the fullest extent )** | 20 |
| 3. | బోధనాభ్యసన ప్రక్రియలు - పిల్లల్ని కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, కృత్యాలు, అన్వేషణ, కనుగొనడం ద్వారా నేర్చుకోవాలి<br>**(Promoting learning through activiteis, exploration and discovery in a child centered and child friendly manner)** | 45 |
| 4. | భయరహిత వాతావరణం - భయం, ఆందోళన, దండన వంటి వాటి నుండి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించుటకు తోడ్పడాలి<br>**(Fear Free Learning Environment - Making children free from fear trauma and anxiety and helping the child to express views freely)** | 70 |
| 5. | నిరంతర సమగ్ర మూల్యాంకనం<br>**(Continuous &Comprehensive Evaluation)** | 89 |
| 6. | పాఠశాల పని దినాలు - పని గంటలు<br>**(School Working Days - Working Hours)** | 115 |
| 7. | పాఠశాల యాజమాన్య కమిటీలు<br>**(School Management Committees)** | 126 |
| 8. | పాఠశాల అభివృద్ధి ప్రణాళిక<br>**(School Development Plan)** | 145 |
| 9. | పర్యవేక్షణ మరియు సమీక్షలు<br>**(Monitoring and Reviews)** | 160 |

# 1. ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం - 2009

## ఆవశ్యకత - అవగాహన

## (RTE Act - 2009 - Importance - Awareness)

**1.1.** మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి

**(Basic Questions - Think and Reflect)**

**1.2.** నేపథ్యం **(Context)**

**1.3.** చట్టంలోని అధ్యాయాలు – వాటి వివరాలు

**(Sections in the Act and Its details)**

- **1.3.1** చట్టం పరిధి – అమలు తేది – నిర్వచనాలు
  **(The frame of the Act, Implementation Dates)**
- **1.3.2** ఉచిత నిర్బంధ విద్యకు హక్కు
  **(Right to Free and Compulsory Elementary Act)**
- **1.3.3** సంబంధిత ప్రభుత్వం – స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతలు
  **(Responsibilities of concerned Govt., Local Govts and Parents)**
- **1.3.4** బడులు – ఉపాధ్యాయుల బాధ్యతలు
  **(Responsibiliteis of Schools and Teachers)**
- **1.3.5** పాఠ్యప్రణాళిక, మూల్యాంకన సంస్కరణలు – ప్రాథమిక విద్యను పూర్తిచేయడం
  **(Curriculum and Evaluation Reforms - Completion of Elementary Education)**

**1.4.** ఫిర్యాదుల పరిష్కారం – సలహా సంఘాలు

**(Grievance redressal and Committees)**

**1.5.** బడికి నియమాలు – ప్రామాణికాలు

**(Rules and Standards to Schools)**

**1.6. RTE - 2009** అమలుకు సూచికలు

**(RTE - 2009 Indicators of Implementations)**

**1.7.** ముగింపు **(Conclusion)**

కొందరి ఆలోచనలు సముద్రపు లోతుల్ని కొలుస్తాయి. ఆశయాలు హిమాలయశృంగాల్ని తాకుతాయి. భావోద్రేకాలు గగనతలాన్ని చుంబిస్తాయి. కార్యాచరణలు సమకాలీన బుద్ధి జీవుల్ని అనితరసాధ్యంగా ఆకర్షిస్తాయి.

ఈ పేదలకు మనం భూములివ్వలేం, ఆస్తులివ్వలేం, కనీసం ఒక్కపూట తిండికైనా సాయపడలేం. మనసున్న మనుషులుగా ఈ సమాజం ఇలానే అస్తవ్యస్తంగా ఉండరాదని కోరుకునే సామాజిక జీవులంగా వీళ్ళ పిల్లలకైనా ఏమైనా చేయగలమా? వీళ్ళకి మనం ఏమీ చెయ్యలేకుంటే ఈ దుస్థితి ఇలా ఎంత కాలమైనా కొనసాగుతూంటే ఇక ఈ శాస్త్రసాకేంతిక పరిజ్ఞానానికీ తత్వశాస్త్రాలకీ ప్రజాస్వామ్యానికీ అర్థం ఏమిటి?

"మరి ఈ పిల్లలకి మనం ఏం ఇవ్వగలం? ఏమిస్తే మంచిది? వాళ్ళనీ ప్రపంచంలో మనుషులుగా నిలబెట్టగలిగిందీ ఈ ప్రపంచాన్ని ఇంతకంటే మంచిగా మార్చాలన్న విచక్షణ పుట్టించగలిగిందీ చదువులే. ఆ చదువును వీళ్ళకందించగలిగితే....."

" చదువంటే నాలుగు ముక్కలు రాయడమూ చదవడమూ కాదు. ఈ చదువు మళ్ళీ వాళ్ళని అలానే ఉంచుతుంది. ప్రస్తుత వ్యవస్థలో సర్దుకుని పోవడాన్నే నేర్పుతుంది. అందుకే వీళ్ళకు ఇచ్చే చదువు అత్యాధునికమై ఉండాలి. ఉన్నత వర్గాలకందుబాటులో ఉన్న చదువు వీరికి ఇవ్వాలి. ఈ చదువు ఒక వైపు ఈ ఆధునిక సమాజంలో ధీటుగా రాణించగల్గడానికి, మరోవైపు ఈ సామాజిక వ్యవస్థ పట్ల స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం కలిగించడానికి తగినదిగా ఉండాలి.

మరి దీనికెవ్వరు నడుం బిగిస్తారు? మనమే బిగించాలి. ఈ సమాజం నుంచి అన్ని సదుపాయాలు పొంది, ఉన్నత స్థితికి ఎదిగిన మనమే దీనికి కంకణధారులం కావాలి.

చదువులో ప్రవేశం కల్పించి, దాని రుచి, అవసరం గుర్తింపజేసి, ధైర్యం, స్వేచ్ఛ అందిస్తే చాలు పిల్లలు అన్ని పనుల్లానే చదువును కూడా తమకు తాముగా ఒక పద్ధతిలో నేర్చుకుంటారు.

**–డేవిడ్ హస్పిరో (సుమవనం)**

---

మనిషి తోటి మనిషికి ఎన్నో విలువైన ఉత్పత్తులు, కానుకలు, ప్రోత్సాహాలు ఇవ్వవచ్చుగాక. కాని అన్నిటికన్నా విలువైనది అతడు తన తోటి మనిషికి ఇవ్వగలిగేది విద్య మాత్రమే. ఇక్కడ విద్య అంటే పుస్తకాలు కాదు. పరిజ్ఞానం కాదు. ఏదో ఒక నైపుణ్యం, సంపాదనా సామర్థ్యం కానే కాదు. అన్నిటికన్నా మిన్న, మనిషి తన తోటి మనిషికి అందించగలిగేది తన ఆత్మిక సారాంశాన్నే. అది పక్షి తన తోటి పక్షికి రెక్కలతో ఎగరడం నేర్పినట్టుగా, పులి తన బిడ్డకి పంజా విసరడం నేర్పినట్టుగా, మనిషి తన అమూల్య సారాంశాన్ని, తన మానవత్వాన్ని, తను ఏ మూలాధారం వల్ల తనని తాను మానవుడిగా గుర్తిస్తున్నాడో ఆ అత్యంత మౌలిక సారాంశాన్ని తన తోటి మనిషికి అందిస్తాడు. దాన్నే విద్య అంటున్నారు గాంధీజీ. ఆ అందించేదాన్ని ఎలా అందించాలన్న దాన్లో ప్రాంతీయ, జాతీయ వైవిధ్యాలూ, విశేషాలూ ఉండవచ్చుగాక. కానీ, అందుతున్న సారాంశం మాత్రం ఒక్కటే.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం - 2009
# ఆవశ్యకత - అవగాహన
## (RTE Act - 2009 - Importance - Awareness)

### 1.1 మౌలిక ప్రశ్నలు - ఆలోచించండి - ప్రతిస్పందించండి
### (Basic Questions - Think and Reflect)

1. ప్రాథమిక హక్కు అంటే ఏమిటి? అవి ఏవి?
   (What is fundamantal Right? What are these Rights?)
2. ప్రాథమిక హక్కులు మరియు ఇతర హక్కులకు గల భేదమేమి?
   (What is the difference between fundamental rights and other rights?)
3. ఇప్పుడు ఎలిమెంటరీ విద్య హక్కుగా మారింది కావున ఇది ప్రజలకు ఏవిధంగా ఉపయోగం? దీని ప్రాముఖ్యత ఏమి? ఆర్.టి.ఇ.లో ప్రముఖ అంశాలేవి?
   (How RTE is helpful to people? What is it's significance and What are its highlights? )
4. స్థానిక ప్రభుత్వం అంటే ఏమిటి? ఆర్.టి.ఇ. అమలులో దీని బాధ్యతలు ఏమిటి?
   (What are the rights and facilities available through RTE to get quality elementary education?)
5. నాణ్యమైన ఎలిమెంటరీ విద్యను పొందేందుకు ఆర్.టి.ఇ. ద్వారా ఎలాంటి అవకాశాలు ఉన్నాయి?
   (How RTE facilitate quality elementary education?)
6. ఆర్.టి.ఇ. అమలుకు సమాజం మరియు తల్లిదండ్రుల పాత్ర ఏమిటి?
   (What are the roles and responsibilities of community and parents in the implementation of RTE?)
7. ఆర్.టి.ఇ. ఏ విధంగా స్నేహపూరిత వాతావరణం గల పాఠశాలలను రూపొందించడానికి ఉపకరిస్తుంది?
   (How does RTE promotes child friendly schools?)
8. ఆర్.టి.ఇ. 2009 ప్రకారంగా బడులు మరియు ఉపాధ్యాయుల బాధ్యతలేవి? పిల్లల నాణ్యమైన చదువుకు ఎవరు బాధ్యత వహించాలి?
   (What are the responisibiliteis of schools and teachers as per RTE? Who are accountable towards children learning achievement?)
9. ఆర్.టి.ఇ. అమలులో మన ముందున్న ముఖ్యమైన సమస్యలు ఏవి?
   (What are the issues before us in implementing the RTE?)
10. ఆర్.టి.ఇ. ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఆర్.టి.ఇ. ప్రకారంగా ఏ ఏ అంశాలు పాఠశాలల్లో అమలవుతున్నాయి? ఏవి కావడం లేదు? కాకపోవడానికి కారణాలేవి? కారకులు ఎవరు?
    (What is the status of implementation of RTE in our schools? What items are being implemented and what not and who are responsible? What are the reasons for this?)
11. ఆర్.టి.ఇ. సరిగ్గా అమలుచేయాలంటే ఏమి చేయాలి?
    (What actions required for effective implementation of RTE?)

## 1.2 నేపథ్యం (Context)

భారతదేశం సువిశాలమైన దేశం. కోట్లాది మంది ప్రజలున్న దేశం. విభిన్న మతాలు, కులాలు, వర్గాలతో భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన దేశం. ఉత్కృష్టమైన సంస్కృతి, సంప్రదాయాలతో విరాజిల్లుతోన్న దేశం. ఒకప్పుడు అనగా అతి ప్రాచీనకాలంలోనే నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విశ్వ విద్యాలయాలతో ప్రపంచానికి జ్ఞాన భిక్షను పెట్టిన దేశం మనది. అయితే ఆ తదనంతర కాలంలో మన దేశంలోని విద్యా పరిస్థితిని, ప్రజల అభివృద్ధిని విశ్లేషిస్తే గత వైభవాన్ని కోల్పోయినట్లుగా గుర్తించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాల కాలం దాటినా ఇప్పటికీ 100% అక్షరాసత్య అందని ద్రాక్షగానే ఉంది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో దేశ భవిష్యత్తు విద్యారంగంపైననే ఆధారపడి ఉంటుందని విశ్వసించి పిల్లలందరు విద్యను పొందాలని, ఆదేశిక సూత్రాలలో పొందుపర్చారు. ఆ తరవాత మన దేశంలో అక్షరాస్యత కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం వల్ల అక్షరాస్యతలో అభివృద్ధిని గమనించవచ్చు. అయినప్పటికీ కూడా పాఠశాలకు వెళ్ళాల్సిన బడి ఈడు పిల్లలు బళ్ళలో చేరడం, చేరిన వారు కొనసాగడం, వారందరూ అర్థవంతంగా నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని వినియోగించగల్గడం, ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కొరవడింది. ఒక దశలో విద్యను పూర్తి చేసిన పిల్లలు ఏమి సాధించాలి? అనే అంశం పట్ల స్పష్టత కొరవడింది. విద్య వ్యాపారాత్మకమై ఉన్న వారికి ఒక రకంగా, లేని వారికి మరో రకంగా విద్య లభిస్తుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. అధిక సమాచారంతో బరువెక్కిన పాఠ్య పుస్తకాలు, ఒత్తిడి, ఆందోళనలకు గురిచేసే పరీక్ష విధానాలు, పాఠశాలను సమాజం నుండి వేరు చేసే వైఖరులు/ పనితీరు, పిల్లలకు లేదా సమాజానికి జవాబుదారీతనం వహించే లక్షణం కొరవడడం వంటి అంశాలు విద్యా వ్యవస్థను అపహాస్యం పాల్జేస్తున్నది.

ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థలోని అపసవ్య, అశాస్త్రీయ విధానాలను చాలా సునిశితంగా విమర్శిస్తూ రావలసిన మార్పుచేర్పుల గురించి ప్రొఫెసర్ యశ్‌పాల్ గారు 2003 సంవత్సరంలో 'భారంలేని విద్య' అనే నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించారు. వీటి ఆధారంగా ఎన్.సి.ఇ.ఆర్.టి. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005ను రూపొందించింది. 1986 సంవత్సరం తరవాత మన దేశంలో చోటుచేసుకున్న మంచి కార్యక్రమాలు, వాటి ఫలితాలు (OBB, APPEP, DPEP, SSA మొదలగు కార్యక్రమాలు) అధికారపూర్వకంగా ఒక నివేదిక రూపంలో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005 ద్వారా వ్యక్తమైనవి. అర్థరహితమైన బట్టీ విధానాలకు స్వస్తిపలికి అర్థవంతంగా నేర్చుకోవాలని, నేర్చుకోవడం పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, పిల్లలు తాము నేర్చుక్ను అంశాలు/ జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించాలని, సమాచారం, జ్ఞానం ఒక్కటి కావని, జ్ఞానమనేది పిల్లల అనుభవాల ఆధారంగా ఆలోచన, విశ్లేషణల ద్వారా ఉత్పన్నమవుతుందని, ఒత్తిడికి గురిచేసే పరీక్షల విధానాలు సంస్కరించబడాలని ఎన్.సి.ఎఫ్-2005 పేర్కొన్నది. వీటిని సాకారం చేయడానికి విద్యావ్యవస్థలో మౌలికమైన మార్పులు చేర్పులు చోటుచేసుకోవాలని, సమాజ భాగస్వామ్యంతో పాఠశాల విద్య అభివృద్ధిని సాధించాలని తెలిపింది.

పాఠ్యపుస్తకాలు ఆలోచనాత్మకంగా, పిల్లల అనుభవాల ఆధారంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించింది. బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల భాగస్వామ్యాన్ని పెంచేలా జ్ఞాన నిర్మాణానికి తోడ్పడేలా ఉండాలని తెలిపింది. ఎన్.సి.ఎఫ్-2005 సూచించిన పలు అంశాలతోపాటు సమాజంలో కొంతమంది పిల్లలు బాల కార్మికులుగా ఉండడం, వారి ప్రవేశానికి పాఠశాలల నియమ నిబంధనలు అడ్డంకిగా నిలవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక హక్కుగా మారిన 'విద్య'ను పిల్లలందరూ పొందడానికి ఉద్దేశించి మన దేశంలో 2009 ఆగస్టు మాసంలో భారత పార్లమెంట్‌లో చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం 26 ఆగస్టు, 2009 భారత రాష్ట్రపతిచే

ఆమోదం పొందింది. భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని **'ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం–2009 Right To Education Act-2009'** అని పేర్కొని 27 ఆగస్టు, 2009 రోజున గెజిట్ ద్వారా విడుదల చేసింది. ఆర్.టి.ఇ–2009

ఆర్.టి.ఇ–2009 చట్టం ఏప్రిల్ 1, 2010నాటితో అమలులోకి వచ్చింది. భారతదేశ చరిత్రలో ఒక చట్టం ఆ దేశ ప్రధానమంత్రి జాతినుద్దేశించి ఇచ్చిన ఉపన్యాసం ద్వారా అమలులోకి వచ్చింది. ప్రధానమంత్రి తన సందేశం ఇస్తూ ఈ దేశపు బాలలందరూ అంటే జాతి, మత, కులాలకు అతీతంగా బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందడానికి ఈ చట్టం ద్వారా ప్రాథమిక హక్కు కల్పించబడింది. నాణ్యమైన విద్య ద్వారా ఒక బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా ఎదగడానికి కావల్సిన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విలువలు నాణ్యమైన విద్య ద్వారా వారికి అందించబడతాయి.

ఈ ఘట్టం చారిత్రాత్మకమైనది. 'విద్య'ను ప్రాథమిక హక్కుగా పరిగణించి చట్టాలు చేసిన దేశాల జాబితాలో మన దేశం కూడా చేరింది. ప్రధానంగా ఈ చట్టం వల్ల బడిఈడు కలిగిన పిల్లలు (9–14 సం॥ల వయసు) నాణ్యమైన విద్యను పొందే హక్కును సంపాదించుకున్నారు. నాణ్యమైన విద్యను పిల్లలందరూ పొందడానికి అవసరమైన పాఠశాలల ఏర్పాటు, ప్రభుత్వాల బాధ్యతలు, బడి బాధ్యతలు, ఉపాధ్యాయుల బాధ్యతలు, బడికి ఉండాల్సిన నియమాలు, ప్రామాణికాల గురించి ఈ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంట్లో ప్రధానంగా రెండు రకాలైన అంశాలు గమనించవచ్చు. మొదటిది పరిమాణాత్మకమైన, పరిపాలనాపరమైన, అమలుకు చెందిన అంశాలు. రెండవది నాణ్యమైన విద్యకు సంబంధించిన అవగాహన, విద్యా ప్రణాళికలకు సంబంధించిన అంశాలు. చట్టం అమలు జరగడం అంటే ఇందుకు అవసరమైన అన్ని అంశాలు ఆచరణలోకి రావడం అని అర్థం. అనగా పిల్లలందరూ బడిలో చేరడం, వారందరూ కొనసాగి నాణ్యమైన విద్యను పొందడానికి అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టడం ద్వారా ఫలితాలు సాధించాల్సి ఉంటుంది.

## 1.3 చట్టంలోని అధ్యాయాలు, వాటి వివరాలు (Section in the Act and its details)

ఆర్.టి.ఇ.–2009 చట్టంలోని అధ్యాయాలు, సెక్షన్లు గురించి తెలుసుకుందాం.

- ఈ చట్టంలో 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు, ఒక షెడ్యూల్ ఉంది.
- ప్రారంభంలో ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశపెట్టారు, రాష్ట్రపతిచే ఆమోదం పొందిన తేది, అమలు పరిధి వివరాలు ఉన్నాయి.
- **అధ్యాయం1**లో చట్టం పేరు, పరిధి, అమలు, వివిధ పదాలకు సంబంధించిన అర్థాలు, నిర్వచనాలు ఉన్నాయి. ఉదాహరణకు బడి, పిల్లలు, ప్రాథమిక విద్య, ఎంపిక విధానం వంటి పదజాలాలకు వివరణలు ఉన్నాయి. ఈ వివరాలను 1 నుండి 3 సెక్షన్ల ద్వారా తెలిపారు.
- **అధ్యాయం2**లో ఉచిత విద్యకు బాలల హక్కు, బడిలో ప్రవేశం, బదిలీ ధ్రువీకరణ పత్రం మొదలగు అంశాల గురించి 4, 5 సెక్షన్ల ద్వారా తెలిపారు.
- **అధ్యాయం3**లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతల గురించి, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటు గురించిన వివరాలు 6 నుండి 11 సెక్షన్ల ద్వారా తెలిపారు.
- **అధ్యాయం4**లో బడులు, ఉపాధ్యాయుల బాధ్యతలకు సంబంధించిన వివరాలను సెక్షన్ 12 నుండి 28 వరకు పొందుపర్చారు. ప్రధానంగా పిల్లలను బడిలో చేర్చినపుడు ఎంపిక విధానానికి గురిచేయరాదని, ఎలాంటి క్యాపిటేషన్ రుసుము వసూలు చేయరాదని తెలిపారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా పిల్లలను బడిలో చేర్చుకోవాలని, ఒకే తరగతిలో పిల్లలను మళ్ళీ కొనసాగించడం లేదా పాఠశాల నుండి తొలగించడం చేయరాదని,

పిల్లలను శారీరకంగా గాని, మానసికంగా గాని వేధించడం, శిక్షించడం చేయరాదని వంటి అంశాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. బళ్ళను ఏర్పాటు చేయడం, అవి పాటించాల్సిన ప్రామాణికాలు, నియమాల గురించి, ఉపాధ్యాయుల నియామకం, వారి విధులు, బాధ్యతలు మొదలగు అంశాల గురించి కూడా వివరించారు.

- **అధ్యాయం5**లో నాణ్యమైన విద్యకు సంబంధించిన విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు మొదలగు వాటి గురించి సవివరంగా సెక్షన్ 29, 30ల ద్వారా తెలిపారు. వీటిలో ప్రధానంగా విద్యా ప్రణాళికలను రూపొందించేటపుడు, మూల్యాంకన విధానాలను నిర్ధారించేటపుడు పిల్లల సమగ్ర అభివృద్ధిని, రాజ్యాంగ విలువలను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. వీటితోపాటు బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు, బోధన మాధ్యమం, అభ్యసన వాతావరణం వంటి అంశాల గురించి కూడా తెలిపారు.

- **అధ్యాయం6**లో బాలల హక్కుల సంరక్షణ, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో సలహా సంఘాల ఏర్పాటు గురించి సెక్షన్ 31 నుండి 34ల ద్వారా వివరించారు.

- **అధ్యాయం7**లో చట్టం అమలు గురించి ఆదేశాలు జారీచేసే అధికారాలు, ప్రాసిక్యూషన్, చేపట్టాల్సిన చర్యలు, నియమ నిబంధనలు రూపొందించడం గురించిన వివరాలను సెక్షన్ 35 నుండి 38ల ద్వారా వివరించారు.

- చట్టం చివర అనుబంధంలో పేర్కొన్న **షెడ్యూల్**లో బడికి సంబంధించిన ప్రామాణికాలు, నియమాల గురించి సెక్షన్ 19, 25లను దృష్టిలో పెట్టుకొని వివరాలను పొందుపర్చారు. వీటిలో పిల్లల సంఖ్యను బట్టి ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల భవనం, గదులు, వసతి సౌకర్యాలు, సామగ్రి, విద్యా సంవత్సరంలో పాఠశాల పనిదినాలు, బోధనాగంటల సంఖ్య, ఉపాధ్యాయులు వారానికి పనిచేయాల్సిన పనిగంటల సంఖ్య మొదలగు వాటి వివరాలను చేర్చారు.

**చట్టంలోని సెక్షన్లు, వివరాలు:**

**అధ్యాయం 1**

- పార్లమెంటు చేసిన ఈ దిగువ చట్టం 2009, ఆగస్టు 26న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ప్రజల సమాచారం నిమిత్తం ఇక్కడ ప్రచురిస్తున్నాం.

**ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009 35 ఆఫ్ 2009:**

- 6 నుండి 14 సంవత్సరాల బాలలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించడానికి ఉద్దేశించిన చట్టం.

### 1.3.1 చట్టం పరిధి – అమలు తేది – నిర్వచనాలు (The frame of the Act, Implementation Dates)

1. (1) ఈ చట్టాన్ని ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, ఆగస్టు 2009గా పిలవవచ్చు.

(2) ఒక్క జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి ఇది భారతదేశమంతటికీ వర్తిస్తుంది.

(3) కేంద్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో ప్రకటించిన తేది నుండి ఇది అమలులోకి వస్తుంది.

**నిర్వచనాలు:**

2. సందర్భంలో వేరుగా ఉదహరిస్తే తప్పించి చట్టంలోని పదాల అర్థాలు:

(a) 'సంబంధిత ప్రభుత్వం' అంటే–

(i) కేంద్ర ప్రభుత్వం ప్రారంభించి, దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో ఉన్న బడులకు శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం;

(ii) సబ్ క్లాజ్ (i) లో సూచించిన బడులు కాకుండా ఇతర బడులకు–

(A) ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం;

(B) శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంలో ఉంటే ఆ కేంద్రపాలిత ప్రభుత్వం;

(b) 'కాపిటేషన్ రుసుం' అంటే బడి ప్రకటించిన రుసుం కాకుండా ఇతర రూపాలలో ఇచ్చే చందా, విరాళం, చెల్లింపులు;

(c) 'బాలలు' అంటే 6 నుండి 14 సంవత్సరాల బాల, బాలికలు;

(f) 'ప్రాథమిక విద్య' అంటే 1 నుండి 8వ తరగతి వరకు విద్య;

(h) 'స్థానిక ప్రభుత్వం' అంటే నగర పాలక సంస్థ, లేదా నగర పాలక సంఘం లేదా జిల్లా పరిషత్ లేదా నగర పంచాయతీ లేదా పంచాయతీ, ఏ పేరుతో పిలవబడినప్పటికీ బడిమీద పరిపాలనా సంబంధ నియంత్రణ కలిగిన సంస్థని సూచిస్తుంది లేదా అమలులో ఉన్న చట్ట ప్రకారం ఏదైనా గ్రామ, పట్టణ, నగరంలో స్థానిక ప్రభుత్వంగా పని చెయ్యటానికి అధికారం పొందిన సంస్థని సూచిస్తుంది.

(n) 'బడి' అంటే ప్రాథమిక విద్యను అందజేస్తూ గుర్తింపు పొందిన బడి, దీంట్లో ఇవి ఉంటాయి.

(i) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న బడి.

(ii) తన ఖర్చులో మొత్తంకానీ కొంత భాగంగానీ సహాయంగా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి పొందుతున్న ఎయిడెడ్ పాఠశాల.

(iii) ప్రత్యేక వర్గీకరణకు చెందిన బడి.

(iv) తన ఖర్చులకు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం పొందని అన్ ఎయిడెడ్ పాఠశాల.

### 1.3.2 అధ్యాయం 2: ఉచిత, నిర్బంధ విద్యకు హక్కు

### (Right to Free and Compulsory Elementary Act)

**ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు:**

3. (1) ఆరు నుంచి 14 సంవత్సరాలు ఉన్న బాలలందరికీ పరిసర ప్రాంత పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసేవరకు ఉచిత, నిర్బంధ విద్య పొందే హక్కు ఉంటుంది.

(2) సబ్ సెక్షన్ (1)లో పేర్కొన్నట్లు ప్రాథమిక విద్యను చేపట్టి పూర్తి చేయడానికి అవరోధకంగా ఉండే ఎటువంటి రుసుం, ఛార్జీలు, ఖర్చులను చెల్లించాల్సిన అవసరం బాలలకు లేదు.

**ప్రాథమిక విద్యలో నమోదు చేయించుకొని లేదా పూర్తి చేయని బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు:**

4. ఆరు ఏళ్ళు నిండిన బాలుడు/ బాలికను బడిలో చేర్చకపోయినా, లేదా చేర్చిన తరవాత ప్రాథమిక విద్యను పూర్తి చేయలేకపోయినా వారిని వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చుకోవాలి:

అయితే, తమ వయసుకు తగిన తరగతిలో ప్రవేశం పొందిన బాలలు తోటివారితో సమానంగా ఉండటానికి సిఫారసు చేసిన పద్ధతిలో, సిఫారసు చేసిన కాలపరిధిలో ప్రత్యేక శిక్షణ పొందే హక్కు కలిగి ఉంటారు.

**వేరే బడికి బదిలీ హక్కు:**

5. (3) వేరే బడిలో ప్రవేశం పొందడానికి అప్పటివరకు చదివిన బడి ప్రధానోపాధ్యాయులు లేదా బడి ఇన్‌చార్జి వెంటనే బదిలీ ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాలి:

అయితే, బదిలీ ధ్రువీకరణ పత్రం ఇవ్వడం ఆలస్యం అయ్యిందన్నది వేరే బడిలో ప్రవేశం ఇవ్వకపోవడానికి, ఆలస్యంగా చేర్చుకోవడానికి కారణంగా చూపడానికి లేదు;

అయితే, ధ్రువీకరణ పత్రం ఇవ్వటంలో జాప్యానికి కారణమైన ప్రధానోపాధ్యాయులు లేదా బడి ఇన్‌చార్జి, వారికి వర్తించే ఉద్యోగ నియమాల ప్రకారం క్రమశిక్షణ చర్యలకు బద్ధులవుతారు.

## 1.3.3 అధ్యాయం 3: సంబంధిత ప్రభుత్వం – స్థానిక ప్రభుత్వం – తల్లిదండ్రుల బాధ్యతలు (Responsibilities of concerned govt., Local govt.s and Parents)

**ఆర్థిక ఇతర బాధ్యతలను పంచుకోవడం:**

7. (6) కేంద్ర ప్రభుత్వం–

(a) సెక్షన్ 29లో పేర్కొన్న, అకడెమిక్ అథారిటీ సహాయంతో జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రాన్ని తయారు చేస్తుంది;

(b) టీచర్ల శిక్షణకు ప్రామాణికాలను రూపొందించి, అమలు అయ్యేలా చూస్తుంది.

(c) కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రణాళిక తయారీ, సామర్థ్యం పెంపుదలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక మద్ధతును, వనరులను అందజేస్తుంది.

**సంబంధిత ప్రభుత్వ బాధ్యతలు:**

8 (a) బాలలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అందజేస్తుంది.

(i) 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలలందరికీ ఉచితంగా ప్రాథమిక విద్యను అందించడం;

(ii) 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలలు తప్పనిసరిగా బడిలో చేరి, బడికి హాజరవుతూ, ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా చూడటం;

(b) సెక్షన్ 6లో పేర్కొన్నవిధంగా పరిసర ప్రాంతంలో బడి అందుబాటులో ఉండేలా చూడడం;

(c) బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏవిధమైన వివక్షతకు గురికాకుండా, ప్రాథమిక విద్యను చేపట్టి, పూర్తి చేయడంలో ఏ కారణంగా కూడా ఆటంకాలు లేకుండా చూడటం;

(d) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

(e) సెక్షన్ 4లో పేర్కొన్నవిధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

(g) షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలకు అనుగుణంగా నాణ్యమైన ప్రాథమిక విద్య అందుబాటులో ఉండేలా చూడడం;

(h) ప్రాథమిక విద్యకు పాఠ్య ప్రణాళికను, కోర్సులను సకాలంలో సిఫారసు చేయడం;

(i) టీచర్లకు శిక్షణా సౌకర్యం కల్పించటం.

**స్థానిక ప్రభుత్వ బాధ్యతలు:**

9 ప్రతిస్థానిక ప్రభుత్వం:

(d) సిఫారసు చేసిన విధంగా తమ పరిధిలో నివసిస్తున్న 14 ఏళ్ళ లోపలి బాలలందరి రికార్డులను నిర్వహించడం;

(e) ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక బడిలో ప్రవేశం పొంది, హాజరు అవుతూ, ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా పర్యవేక్షించడం;

(f) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

(g) సెక్షన్ 4లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

(k) వలస కుటుంబాల పిల్లలు బడిలో ప్రవేశం పొందేలా చూడటం;

(l) తమ పరిధిలోని బడుల పనితీరును పర్యవేక్షించడం;

(m) విద్యా క్యాలెండర్‌ను నిర్ణయించడం.

**పూర్వ పాఠశాల విద్య:**

11. మూడు సంవత్సరాలకు మించిన బాలలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చెయ్యడానికి, ఆరేళ్ళు నిండే వరకు బాలలందరికీ శైశవ దశ సంరక్షణ, విద్య అందించడానికి ఇటువంటి పిల్లలకు ఉచిత పూర్వ పాఠశాల విద్యను అందించడానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత ప్రభుత్వం చెయ్యాలి.

### 1.3.4 అధ్యాయం 4: బడులు, ఉపాధ్యాయుల బాధ్యతలు (Responsibilities of Schools and Teacehrs)

**ఉచిత నిర్బంధ విద్యకు బడుల బాధ్యత, పరిధి:**

12 (c) సెక్షన్ 2, క్లాజు (n), సబ్ క్లాజు (iii) లో పేర్కొన్న బడులు పరిసర ప్రాంతాలకు చెందిన బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన బాలలకు ఒకటవ తరగతిలోని విద్యార్థుల సంఖ్యలో 25% ఇచ్చి ప్రాథమిక విద్య పూర్తి చేసేంత వరకు ఉచిత, నిర్బంధ విద్యను అందజేయాలి.

(3) సందర్భాన్నిబట్టి సంబంధిత ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రభుత్వానికి అవసరమయ్యే సమాచారాన్ని ప్రతి బడి అందించాలి.

బడిలో ప్రవేశానికి ఎంపిక విధానం, క్యాపిటేషన్ రుసుం ఉండకూడదు.

13 (1) బాలుడు/ బాలికను బడిలోకి చేర్చుకోవటానికి బడిగానీ లేదా ఎవరైనా వ్యక్తిగానీ క్యాపిటేషన్ రుసుం వసూలు చెయ్యకూడదు. బాలుడు/బాలికను లేదా వారి తల్లిదండ్రులను లేదా వారి సంరక్షకులను ఎటువంటి ఎంపిక విధానానికి గురి చెయ్యకూడదు.

(2) సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా ఏ బడి అయినా, లేదా వ్యక్తి అయినా

(c) క్యాపిటేషన్ రుసుం వసూలు చేస్తే దానికి పదిరెట్ల వరకు జరిమానాతో శిక్షింపబడవచ్చు.

(d) బాలుడు/ బాలికను ఎంపిక విధానానికి గురిచేస్తే మొదటిసారి తప్పుకు 25,000 రూపాయలు, ఆ తరవాత ప్రతిసారి తప్పుకు రూ.50,000ల జరిమానా విధించవచ్చు.

**బడిలో ప్రవేశాన్ని తిరస్కరించకూడదు:**

15. విద్యాసంవత్సరం మొదలు అయినప్పుడు లేదా సిఫారసు చేసిన గడువు పెంచిన కాలం లోపు బాలలను బడిలో చేర్చుకోవాలి.

అయితే, పెంచిన గడువు తరువాత బాలుడు / బాలిక ప్రవేశం కోరితే దానిని తిరస్కరించకూడదు.

అయితే గడువు తరువాత ప్రవేశం పొందిన బాలలు సంబంధిత ప్రభుత్వం సిఫారసు చేసిన విధంగా తమ చదవును పూర్తిచెయ్యాలి.

**అదే తరగతిలో మళ్ళీ కొనసాగించడం, బడినుంచి తీసివెయ్యడం నిషేధం:**

16 బడిలో ప్రవేశం పొందిన బాలలను ప్రాథమిక విద్య పూర్తి అయ్యే వరకు ఏ తరగతిలోనైనా మళ్ళీ కొనసాగించకూడదు. బడి నుంచి తీసివెయ్యకూడదు.

**బాలలను శారీరకంగా శిక్షించటం, మానసికంగా వేధించటం నిషేధం:**

17 (1) ఏ బాలుడు / బాలికను కూడా శారీరక శిక్షకూ, మానసిక వేధింపులకు గురి చెయ్యకూడదు.

**బడులకు నియమాలు, ప్రామాణికాలు:**

19 (1) షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలు పూర్తిచెయ్యకుండా సెక్షన్ 18 కింద ఏ బడిని ఏర్పాటు చెయ్యకూడదు. గుర్తింపును ఇవ్వకూడదు.

(2) ఈ చట్టం ఏర్పడక ముందే స్థాపింపబడి, నిర్వహింపబడుతున్న బడి షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలను పూర్తి చెయ్యకపోతే చట్టం అమలులోకి వచ్చిన తేది నుంచి మూడు సంవత్సరాలలోపు ఈ నియమాలు, ప్రామాణికాలను పూర్తిచెయ్యడానికి తన సొంత ఖర్చులతో చర్యలు చేపట్టాలి.

(5) గుర్తింపు రద్దు అయిన తరువాత కూడా ఏ వ్యక్తి అయినా బడిని నడిపితే లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఒకవేళ ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే అలాంటి కాలానికి ప్రతి రోజుకి పది వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

**బడి యాజమాన్య సంఘం:**

21 (1) సెక్షన్ 2, క్లాజు (n) సబ్ క్లాజు (iv) లో పేర్కొన్న బడులను మినహాయించి మిగిలిన బడులన్నీ స్థానిక ప్రభుత్వానికి ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో, ఆ బడిలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు, ఉపాధ్యాయులతో బడి యాజమాన్య సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి.

అయితే, ఇటువంటి సంఘంలో నాల్గింట కనీసం మూడు వంతుల సభ్యులు తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అయివుండాలి.

అయితే బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాల పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు దామాషా పద్ధతిలో ప్రానిధ్యం కల్పించాలి.

అయితే ఈ సంఘ సభ్యులలో 50 శాతం మహిళలు ఉండాలి.

(2) బడి యాజమాన్య సంఘం ఈ కింది విధులను నిర్వర్తిస్తుంది.

(a) బడి పని తీరును పర్యవేక్షించడం

(b) బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి, సిఫారసు చేయటం.

(c) సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం లేదా ఏ ఇతర వనరులనుంచి అయినా అందిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం.

(d) సిఫారసు చేసిన ఇతర విధులను నిర్వర్తించడం.

**బడి అభివృద్ధి ప్రణాళిక:**

22 సెక్షన్ 21, సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏర్పడిన ప్రతి బడి యాజమాన్య సంఘం సిఫారసు చేసిన విధంగా బడి అభివృద్ధి ప్రణాళికను తయారు చెయ్యాలి.

**టీచరుగా నియామకానికి అర్హతలు, ఉద్యోగ షరతులు, నిబంధనలు:**

23 (1) కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడమిక్ సంస్థ నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న ఏ వ్యక్తి అయినా టీచరుగా నియమింపబడటానికి అర్హులు.

**టీచర్ల విధులు, సమస్యల పరిష్కారం:**

24 (1) సెక్షన్ 23 సబ్ సెక్షన్ (1) ప్రకారం నియమితులైన టీచర్లు ఈ కింద పేర్కొన్న విధులను నిర్వర్తించాలి.

(a) బడికి హాజరు కావటంలో సమయాన్ని క్రమబద్ధతనీ పాటించాలి.

(b) సెక్షన్ 29 సబ్ సెక్షన్ (2) లోని అంశాల ప్రకారం పాఠ్యాంశాలను చేపట్టి, పూర్తిచెయ్యాలి.

(c) నిర్ధారిత సమయంలోపు పాఠ్యాంశాలన్నింటినీ పూర్తి చెయ్యాలి.

(d) ప్రతి బాలుడు / బాలిక నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేసి, అవసరమైతే దానికి అనుగుణంగా అదనపు బోధనను అందించాలి.

(e) తల్లిదండ్రులు, సంరక్షకులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి బాలల హాజరులో క్రమబద్ధత, వారు నేర్చుకునే సామర్థ్యం, నేర్చుకోవడంలో వారి ప్రగతి, వారికి సంబంధించిన ఇతర సమాచారాన్ని పంచుకోవాలి.

(2) సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న విధులను నిర్వర్తించడంలో టీచరు విఫలమైతే వారికి వర్తించే ఉద్యోగ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యకు గురౌతారు.

అయితే, ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకునే ముందు ఆ టీచర్ తన వాదన వినిపించడానికి న్యాయమైన అవకాశాన్ని ఇవ్వాలి.

(3) టీచర్లకు ఉండే ఏ సమస్యలనైనా సూచించిన పద్ధతిలో పరిష్కరిస్తారు.

**విద్యార్థి – టీచర్ల నిష్పత్తి:**

25 (1) చట్టం అమలులోకి వచ్చిన ఆరు నెలలలోపు షెడ్యూల్‌లో నిర్ధారించిన విద్యార్థులు – టీచర్ల నిష్పత్తి ప్రతి బడిలోనూ ఉండేలా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం చూడాలి.

**విద్యేతర పనులకు టీచర్లను పంపటంపై నిషేధం:**

27. పది సంవత్సరాలకి ఒకసారి జరిగే జనాభా గణన, వైపరీత్యాలలో సహాయ విధులు, లేదా పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులను మినహాయించి టీచర్లను ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదు.

**టీచర్ల ప్రైవేటు ట్యూషన్లపై నిషేధం:**

28. ఏ టీచరు కూడా ప్రైవేటు ట్యూషన్లను, ప్రైవేటు బోధనా పనులను చేపట్టగూడదు.

## 1.3.5 అధ్యాయం 5: పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన సంస్కరణలు – ప్రాథమిక విద్యను పూర్తి చెయ్యటం (Curriculum and Evaluation - Completion of Elementary Education)

29 (1) సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడెమిక్ సంస్థ ప్రాథమిక విద్యకు పాఠ్యప్రణాళిక, మూల్యాంకన విధానాన్ని నిర్ధారిస్తుంది.

(2) సబ్‌సెక్షన్ (1) ప్రకారం పాఠ్యప్రణాళికను, మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటప్పుడు, అధీకృత అకడెమిక్ సంస్థ ఈ కింది అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

(a) రాజ్యాంగంలో పొందు పరిచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

(b) బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలి

(c) బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించాలి.

(d) బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులు అభివృద్ధి చెందాలి.

(e) పిల్లలను కేంద్రంగా చేసుకుని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన కనుగొనటం ద్వారా నేర్చుకోవాలి.

(f) ఆచరణకు సాధ్యమైనంత వరకు బోధనా మాధ్యమం బాలల మాతృ భాషగా ఉంటుంది.

(g) భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటంలో సహాయపడాలి.

(h) జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దాన్ని అన్వయించే సామర్థ్యంపై నిరంతర సమగ్ర మూల్యాంకనం జరగాలి.

**పరీక్ష ప్రాథమిక విద్య పూర్తి అయినట్లు ధ్రువీకరణ పత్రం:**

30 (1) ప్రాథమిక విద్య పూర్తి అయ్యే వరకు బాలలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.

(2) బాలుడు లేదా బాలిక ప్రాథమిక విద్య పూర్తిచేసిన తరువాత సూచించిన ప్రకారం వారికి తగిన విధానం, పద్ధతిలో ధృవీకరణ పత్రం జారీ చేస్తారు.

## 1.4 ఫిర్యాదుల పరిష్కారం – సలహా సంఘాలు

## (Grievance redressel and Committees)

32 (1) సెక్షన్ 31లో పేర్కొన్న దానితో సంబంధం లేకుండా ఈ చట్టం కింద బాలలకున్న హక్కుకి సంబంధించి ఏ వ్యక్తికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే సంబధిత స్థానిక ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చు.

(3) ఈ విషయంలో స్థానిక ప్రభుత్వ నిర్ణయంతో బాధకు గురైన ఏ వ్యక్తి అయినా సందర్భాన్ని బట్టి బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్‌కి గాని, లేదా పేర్కొన్న ఇతర అధారిటీలకు అప్పీలు చేసుకోవచ్చు.

**జాతీయ సలహా సంఘం ఏర్పాటు:**

33 (1) ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించినంత మందితో జాతీయ సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తులనుంచి సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించాలి.

(2) జాతీయ సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థంగా అమలుచేసే విధానాలపై కేంద్రప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

**రాష్ట్ర సలహా సంఘం ఏర్పాటు:**

34 (1) ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించినంత మందితో రాష్ట్ర సలహా సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తుల నుంచి సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించాలి.

(2) రాష్ట్ర సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థంగా అమలుచేసే విధానాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

## 1.5 బడికి నియమాలు, ప్రామాణికాలు (Rules and Standards to Schools)

| క్ర. సం | అంశం | నియమాలు, ప్రామాణికాలు |
|---|---|---|
| 1 | ఉపాధ్యాయుల సంఖ్య<br>అ) 1 నుండి 5వ తరగతి వరకు | **చేర్చుకున్న పిల్లల సంఖ్య** — **టీచర్ల సంఖ్య**<br>అరవై వరకు – ఇద్దరు<br>అరవై ఒకటి నుంచి తొంభై వరకు – ముగురు<br>తొంభై ఒకటి నుంచి నూట ఇరవై వరకు – నలుగురు<br>నూట ఇరవై ఒకటి నుంచి రెండు వందల వరకు – అయిదుగురు + ఒక హెడ్‌మాస్టర్<br>150కు మించి<br>200లకు మించి – ప్రధానోపాధ్యాయులు కాకుండా విద్యార్థి – టీచర్ల నిష్పత్తి 40కి మించకూడదు.) |
| | ఆ) 6 నుండి పై తరగతులు | 1) ప్రతి తరగతికి ఒక టీచరు ఉండి, కింది అంశాలకు కనీసం ఒక టీచరు ఉండాలి. ఎనిమిదవ తరగతి వరకు<br>i) విజ్ఞానశాస్త్రం, లెక్కలు<br>ii) సామాజిక శాస్త్రం<br>iii) భాషలు<br>2) ప్రతి ముప్పై అయిదు మంది విద్యార్థులకు కనీసం ఒక టీచరు<br>3) చేర్చుకున్న పిల్లల సంఖ్య వందకు మించి ఉన్నట్లయితే<br>i) పూర్తి కాల ప్రధానోపాధ్యాయులు<br>ii) కింది అంశాలకు పార్ట్‌టైమ్ బోధకులు<br>A) చిత్రకళ<br>B) ఆరోగ్యం, వ్యాయామ విద్య<br>C) వృత్తివిద్య |

| క్ర. సం | అంశం | నియమాలు, ప్రామాణికాలు |
|---|---|---|
| 2 | భవనం | అన్ని కాలాలకు అనువైన భవనంలో<br>1) ప్రతి టీచరుకు కనీసం ఒక తరగతి గది, కార్యాలయం, గోదాము, ప్రధానోపాధ్యాయుల గది<br>2) వికలాంగుల ప్రవేశానికి అనువుగా ఉండాలి.<br>3) ఆడపిల్లలు, మగ పిల్లలకు వేరుగా మరుగుదొడ్లు<br>4) పిల్లలందరికీ సరిపోయేటంత రక్షిత మంచినీటి సౌకర్యం<br>5) బడిలో మధ్యాహ్నపు భోజనం వండటానికి వంట గది<br>6) ఆటస్థలం<br>7) సరిహద్దుగోడ లేదా కంచెతో బడి భవనానికి భద్రత ఏర్పాట్లు |
| 3 | విద్యా సంవత్సరంలో కనీస పనిదినాలు/ బోధనా గంటల సంఖ్య | 1) 1 నుంచి 5వ తరగతి వరకు 200 పనిదినాలు<br>2) 6 నుంచి 8వ తరగతి వరకు 220 పనిదినాలు<br>3) 1 నుంచి 5వ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో 800 బోధనా గంటలు<br>4) 6 నుంచి 8వ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో 1000 బోధనా గంటలు |
| 4 | టీచర్లకు వారానికి కనీస పనిగంటలు | బోధనకు కనీసం 45, తయారీకి అదనపు గంటలు |
| 5 | బోధనా పరికరాలు | ప్రతి తరగతికి అవసరం మేరకు అందచెయ్యాలి. |
| 6 | గ్రంథాలయం | దినపత్రిక, పత్రికలు, అన్ని పాఠ్యవిషయాలపై పుస్తకాలు, కథల పుస్తకాలు అందించే గ్రంథాలయం ప్రతిబడిలో ఉండాలి. |
| 7 | ఆటలు, క్రీడలకు సంబంధించిన సామగ్రి | ప్రతి తరగతికి అవసరం మేరకు అందచెయ్యాలి. |

## 1.6 ఆర్.టి.ఇ-2009 అమలుకు సూచికలు (RTE-2009 Indicators of Implementation)

ఆర్.టి.ఇ. - 2009 చట్టం అమలు జరుగుతున్న పాఠశాలల్లో కింది అంశాలు ఆచరణలో కన్పిస్తాయి.

- పాఠశాలల్లో ఆర్.టి.ఇ.-2009 షెడ్యూల్‌లో వివరించిన విధంగా తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, తరగతి గదులు, వసతి సౌకర్యాలు మొదలగునవి ఉంటాయి.
- చట్టంలో పేర్కొన్న విధంగా ప్రతి ఉపాధ్యాయుడు వారానికి కనీసం 45 గంటలు పాఠశాలలో పనిచేస్తాడు. ఇందుకు అనుగుణంగా కాలనిర్ణయి పట్టికలో వివరాలను పొందుపరుస్తారు.
- ఉపాధ్యాయులు తమకున్న అపోహలు తొలగించుకొని బాలల హక్కుల దృక్పథంలో పనిచేస్తారు. జ్ఞానం అంటే సమాచారం కాదని, అది గత అనుభవాలు, ఆలోచనల ద్వారా ఉత్పన్నమవుతుందని భావిస్తారు. ఇందుకనుగుణంగా పిల్లలను ఆలోచింపజేసేలా, ప్రతిచర్యలు, భాగస్వామ్యం చేసేలా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తారు.

- పిల్లల్లో తరగతి వారీగా, సబ్జక్టు వారీగా నిర్ధారించిన సామర్థ్యాల సాధనకు కృషి చేస్తారు.
- పిల్లల్లో ఆలోచన నైపుణ్యాలు అనగా ప్రతిస్పందించే నైపుణ్యాలు, విశ్లేషించి వాస్తవాలు గ్రహించే నైపుణ్యాలు, బహుకోణాల్లో ఆలోచించే నైపుణ్యాలు, సృజనాత్మకంగా ఆలోచించడం వంటివి పెంపొందిస్తారు. వీటిని దృష్టిలో పెట్టుకొని బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ఉంటుంది.
- ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు రూపొందించుకొని, తగిన సంసిద్ధతతో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తారు.
- పిల్లల్లో సహజంగా ఉండే శక్తి సామర్థ్యాలు అనగా పోల్చడం, వర్గీకరించడం, విశ్లేషణ, ప్రశ్నించడం, నిర్ధారణ వంటి సామర్థ్యాలు మరింత వృద్ధి చెందేలా, వీటి ఆధారంగా అర్థవంతంగా నేర్చుకునేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఉంటాయి.
- ప్రతి పాఠశాలకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక ఉంటుంది. దీని ప్రకారం కార్యక్రమాలు అమలవుతాయి.
- తద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తారు. అంటే పాఠ్య, సహపాఠ్య విషయాలకు సమాన ప్రాధాన్యతనిచ్చి కార్యక్రమాలను అమలుపరుస్తారు.
- పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో నెలకొకసారి తల్లిదండ్రుల సమావేశాలు, పాఠశాల మానిటరింగ్ సక్రమంగా జరుగుతుంది.
- పాఠశాల పరిధిలోని బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరి విద్యనభ్యసిస్తుంటారు.
- పాఠశాలల్లో పిల్లలనుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయరు.
- పాఠశాలల్లో పిల్లలు ఎప్పుడు వచ్చినా చేర్చుకొని వయస్సుకు తగ్గ తరగతికి కావల్సిన సామర్థ్యాల సాధన కొరకు ఉపాధ్యాయులు బాధ్యత వహించి ప్రత్యేక శిక్షణనిచ్చి వారంతా కొనసాగేలా చేస్తారు.
- పాఠశాలల్లో దండనలు, దూషణలు లేకుండా పిల్లలందరితో ప్రేమ పూర్వకంగా వ్యవహరించే వాతావరణం ఉంటుంది. పిల్లలందరు స్వేచ్ఛగా మాట్లాడతారు. ప్రశ్నిస్తారు. తమ అభిప్రాయాలను చెబుతారు.
- పిల్లలందరు భాగస్వాములయ్యేలా కృత్యాధార పద్ధతిలో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తారు. ప్రతి బాలుడు, బాలిక తరగతికి చెందిన సామర్థ్యాలు పొందుతారు. దీనికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహిస్తారు.
- బాలల సర్వతోముఖాభివృద్ధి, బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు పూర్తిగా పెంపుదల.
- చదువులో వెనుకబడిన పిల్లలకు అదనపు సమయంలో తరగతులను నిర్వహిస్తారు.
- భయరహిత, దండనలేని పాఠశాల వాతావరణం ఉంటుంది. పిల్లల తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడం.
- పిల్లల జ్ఞానాన్ని, దాన్ని అన్వయించే శక్తిని నిరంతరంగా, సమగ్రంగా మూల్యాంకనం ద్వారా అంచనా వేస్తారు.
- ఇందుకోసం ఉపాధ్యాయులే ప్రశ్నపత్రాలను రూపొందించుకొని అమలుపరుస్తారు.
- ఏ తరగతిలో కూడా పిల్లలను నిలిపివేయడం లేదా పాఠశాలనుండి తొలగించడం వంటివి అగుపించవు.
- పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన తరగతిగదులు, తాగునీరు, మరుగుదొడ్లు మొదలగు కనీస సౌకర్యాలు కల్పించాలి.

## 1.7 ముగింపు (Conclusion)

ఎన్నో దశాబ్దాలనుండి ఆశిస్తున్న విద్య అందరు పిల్లలు పొందడానికి అవసరమైన అంశాలన్నీ ఆర్.టి.ఇ.-2009 చట్టం రూపంలో మన ముందుకొచ్చాయి. ఇవి ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా అందరికి అందుబాటులోకి వచ్చేలా చేయడానికి ఉపకరిస్తాయి. ఈ అంశాలను అమలుపరచి పిల్లలందరకు నాణ్యమైన విద్యను అందించేలా చేయడం మన బాధ్యత. వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను తదుపరి అధ్యాయాల్లో విపులంగా చర్చిద్దాం.

# 2. బాలల సర్వతోముఖాభివృద్ధి - బాలల జ్ఞానం - సామర్థ్యాలు - నైపుణ్యాలు, వైఖరులు పూర్తిగా పెంపొందించుట

**(All Round Development of Children - Developing, Knowledge, Abilities, Skills, Attitudes to the fullest extent )**

**2.1** మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
**(Basic Questions - Think and Reflect)**

**2.2** నేపథ్యం **(Context)**

**2.3** కరికులమ్ – ఆశయాలు **(Curriculum Goals)**

**2.4** **RTE – 2009** – బాలల అభివృద్ధి
**(RTE - 2009 - Child Development)**

**2.5** బాలల సర్వతోముఖాభివృద్ధి – ప్రస్తుత పరిస్థితి
**(All Round Development of Children - Existing Situtation)**

**2.6** బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు, వైఖరులు సంపూర్తిగా పెంపొందించడం
**(Development of children knowledge, abilities, skills, values and attitudes to the fullest extent)**

**2.7** బాలల సర్వతోముఖాభివృద్ధి – అభివృద్ధి రంగాలు
**(All round development of children - Developmental areas)**

- **2.7.1** శారీరక అభివృద్ధి **(Physcial Development)**
- **2.7.2** మేథోపరమైన లక్ష్యం **(Intellectual Development)**
- **2.7.3** సాంఘికాభివృద్ధి **(Social Development)**
- **2.7.4** ఉద్వేగ అభివృద్ధి **(Emotional Development)**
- **2.7.5** నైతిక విలువల అభివృద్ధి **(Moral Development)**
- **2.7.6** సౌందర్యాత్మ స్పృహ **(Aesthetic Development)**

**2.8** పిల్లల సర్వతోముఖాభివృద్ధి – పాఠశాల పాత్ర
**(All-round development of children - Reole of the school)**

**2.9** పిల్లల సర్వతోముఖాభివృద్ధి – ఉపాధ్యాయుల పాత్ర
**(All-round development of children - Reole of the teacher)**

**2.10** బాలల సర్వతోముఖాభివృద్ధి – అమలుకు సూచికలు
**(All round development of children - indicators of implementation)**

**2.11** ముగింపు **(Conclusion)**

### బోధన – అభ్యసనం

ఉపాధ్యాయుడు బోధిస్తాడు. పిల్లలు నేర్చుకొంటారు. టీచరుకు అన్నీ తెలుసు. పిల్లలకేమీ తెలియదు. ఆలోచించేవాడు ఉపాధ్యాయుడు. ఆలోచించే పనిని పిల్లలు టీచరుకు అప్పచెపుతారు. క్రమశిక్షణ గరిపేది టీచరు. దాన్ని పాటించే వాళ్ళు విద్యార్థులు. టీచరు ఎంపిక చేసి అవసరమైనదాన్ని అమలుచేస్తాడు. విద్యార్థులు దాన్ని ఆచరిస్తారు. ఉపాధ్యాయుడు చేసేవాడు. పిల్లలు అతని చర్యల ద్వారా తాము చేస్తున్నామని భ్రమపడుతుంటారు. ఉపాధ్యాయుడు కార్యక్రమాల్ని రూపొందిస్తాడు. పిల్లలు తమకందులో ఏ ప్రమేయం లేకున్నా వాటిని పాటిస్తారు. అన్నిటికంటే మించి ఉపాధ్యాయుడు తనకు విజ్ఞానంపై ఉండాల్సిన అధికారికతను, వృత్తిపరమైన అధికారంతో కలగాపులగం చేస్తాడు. మన విద్యాప్రక్రియలో ఉపాధ్యాయుడు కర్త. విద్యార్థులు కేవలం కర్మలు. విద్యార్థులు కేవలం విజ్ఞానమనే సొత్తుని డిపాజిట్ చేసుకొనేవారు ఈ విద్యా విధానంలో విద్యార్థులు ఎలాగైనా సర్దుకొనిపోగల, ఎవ్వరైనా నియంత్రణ చేయగల జీవులు. తమ బుర్రల్లో వీళ్ళెంత సమాచారాన్ని జమచేసుకొంటారో అంతగా ప్రాపంచిక దృక్పథంనుంచి దూరమవుతారు. వాళ్ళెంతగా తమమీద రుద్దబడ్డ ప్రతి దాన్నీ అంగీకరిస్తూ పోతారో అంతగా ప్రపంచంలో సర్దుకుపోవడం నేర్చుకొంటారు. ఇలా తర్కం, చర్చ నిరంతరం పలుకోణాలనుంచి కొనసాగాల్సిందే కానీ అన్వేషణ, పునరన్వేషణల నుండి మాత్రమే విజ్ఞానం వికసిస్తుంది. అవిశ్రాంతి, అనంత జిజ్ఞాసతోనే మనిషి ప్రపంచాన్ని అనుక్షణం అర్థంచేసుకుంటూ పురోగమిస్తాడు. తరగతి గదిలో విద్యార్థికి దక్కవలసింది ఈ అన్వేషణ, జిజ్ఞాసలే. ఎన్ని చర్చోపచర్చల సారాంశమైనా ఇదే.

**– (సౌజన్యం.... చదువు)**

విద్యావంతులంతా పాఠశాలని మరింత సౌకర్యవంతంగా ఎలా తీర్చిదిద్దగలమా అనే ఆలోచిస్తూవచ్చారు. అది పురాతన గ్రీకు జిమ్నాషియమయినా, లేదా ప్రాచీన భారతీయ గురుకులమైనా దాని ఉద్దేశ్యం మనిషికి అత్యున్నత స్థాయి విద్యని అందదించడమే. ప్రపంచమంతటా, అన్ని నాగరికతల్లో కనీసం ఒక వయసుదాకా పిల్లలకి సమగ్రశిక్షణ ఇవ్వడానికి పాఠశాల వంటిదంటూ ఒకటుండాలని మానవ సమాజం నమ్ముతూ వచ్చింది. పాఠశాల అంటే ఏమిటి? గురువా? పిల్లవాడా? బోధనా? అభ్యసనమా? వల్లెవేయడమా? అది కొన్ని పనిగంటల ప్రక్రియా? లేక అహర్నిశలు కొనసాగుతుండే అపురూప సహజీవనమా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఒక్కలా లేవు. ఇందులో ప్రతి అంశం మీద ఎంతో చర్చ జరిగింది. ఎన్నో వాదవివాదాలు. ఎన్నెన్నో ప్రయోగాలు జరిగాయి. జరుగుతున్నాయి. ఇంకా ఎన్నో జరగబోతున్నాయి. కాని ఒక్క విషయంలో మాత్రం అన్ని ప్రయోగాలూ, అందరు విద్యావేత్తలూ ఒక్కలానే అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యార్థి సమగ్రాభివృద్ధికి తోడ్పడవలసి ఉంటుందని. సమగ్ర అభివృద్ధి అంటే, కేవలం పిల్లవాడి శరీరానికో లేదా బుద్ధికో లేదా హృదయానికో మాత్రమే శిక్షణనివ్వడం కాదు. అది ఏకకాలంలో పిల్లవాడి సమస్త శక్తుల్నీ అభివృద్ధి పరచవలసి ఉంటుందనే ప్రతి విద్యావేత్తా భావిస్తూ వచ్చాడు. తన విద్యార్థికి ఏదో కనీస విద్యానుభవాన్నిస్తే చాలని ఏ విద్యావేత్తా భావించినట్టు కనబడదు. పైగా ఆ విద్యానుభవం అత్యంత ప్రాకృతిక పరిసరాల్లో, అత్యంత సహజసిద్ధంగా వాళ్లకి ఒనగూడాలనే ఎందరో విద్యావేత్తలు కోరుకున్నారు. పిల్లవాడితో కలిసిమెలసి అతనికొక నూతన జీవన దృక్పథాన్నివ్వడం సుదీర్ఘమైన, సహనశీల ప్రక్రియ అనే వారు భావించారు.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# 2. బాలల సర్వతోముఖాభివృద్ధి

## (All-round Development of the Children)

### 2.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి

### (Basic Questions - Think and Reflect)

1. బాలల సర్వతోముఖాభివృద్ధి అంటే ఏమిటి? (What is allround development of children?)
2. విద్యా లక్ష్యాలు ఏమిటి? ఏ ఆశయాల సాధన కోసం పాఠశాల పనిచేస్తుంది?
   (What are the goals and aims of education. for what purpose do the school serve?)
3. ప్రస్తుతం బాలల సర్వతోముఖాభివృద్ధి పరిస్థితి ఏమిటి?
   (What is the present status on all-round development of children?)
4. ఈ క్రింది అంశాలు ఎలా రూపొందిస్తాం? (How to formulate the following items?)
   1. కరికులం మరియు అభ్యాసన అంశాలు (Curriculam and learning areas)
   2. నాణ్యమైన బోధనభ్యసనా విధానాలు. (Quality teaching learning process)
   3. టీచర్ నాణ్యత, ఉపాధ్యాయుని తయారి మరియు తరగతి గది నిర్వహణ.
      (Quality of teacher, teacher preparation and classroom management)
   4. నాణ్యమైన తరగతి గది నిర్వహణ. (Quality of classroom management.)
5. మూల్యాంకనంలో నాణ్యత అంటే ఏమిటి? మూల్యాంకనం అనేది పిల్లలు నేర్చుకోవడానికి ఏ విధంగా దోహదపడుతుంది? (What is quality in assessmenet? How it supports learning?)

### 2.2 నేపథ్యం (Context)

**బాలల సర్వతోముఖాభివృద్ధి – రాష్ట్ర దృక్పథం:**

ఇతరులను సరిగా అర్థం చేసుకుంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా పిల్లలందరూ ఎదగడానికి ఉన్నత ప్రమాణాలు గల నాణ్యమైన విద్యను రూపొందించాలి. పిల్లలకు వాళ్ళ పరిసరాల పట్ల అవగాహన ఉండి దాన్ని గురించి వాళ్ళు విమర్శనాత్మకంగా ఆలోచించాలి. పిల్లలు శ్రద్ధగా వినాలి. నిర్భయంగా మాట్లాడాలి. చదివినదీ, విన్నదీ అర్థం చేసుకోవాలి. వాటి గురించి ప్రశ్నించగలగాలి. స్నేహపూరితమైన సహజ అభ్యసన వాతావరణంలో పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేందుకు, సందేహ నివృత్తి చేసుకునేందుకు ఉపాధ్యాయులు దోహదపడాలి. పిల్లల నైపుణ్యాలను పెంపొందిస్తూ అర్థవంతమైన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. ఉపాధ్యాయులు సమాజం నుండి నేర్చుకోవాలి. నేర్చుకున్న దాన్ని తరగతి గదిలో అన్వయించాలి. పాఠశాల తమదనే భావన తల్లిదండ్రుల్లోనూ, సమాజంలోనూ ఉండాలి. వాళ్ళు పాఠశాల కార్యకలాపాల్లో పాల్గొనాలి. యాంత్రికత, భౌతికత, పోటీతత్వం, ప్రబలుతున్న ప్రపంచంలో సహకారం, ప్రతిస్పందన, మానవీయ, నైతిక విలువలకు పాఠశాలలు స్థానం కల్పించాలి.

ప్రస్తుతం బాలల సర్వతోముఖాభివృద్ధికి ఏ రకమైన కరికులం మనం ఎంచుకున్నాం? ఎలా అమలు చేస్తున్నాం? అమలుపరచాల్సిన ఉపాధ్యాయులు మరియు అధికారుల వృత్తిపరమైన అవగాహన, దృక్పథం మరియు అంకితభావం ఎలా ఉన్నది? వీటిపైనే పిల్లల అభివృద్ధి, వికాసం ఆధారపడి ఉన్నాయి.

**ఇందుకోసం మన రాష్ట్రంలో చేపట్టిన చర్యలు:**

పాఠశాల విద్యలో పిల్లల సర్వతోముఖాభివృద్ధి కోసం కింది అంశాలను కూడా పాఠ్య విషయాలగానే పరిగణించి వీటికి కూడా ఆధారపత్రాలను, పాఠ్యప్రణాళిక (syllabus)ను రూపొందించారు. ఉపాధ్యాయుల కరదీపికలు కూడా తయారవుతున్నాయి. అవి:

- శారీరక, ఆరోగ్య విద్య (Physical, Health Education)
- కళలు, సాంస్కృతిక విద్య (Arts, Cultural Education)
- పని, కంప్యూటర్ విద్య (Work, Computer Education)
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు (Value Education, Life Skills)

రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం, 18 ఆధారపత్రాలు (వీటిని ఎస్.సి.ఇ.ఆర్.టి వెబ్‌సైట్ www.apscert.inలో చూడవచ్చు

*–ఎ.పి.ఎస్.సి.ఎఫ్–2011*

పిల్లలు అన్ని రంగాల్లో శారీరక, మేథోపరమైన, నైతిక, సాంఘిక, సౌందర్యాత్మక అంశాల్లో అభివృద్ధిని సాధించడాన్ని **బాలల సర్వతోముఖాభివృద్ధి** అంటారు.

## 2.3 కర్రికులం – ఆశయాలు (Curriculum Goals)

1. పాఠశాలలు సాధించాల్సిన విద్యా లక్ష్యాలు ఏవి? (Aims of Education)
2. ఈ లక్ష్యాలను సాధించడానికి ఎలాంటి అనుభవాలను కల్పించాలి? (Syllabus, Content, Experiences)
3. ఈ విద్యా అనుభవాలను ఎలా అర్థవంతంగా నిర్వహించాలి. (Classroom Environment, Methods of teaching, Classroom management )
4. ఈ విద్యా లక్ష్యాలను సాధించినట్లుగా ఎలా నిర్ధారించుకోవాలి? (assesment)

విద్యా లక్ష్యాలు ఈ క్రింది ప్రశ్నలకు తగిన అవగాహన కల్పిస్తాయి.

పిల్లలు పాఠశాలకు ఎందుకు రావాలి? (Why should a child come to school?)

తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు ఎందుకు క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు పంపించాలి? (Why should a parent send their children to school regularly on for a sufficient long period of time)

ప్రభుత్వం బడులను ఎందుకు నడిపిస్తుంది? (Why should the Government run the schools ?)

ఈ పాఠశాలల ప్రాధాన్యతలు ఏమై ఉండాలి? (What should be the priorities of these schools)

పాఠశాలలు ఏమి చేయాలి? సమాజంలో పాఠశాల పాత్ర ఏమి? (What can schools do? and what is their possible role in the society?)

విద్య యొక్క లక్ష్యం ఏమిటి? (What is the purpose of education?)

**కరికులం యొక్క ఆశయాలు:**

- పిల్లలందరూ ఉన్నత స్థాయి గుణాత్మక విద్య పొందాలి.
- ఇతరుల పట్ల స్పందించే వైఖరులను కలిగి ఉండి బాధ్యతాయుతమైన పౌరునిగా విద్యార్థులు రూపొందాలి.

- పిల్లలందరూ సమగ్రంగా, సర్వతోముఖాభివృద్ధి పొందాలి అంటే శారీరక, మేథోపరమైన, ఉద్వేగ, నైతిక పరంగా అభివృద్ధి.
- తమ పరిసరాల పట్ల  పరిజ్ఞానం కలిగి ఉండి విమర్శనాత్మకంగా పరిసరాల పట్ల ఆలోచించగలగాలి.
- బాలల పూర్తి  సామర్థ్యం మేరకు శారీరక మానసిక సామర్థ్యాలు అభివృద్ధి చెందాలి. బాలల జ్ఞానం, బాలల సామర్థ్యం, నైపుణ్యాలు, వైఖరులు అభివృద్ధి చెందాలి.
- ఆత్మిక జాగృతి, శీల నిర్మాణం, నైపుణ్య సముపార్జన, సహజీవన సంస్కృతి మొదలగునవి నిర్మాణం జరగాలి.
- బాలలు జాగ్రత్తగా విని, ఆలోచించి నిర్భయంగా మాట్లాడగలగాలి.
- విన్నదాన్ని, చదివిన దాన్ని అవగాహన చేసుకోవాలి.
- ప్రశ్నించే మనస్తత్వం, స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తీకరించే విధంగా పెంపొందించాలి.
- యాంత్రికత, భౌతిక, పోటీతత్వం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, ప్రతిస్పందన, సహకార  గుణాలకు పాఠశాల చోటు కల్పించాలి.
- మానవీయ నైతిక విలువలు పెంపొందించాలి. రాజ్యాంగ విధులు, మానవ హక్కులు, పిల్లల హక్కుల అమలుపరచాలి.
- విద్యార్థి తనను తాను తెలుసుకోవాలి.
- సాంస్కృతిక భిన్నత్వం, వివిధ సంస్కృతుల మధ్య సంబంధాన్ని గౌరవించాలి, ప్రశ్నించాలి. పిల్లలలో వివిధ రకాలైన నైపుణ్యాలు అనగా కళలు, సంగీతం, నృత్యం, చిత్రకళ, రంగులు వేయడం, ఆటలు ఆడుట, జీవన నైపణ్యాలు పెంపొందించాలి.
- జీవావరణం, జీవవైవిధ్యం పై అవగాహన స్పందన పెంపొందించాలి.
- విద్య అనేది విమోచనం కొరకు అనగా అణచబడే తీరు, అన్ని రకాల వివక్షతలు అనగా  స్త్రీ, పురుష సమానత్వం, కులాలు, సమాజంలో సమానత్వం మొదలగు వాటిపై అవగాహన.
- ప్రజాస్వామ్య విధానాన్ని బలపరిచే విధంగా ప్రజాస్వామ్య విలువలు పెంచే విధంగా దీనిని  కొనసాగించే విధంగా ఉండాలి.
- పిల్లలను తార్కికంగా తులనాత్మకంగా ఆలోచించే విధంగా తయారు చేయాలి. ఆలోచనా నైపుణ్యాలను పెంచాలి.
- శ్రమ విలువను గుర్తించేలా, శ్రమ చేసే విధంగా, బాధ్యతలు తీసుకొనే విధంగా, ఒక మంచి మానవ వనరుగా పిల్లలను వికాసవంతులుగా చేసి, సర్వతోముఖాభివృద్ధి పొందడం విద్యాలక్ష్యం.

## 2.4 ఆర్.టి.ఇ-2009 - బాలల అభివృద్ధి (RTE-2009 - Child Development)

**'అభివృద్ధి చెందడం'** అనేది పిల్లల హక్కు. బాలల హక్కుల్లో జీవించే హక్కు, సంరక్షించబడే హక్కు, భాగస్వామ్యపు హక్కు, అభివృద్ధి చెందే హక్కు అనే ప్రధానమైన హక్కులు ఉన్నాయి. ప్రపంచంలోని బాలలందరికీ ఇవి వర్తిసాయి. బాలలందరూ అభివృద్ధి చెందడానికి ఆయా దేశాలు అంతర్జాతీయ వేదికలపై తగిన చర్యలు చేపడతామని కూడా చెప్పాయి.

పిల్లలందరూ జీవించడానికి అవసరమైన పోషకాహారం, తాగునీరు, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన పరిసరాలు/వాతావరణం కలిగి ఉండడం. భద్రత, ప్రేమపూర్వకమైన స్వేచ్ఛా వాతావరణం కలిగి ఉండడం, పిల్లల అభివృద్ధికి తోడ్పడే పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలన్నింటిలో పాల్గొనడం వంటివి పిల్లల హక్కులు. ఇవన్నీ సక్రమంగా జరిగినప్పుడే పిల్లలందరూ

అభివృద్ధిని సాధించగల్గుతారు. బాలల హక్కుల్లో నాలుగు కూడా ఒకదాన్ని ఇంకొకటి ప్రభావితం చేస్తుంది. అందుకే బాలల సర్వతోముఖాభివృద్ధిని బాలల హక్కుల కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

బాలలందరూ సర్వతోముఖాభివృద్ధి సాధించడం అనేది మన దేశంలో నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం–2009 ద్వారా చట్టబద్ధమైంది. ఈ ఆర్.టి.ఇ.–2009 సెక్షన్ (29) సబ్ సెక్షన్ (2)లో బాలలందరూ విద్య ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించేలా విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలు ఉండాలని పేర్కొన్నది.

బాలల సర్వతోముఖాభివృద్ధి కోసం విద్యా విషయక అధీకృత సంస్థ (Academic Authority) కింది అంశాలపై దృష్టిపెట్టి విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు ఉండాలని RTE-2009 సూచించింది. అవి:

- రాజ్యాంగంలో పొందుపర్చిన విలువలు

  ఉదా: సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం మొ॥వి.
- బాలల సర్వతోముఖాభివృద్ధి
- బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు, వైఖరులు.
- బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తుల అభివృద్ధి.

పాఠశాల అనేది బాలల సమగ్ర ఎదుగుదలకు ఏర్పాటు చేసిన కేంద్రం. పిల్లల్లో ఏదో ఒక సామర్థ్యాన్ని అభివృద్ధిపర్చడం ద్వారా గాని లేదా కొన్ని విషయాలకే పరిమితమై వాటిని సాధించడం వల్ల గాని విద్య యొక్క లక్ష్యం నెరవేరదు. బాలల ఇష్టాలు, ఆసక్తులు వారిని అభివృద్ధిపరిచే రంగాలను గుర్తించి, వాటిలో పాల్గొనేలా చేయడం, అందుకు అవసరమైన కార్యకలాపాలను పాఠశాలల్లో నిర్వహించినపుడే బాలల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది.

'బాల్యం' పిల్లల ఎదుగుదలకు తోడ్పడే దశ. ఈ సమయంలో పిల్లల బాల్యాన్ని హరించేవిధంగా పాఠశాల వాతావరణం, పనితీరు ఉంటే, ఇది పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపి బాలల అభివృద్ధిని నిరోధిస్తుంది. అందుకే బాలల సర్వతోముఖాభివృద్ధి జరగడానికి అవసరమైన అన్ని రంగాల్లో కార్యక్రమాలు నిర్వహించబడాలి. ఇందుకోసం కింది రంగాలపై దృష్టి పెట్టాలి.

బాలల సర్వతోముఖాభివృద్ధి రంగాలు

- శారీరక అభివృద్ధి, మేథోపరమైన అభివృద్ధి
- సాంఘిక అభివృద్ధి
- ఉద్వేగ అభివృద్ధి
- నైతిక విలువల అభివృద్ధి
- సౌందర్యాత్మక స్పృహ

## 2.5 బాలల సర్వతోముఖాభివృద్ధి – ప్రస్తుత పరిస్థితి (All Round Development of Children - Existing Situtation)

- విద్య యొక్క పరమార్థం పరీక్షలు, మార్కులు, ర్యాంకులుగా మారింది.
- జ్ఞాపక శక్తిని పరీక్షించడానికి పరిమితమైన పరీక్షల విధానాలు.
- కేవలం పాఠ్యవిషయాలు అంటే భాషలు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలకే ప్రాధాన్యత.
- పిల్లల అభివృద్ధికి తోడ్పడే విలువలు, అభిరుచులు, ఆటలు, పని వంటి అంశాలు పాఠశాలలో కనుమరుగైనవి.

- తల్లిదండ్రుల దృష్టిలో కూడా ఆటలు, పాటలు, కథలు, వ్యాయామం, పనిచేయడం వంటివి చదువులో భాగం కాదని, వీటి వల్ల తమ పిల్లల చదువులు దెబ్బతింటాయని భావించడం.
- ఆనందంగా ఆడుకునే సాయంకాలం (పిల్లల సమయం), ఇంటిపని (home work)తోనో, పరీక్షల కోసం చదవడానికో, ట్యూషన్లకో, స్టడీసెంటర్లకో వెళ్లడానికే పరిమితమైంది.
- పిల్లలు తల్లిదండ్రుల కోరిక మేరకే చదవడం.
- ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు.... ఇలా అందరూ కూడా పిల్లలకు ఒక మనసుంటుందని, వారికి ఆలోచనలు, ఆసక్తులు ఉంటాయని మరిచి, తమకిష్టమైన/ తోచిన అంశాలను బలవంతాన రుద్దుతున్నారు. పిల్లలను యంత్రాలుగా మారుస్తున్నారు.
- వీటికితోడు ప్రమాణాల పేరుతో బరువెక్కిన చదువులు అంటే (IIT) కోచింగ్‌ల పేరుతో పై తరగతుల్లో చదవాల్సిన వాటిని అర్థమైనా, కాకున్నా బలవంతాన కింది తరగతుల్లోనే చదవడం.
- ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పుస్తకాల చుట్టూ, వాటిలోని అంశాలను మెదళ్ళలో కుక్కుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు.
- వీటి ప్రభావం వల్ల పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, ప్రవర్తనా సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఒత్తిడి, ఆందోళనకు గురై ఆత్మన్యూనతలో మునిగిపోవడం, స్తబ్దంగా, నిస్తేజంగా ఉండడం. స్పందించే గుణం కోల్పోవడం జరుగుతున్నది.
- వీటిని దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్రంలో APSCF-2011ను రూపొందించి మన రాష్ట్ర దృక్పథాన్ని రాసుకున్నాం.

## 2.6 బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు, విలువలు, వైఖరులు, సంపూర్తిగా పెంపొందించడం (Development of children knowledge, abilities, skills, values and attitudes to the fullest extent)

బాలల శారీరక, మానసిక, సాంఘిక, నైతిక, మేధోపర, భావోద్వేగ, సౌందర్యాత్మక స్పృహ వంటి అంశాలలో అభివృద్ధిని బాలల సర్వతోముఖాభివృద్ధి అనవచ్చును. బాలలు ఆసక్తిగా అభ్యసించడం, భయరహిత వాతావరణంలో భాగస్వాములవడం ద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. బాలలను భావి ఉత్తమ పౌరులుగా రూపొందించి ఉత్తమ జీవన విధానానికి తోడ్పడేదే విద్య. బాలల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడునట్లుగా పాఠశాల కార్యక్రమాలు ఉండాలి. బాలల అంతర్గత శక్తులను, సామర్థ్యాలను వెలికితీసే విధంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

**1. బాలల జ్ఞానం (Kno wledge):**

ఇది సమాచారం కాదు. పుస్తకాలలోని లేదా గైడులలోనిది జ్ఞాపకం ఉంచుకొని తిరిగి అప్పజెప్పడం కాదు. పుస్తకాలలోని ప్రశ్నలను, జవాబులను గైడ్లు/ స్టడీమెటిరీయిల్ వంటివి చూసి రాయడం కాదు. జ్ఞానమంటే గతానుభవాల ఆధారంగా తమ ఆలోచనల నుండి ఉద్భవించేది. ఇది ఒక అవగాహన కావచ్చు. ఒక కవిత కావచ్చు; కథ కావచ్చు, సూత్రీకరణ కావచ్చు. జ్ఞానం అనేది అన్ని సబ్జెక్టులలో ఒకే రీతిలో ఉండదు. ఆయా సబ్జెక్టు స్వభావాన్ని బట్టి ఉంటుంది. కాబట్టి భాషలో కథలు రాయడం, అనుభవాలు రాయడం, నినాదాలు రాయడం, కవితలు, గేయాలు వంటి వ్యవహార రూపాల్లో ఉంటే గణితంలో సూత్రాలు, సంబంధాలు నిరూపణలు వంటి రూపంలో ఉంటుంది. సైన్సులో భావనలు, అవగాహన, సిద్ధాంతాలు, సాధారీకరణాల వంటి రూపాల్లో ఉంటుంది. సాంఘికంలో మానవతా మధ్య సంబంధాలు, మానవ జీవనాన్ని ప్రభావితం చేసే అంశాలను గుర్తించడం, విలువల ఆవిర్భావం, చట్టాలు, సామాజిక కట్టుబాట్లు, వంటి

రూపాల్లో ఉంటుంది. కాబట్టి జ్ఞాన నిర్మాణం జరిగితేనే నేర్చుకోవడం జరిగిందని భావించాలి. వివరించడం, చదివించడం, చూసి రాయమనడం వల్లే వేయడం వంటి అర్ధరహిత విధానాల ద్వారా  జ్ఞాన నిర్మాణం జరుగదు. ఇందుకోసం కృత్యాలు, ప్రాజెక్టులు, అన్వేషణలు, కనుగొనడం వంటి శిశుకేంద్రీకృత విధానాల ద్వారా బోధనాభ్యసన ప్రక్రియను అర్ధవంతంగా నిర్వహించాలి.

జ్ఞానమనేది సమాచారం పొందడం కాదు. జ్ఞానం ఆలోచనల, అనుభూతుల సంగమం, బట్టిపట్టడం, పునశ్చరణ చేసుకోవడం ద్వారా పిల్లవాడు  పొందే సమాచారాన్ని మనం జ్ఞానం అని తరుచూ భావిస్తారు. కాని జ్ఞానమంటే ఇది కాదు. జ్ఞానమనేది విద్యార్థికి ఇవ్వబడేది కాదు. ఇది అనుభవం ద్వారా స్వయంగా నిర్మించుకునేది. పిల్లలు స్వయంగా ఈ ప్రకృతిలో చురుకైన పాత్ర పోషించి తమంతట తాము చేసి, చూసి జ్ఞానాన్ని పొందాలి. బాలలకు విషయాన్ని  బదలాయింపు చేసి జ్ఞాపకం చేసిన విషయాలను ప్రశ్నల ద్వారా ఉన్నదున్నట్లుగా తిగిరి చెప్పించడం జ్ఞానం కాదు. దీని ద్వారా పిల్లవాన్ని విద్యావంతుని చేయడంగా భావించలేము. నేర్చుకునే విధానం, పద్ధతులు భావనలపై సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, సాధారణీకరించేలా ఉండాలి. పాఠశాల ఈ విధంగా ప్రేరేపించాలి, ప్రోత్సాహించాలి. జ్ఞానమనేది నియమిత కాలంలో పూర్తిగా ఇవ్వగలిగేది కాదు. మానవమేథో భాండాగారాన్ని బదలాయింపు చేసేది మాత్రమే విద్య కాదు. విద్యార్థి పరిశీలన, అనుభూతుల, ఆలోచనల ద్వారా జ్ఞాన నిర్మాణం చేసుకుంటాడు.

**జ్ఞానం వివిధ రీతులలో ఉంటుంది:**

1. విషయ సంబంధ పరిజ్ఞానం (factural knowledge) నిజాలు, నిర్వచనాలు, సమాచారం, పదజాలం.
2. భావనలపరమైన జ్ఞానం (conceptural knowledge)  వివిధ భావనలు, భావనల సమాచారం
3. పద్ధతి సంబంధిత జ్ఞానం (procedural knowledge) – రూల్స్, పద్ధతులు, వివిధ పద్ధతులు, జ్ఞాన నిర్మాణం చేసుకోవడం.
4. Meta cognition – స్వీయ అవగాహన, మనం ఏమిటి ఎలా నేర్చుకుంటున్నాము అనే దానిపై అవగాహన.

బెంజమిన్ బ్లూమ్ మహాశయుని ప్రకారం ఏదైనా ఒక భావనపై జ్ఞానం ఉందంటే దానిని పోల్చడం, తిరిగి తన దైనందిన భాషలో ఉదా॥ చెప్పగల్గడం, బొమ్మ గీయడం, భాగాలు గుర్తించడం, దానిపై ఒక అవగాహనకువచ్చి రాయడం, పరిశీలించి నమోదు చేయడం, వివరణ ఇవ్వడం, తిరిగి చెప్పుడం మొదలైనవి చేయగలగాలి. నేర్చుకొనే దానిని ఉపయోగించగలగాలి.

జ్ఞానం ఉన్నదంటే ఇవి చెయ్యగలగాలి.

- అవగాహన (understanding)
- వినియోగం (application)
- విశ్లేషణ (analyses)
- సంశ్లేషణ (synthesis)
- మూల్యాంకనం (evaluvation)
- సృజించడం (creation)

**2. బాలల సామర్థ్యాలు (Competencies/ abilities):**

సామర్థ్య అంటే చేయగలగడం అని అర్థం. సమర్థత కలిగివుండడం అని అర్థం. 'మాట్లాడడం' అందరికీ వస్తుంది. ఐతే ఒక సమాచారాన్ని ఇతరులను అడిగి తెలుసుకోవడం సమర్థత. అట్లే రాయడం అందరికీ వస్తుందా. ఐతే తన

అవసరం కోసం ఒక దరఖాస్తు రాయగలగడం సమర్థత. ఈ కోణంలో మనం సామర్థ్యాలను అర్థం చేసుకోవాలి. అంటే నైపుణ్యం చెందిన జ్ఞానాన్ని సామర్థ్యంగా భావించాలి.సామర్థ్యాలు సాధారణంగా సబ్జెక్టు స్వభావాన్ని బట్టి ఉంటాయి. ఇవి మానసికమైనవి. ఆలోచనలు కూడా ఉంటాయి. పాఠశాల విద్య ద్వారా పిల్లలు వివిధ సబ్జెక్టులను నేర్చుకుంటారు. ఐతే వీటి ద్వారా ఆయా సబ్జెక్టులలో పిల్లలు ఏమి సాధించాలి? ఏమేం చేయగలగాలి? అనేది ముఖ్యం. అందుకే ప్రతి సబ్జెక్టులో తరగతి వారీగా ఆయా సబ్జెక్టుల స్వభావాన్ని బట్టి సాధించాల్సిన సామర్థ్యాలను నిర్ధారించారు. కాబట్టి వీటిని పిల్లలందరూ సాధించేలా చూడడం మన బాధ్యత. ఇందుకనుగుణంగానే నూతన పాఠ్యపుస్తకాలు కొనాలి. వీటిని సరైన రీతిలో వినియోగించాలి. అనగా పాఠాల మధ్యలోని, పాఠాల కింద ఉన్న సామర్థ్యాధారిత అభ్యాసాలను పిల్లలు సొంతంగా రాసేలా చూడాలి. గైడ్లు వంటి వాటిని చూసి రాయడాన్ని నిషేధించాలి. ఇలా చేస్తే వారిలో సామర్థ్యాభివృద్ధి జరుగదు. ఆలోచించడం, చేసి చూడడం, అధ్యయనం చేయడం,  పాల్గొనడం, సొంతంగా రాయడం ద్వారా సామర్థ్యాలను పిల్లలు  పొందుతారు. ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళికను, పాఠ్య ప్రణాళికను రూపొందించుకొని తగిన సంసిద్ధతతో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

పిల్లలు ఎన్నో అంతర్గత శక్తులు, సామర్థ్యాలు కలిగి ఉంటారు. విద్య యొక్క ముఖ్య ఆశయం బాలల్లో ఉండే సహజమైన ఈ శక్తులను అభివృద్ధి పరచడమే (capabilities or innate abilities)

**బాలల అంతర్గత శక్తులు, సామర్థ్యాలు:**

ఈ అంతర్గత శక్తులు ప్రతి బాలుని/ బాలికలో ఉంటాయి. ఇవి ఒక్కొక్కరిని ఒక్కోవిధంగా అభివృద్ధి చెందివుండాలి. వీటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మంచి శక్తులు, నైపుణ్యాలు గల వ్యక్తులను తయారు చేయడమే పాఠశాల ప్రముఖ కర్తవ్యం. ఆలోచించడం

- పరిశీలించడం, పోల్చడం, సేకరించడం
- ఊహించడం
- భేదాలు పోలికలు గుర్తించడం, చెప్పడం
- వర్గీకరించడం, లెక్కించడం
- అంచనా వేయడం
- కారణ కారకాలు, సూత్రీకరించడం
- ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం
- కారణాలు చెప్పడం
- నియమాలు ఏర్పరచడం, సాధారణీకరించడం
- విశ్లేషించడం
- సంశ్లేషించడం
- ఉత్పత్తి చేయడం/సృజించడం
- ఆడడం, పాడటం, అభినయనం
- సృజనాత్మకంగా వ్యక్తీకరించడం
- సమస్యా పరిష్కారాలు సూచించడం

- నిర్ధారణకు రావడం
- పరికరాలను ఉపయోగించడం
- మానసిక చిత్రాలు ఏర్పరచుకోవడం
- బొమ్మలు, పటాలు గీయడం

పై శక్తులు ఎంతో కొంత అభివృద్ధి చెంది పిల్లలందరిలో ఉంటాయి. వాటిని పూర్తిగా వృద్ధిపరచడం, పిల్లల పూర్తి సామర్థ్యం మేరకు పై శక్తులను (capabilities) ను వృద్ధి పరచడం పాఠశాలలు, ఉపాధ్యాయులు చేయాల్సింది ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులో భాగంగానే వీటి పెంపుదల, అభివృద్ధికి తగిన కార్యక్రమాలు ప్రణాళికచే సాధించాలి.

**3. నైపుణ్యాలు (Skills):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నూతన సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనుటకు పిల్లలు ప్రదర్శించాల్సిన సామర్థ్యాలే నైపుణ్యాలు. ఈ నైపుణ్యాలు సబ్జెక్టు ఆధారంగా కావచ్చు లేక అన్ని సబ్జెక్టులో అంతర్గతంగా ఉండేవి కావచ్చు.

నైపుణ్యాలు ముఖ్యంగా ఈ రకాలుగా ఉంటాయి.

1. ఆలోచనా నైపుణ్యాలు (Thinking skills)
2. సామాజిక నైపుణ్యాలు (Social skills)
3. భావప్రసార నైపుణ్యాలు (Communicative skills)
4. స్వయం నిర్వహణ నైపుణ్యాలు (Self management skills)
5. పరిశోధన నైపుణ్యాలు (Reserch skills)

**ఆలోచనా నైపుణ్యాలు:**

సాధారణంగా మనకు భాషల్లో భాషానైపుణ్యాలు, విజ్ఞానశాస్త్రంలో ప్రక్రియా నైపుణ్యాలు వర్గీకరణ, పోల్చడం, ప్రయోగాలు, భావ ప్రసార నైపుణ్యాలు, పరికల్పనలు, అన్వేషణలు నిర్ధారణ మొదలగువాటి గురించి కొంత అవగాహన ఉంది. నైపుణ్యాలు అనేవి మానసికపరమైనవి. అనగా ఆలోచణాత్మకమైనవి. ఆలోచించే విధంలో వైవిధ్యతను ప్రదర్శించే నైపుణ్యం కల్గి ఉండడం. వీటినే ఆలోచన నైపుణ్యాలు (thinking skills) అంటారు. ఇవి ప్రధానంగా నాలుగు రకాలు.

1. ప్రతిస్పందించడం (Reflection)
2. హేతుబద్ధంగా ఆలోచించడం (Analytical thinking) అంటే వాస్తవాలు గుర్తించి కారణాలు చెప్పగలగడం.
3. బహుకోణాల్లో ఆలోచించి విశ్లేషించడం అంటే ఏ విషయం గురించైనా విభిన్న కోణాల్లో చెప్పగలగడం, సమర్థిస్తూ మాట్లాడడం, దాన్నే విభేదిస్తూ మాట్లాడడం; ఏదైనా పని – అంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల గురించి ప్రయోజనాలను చెప్పగలగడం అట్లే పరిమితులను కూడా చెప్పగలగడం.
4. **సృజనాత్మక ఆలోచనలు (Creative Thinking)**: అంటే నూతన ప్రతిపాదన చేయగల్గడం ,కొత్తవి సృష్టించడం, తన నిర్ణయాన్ని ప్రకటించడం అంటే తానే ఆస్థానంలో ఉంటే ఏం చేస్తాడు? అని స్థిరంగా/ ఆత్మ విశ్వాసంతో చెప్పగలగడం.
5. విమర్శనాత్మక ఆలోచనలు **(Critical Thinking)**: ఎందుకు? ఏమిటి? ప్రశ్నించడం ద్వారా ఆలోచింపజేయడం.

నేర్చుకోవడం అనేది ఆలోచించడం ద్వారానే జరుగుతుంది. అభ్యసనం జరగాలంటే విద్యార్థులను భావనలపై, సమస్యలపై ఆలోచింప చేయాలి. ఆలోచించడం, చేయడం, అనుభవాల ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

జ్ఞానాన్ని పొందడానికి ఆలోచించాలి. ఆలోచిచండం ద్వారానే అవగాహన, వినియోగం, విశ్లేషణ, సంశ్లేషణ, మూల్యాంకనం అనే అత్యున్నత నైపుణ్యాల సాధన జరుగుతుంది.

**సామాజిక నైపుణ్యాలు (Social Skills):**

-ఇతరులను గౌరవించడం

-బాధ్యతలు స్వీకరించడం

-ఇతరులతో కలిసి పని చేయడం, పంచుకోవడం

-సమాజంలో సమూహంలో తన బాధ్యతను నిర్వర్తించడం

-స్వీయ విశ్వాసం, నమ్మకం ఉండటం

- కుటుంబ జీవనం, కుటుంబ సంబంధాలపై ఆకాంక్ష

**భావ ప్రసరణ నైపుణ్యాలు (Communicative Skills):**

- బాగా వినటం
- ఆలోచించి మాట్లాడటం
- చదవటం
- చదివింది అవగాహన చేసుకొని ప్రతిస్పందించడం
- స్వీయ రచన : చదివింది, విన్నదానిపై అవగాహనతో వ్యాఖ్యానించడం
- హావ భావాల ద్వారా భావనా ప్రసరణ నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ

**స్వీయ నిర్వహణ నైపుణ్యాలు (Self management Skills):**

- మానసిక చలనాత్మక నైపుణ్యాలు (కాళ్ళు, చేతులు, వేళ్ళతో వివిధ పనులు చేయటం)
- సమయ పాలన నిర్వహణ (Time management)
- ఆరోగ్యమైన జీవన విధానాలు (Healthy life style)
- ఆశించిన రీతిలో పిల్లల ప్రవర్తన

**పరిశోధనా నైపుణ్యాలు/సమాచార నైపుణ్యాలు:**

పరిశోధించడం ద్వారా తెలుసుకోవటం, వివిధ నైపుణ్యాలు సాధించడం అవి

- ప్రశ్నించడం
- ప్రశ్నల ఆధారంగా పరిశీలనలు చేయడం
- ప్రణాళిక మరియు సమాచార సేకరణ
- సేకరించిన సమాచార నమోదు విశ్లేషణ
- కనుగొన్న విషయాలు రిపోర్టు రూపంలో రాయటం, ప్రదర్శించడం

ప్రతి పాఠశాల తన సిలబస్ మరియు వివిధ అంతర కరికులం కార్యక్రమాల ద్వారా పై నైపుణ్యాలను పిల్లలందరిలో అభివృద్ధి పరచాలి.

**4. వైఖరులు (Attitudes/ dispositions):**

వ్యక్తులు తమ ప్రకృతి మరియు సమాజంపై ప్రదర్శించే, బహిర్గత పరిచే అతి ముఖ్యమైన మానవ విలువలు, నమ్మకాలు, అనుభూతులను వైఖరులు అంటాం.

**వ్యక్తులు ప్రదర్శించే ముఖ్యమైన వైఖరులు:**

- బాధ్యత తీసుకోవడం
- కలిసి పనిచేయడం (Cooperation)
- సృజనాత్మకత (Creativity)
- ఉత్సాహం, ఉత్సుకత (Curiosity)
- తదానుభూతి (Empathy)
- సహనం, ఓర్పు
- గౌరవం చూపడం
- స్వతంత్రత
- క్షమ, ప్రేమతత్వం
- ప్రోత్సహించడం, ప్రశంసించడం
- నిజాయితి, శ్రమకు విలువనివ్వటం

విద్య అనేది జాతీయ అభివృద్ధిని, సాంఘిక అభివృద్ధిని సాధించేది. బాలల అంతర్గత శక్తులను గుర్తించి శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, విలువలు, నీతినియమాలను అభివృద్ధి చేయునట్లుగా పాఠశాల చేయడం ద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.

## 2.7 బాలల సర్వతోముఖాభివృద్ధి – అభివృద్ధి రంగాలు (All round development of children - Developmental areas)

బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులను అభివృద్ధి చేయడం.

బాలలు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో కింది రంగాలపై దృష్టిపెట్టాలి.

1. శారీరక అభివృద్ధి
2. మానసికాభివృద్ధి/ మేధోపరమైన అభివృద్ధి
3. సాంఘికాభివృద్ధి
4. ఉద్వేగాభివృద్ధి
5. నైతికత, విలువలు శీలనిర్మాణం
6. సౌందర్యాత్మక స్పృహ, ప్రశంస

బాలల సర్వతోముఖాభివృద్ధిలో శారీరక, సామాజిక, మానసిక, మేధోపర, నైతిక, విలువలు, సౌందర్యాత్మక స్పృహ వివిధ రంగాలు ఇమిడి ఉన్నాయి. వీటి వికాసానికి పాఠశాలలు కేంద్రబిందువులు కావాలి. వీటన్నిటితో కూడిన పాఠ్యప్రణాళిక పాఠశాలల్లో అమలుకావాలి.

### 2.7.1 శారీరక అభివృద్ధి (Physical Development)

పిల్లల శారీరకాభివృద్ధి అనేది అన్ని సమాజాలకు ముఖ్యమైనది. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి మూలమైంది. శారీరకాభివృద్ధి పిల్లల సామర్థ్యాలను, శక్తులను ద్విగుణీకృతం చేస్తుంది. శారీరక విద్య క్రమబద్ధమైన పని విధానాన్ని మెరుగుపరుస్తుంది. వ్యాయామ విద్య, యోగ, ఆటలు, క్రీడలు పిల్లలను చైతన్యవంతులను చేయడంలో విమర్శనాత్మక

పాత్రను పోషిస్తాయి. అంతేకాకుండా పిల్లల భౌతిక, సాంఘిక, మానసిక, ఉద్వేగ వికాసాలకు ఎంతగానో తోడ్పడతాయి. శారీరక అభివృద్ధిలో వ్యాయామవిద్య, యోగ, ఆరోగ్యవిద్యలను భాగంగా చేశారు.

ఇవి పాఠశాలను సుసంపన్నం చేస్తాయి. పిల్లల సంపూర్ణాభివృద్ధిలో ఆరోగ్యానికే ప్రధానపాత్ర. ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులనుండి దూరంగా ఉండడమేకాదు. ఆరోగ్యం అనేది బహుముఖ భావాలు గలది. పాఠశాలలో ఆరోగ్యవిద్య ప్రవేశపెడితే పాఠశాల ఆరోగ్యకరమైన పాఠశాలగా రూపాంతరం చెందుతుంది. వైద్య సిబ్బంది పాఠశాలను క్రమం తప్పక సందర్శించాలి. ఆరోగ్యకర జీవనం, దాని ప్రాముఖ్యత, వ్యాధులు,వ్యాధికారకాలు, వ్యాధినిరోధక మార్గాలు మొదలగువాటిపై పిల్లలకు పాఠశాల సిబ్బంది అవగాహన ఏర్పరచాలి. పిల్లల ఆరోగ్యంపట్ల ఇల్లు, సమాజం, పాఠశాల ఉమ్మడి బాధ్యతలు కలిగి ఉండాలి. ఆరోగ్య విద్యా కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించే ముఖ్యకార్యక్రమాలలో భాగమై ఉండాలి. ఇవి పిల్లలలో మంచి ఆరోగ్య అలవాట్లను సరైన వైఖరులను పెంపొందించాలి.

వ్యాయామ విద్య, ఆరోగ్య విద్య, యోగ, ఆటలు, క్రీడలు మొదలగునవి పాఠ్యప్రణాళికలో భాగంగా అయినాయి. వివిధ సబ్జక్టులలో సందర్భోచితంగా కూడా ఈ అంశాలు పాఠ్యాంశాలలో జోడించాలి. సమయసారిణిలో వీటికి సముచిత స్థానం ఇవ్వబడింది. ఈ అంశాలలో పరీక్షల నిర్వహణ జరుగుతుంది.

వ్యాయామ ఉపాధ్యాయునికి వృత్యంతరపునశ్చరణ కోర్సులు కనీసం ఐదు సంవత్సరాలకు ఒకసారైనా తప్పక నిర్వహించాలి. వారిలో వృత్తిపర నైపుణ్యాల అభివృద్ధి, జ్ఞానాన్ని ఇనుమడింపజేసే వస్తుసామగ్రి, రెఫరెన్సు పుస్తకాలు, శిక్షణలు, వనరులు అందుబాటులో ఉంచాలి.

మన దేశంలో పౌష్టికాహారలోపం, అంటువ్యాధులు, పిల్లల ఆరోగ్యం మీద ప్రభావం కలిగిస్తున్నాయి. కాబట్టి పాఠశాలలో అన్ని స్థాయిల్లోనూ బలహీన వర్గాల పిల్లలు, ముఖ్యంగా బాలికల ఆరోగ్యంపట్ల మనం శ్రద్ధ వహించాలి./ విద్యా ప్రణాళికలో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని, వైద్య పరీక్షల్ని అమలుపరచాలి. పిల్లలు పెరిగేకొద్దీ తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు (ముఖ్యంగా ఎదిగే బాలికల విషయంలో) చర్చించాలి. వివిధ ఆహారపదార్థాలు వాటిలో ఉన్న పోషక పదార్థాలను పిల్లలకు చెప్పాలి.

వైద్య సదుపాయం, పాఠశాలలో ఆరోగ్యకర వాతావరణం, పాఠశాలలో అందించే భోజనం, ఆరోగ్యం, వ్యాయామవిద్య వంటి అంశాలు పిల్లల సమగ్ర అభివద్ధికి దోహదం చేస్తాయి. అందుచేతనే వీటిని విద్యాప్రణాళికలో చేర్చవలిసిన అవసరం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో నూతనంగా విద్యాప్రణాళికలో చేర్చవలసిన అంశంగా 'యోగా'ను గుర్తించడం జరిగింది.

పిల్లలు శారీరకంగా ఎదగడానికి స్వేచ్ఛగా ఆడుకోవడం, యధేచ్ఛగానూ, పద్ధతి ప్రకారం ఆడుకొనే వివిధ రకాల ఆటలు, క్రీడలు (స్థానిక మరియు స్థానికేతర) చాలా అవసరం. పిల్లల్లో అభివృద్ధిపరచాల్సిన శారీరక సామర్థ్యాలలో శరీర పటుత్వం, చాలక నైపుణ్యాలు, లాఘవాలు, స్వయం జాగృతి, సంయమనం, జట్టుతో కలిసి పనిచేయగలగడం ముఖ్యమైనవి. కొన్ని రకాల అదనపు పరికరాలు, అందుబాటులో ఉన్నట్లయితే, ఈ కార్యకలాపాలలో (ఆటలు, క్రీడలు) పిల్లలందరూ కలిసికట్టుగా పాల్గొనేటట్లు చేయవచ్చు.

పిల్లల్లో శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధికి మరియు అవగాహన సామర్థ్యాల పెంపుదలకు దోహదం చేస్తుంది. ఆలోచించగల, విచక్షణ చేయగల, సామర్థ్యం, తన గురించీ, తన చుట్టు ఉన్న పరిసర ప్రపంచం గురించీ అర్థంచేసుకోవడానికి ప్రయత్నించగలగడం, తనకు తానుగాను, ఇతరులతో కలిసి కృత్యాలను చేయగలగడం, ఇతరులతో ఇచ్చిపుచ్చుకోగలిగే నైపుణ్యం పెంపొందించుకోగలగడం ఆటల్లో ఇమిడి ఉన్నాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం పిల్లలందరూ ఆరోగ్యంగా ఉంటేనే వారు అభ్యసనంలో చురుకుగా పాల్గొంటారు. అభివృద్ధి చోటుచేసుకుంటుంది. శారీరక అభివృద్ధి పిల్లల స్వామర్థ్యాలను, శక్తులను ద్విగుణీకృతం చేస్తుంది. శారీరక విద్య క్రమ బద్ధమైన పని విధానం అలవడేలా చేస్తుంది. వ్యాయమ విద్య పిల్లలను ప్రశాంతంగా ఉండటానికి, చైతన్యంతో, ఉత్సాహంగా ఉండటానికి తోడ్పడుతుంది.

ఆరోగ్య విద్య అంటే కేవలం వ్యాధుల నుండి దూరంగా ఉండడమనే భావన మాత్రమే కాదు. ఆరోగ్యంపట్ల అవగాహన పెంచి, తగిన విధంగా పిల్లలు తమ జీవన విధానాన్ని మరల్చుకోవడం. అంటే ముందే ఆరోగ్యంపట్ల జాగ్రత్తవహించడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, ఆరోగ్యపు అలవాట్లను కలిగివుండడం వంటివి అలవడాలి.

**శారీరక అభివృద్ధికి పాఠశాల నిర్వహించాల్సిన కార్యక్రమాలు:**

- ఇందుకోసం శారీరక, ఆరోగ్య విద్యను పాఠశాలల్లో అమలుపరచాలి.
- పిల్లల్లో శారీరక అభివృద్ధికోసం పాఠశాలల్లో ప్రతిరోజు ఆటలు ఆడించడానికి ఒక పీరియడ్ కేటాయించారు. తప్పనిసరిగా ఆటలు ఆడించాలి.
- పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. ఆరోగ్యవిద్య కార్యక్రమాలు నిర్వహించాలి.
- ఆటలు ఆడటం, పాటలు, యోగా, ధ్యానం వంటి వాటిలో పిల్లలు పాల్గొనేలా చూడాలి.
- పిల్లల ఎత్తు, బరువు వీటిని సంవత్సరంలో రెండుసార్లు చేయాలి.
- ఆరోగ్య స్థితి వంటి వివరాలను వారికిచ్చే క్యుమిలేటివ్ రికార్డులో కూడా నమోదు చేయాల్సి వుంటుంది.
- ప్రతి రోజు పిల్లలను ఆటలు, క్రీడలు ఆడించాలి.
- ఆరోగ్య అలవాట్లపై చర్చలు నిర్వహించాలి.
- మనం తినే ఆహార పదార్థాలు, వాటిలోని పోషక విలువలు, అనగా ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్స్, లవణాలు వాటి పైన చర్చించాలి. ఏ ఏ ఆహార పదార్థాలు పెరగడానికి, ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడతాయో తెలపాలి.
- యోగాసనాలు వేయించాలి. అవి వారు ఇంటి దగ్గర చేసేటట్టుగా ప్రోత్సహించాలి.
- పరిశుభ్రమైన అలవాట్లు మరియు ఆహార అలవాట్లను చార్ట్‌పై రాయించాలి. వాటిపై మాట్లాడించాలి.
- పాఠశాలలో ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించి, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, నాటికలు, సృజనాత్మక రచనలు చేయించాలి.
- సమీప ఆరోగ్య కేంద్రంలోని డాక్టరు, వైద్య సిబ్బందిని ఆహ్వానించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- పిల్లలను ఆటల పోటీకి, టోర్నమెంటుకు తయారు చేయించాలి.

## 2.7.2 మేథోపరమైన అభివృద్ధి (Intellectual Development)

ప్రతి శిశువుకు అంతర్గత శక్తులుంటాయి. సరయిన అవకాశాలు కల్పించినపుడు అవి పూర్తి స్థాయిలో వ్యక్తమవుతాయి. పౌష్టికాహారం, వ్యాయామంవంటి వాటితో శారీరకాభివృద్ధి సాధ్యమయినట్లు స్నేహపూరిత వాతావరణం, ఛాలెంజింగ్ లక్ష్యాలు నిర్దేశించి సహకరించడం ద్వారా మానసికాభివద్ధి పెంపొందించవచ్చు. భయపూరిత వాతావరణం, దండనలు, వివక్షత వంటివి పిల్లల మానసికాభివృద్ధికి ఆటంకాలు. ఒకే చట్రంలో బిగించినట్లుగా జీవితకాల నిర్ణయ

పట్టిక ఉంటే విద్యార్థి మానసిక వికాసం జరగదు. బాల్యదశలో శిశువు మానసిక వికాసం ఎక్కువగా ఉంటుంది. పిల్లల స్వభావానికి అనుగుణంగా వాతావరణం కల్పించబడితే తాను కోరుకున్న రంగంలో నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునే వీలుంటుంది. పరిసరాలు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాబట్టి ఇంట్లో, పాఠశాలలో, సమాజంలో మానసిక వికాసానికి అవసరమైన వాతావరణముండాలి. గ్రంథాలయ పుస్తకాలు చదివించడం, పాఠ్యాంశాల అదనపు సమాచారం కొరకు రిఫరెన్స్ పుస్తకాలు చూడడం, సమాజంలోని వివిధ వ్యక్తులతో ప్రతిస్పందించడం, వివిధ ప్రదేశాలను సందర్శించడం వంటివి పిల్లల మానసికాభివృద్ధికి తోడ్పడతాయి. రోజువారీ జీవన విధానం కాకుండా విభిన్నంగా గడపడం కొత్త ఆలోచనలను, మానసిక వికాసాన్ని పెంపొందిస్తుంది. చర్చలు, సభలు, సమావేశాలలో పాల్గొనడం, పాఠశాలలో వినూత్న కార్యక్రమాలు అమలుచేయడం వంటివి చేయాలి. ఉపాధ్యాయులు పిల్లల సామర్థ్యాన్ని అంచనావేసి అందుకనుగుణంగా వివిధ సబ్జెక్టులలో వికాసానికి సహకారాన్ని అందించాలి. జట్టు పనులలో, సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం జరుగుతుంది. కేవలం ఇంటికి, పాఠశాలకు, పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితమయితే మానసిక వికాసం సరిగ్గా జరగదు. పాఠ్యాంశాల బోధన సమయంలో, పాఠశాల కార్యక్రమాలలో మానసికాభివృద్ధికి సహకరించే వాటిని అమలుచేయాలి.

బాల్యం నిర్మాణాత్మక దశ. ఈ దశలో జరిగే వికాసం వేగంగా ఉంటుంది. జీవితాంతం ఉంటుంది. బాల్యంలో ఎన్నో అంశాలను వేగంగా గ్రహించే శక్తి పిల్లలకు ఉంటుంది. ఈ వయస్సులో స్థాయికి తగిన సహాయంతో కూడిన తగినన్ని ఎక్కువ అంశాలను పిల్లలకు పరిచయం చేస్తే మానసిక వికాసం జరుగుతుంది. మేధస్సు వికసిస్తుంది. కాబట్టి పిల్లలకు ఎప్పుడూ పాఠ్యాంశాలు బోధించడం, ఆలోచనలకు తావివ్వని అభ్యాసాలు ఇవ్వడం, వినడం మాత్రమే నేర్పడం, ఛాలెంజింగ్ లక్ష్యాలు నిర్దేశించకపోవడం, పరిసరాలు సమాజంలో ప్రతిస్పందించే అవకాశమివ్వకపోవడం వంటివి, అర్థంలేని అంశాలను బట్టీపట్టించడం వంటివి పిల్లల మేధోపరమైన అభివృద్ధికి ఆటంకాలే, పాఠ్యాంశాలను దాటి పిల్లలు ఆలోచించేట్లు, నిజజీవిత అంశాలను ప్రశ్నించేటట్లు, సొంతంగా ఒక విషయాన్ని పరిశోధించి, అన్వేషించి తెలుసుకునేట్లుగా తరగతి గది ప్రక్రియలు ఉండాలి.

భాషకు సంబంధించి పదబంధాలు, వివిధ సన్నివేశాలలో ఏం జరిగితే బాగుంటుందో చెప్పమనడం, ఓపెన్ ఎండెడ్ టాస్క్లు ఇవ్వడం చేయాలి. గణితంలో నిజజీవిత సమస్యలను అనుసంధానం చేయాలి. సుడోకు సమస్యాసాధన, వంటివి పూరింపజేయాలి. అబాకస్ వంటివి అభ్యాసం చేయించాలి. సైన్స్‌లో అంశాల గురించి ప్రశ్నించగలగాలి. దేనిని గుడ్డిగా అనుసరించకుండా, కార్యకారణ సంబంధం తెలుసుకోవడం, సృజనాత్మకతతో, విచక్షణతో, విమర్శనాత్మక ధోరణిలో ఆలోచించి తార్కికతతో విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించాలి. ప్రస్తుతం సమాజ పరస్థితిని, గత చరిత్రను పోల్చుకొని రాజ్యాంగబద్ధంగా ఉత్తమ పౌర లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలో ఆలోచించి, అమలు చేయగలగాలి.

పాఠ్యపుస్తకాలను దాటి ఇతర పుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలను చదివేట్లుగా వాటిని నిపుణులతోచర్చించునట్లుగా చూడాలి. ఇల్లు, పాఠశాలను దాటి సమాజ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మేధోవికాసం ఎంతో జరుగుతుంది. చర్చలు, సెమినార్లు, సభల వంటి వాటిలో పాల్గొనడం చేయాలి.

బహుళ ప్రజ్ఞసిద్ధాంతం ప్రకారం ప్రతి విద్యార్థి కొన్ని రంగాలలో నిష్ణాతులుగా ఉంటారు. దానిని ఉపాధ్యాయులు గుర్తించాలి. ఆ రంగంలో నైపుణ్యాల పెంపుదలకు అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి. పిల్లలకు ఆసక్తి, అభిరుచిలేని రంగాలను వారిపై రుద్దడం ద్వారా మానసిక వికాసం ఆగిపోతుంది. ఇందుకోసం తగిన కృత్యాలు రూపొందించుకొని కల్పించాలి. పాఠశాల కార్యక్రమాలు, ఉత్సవాలు, వార్షికోత్సవాలు, జాతీయ పండుగలు, క్రీడలు, క్విజ్‌లు, సెమినార్లు, సామాజిక కార్యక్రమాలు, తోటపని వంటి వాటిల్లో పిల్లలు పాల్గొనేలా చూడాలి.

**మేథోపరమైన అభివృద్ధికి పాఠశాల నిర్వహించాల్సిన కార్యక్రమాలు:**

పాఠశాల బోధనలో,పాఠం అవగాహనకోసం ముఖ్యమైన ప్రశ్నలు నల్లబల్లపై రాసి అందరి పిల్లలచే చర్చింపచేయాలి. చర్చల్లో పాల్గొనాలంటే పిల్లలు ఆలోచించి తమ భావనలు వ్యక్తీకరించాలి. విమర్శనాత్మక ఆలోచనలు మేథోపరమైన అభివృదిక్ధి ఉపయోగపడతాయి.

- గ్రంథాలయ పుస్తకాలను చదివించి వాటిపై పుస్తక సమీక్షలు చేయించాలి.
- చదివిన అంశాలపై వాఖ్యనించమనాలి. అంటే మాట్లాడించాలి, రాయించాలి.
- వివిధ సమస్యలు ఇచ్చి (సామాజిక, వ్యక్తిగత, సమస్యలు) వాటిని ఎలా సాధిస్తారో చెప్పమనాలి.
- వివిధ సామాజిక సమస్యలు, సంఘటనలపై న్యాయం, అన్యాయం, నైతిక విలువలపై, మంచి, చెడుపై వారి వాదనలను వినిపించమనాలి. వాఖ్యానించమనాలి.
- వివిధ సంఘటనలను కారణాలను ఊహించమనాలి. మంచికోసం ఏమి చర్యలు తీసుకోవాలో చర్చించమనాలి.
- సృజనాత్మక రచనలను, ఆలోచనలను ప్రోత్సహించాలి.
- వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్, పాడడం మొదలగు పోటీలను నిర్వహించాలి. దానికి పిల్లలను తయారుచేయమనాలి.
- లైబ్రరీలో ఉన్న ఉపయుక్త గ్రంథాలు చదివి ఉపయోగపడే సమాచారాన్ని ఉదా॥లు సేకరించమనాలి.

## 2.7.3 సాంఘికాభివృద్ధి (Social Development)

మనిషి సంఘజీవి. సంఘంలో మనుగడ సాధిందం వల్లనే మానవ ప్రగతి సాధ్యమవుతుంది. ఇప్పటి పరిస్థితుల్లో మనిషి తానుగా, ఒంటరిగా ఉండలేని పరిస్థితి ఉంది. పిల్లలు కూడా సహజంగా గుంపులో ఉండాలని సమవయస్కులతో ఎక్కువగా గడపాలని కోరుకుంటారు. ఇది వారి సహజ స్వభావం. కుటుంబం, సమాజం పిల్లలకు పాఠ్యాంశాల కంటే ఎక్కువ అంశాలు నేర్పిస్తాయి. పిల్లలు పాఠశాలకు రాకముందే అనేక అంశాలలో అవసగాహన కలిగి ఉంటారు. ఇల్లు, దుస్తులు,పనిముట్లు, కుటుంబసభ్యులు, ఆహారం, మొక్కలు, జంతువులు, నక్షత్రాలు, ప్రయాణ సౌకర్యాలు వంటి అనేక అంశాలలో అవగాహనకు కారణం సమాజంతో వారు ప్రతిస్పందించడమే.

కాబట్టి పిల్లలను వీలయినంత ఎక్కువగా సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనేట్లు చూడాలి. సాంఘిక కార్యక్రమాల్లో వాలంటీరుగా, నిర్వాహకులుగా, పాల్గొనే వారుగా పిల్లలకు అవకాశాలు కల్పించాలి. దీనివలన సాంఘిక, ఉద్వేగపరమైన వికాసం జరుగుతుంది. ఎప్పుడూ పుస్తకాలను అంటిపెట్టుకొని చదివే వారికన్నా సాంఘికాభివృద్ధి సాధించిన వారు జీవిత సమస్యలను సులభంగా ఎదుర్కోగలరు. పాఠశాలల్లో మరియు గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పిల్లలను సాంఘీకరణం చేయవచ్చు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు ఇవన్నీ సాంఘికాంశాల కిందికి వస్తాయి. తరతరాలు అవి కొనసాగడం పిల్లల సాంఘికాభివృద్ధి ద్వారానే సాధ్యం. తోటివారితో కలిసి పనిచేయడం, ఇతరులకు సహకరించడం నియమాలను పాటించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలలో పాల్గొనడం ఇతరులను గౌరవించడం, సమానంగా చూడడం వంటివి పిల్లలకు నేర్పాలి. ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., ఎన్.జి.సి., వంటి కార్యక్రమాలు, సాంఘిక సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేట్లు చూడాలి. ఈ భాగస్వామ్యాన్ని మూల్యాంకనం చేయాలి.

నేలలు, వనరులు, ఖనిజాలు, మానవ సమూహాలు ఎలా అభివృద్ధి చెందాయో తెలుసుకొని వాటిని కాపాడుకునే ప్రయత్నం చేయగలగాలి. ఘనమైన పూర్వ చారిత్రక సంస్కృతిని రాబోయే తరాలకు అందించగలగాలి. ఉత్తమమైన లక్షణాల పెంపుదల సాంఘికాభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యం.

**సాంఘికాభివృద్ధికి పాఠశాల చేయాల్సిన మరియు నిర్వహించాల్సిన పనులు/ కార్యక్రమాలు:**

- పిల్లల్లో కలిసి పని చెసేలా కార్యక్రమాలు నిర్వహించాలి. అంటే బడితోట, చెట్లు నాటడం, వాటి పోషన, నిర్వహణ.
- సమాజం, గ్రామంనకు ఉపయోగపడే శ్రమదానం లాంటిపనులు, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత, రోడ్లపై మట్టిపైపోయడం, గుంతలు తీసి చెట్లు నాటడం మొదలగున్నవి చేయించాలి.
- పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవడం, మంచి ఆట స్థలాన్ని, ఆటలకు కావలసిన సామగ్రిని ఏర్పాటు చేసుకోవడం మొదలగునవి చెయ్యాలి.
- పిల్లలను ప్రతి సంవత్సరం, కమ్యూనిటీ వారిగా తల్లిదండ్రుల సహాయ సహకారాలతో విద్యా వైజ్ఞానిక యాత్రలు చేయించడం చేయాలి. దానికి ఉపాధ్యాయులు చొరవతీసుకోవాలి.
- పాఠశాలల్లో తప్పకుండా క్రీడలు, ఆటలు ఆడించాలి. పోటీలకు, టోర్నమెంటుకు పిల్లలను సంసిద్ధం చేసి పంపించాలి.
- సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, పాటలు, నృత్యం, నృత్య నాటికలు మొదలగునవి శక్తి మేరకు నిర్వహించాలి. అందరూ పిల్లలు పాల్గొనేటట్లు చేయాలి.
- సామాజికఉత్సవాలు క్షేత్ర ప్రదర్శనలు చేయించాలి. పై కార్యక్రమాల వల్ల పిల్లలు బాధ్యతలు తీసుకొని కార్యక్రమాలను నిర్వహిస్తారు. మంచి జీవన నైపుణ్యాలు అనగా కలిసి చర్చించుకోవడం, ప్రణాళికలు వేసుకోవడం కలిసి నిర్వహించుకోవడం, అనే మంచి నైపుణ్యాలు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ వల్ల వస్తాయి. కేవలం పాఠం చెప్పడం, వినడం, తరగతి గదికే పరిమితం అవడం, నోట్సు రాసుకోవడం, పాఠ్యపుస్తకాన్ని పదే పదే చదవడం, ప్రశ్న జవాబులు రాయడం వల్ల జీవన నైపుణ్యాలు, సాంఘిక నైపుణ్యాలు రావు. ఉపాధ్యాయులు సొంతంగా వీటి గురించి ఆలోచించాలి. సెలబస్ చెప్పడం అనేది ఒక్కటే విద్యా లక్ష్యం కాదు. పిల్లలు సమగ్ర అభివృద్ధికి మానవ విలువల పెంపుదలకు, ఒక సమగ్ర పరిపూర్ణ మానవునిగా పిల్లల ఎదుగుదలకు ఉపాధ్యాయులు ఆలోచించాల్సింది, చేయాల్సింది చాలా ఉంది. దానికి వారి సంసిద్ధత, తయారీ, ఉత్సాహం విద్యా లక్ష్యాలపై అవగాహన అవసరం.

### 2.7.4 ఉద్వేగాభివృద్ధి (Emotional Development)

పిల్లలు తమ పరిసరాలలో సంభవించే అనేక సంఘటనలకు వివిధ రకాలుగా ప్రతిస్పందిస్తారు. ఇవి పిల్లలపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. వీటి ఆధారంగానే ప్రతి విషయంపట్ల ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకుంటారు. వివిధ సంఘటనల పట్ల పిల్లలు స్పందించే తీరు వారి భావోద్వేగాలను తెలియజేస్తుంది. పిల్లల భావోద్వేగాలను సరైన మార్గంలో పెట్టినపుడు సమాజానికి అవసరమైన ఉత్తమ పౌరులుగా రూపొందుతారు. సరైన ప్రవర్తనను అలవరుచుకుంటారు.

ప్రస్తుతం సమాజంలో జరిగే సంఘటనలకు ఆవేశపడడం, ఇతరులపై దాడికి దిగడం, విచక్షణ కోల్పోవడం, గుంపు మనస్తత్వానికి అలవాటుపడటం జరుగుతున్నవి. అలా కాకుండా సంఘటనలపట్ల, వ్యక్తులపట్ల, సమాజంపట్ల తదానుభూతిని పొంది తమవంతు బాధ్యతగా మెలిగేలా పిల్లల భావోద్వేగాలను క్రమబద్ధం చేయవలసి ఉంది. కుటుంబ సభ్యులతో, చుట్టుపక్కలవారితో, పాఠశాలలో తోటివారితో, సమాజ సభ్యులతో భావోద్వేగాలను క్రమబద్ధం చేయవలసి ఉంది. కుటుంబ సభ్యులతో, చుట్టుపక్కలవారితో, పాఠశాలలో తోటివారితో, సమాజ సభ్యులతో భావోద్వేగాలకు గురయినపుడు నిర్మాణాత్మక ఆలోచనలు చేయడం, సంయమనం పాటించడం అలవరుచుకోవాలి. పిల్లలను ప్రోత్సహిస్తూ ప్రేమగా చూసే వారు కూడా కరుణ, జాలి గల వాడుగా ప్రకృతిపట్ల, జంతువులపట్ల దయ కలిగి ఉండాలి. మొక్కలను,

చెట్లను నిర్మూలించడం, జంతువులను కొట్టడం వంటివి చేయకుండా జాలి, దయ వంటివి చూపాలి. ప్రతి సబ్జెక్టు బోధించినపుడు సందర్భోచితంగా, పాఠ్యాంశాల ఆధారంగా భావోద్వేగాలను వ్యక్తీకరించే సందర్భంలో భాష అవసరం ఏర్పడుతుంది. వ్యక్తీకరణ ద్వారా భాష పటిమ అభివృద్ధి చెందుతుంది. ఒక సంఘటన పట్ల భావోద్వేగానికి గురయినపుడు అది కవిత్వ రూపంలో మారిన సందర్భాలు మనం వింటూ ఉంటాం.

సహజ సంఘటనలకు 'బెల్లం కొట్టిన రాయి'లాగా ఉండకుండా పిల్లలు స్పందించేటట్లు చూడాలి. పాఠశాలలో తోటి విద్యార్థులకు సహాయం చేయడం, సమస్యలు వచ్చినపుడు ధైర్యంగా ముందుకు రావడం చేయాలి. సాంఘిక కార్యక్రమాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. వృద్ధులు, సేవలు అవసరమైన వారిలో కొంతకాలం గడిపేలా చూడాలి.

పైన పేర్కొన్న విధంగా పిల్లలు ఉద్వేగపరంగా అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులుగా మీరు చేయాల్సింది.

- పిల్లలందరిని పేరుతో ఆప్యాయంగా పిలవాలి.
- పిల్లలతో స్నేహితునిలా, మార్గదర్శిగా, సలహాదారుగా, సౌలభ్యకర్తగా వ్యవహరించాలి.
- పిల్లల నైపుణ్యాలను తెలుసుకోవాలి. తదానుభూతి కలిగి ఉండాలి.
- అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ఎలాంటి వివక్ష చూపకుండా అందరిని సమానంగా చూడాలి.
- పిల్లల అభిరుచులు, ఆసక్తులు, అనుభూతులు, వ్యక్తీకరణలను గౌరవించాలి.
- భయరహిత (fear free), స్నేహపూరిత (friendly), సమ్మిళిత (inclusive) వాతావరణాన్ని కల్పించాలి.
- ప్రోత్సాహం, అభినందన, అవకాశం, అభ్యాసం వంటివి కల్పించాలి.

వారి ప్రవర్తనను ఎనక్‌డోట్స్‌లో నమోదుచేయాలి. అవసరమైన మార్పులు ప్రవర్తనలో సాధించుటకు తగిన కృషి చేయాలి. పిల్లలకు తగిన స్వేచ్ఛ ఇవ్వడం, వారి భావ వ్యక్తీకరణకు అవకాశమివ్వడం చేయాలి. ప్రతి సబ్జెక్టు బోధన సమయంలో భావోద్వేగాలను సరైన మార్గంలో ప్రదర్శించే విధంగా పాఠ్యాంశాలను కలిపి బోధించాలి. అవసరమైన వారికి వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ చేయాలి. స్వీయ క్రమశిక్షణ పెంపొందునట్లుగా తర్ఫీదునివ్వాలి. సమూహంలో ప్రవర్తించే విధానంపై చర్చించాలి. విద్యార్థుల భావోద్వేగాలను నైపుణ్యాలుగా మార్చుటకు కృషిచేయాలి. బొమ్మలు వేయడం,పాటలు పాడడం వంటి వాటిలోకి వారి భావోద్వేగాలను మళ్ళించగలగాలి. వారంలో ఒక రోజు కొంతసమయం వీటికి కేటాయించాలి.

**ఉద్వేగాభివృద్ధికి పాఠశాల చేయాల్సిన మరియు నిర్వహించాల్సిన పనులు/ కార్యక్రమాలు:**

- పిల్లలందరిని పేరుతో పిలవాలి, ప్రేమ ఆప్యాయతతో చూడాలి.
- క్రీడలు, ఆటలు నియమాలసారంగా ఆడించాలి.
- పాఠశాలలో తోటను పెంచాలి, చెట్లను విద్యార్థులకు దత్తత ఇచ్చి జాగ్రత్తగా చూసుకోమనాలి.
- సమస్యలపై పిల్లలను స్పందించమనాలి. మంచి వ్యక్తులు, మంచి పనులను ప్రశంసించాలి.
- జంతువులపై హింస, పర్యావరణాన్ని కలుషితం చేయడం, శక్తిని వృథా చేయడం, వనరులను వృథా చేయడం వంటిపై డిబెటు, చర్చలు పెట్టి ఈ సమస్యలపై పిల్లలకు సరియైన దృక్పదాన్ని ఏర్పరచాలి.
- స్నేహం చేయడం ప్రోత్సహించాలి, మంచి స్నేహితులు ఉండాలని మాట్లాడాలి. మంచి స్నేహితులను ప్రశంసించాలి.
- కుటుంబ జీవనం, వృద్ధులకు గౌరవం, తగిన సంరక్షణ, కలిసి ఉండడంలో ఉన్న సౌఖ్యత మొదలగు వాటిపై పిల్లలతో మాట్లాడించాలి. అలాంటి కుటుంబాలు తెల్పమని, అలాంటి కుటుంబాలను ప్రశంసించాలి.
- ఆటలు, పాటలు, సంగీతం, బొమ్మలు గీయడం, నాటికలు మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి. వీటికి పిల్లలను ప్రోత్సహించాలి, ప్రశంసించాలి.

- మంచి పనులకు పిల్లలను ప్రశంసించాలి. ఎటువంటి పరిస్థితులలో కూడా పిల్లలను తిట్టడం, చిన్నబుచ్చడం, అవమాన పర్చడం, దండించడం మొదలగు ఏ పనులైతే పిల్లల ఆత్మ గౌరవం మరియు ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తాయో వాటిని చేయకూడదు. పిల్లలు నేర్చుకోవడంలో ఆసక్తి చూపాలంటే, కావలసినది ప్రోత్సాహం, అభినందన, అవకాశం, ఆప్యాయత, నేర్చుకోగలసామర్థ్యం ఉన్నదని నమ్మడం, ప్రోత్సహించడం.

### 2.7.5 విలువల అభివృద్ధి (Moral Development)

మానవుడు సంఘజీవి కనుకనే సంక్లిష్ట సమాజాన్ని ఏర్పరుచుకున్నాడు. సామాజికవ్యవస్థ, సహజీవనం కొనసాగాలంటే అతనికి సమాజంపట్ల అవగాహన, విశ్వాసం, ఎంతో అవసరం. సమాజ సభ్యులు ఒకరిపై ఒకరు ఆధారపడి ఉంటారు.కాబట్టి ఆమోదయోగ్య ప్రవర్తనా నియమాలు అవసరం. ఇష్టమొచ్చినట్లు మనం ప్రవర్తిస్తూ ఉన్నత సమాజాన్ని ఊహించుకోలేం. నైతిక నియమాలే మన ప్రవర్తనను నిర్దేశించే సూత్రాలు కనుక పిల్లల్లో వాటిని జీర్ణించుకునేలా చేయాలి. పిల్లల్లో నైతికాభివృద్ధి కలిగించడమంటే వారిని సామాజిక నియమాలను గుడ్డిగా పాటించమనడం కాదు. వారిలో ఏ సందర్భంలో ఎలా ప్రవర్తిస్తే బాగుంటుందో హేతుబద్ధంగా ఆలోచించగలిగే సామర్థ్యాలు పెంచాలి. సామాజిక సందర్భాల్లో ఎంపిక సౌకర్యవంతంగానూ, ప్రశాంతతకు దారితీసేదిగానూ ఉండేలా నైతిక అవగాహనను పెంపొందించాలి. 'తనకు చెప్పి విధంగా చేస్తున్నాను' అనడానికి ఇది భిన్నంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ తనకు తోచినవిధంగా కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైనవి చేయడానికే ఇష్టపడతారు. ఎందుకనగా విరుద్ధంగా చేస్తే తాము శిక్షించబడతాం లేదా దూషించబడతాం అనే భయం. అంటే ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా కొన్ని నైతిక నియమాలు ఉండి వారు ఎప్పుడు ఏమి చేయాలో, ఎలా చేయాలో, అందరూ చేసేదాన్ని సూచిస్తుంది.

ప్రస్తుతం అన్ని సమాజాలలో అశాంతి నెలకొని ఉంది. నైతిక విలువలు క్షీణించడం, అందరి జీవితాల్లో ఒత్తిడి పెరగడం మనం చూస్తున్నాం. దీనికి ప్రజల్లో/ మనుషుల్లో నైతికస్పృహ కొరవడడం ఒక కారణం. ఈ మార్పులు ఒక రోజు లేక సంవత్సరంలో సంభవించినవి కావు. జీవితంలో సమతుల్యత, పరిమితుల క్రమక్షయాలే దీని ఫలితం. దీని ద్వారా వినిమయ సంస్కృతి, దురాశ శ్రమదోపిడి పెల్లుబికినాయి. వీటి కారణంగా సమాజంలో అభద్రత, అవిశ్వాసం పెరిగింది. బహుళ ప్రచారసాధనాలు, విచ్ఛిన్న కుటుంబవ్యవస్థ, ఉత్పత్తి విద్య వాణిజ్యపరం కావడం వంటివి ప్రబలినాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా వ్యవహారాలు పైన చెప్పినట్లుగానే దేశ, ఇతర ప్రాంతాల మాదిరిగానే అదే దుస్థితిలో ఉన్నాయి. సమాజంలో స్థానిక అంతరాలు, అసమానత్వంతోపాటు ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు కూడా ఉన్నాయి. ఇవి మన అన్ని జీవనాంశాలలో పోటీస్వభావాన్ని పెంచి వాణిజ్యపరం చేస్తున్నాయి. ఇవి స్త్రీలపై దౌర్జన్యానికి, భ్రూణహత్యలు, మానవ హక్కుల ఉల్లంఘనకు దారి తీస్తున్నాయి. విలువల క్రమక్షయం, మానవ సంబంధాలు బలహీనపడడం, సమాజంలో అశాంతి నెలకొనడమే దీనికి మూలకారణం. కాబట్టి పాఠశాలలో పిల్లల నైతిక విలువలను పెంపొందించడం ఎంతో అవసరం. దీనికై పాఠశాలలో నైతిక విలువలు – వాటి ఆవశ్యకత వంటి అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించాలి. పిల్లలు వారి నిజజీవితాలలో విలువలు పాటించేలా ప్రేరేపించాలి. నైతిక విలువల బోధనలో మనం అనుసరించే వ్యూహంపట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు వైయక్తిక మరియు సమిష్ఠి వినిమయ – నియంత్రణ, హింసాత్మక – శాంతియుత పోరాటం, ఉద్రిక్త వాదనలు, – శాంతియుత చర్చలు, సంకుచిత భావాలు – స్వేచ్ఛాయుత ఆలోచనల మధ్య తేడాలను క్షుణ్ణంగా గుర్తించగలిగేలా మనం వ్యూహాలను రచించాలి. దీనిలో భాగంగా బళ్ళలో ఎల్లప్పుడూ నైతిక విలువలను పెంచడానికి సమాజంలో, బడిలో, తరగతిగదిలో ఏంచేయాలి అనే ప్రశ్నలుండాలి. పిల్లల్లో ఎలాంటి విలువలు పెంపొందించాలి? పిల్లలు ఇతరుల హక్కులను గౌరవించేలా సహనముపట్ల నిగ్రహం పెంచేలా ఎలా చేయాలి? అనే ప్రశ్నలుండాలి.

కుటుంబ జీవితంలో పిల్లవానికి కొన్ని సదలవాట్లు అలవడతాయి. ఇవి అనేక రకాలుగా అలవడతాయి. కానీ పిల్లలందరికీ రాజ్యాంగంలో చెప్పిన అన్ని లక్షణాలు, అలవాట్లు అలవడకపోవచ్చు. ఒక సమాజపు నైతిక నియమాలు మరో సమాజపు సాంప్రదాయాలను గౌరవించకపోవచ్చు. అన్నిరకాల సమాజాలనుండి ఒకే నియమాల సారూప్యత గల పిల్లలు లేకపోవచ్చు. కాబట్టి అన్ని రకాల సామాజిక భావజాలాన్ని ఏకంచేస్తూ అందరికి ఆమోదయోగ్యమైన నైతిక విలువలను బడిలోనే పెంపొందించి ఉన్నత దేశీయ సమాజాన్ని నిర్మించాలి.

విభిన్న నైతిక విలువలు, నేపథ్యాలనుండి బడికి వచ్చే పిల్లలందరినీ ఏకత్రాటిపై తీసుకొచ్చి ఒకరి విలువలను మరొకరు గౌరవించేలా, సహించేలా చేయడంలో పాఠశాల ప్రముఖపాత్ర వహించాలి. విలువలు కలిగిఉండడం, విజ్ఞానంతో, వివేకంతో మెలగడం పిల్లల సమగ్రాభివృద్ధిలో అంతర్భాగం. రాజ్యాంగంలోని విలువలు, మూలసూత్రాలు, సమన్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి ప్రాముఖ్యతనిస్తున్నవి. వీటిని అమలుపరచడం బహుళత్వం, ఇతరులను గౌరవించడం, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత, ప్రేమ, శ్రద్ధ, సహకారం, విలువలపట్ల విమర్శనాత్మకంగా మరియు సృజనాత్మకంగా ఆలోచించడం, సౌందర్యాత్మక విలువలను సూచిస్తుంది. సమానత్వ భావన, పరస్పర సహకారం, విమర్శనాత్మక ఆలోచనావిధానం ఒక వ్యక్తిని సమాజంలోగాని దేశంలోగాని తనకు తానుగా బాధ్యతగల పౌరునిగా తయారుచేయడంలో కీలకం అని గుర్తించడం ఎంతో ముఖ్యం. ఇవన్నీ పౌరుడు సక్రమమైన బాధ్యతలు నిర్వర్తించటానికి దోహదపడతాయి.

**నైతిక విలువల అభివృద్ధికి పాఠశాల చేయాల్సిన మరియు నిర్వహించాల్సిన పనులు/ కార్యక్రమాలు:**

- పాఠం చెప్పేటప్పుడు, సమయం ఉన్నప్పుడు ప్రతి ఉపాధ్యాయుడు మంచి, చెడు, సమాజం పోకడలపై పిల్లలతో చర్చించాలి. సంఘటనల ఆధారంగా, వార్తాపత్రికలల్లో వచ్చిన వార్తల/ సంఘటనల ఆధారంగా చర్చించాలి. మంచి, చెడు, ధర్మం, అధర్మం, నీతి నిజాయితీ గురించి సంఘటనలు మరియు వ్యక్తుల ఆధారంగా మాట్లాడించాలి. మంచిని, మంచి వ్యక్తులను ప్రశంసించాలి.
- మన సంస్కృతిలోని కథలు, అనగా ధర్మం, న్యాయం, నిజాయితీ, కరుణ, దానగుణం, సమానత్వం, ధైర్యం, వాటిపై కథలు, సేకరించి, చెప్పి వాటిపై విద్యార్థులను మాట్లాడించాలి.
- మానవహక్కులు, పిల్లల హక్కులు నల్లబల్లపై రాసి అవి ఏ మేరకు అమలవుతున్నాయి లేక గౌరవించబడుతున్నాయి. ఏ ఏ హక్కులు ప్రస్తుతం అందరు అంటే పిల్లలు, పెద్దలు అనుభవిస్తున్నారు, ఏవేవి ఆచరణలో లేవు అని చర్చింప చేసి, గ్రహింపజేయాలి.

రాజ్యాంగ విలువలు ఒక్కొక్కటి నల్లబల్లపై రాసి, వాటి ప్రాముఖ్యత తెలియజేయాలి. ఆ విలువలు ఏ మేరకు మన సమాజంలో అమలవుతున్నాయి అని పిల్లలచే చర్చింప చెయ్యాలి. ఈ విధంగా పిల్లలు ఎంతో నేర్చుకుంటారు. విశ్లేషిస్తారు. తమదైన అభిప్రాయాలు చెబుతారు. చర్చల్లో పాల్గొంటారు. ఇతరులు చెప్పేది వింటారు. మంచిని ప్రశంసిస్తారు.

జీవన నైపుణ్యాలు అయిన మంచిగా మాట్లాడడం, జీవిత గమ్యం, జీవితంలో ఒక ఆశయంను ఏర్పరచుకోవడం, ఆరోగ్యకరమైన జీవన విధానం, పఠన నైపుణ్యాలు, మొదలగు వాటిపై చర్చలు నిర్వహించాలి. సమాజంలో పిల్లలకు తెలిసిన ఆయా వ్యక్తులు ఎవరైతే మంచి జీవన నైపుణ్యాలు కలిగి ఉన్నారో వారిని గురించి తెలిపి, ప్రశంసించాలి, చర్చించాలి. ఆ వ్యకులు అలా ఉండడం వల్ల వారు ఏ రకంగా మంచి జీవనం గడుపుతున్నారో చెప్పమనాలి. చర్చించాలి.

మంచి, చెడు, నీతి, న్యాయం, ధైర్యం, అధర్మంపై వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి.

## 2.7.6 సౌందర్యాత్మక స్పృహ, ప్రశంస (Aesthetic Development)

సౌందర్యాన్ని, కళూరాపాల్ని చూసి ఆనందించడం మానవజీవితంలో విడదీయరాని అంతర్భాగం. కళలు, సాహిత్యం, ఇతర జ్ఞానాత్మక అభివ్యక్తినీ, సౌందర్య వివేచననూ పెంపొందించే సాధన సంపత్తిని, అవకాశాల్ని ప్రాథమిక స్థాయినుండే పిల్లలకు అందించాల్సి ఉంటుంది. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005, రాష్ట్ర విద్యా ప్రణాళిక పత్రం 2011 ప్రకారం వీటికి సంబంధించిన పాఠ్యాంశాలు/ అభ్యాసాలు/ కృత్యాలు ప్రక్రియలు, కవితలు, పద్యరూపాలు, ప్రకృతి ఆరాధన, వర్ణన, వారసత్వ సంపదను పరిరక్షించడం, వినోదం, విజ్ఞానం, చరిత్ర, చారిత్రక సంఘటనలు, కట్టడాల నేపథ్యాన్ని ప్రశంసించడం, తదాత్మీయం చెందడం, కవుల జీవనవిధానాలు, కవితారీతులను కొనియాడడం. భాషా సౌందర్యానికి స్పందించడం, ప్రశంసించడం, బొమ్మలు గీయడం, సంగీతం వంటి కృత్యాల రూపంలో ఉన్నాయి. కేవలం వీటిని మాత్రమే కాకుండా స్థానిక కళారూపాలు, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఉత్సవాలు మొదలగువాటిని సందర్భోచితంగా కృత్యాల రూపంలో పిల్లలకు అందించాలి. వారిలో సౌందర్యాత్మక స్పృహ కలిగించాలి.

**సాందర్యాత్మక స్పృహ, ప్రశంస పాఠశాల చేయాల్సిన మరియు నిర్వహించాల్సిన పనులు/ కార్యక్రమాలు:**

- సౌందర్యం అంటే ఏమిటి? వ్యక్తి సౌందర్యమా, ప్రకృతి సౌందర్యమా? మనషులయొక్క మహోన్నతమైన, ఔన్నత్యమా! సాహసమా? ఉపకార గుణమా! మంచితనమా! చర్చింపచెయ్యాలి.
- ప్రకృతి అడవులు, పచ్చని చెట్లు, ఫల వృక్షాలు, చెరువులు, పరిశీలన చేయించి ప్రతిస్పందన చెప్పించాలి, రాయించాలి.
- ఒక సూర్యోదయ ముందు కాలం, సూర్యోదయం సూర్యాస్తమయం పరిశీలన, అనుభవం ప్రశాంతంగా చేయించి దానిపై ప్రతిస్పందన అనుభవాలు చెప్పించాలి.
- ప్రకృతిలో నిశ్శబ్దం యొక్క అనుభవం ప్రతిస్పందన.
- జంతువులు వాటి చిన్న పిల్లలను పరిశీలింపచేయడంలో సమయం గడపడం, పిల్లల దైనందిక అనుబంధాలు, పొందిన ఆనందం చెప్పించాలి.
- స్వయంగా మొక్కలు, చెట్లు పెంచడం, పూలు, పండ్లు, కాయలు కాయించడం, మొక్కలు ఎదగడం, దానిని పొందిన ఆనందంపై ప్రతిస్పందన.
- రకరకాలైన పండుగలు, శుభకార్యాలు పరిశీలన, రంగు రంగుల అలంకరణ, వాటిపై ప్రశంస, అనుబంధాలు.
- ప్రకృతి వర్ణన, చారిత్రత సంఘటనలు, చారిత్రక కట్టడాల పరిశీలన ప్రశంస

ప్రస్తుత యాంత్రిక జీవనం, జీవన గమ్యం మొత్తం మీద మనిషి వస్తు సంపద, సుఖ జీవనం అనే వాటి కొరకు నిరంతరం అలుపెరగని ఉరుకులు, పరుగులు పెడుతున్నాడు. ఉద్వేగభరిత మానవ సంబంధాలు, పోటీతత్వం, తీవ్ర మానసిక ఒత్తిడితో జీవనం గడుస్తోంది., ఆనందం అంటే ఏమిటి, ఏది నిజమైన, ఆనందం, తృప్తి అనేది మానసికమైన లేక భౌతిక వస్తువల మీద ఆధారపడి ఉంటుందా! బాగుగా వస్తు సంపద ఉన్న వారు నిజంగా ఆనందంగా ఉన్నారా? మన సంస్కృతి చరిత్ర ఎటువంటి వ్యక్తులను ఇప్పటి వరకు గుర్తించుకుంది? మనిషికి శాశ్వత గుర్తింపు ఎలా వస్తుంది, దీనికి ఏఏ ఉదంతాల్ని చరిత్ర మనకు అందించిందో ఆలోచించండి. ఆనందంగా ఉండాలంటే ఆనందించడం, ప్రకృతిలో గడపడం మానసిక సౌందర్యాన్ని ప్రశంసించడం పిల్లలకు పట్టివ్వాలి. సంపూర్ణ మనిషిగా ఎదగడంలో మనకై మనం సమయం ఇచ్చుకోవడం, ప్రకృతిలో గడపడం, ప్రకృతిని గౌరవంగా, ఆరాధన భావంతో చూడడం ప్రకృతిలోని సమస్త ప్రాణులకి అపకారం చేయకుండా వాటి బాగుకు కృషి చేయడం మన బాధ్యత, దానిలోనే ధర్మం, ఆనందం, బ్రతుకు ఉన్నది.

ఇటువంటి మన పౌరసత్వాన్ని పిల్లలకు విద్యా రూపంలో మనం పిల్లలకు అందించాలి. దీనికి మనం పాటుపడాలంటే సంసిద్ధులు కావాలి. ఉపాధ్యాయులు స్వయంగా జ్ఞాన సముపార్జన చేసుకోవాలి. జ్ఞానులుగా తయారుకావాలి.అప్పుడు మనం ఒక్క మహత్తరమైన జాతిని రూపొందించగలం. అందువల్లనే ఉపాధ్యాయుడు జాతి నిర్మాణంలో దీనికి అర్హుడగుటకు కృషి, తపన, తయారీ, అత్యంత అవసరం. ఇదే దేశభక్తి.

## 2.8 పిల్లల సర్వతోముఖాభివృద్ధి – పాఠశాల పాత్ర

## (All-round development of children - Reole of the school)

పిల్లలు అన్ని రంగాలలో (శారీరక, మానసిక, ఉద్వేగ, నైతిక, సాంఘిక రంగాలు మొదలగునవి) సంపూర్ణ అభివృద్ధి చెందాలంటే పాఠశాల, సమాజం కీలకపాత్ర వహించాల్సి ఉంటుంది. అభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఏ కార్యక్రమమైనా, కృత్యమైనా పిల్లలు సంపూర్ణంగా, చురుకుగా పాల్గొంటేనే ఆశించిన అభివృద్ధి సుసాధ్యమవుతుంది.

**పాఠశాలపరంగా నిర్వహించాల్సిన కార్యకలాపాలు**

**పాఠశాలలోపల నిర్వహించాల్సినవి:**

- తరగతిగదులలో ఆయా సబ్జెక్టు, రంగాలకు సంబంధించిన కృత్యాలు
- ఫజిల్స్, ప్రయోగాలు, పరిశోధనలు, నివేదికలు
- మానసిక ఉల్లాస కార్యక్రమాలు, యోగా, ధ్యానం మొదలైనవి.
- చర్చలు, గోష్ఠులు, సెమినార్లు, ప్రదర్శనలు, చార్టులు, సభలు, సమావేశాలు, సదస్సులు
- బోధనాభ్యసన సామగ్రి తయారీ
- సామూహిక మధ్యాహ్న భోజనం
- పుస్తకపఠనం, కథల పుస్తకాలు, కథావాచకాలు వంటి పాఠ్యపుస్తకేతర సామగ్రి
- అభినయగేయాలు, ఏకపాత్రాభినయం, పాటలు, పద్య పోటీలు
- నాటికలు, థియేటర్ ఆర్ట్స్, కొరియోగ్రఫి.
- గణిత భాషాక్రీడలు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు
- వైద్యపరీక్షలు – ఆరోగ్యపు అలవాట్లు పెంపొందించే కృత్యాలు
- పోర్ట్‌పోలియోల నిర్వహణ
- గోడ పత్రిక నిర్వహణ
- పిల్లల ప్రతిభాపాటవ ప్రదర్శనలు, ప్రగతి ప్రదర్శన
- ఎస్.ఎమ్.సి. సమావేశాలు

**పాఠశాల బయట నిర్వహించాల్సినవి:**

- ఆటలు, స్థానిక, స్థానికేతర ఆటలు, క్రీడల పోటీలు నిర్వహించడం
- స్కౌట్స్ అండ్ గైడ్స్
- విజ్ఞాన విహారయాత్రలు, క్షేత్రపర్యటనలు మొదలైనవి.
- మేళాలు, ప్రాజెక్టు పనులు

- ఎగ్జిబిషన్స్ - బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన
- సమీప పాఠశాలల పిల్లలు, ఉపాధ్యాయులతో కూడిన సభలు, సమావేశాలు
- ప్రత్యేక దినోత్సవాలు - మదర్స్ డే, ఫాదర్స్‌డే, మహిళా దినోత్సవం, సైన్స్ డే, గ్రంథాలయ వారోత్సవాలు, విద్యా పక్షోత్సవాలు, అక్షరాస్యత దినోత్సవం వంటివి.
- జాతీయ పండుగలు
- ర్యాలీలు, బహిరంగసభలు
- సామూహిక వనభోజనాలు, వనమహోత్సవాలు, అక్షరాభ్యాసం మొదలైనవి

పై కార్యకలాపాలలో కొన్ని కేవలం పిల్లలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొనేవి ఉన్నాయి. ఉదాహరణకు పాఠశాల లోపలి కార్యక్రమాలు. అయినప్పటికి వీలయిన సన్నివేశాలకు అనుగుణంగా ప్రతి సందర్భంలో తల్లిదండ్రులు, సమాజసభ్యులు, అధికారులు పాల్గొనేలా చూడాలి.

పాఠశాల బయట నిర్వహించే అన్ని కార్యకలాపాలలో తల్లిదండ్రులు, సమాజ సభ్యులు, యువత, స్వచ్ఛంద సేవాసంస్థలకు చెందిన వారు, పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులను విధిగా పాల్గొనేలా పాఠశాల సిబ్బంది చూడాలి. సమాజ కేంద్రంగా కూడా కార్యకలాపాలలోని చాలా వాటిని నిర్వహించవచ్చు. సమాజం పాఠశాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటేనే పాఠశాల సర్వతోముఖానివృద్ధి కేంద్రంగా పనిచేయగలుగుతుంది. పిల్లల్లో అంతర్గతశక్తులు ఉంటాయని, మనకు తెలిసిందే. మర్రి విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నట్లే పిల్లల్లో సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే సామర్థ్యాలు దాగి ఉంటాయి. వీటిని పూర్తిస్థాయిలో శక్త్యానుసారం వినియోగించుకోవాలంటే ఉపాధ్యాయులు పిల్లలకు తగిన ప్రోత్సాహం, అవకాశం, అభ్యాసం, అవసరం కల్పించాలి. సందర్భోచితంగా సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే కృత్యాలు కల్పించాలి.

## 2.9 పిల్లల సర్వతోముఖాభివృద్ధి - ఉపాధ్యాయుల పాత్ర

## (All-round development of children - Reole of the teacher)

పాఠశాల విద్యకు సంబంధించినంతవరకు పిల్లల సర్వతోముఖాభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయులదే. పిల్లలు పాఠశాలలో గడిపే ప్రతి నిమిషం కీలకమైనదే. అది వారి భావిజీవితానికి బంగారు బాటలు వేసేదిగా ఉండాలి. పిల్లలకు కేటాయించే బోధనా సమయం ఉపాధ్యాయులు పూర్తిగా అంటే వందశాతం సద్వినియోగం చేసుకోవాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక, నైతిక, మేధోపర రంగాలపట్ల సంపూర్ణ అవగాహన కలిగిఉండి అందుకు ఉపకరించే కార్యక్రమాలు, కృత్యాలు ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు నిర్వహించాలి.

- శారీరక అభివృద్ధికి - వ్యాయామ, ఆరోగ్య విద్య, యోగా, ఆటలు, క్రీడలకు ఉద్దేశించిన కార్యక్రమాలు నిర్వహించాలి. వీటిలో పిల్లలు చురుకుగా పాల్గొనేలా వ్యూహాలు రూపొందించుకోవాలి. పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనావేస్తు ప్రగతికి కృషిచేయాలి. పిల్లల ఆసక్తులు, అభిరుచులకు అనుగుణమైన కృత్యాలు కల్పించాలి.
- మానసికరంగంలో పిల్లలు అభివృద్ధిచెందాలంటే అందుకు దోహదపడే ఉల్లాసకృత్యాలు, స్థాయికి అనుగుణమైన, సవాలుతో కూడి ఉండే కృత్యాలు కల్పించాలి. ఆలోచనలు రేకెత్తించే, ఊహాశక్తికి, సృజనాత్మకతకు దోహదపడే అభ్యసన ప్రక్రియలు ప్రవేశపెట్టాలి.

- అందరితో కలిసిపోవడం, పరస్పర సహకార భావనలు, సహజీవనం ఆలోచనలు,, అభిప్రాయాలు, భావాలు, తోటివారితో, ఉపాధ్యాయులు, పెద్దలతో పంచుకోవడం ఇతరుల సమస్యలపట్ల స్పందించడం, కలసి ఆటలు ఆటడం, పాటలు పాడటం, సామాజిక పరిస్థితులతో సర్దుబాటు కావడం వంటి వాటిని ప్రాథమికస్థాయినుండే పిల్లలు అలవర్చుకోవాలి. ఫలితంగా వారు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర వహించే మంచి పౌరులుగా రూపొందుతారు. ఈ అంశాలకు సంబంధించినవి విద్యాప్రణాళికలో పేర్కొన్నవిధంగా పాఠ్యపుస్తకాలలో పొందుపరచడం జరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకొని ఆయా అభ్యసనా కృత్యాలు కల్పించాలి. పైన పేర్కొన్న సామాజిక అంశాలు పిల్లల్లో ఏ మేరకు సాధించబడ్డాయో అంచనావేయాలి.
- విలువలు క్రమంగా క్షీణించడం, మానవ సంబంధాలు బలహీనపడడం, అశాంతి ప్రబలిపోవడం మన సమాజంలో ప్రస్తుతం మనం గమనిస్తున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతి మనుగడకు పెనుముప్పుకు గురవుతుంది. దీనిని అరికట్టే సామర్థ్యం ఉపాధ్యాయులకు ఉంది. ప్రాథమికస్థాయి నుండి విలువల విద్యను అందించాల్సిన అవసరం ఉంది. విలువలకు ఆస్కారమిచ్చే, విలువలు ప్రతిబింబించే పాఠ్యాంశాలు పాఠ్యపుస్తకాలలో చోటుచేసుకుంటున్నాయి. ఈ అంశాలను సందర్భోచితంగా పిల్లలకు బోధించడమే కాకుండా పాఠ్యేతర అంశాలు విలువలకు విలువనిచ్చే, సామాజిక కట్టుబాట్లు, బాధ్యతలు, సంస్కృతి, జాతి మనుగడ, దేశభక్తి, మానవసేవ, క్రీడాస్ఫూర్తి, సహజీవనం, శాంతి, న్యాయం, అహింస, సమానత్వం, తదానుభూతి వంటివి ప్రతిబింబించే, నియమాల అనుసరణ, ప్రేమ, శ్రద్ధ, స్వేచ్ఛ, కథలు, పద్యాలు, పాటలు, నాటికలు, నృత్యం, అభినయం వంటివి అభ్యసనకృత్యాల రూపంలో పిల్లలకు కల్పించాలి.
- సృజనాత్మకత, వైవిధ్యంగా ఆలోచించడం, మెదడుకు పదును పెట్టే కృత్యాలు కల్పించాలి. సంవాదాలు, గోష్ఠులు, సెమినార్లు, బృందచర్చలు చేపట్టాలి. మెదడుకు మేత, క్విజ్, గణితం, భాషా క్రీడలు, పజిల్స్ వంటి కృత్యాలు కల్పించాలి. పిల్లలను ప్రోత్సహించాలి.

## 2.10 బాలల సర్వతోముఖాభివృద్ధి – అమలుకు సూచికలు

## (All round development of children - indicators of implementation)

పాఠశాలస్థాయి పిల్లల్లో జరిగే సర్వతోముఖాభివృద్ధి మదింపు చేస్తూ పరిశీలనాంశాలను, ప్రగతి అంశాలను రికార్డులలో నమోదుచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదైతే మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత అధికారులది, సమాజసభ్యులది.

పాఠశాలలో పిల్లలు సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నారని కింది సూచికలు/ ఆధారాల ద్వారా చెప్పవచ్చు.

- ఉపాధ్యాయులకు పిల్లలు ఏ ఏ రంగాలలో అభివృద్ధి చెందాలో తెలిసి ఉండడం.
- వ్యాయామం, ఆటలు, పాటలు, క్రీడలు, వక్తృత్వం, వ్యాసరచన, నాటిక, పాత్రపోషణ, చిత్రలేఖనం, సంగీతం, క్విజ్, మేళాలు, ప్రదర్శనలు, సెమినార్లు, సమావేశాల నిర్వహణ ఉంచడం.
- గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ ఉండడం.
- బాలల కమిటీలు సమర్థవంతంగా పనిచేస్తూ ఉండడం.
- గోడపత్రిక, సైన్స్ ఫెయిర్, ఉత్సవాల నిర్వహణ ఉండడం.

- పిల్లలందరూ కలిసి మెలసి ఉండడం, స్వీయ క్రమశిక్షణ పాటించడం.
- అనువైన బోధనాభ్యసన సామగ్రి వినియోగించబడుతుండడం.
- స్నేహపూరిత, సమ్మిళిత వాతావరణం తరగతుల్లో కన్పించడం.
- పిల్లలు ప్రస్తుతం సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపట్ల అవగాహన కలిగి ఉండడం.
- వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడతుండడం.
- గోడపై నీతివాక్యాలు రాయబడి ఉండడం.
- యోగా, ధ్యానం, తరగతుల నిర్వహణ ఉండడం.
- ఆయా రంగాల ప్రగతి గురించి పిల్లల ప్రగతి నివేదికల్లో రాయబడి ఉండడం.
- వ్యాయామం, విలువలు, కళలు వంటి వాటికి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సమయసారణిలో సముచిత స్థానం కల్పించడం. సమయసారిణి ప్రకారం అభ్యసన ప్రక్రియలు కల్పిస్తూ ఉండడం.

## 2.11 ముగింపు (Conclusion)

పిల్లలందరూ శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలి. మంచి ప్రవర్తన, విలువలు కలిగి ఉండడం, సమస్యలపట్ల స్పందించడం, సామాజికస్పృహ కలిగి ఉండడం, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండడం, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం, తోటివారితో, ఉపాధ్యాయులతో పెద్దలతో, తల్లిదండ్రులతో అభిప్రాయాలు పంచుకోవడం వంటివి పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా అభ్యసన ప్రక్రియలు ఉపాధ్యాయులు కల్పించాలి. పిల్లల సర్వతోముఖానివృద్ధికి జవాబుదారీతనం వహించాలి.

×××

*మహాత్మాగాంధీ జాతి కోసం కొత్త తరహా ప్రాథమిక విద్యా పథకాన్ని ప్రతిపాదించారు. అది బేసిక్ విద్యా ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది. పాఠశాల విద్యను సామజిక జీవితానికి సన్నిహితంగా, సంగతంగా చెయ్యాలని, అందుకోసం పాఠశాల కార్యక్రమంలో కొంత కాయిక శ్రమనూ, ఉత్పాదక శ్రమనూ కూడా మేళవించాలని ఆయన భావించారు. అది భారతదేశ విద్యా చరిత్రలోనే మహత్తరమైన మలుపు. ఎన్నో ఏళ్ళ బ్రిటిష్ పాలన దేశంలో స్థిరీకరిస్తూ వచ్చిన పుస్తక కేంద్ర, పరీక్షాధారిత, నిష్ఫల విద్యా వ్యవస్థ మీద అదొక తిరుగుబాటు. అదొక జాతీయ ఉద్వేగాన్ని లేవనెత్తింది.*

*ఆ మౌలిక లక్షణాలు ఇవి: 1) విద్యలో ఉత్పాదక కార్యకలాపం ప్రధాన భాగం కావడం; 2) పాఠశాల కరికులంను ఉత్పాదక కార్యకలాపంతోనూ, పాఠశాల చుట్టూ ఉండే భౌతిక, సామాజిక పరిసరాలకు సన్నిహితంగా తీసుకుపోవడం; 3) పాఠశాలకూ, స్థానిక సమాజానికి మధ్య ఆత్మీయ సంబంధాన్ని ఏర్పరచడం.*

**– వాడ్రేవు చినవీరభద్రుడు**

# 3. బోధనాభ్యసన ప్రక్రియలు - పిల్లల్ని కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, కృత్యాలు, అన్వేషణ, కనుగొనడం ద్వారా నేర్చుకోవాలి

**(Promoting learning through activiteis, exploration and discovery in a child centered and child friendly manner)**


**3.1** మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
**(Basic Questions - Think and Reflect)**

**3.2** నేపథ్యం **(Context)**

**3.3** నాణ్యమైన విద్య **(Quality of Education)**

**3.4** నాణ్యమైన బోధన **(Quality of Teaching)**

- **3.4.1** వార్షిక మరియు యూనిట్/ పాఠ్య ప్రణాళికలు **(Annual & Unit/ Lesson Plan)**
- **3.4.2** మంచి తరగతిగది వాతావరణం **(Effective Classroom Environment)**
- **3.4.3** బోధనాభ్యసన విధానాలు **(Teaching and Learning Processes)**
- **3.4.4** ఉపాధ్యాయుల నాణ్యత –వృత్తిపరమైన బాధ్యతలు **(Teacher Quality - professional responsibilities)**

**3.5** బోధనాభ్యసన ప్రక్రియలు – ప్రస్తుత పరిస్థితి **(Teaching Learning process - Existing situtaion)**

**3.6** **RTE Act - 2009** – పదజాలం, వివరణ **(RTE Act - 2009 Terms - Description)**

- **3.6.1** కృత్యం **(Activity)**
- **3.6.2** కనుగొనడం **(Discovery)**
- **3.6.3** అన్వేషణ **(Exploration)**
- **3.6.4** శిశుకేంద్రీకృత విద్య **(Child Centred Education)**

**3.7** పిల్లల స్వభావం అవగాహన **(Understanding Childhood )**

**3.8** స్నేహపూరిత వాతావరణం **(Child Friendly Environment)**

**3.9** అభ్యసనం అంటే ఏమిటి? **(What is learning)**

**3.10** అభ్యసన స్వభావం, పిల్లలు ఎలా నేర్చుకుంటారు?
**(Nature of learning - How children learn)**

**3.11** పిల్లలు నేర్చుకోవడంలో ఎందుకు వెనుకబడుతున్నారు?
**(Why children fail in learning)**

**3.12** అభ్యసన స్వభావం నియమాలు **(Nature and principles)**

**3.13** కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం యొక్క అమలు – బాధ్యతలు
**(Learning through Activities, Explorations and Discovery - Implementation and Responsibilities)**

**3.14** అమలుకు సూచికలు **(Indicators of Implementation)**

**3.15** ముగింపు **(Conclusion)**

**రావల్సింది మన వైఖరిలో మార్పు**

ఒక సంస్కృతికి మనం అలవాటుపడ్డాం. అందులోంచి బయటపడడం మన వైఖరికి సంబంధించిన సంక్లిష్టాంశం. సమాజంలోలాగానే ఇంట్లో, ఇంట్లోలాగానే బడిలో ప్రజాస్వామ్యం వుండాలని మనం అంగీకరించలేకున్నాం. పిల్లలకూడా వివేచనా, ఆసక్తులూ వుంటాయని, వాటిని వ్యక్తీకరించడం వాళ్ల హక్కని మనం గుర్తించడమే బడిలో ప్రజాస్వామ్యం. వాళ్లు మట్టిముద్దలనీ, వాటిని మనం కోరినరీతిలో మలిచి సుందరాకారాలుగా మారుస్తున్నామనీ మనం అనుకొంటున్నాం. మనం ప్రతిదీ నేర్పాలనీ, మననుంచే వాళ్ళు ప్రతిదీ నేర్చుకొంటున్నారనీ మన నమ్మకం.

అసలు నేర్పడం ఒక కళా? అది ప్రతిభావంతులే చెయ్యగల పనా? అది ఎంతో శ్రమతో కూడిన అపురూపకృత్యమా? ఆ పక్షంలో నేర్చుకోవడం కూడా గొప్ప ప్రతిభావంతులకే గదా సాధ్యం! మరి అలా జరగడం లేదే. ప్రతి బిడ్డా అత్యంత సహజంగా భాష నుంచి బతకడందాకా ఎలా నేర్చుకొంటున్నాడు? అభ్యసనం అత్యంత సరళమైంది. మనమే దాన్ని సంక్లిష్టం చేస్తున్నాం. సంక్లిష్టంగా వుండడమే “విద్య స్వభావం”గా మనం నమ్ముతున్నాం.

ఇలా మనకూ పిల్లలకూ మధ్య అడుగడుగునా అగాధం వుంది. ఈ అగాధం వున్నట్టే మనం గుర్తించం, అంతా సవ్యంగా ఉన్నట్లు తృప్తి పడతాం. పిల్లలతో పాటు నేలమీద మనం కూచోగలమా? ఎంత చదివినా, ఎంత చెప్పినా, ఎన్ని శిక్షణలకు హాజరైనా మన లోకం మనది. ఇదొక సంస్కృతికి సంబంధించిన అంశం. దీన్నుంచి బయటపడడానికి కావల్సింది మానసిక సంసిద్ధత, మన వైఖరిలో మార్పు!

**– “చదువు విజ్ఞానం”**

వారు గడిపే ప్రతి ఒక్క క్షణం, తలపు, మాట, చేత ఒక శివానందలహరి కావాలి. అన్నిటికన్నా ముందు, తాము జీవిస్తున్నందుకు, తమ చుట్టూ ప్రపంచంలో పూలతోటలు, సెలయేళ్ళు, నీలిమబ్బులు, తూనీగలు, ప్రేమ కవితలు, పిల్లనవ్వులు పొంగిపొర్లుతున్నందుకు వారు మహానంద పరవశులు కావాలి. ప్రతి ఒక్కరిలోనూ నిద్రాణంగా ఉన్న లోవెలుగు వారి వారి అభివ్యక్తికి అనుగుణంగా ప్రపంచ సంగీతంలో గొంతు కలపాలి.

అది అక్షరాస్యత వల్ల సాధ్యమయితే అక్షరాస్యత వల్ల కానివ్వండి. లేదా మౌఖిక ప్రసారం వల్ల సాధ్యమయితే మౌఖిక ప్రసారం వల్ల కానివ్వండి. అది మాంటిస్సోరి పద్ధతిలో పాఠశాల ఆవరణలో సాధ్యపడితే పాఠశాలల ద్వారానే రానివ్వండి, లేదా శాంతినికేతనంలో మాదిరి మాఘ మాసపు మామిడితోటల నీడన వికసించవలసి ఉంటే అట్లానే కానివ్వండి, లేదా పురాతన ఏథెన్సు నగర వీధుల్లో తన శిష్యులతో నడుస్తూ బోధించిన సోక్రటీస్ మార్గమే కానివ్వండి, అది ఏ రీతిన ఒనగూడిందన్నది కాదు. అది తోటిమానవుల ఆత్మనేమేరకు వికసింపచేసిందన్నది ముఖ్యం.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెలకువలు)**

# 3. బోధనాభ్యసన ప్రక్రియలు
# (Teaching Learning Processes)

## 3.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
## (Basic Questions - Think and Reflect)

1) పిల్లల స్వభావం ఏమిటి? (What is the nature of child?)
2) అభ్యసనం అంటే ఏమిటి? అభ్యసనం యొక్క స్వభావం ఏమిటి?
   (What is learning and what is its nature?)
   అ) పిల్లలు ఎలా నేర్చుకుంటారు? (How children learn?)
   ఆ) బోధించాల్సిన అంశంపై పిల్లలకు ముందే ఏమి తెలుసు. కొత్తగా ఏమి నేర్చుకోవాలి. ఈ రెండింటిని ఎలా కలుపుతాం.
   (Bridge between what child knows already and how to learn these connections?)
3) అభ్యసనంలో పిల్లలు పాల్గొనడం అంటే ఏమిటి?
   (What do you ment by child participation in learning?)
4) నేర్చుకోవడంలో పిల్లలు ఎలా పాల్గొంటారు? పాల్గొనే స్వభావం ఏమిటి?
   (What is the nature and ways of participation in learning?)
5) అన్వేషణ అంటే ఏమిటి? ఎందుకు? (What is exploration? Why?)
6) కనుగొనడం అంటే ఏమిటి? ఎందుకు? (What is discovery? Why?)
7) శిశుకేంద్రీకృత విద్య అంటే ఏమిటి?(What is child centred education?)
8) బోధనాభ్యసనను ఎలా శిశుకేంద్రీకృతం చేయవచ్చు? దానికి ఉపాధ్యాయుడు ఎలా తయారు కావాలి? ఉపాధ్యాయుని పాత్ర ఏమిటి?
   (How to make learning child centred? What is teachers role and preparation?)
9) శిశుకేంద్రీకృత విద్యలో (In child centred education)
   - ఉపాధ్యాయుని పాత్ర (Role of teacher)
   - ప్రధానోపాధ్యాయుని పాత్ర (Role of H.M.)
   - విద్యాశిక్షణా కళాశాలల పాత్ర (Role of teacher training institutions)
   - మానిటరింగ్ అధికారుల పాత్ర (Role of monitoring officer)
   - ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? (What to do? What not to do?)
10) బోధనకు ఉపకరించే వస్తువులు అనగా, పాఠ్య పుస్తకాలు ఇతరములు చురుకైన బోధనభ్యసనకు ఎలా ఉపయోగపడతాయి?
   (How supporting material and textbooks will be helpful in effective implementation of active teaching learning pedagogies?)

## 3.2 నేపథ్యం (Context)

బడిఈడు పిల్లలందరూ బడిలో చేరాలి. కనీసం పదవతరగతి పూర్తి అయ్యేవరకు బడిమానకుండా చదువు కొనసాగించాలి. అంతేకాకుండా వారి శక్త్యానుసారం సమగ్ర అభివృద్ధి చెందాలి. నాణ్యతతో కూడిన చదువు వారికి అందించాలి. దీన్ని దృష్టియందుంచుకుని రాష్ట్ర విద్యాశాఖ పలు కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తున్నది. అయినప్పటికీ ఇటీవల నిర్వహించిన సర్వే ఫలితాలలో నాణ్యమైన చదువు విషయంలో పిల్లలు వెనకబడి ఉన్నారని తేలింది. నమోదు విషయంలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ ఇంకా మధ్యలో బడిమానివేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. దీనికి ప్రధానకారణం మన చదువులు పిల్లలను పాఠశాలవైపు ఆకర్షితులను చేసేలా ఉండకపోవడం, వారి ఆసక్తులు, అభిరుచులు, అనుభూతులు, ఇష్టాయిష్టాలకు విద్యా కార్యక్రమాలలో స్థానం లేకపోవడమే. పిల్లలకు నేర్చుకోవడమనేది సంక్లిష్ట ప్రక్రియగా, ఒక ప్రహసనంగా మారింది. చదువులు అనాసక్తికరంగా ఉండి ఒత్తిడి, మానసిక ఆందోళనకు దారితీసేలా ఉన్నాయి. ఫలితంగా పిల్లలతో చాలా మంది మధ్యలోనే బడిమానివేస్తున్నారు. మరోరకంగా చెప్పాలంటే బడి నుండి తరిమివేయబడుతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టాల్సిన ఆవశ్యకతను గుర్తించి ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం–2009 అభ్యసనం ఏ విధంగా ఉండాలో ప్రస్తావించింది. ఈ చట్టంలోని సెక్షన్ 29, సబ్‌సెక్షన్ 2 (ఇ)లో దీని వివరణ ఉంది. దీని ప్రకారం అభ్యసనం అనేది కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా స్నేహపూరిత వాతావరణంలో శిశుకేంద్రీకృతంగా ఉండాలి. అభ్యసనం ఇలా జరగాలంటే పిల్లల చదువుతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరు విధిగా అభ్యసనం గురించి ప్రస్తుత పరిస్థితి విశ్లేషణ, విద్యా హక్కు చట్టంలో పేర్కొన్న అంశాలు, పదజాలాల నిర్వచనాలు, వాటిపై సంపూర్ణ అవగాహన, అమలు నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## 3.3 నాణ్యమైన విద్య (Quality of Education)

నాణ్యమైన విద్య ముఖ్యంగా ఈ కిందివాటిపై ఆధారపడి ఉంటుంది.

- నాణ్యమైన బోధన (Quality of Teaching)
- అంకితభావం, విషయ పరిజ్ఞానం కలిగిన ఉపాధ్యాయులు (Quality of teacher)
- తరగతిగది వాతావరణం – భయరహిత దండనలేని వాతావరణం (Quality of classroom environment - fear free classrooms)
- ఉపాధ్యాయుల తయారీ, TLM ఉపయోగం, వృత్తిపరమైన అభివృద్ధి, (Quality of teacher preparation and their committment towards children learning)
- పిల్లల అభ్యసనంలో ప్రగతి, తరగతికి సంబంధించిన సామర్థ్యాల సాధన (Programmes in children performances attainment of class specific competencies)

**నాణ్యమైన విద్య – UNICEF:**

మంచి ప్రభావవంతమైన వాతావరణంలో పిల్లలందరు కనీస జ్ఞానాత్మక నైపుణ్యాలు (basic cognitive skills) పొందుతారు. విద్యా నాణ్యత ఐదు కోణాల్లో ఉంటుందని యూనిసెఫ్ తెలిపింది.

1. అభ్యాసకుడు (learner)
2. అభ్యసనా వాతావరణం (learning environment)

3. విషయం (content - syllabus and textbook etc.)

4. అభ్యసనా విధానాలు (process)

5. అభ్యసన ఫలితాలు (outcomes)

పైవన్నియూ కూడా బాలల హక్కుల ఆధారంగా పెంపొందించాల్సి ఉంటుంది. అంటే పాఠశాలలు వివిధ విధానాలు బాలల హక్కుల అమలు దిశగా ఉండాలి. జీవించే హక్కు, సంరక్షణ హక్కు, అభివృద్ధి హక్కు మరియు వికాసం హక్కు, భాగస్వామ్యపు హక్కు. వీటిని అవగాహన చేసుకొని పిల్లలను గౌరవించాలి.

విద్యలో నాణ్యత – UNESCO జీవిత పర్యంతం అభ్యసనానికి నాలుగు లక్ష్యాలను నిర్వచించింది.

**లక్ష్యం 1: తెలుసుకోవడమే నేర్చుకోవడం learning to know** పిల్లల స్వయంగా జ్ఞాన నిర్మాణం రోజు చేసుకుంటారు. learner build their own knowledge on daily basis.

అంటే తెలుసుకోవడం ఎలాగో నేర్చుకోవడం, నేర్చుకోవడాన్ని నేర్చుకోవడం, స్వాధ్యాయ లక్ష్యం కలిగిఉండడం. స్వాధ్యాయం అంటే మనిషి తనకై తాను తెలుసుకోవడం, ప్రయాణించడం.

**లక్ష్యం 2: చేయడానికి అభ్యసనం – learning to do** నేర్చుకున్నది ఎలా నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలనే దానిపై శ్రద్ధ పెట్టడం. Focus on the practical application of what is learned.

అంటే ఇది జ్ఞానం నైపుణ్యంగా మారడం, జ్ఞానశక్తి క్రియాశక్తిగా మారడం. అందులో యాంత్రిక నైపుణ్యాలు మొదలుకొని సృజనాత్మక నైపుణ్యాల వరకు అన్ని నైపుణ్యాలు వచ్చి చేరుతాయి.

**లక్ష్యం 3: కలిసి జీవించడాన్ని నేర్చుకోవడం – learning to live together** సమాజంలో ఒక వ్యక్తిగా జీవించడానికి అవసరమయ్యే జీవన నైపుణ్యాలు, వివక్షతలేని సమాజం, సమానత్వం, స్వేచ్ఛ మొదలగు రాజ్యాంగ విలువలపై దృష్టి Address critical skills for a life free from descrimination, equal opportunity to develop etc.

అంటే మనుషులు ఒకరితో ఒకరు సహజీవనం చేయడం ఎలాగో నేర్పడం. మనుషులు ఒకరినొకరు అర్థం చేసుకోవడాన్ని, కలిసిమెలసి జీవించడాన్ని నేర్పడమెలాగో విద్య నేర్పుతుంది. దీనినే విద్య యొక్క చరమ లక్ష్యంగా పరమప్రయోజనంగా మనం భావించవచ్చు.

**లక్ష్యం 4: ఎదగడానికి నేర్చుకోవడం – learning to be** మనిషి పూర్తి సామర్థ్యం మేరకు ఎదుగుదలకు అవసరమైన నైపుణ్యాలు. Skills needed for individuals to develop their full potential.

అంటే మనిషి తన అస్థిత్వాన్ని అంగీకరించమెట్లానో నేర్చుకోవడం. అన్ని రకాల అస్వాతంత్ర్యాల్ని ధిక్కరించి తను తానుగా ఉండటానికి సాధన చేయడం.

## 3.4 నాణ్యమైన బోధన (Quality of Teaching)

ఉపాధ్యాయుని నాణ్యమైన బోధన ఈ లక్షణాలను కలిగి ఉంటుంది.

- బోధన అనేది విద్యార్థి కేంద్రీకృతంగా ఉండి నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలి. సెలబస్ పూర్తి అని గాకుండా అందరు పిల్లలు నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలి.
- బోధన విద్యార్థి అనుభవాలను ఉపయోగించుకుంటూ జరపాలి. బోధన ద్వారా జ్ఞానం ఇవ్వడం అని గాకుండా విమర్శనాత్మక ఆలోచనల ద్వారా, సమస్యల సాధన ద్వారా విద్యార్థి స్వయంగా నేర్చుకొనేటట్లు చెయ్యాలి. నేర్చుకోవడం అనేది విద్యార్థి ప్రయత్నించి స్వయంగా పాల్గొని సమస్య సాధనను ఆలోచించి సొంతంగా ప్రయత్నిస్తేనే జరుగుతుంది.

- పిల్లలు నేర్చుకోవడానికి ఉపాధ్యాయులు, అభ్యసనా కృత్యాలు, పనులు ముందుగానే యోచించి పిల్లలచే చేయించడం ద్వారా పిల్లలు స్వయంగా అన్వేషించి కనుక్కుంటారు. పిల్లల్ని కృత్యాల ద్వారా, ప్రశ్నల ద్వారా ఆలోచింపచేసి తమంతట తాము నేర్చుకొనే విధంగా ఉపాధ్యాయుడు చెయ్యాలి.

వాత్సల్య పూరితంగా పిల్లలను చూడాలి. వారి సమస్యలను, సందేహాలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి దోహదపడాలి. నాణ్యమైన బోధన ఈ అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. ప్రణాళిక చేసుకోవడం మరియు ఉపాధ్యాయుని తయారీ. (Planning and Teacher Preparation)
2. తరగతి గది వాతావరణం – నిర్వహణ. (Classroom environment and Management)
3. బోధనాభ్యసన – విధానాలు. (Teaching and Learning Process)
4. ఉపాధ్యాయుడు వృత్తిపరంగా బాధ్యత వహించడం. (Teacher responsibilities)

### 3.4.1 ప్రణాళిక చేసుకోవడం (Planning):

పిల్లల్లో ఏమి రావడానికి, లేక ఏఏ సామర్థ్యాలు సాధించడానికి బోధన చేయాలి అనే అంశంపై ఉపాధ్యాయునికి పూర్తి అవగాహన, పట్టుండాలి. నేర్చుకోవడం అనేది పరిశీలించడం, చేయడం, చర్చలు, ఆలోచించడం ద్వారా జరుగుతుంది. కాబట్టి ఎలాంటి చర్చలు ఏ ఏ అంశాలపై చేయించి పిల్లలచే ఆలోచింపచేయాలి. ఎలాంటి కృత్యాలు ఇచ్చి పిల్లలు అనుభవం ద్వారా స్వయంగా నేర్చుకుంటారని ఆలోచించి, ఎలాంటి టి.ఎల్.ఎం.లు ఉపయోగించాలి, వెనుకబడ్డ విద్యార్థులకు ఎలా సహాయ చేయాలి అని ముందుగానే ఆలోచించి ప్రతి యూనిట్ లేక పాఠంనకు ప్రణాళిక వేసుకోవాలి. పాఠ్యపుస్తకాలు పిల్లలను ఉద్దేశించబడినవి కాబట్టి ఉపాధ్యాయుడు ఇతర రిఫరెన్స్ పుస్తకాలు చదివి, భావనలకు (concepts) తగిన ఉదాహరణలు కృత్యాలు అదనపు సమాచారం తన టీచింగ్ నోట్స్‌లో రాసుకొని పిల్లలకు కొత్తగా అందించాలి. ఉపాధ్యాయులు చదవకుండా, రిఫరెన్స్ పుస్తకాలు చూడకుండా పిల్లల అభ్యసనానికి న్యాయం చేయలేరు. ఉపాధ్యాయుని తయారీ అనేది ఒక వృత్తిపరమైన అభివృద్ధి, బోధన ఉత్తేజపరంగా, పిల్లలను ప్రేరణ కలిగించే విధంగా ఉండాలి. పరస్పర ప్రతిచర్యలతో, చర్చలతో కూడిన బోధనాభ్యసన ప్రక్రియలలో పిల్లలు ఏకాగ్రతతో పాల్గొని బాగుగా నేర్చుకొంటారు.

**ప్రణాళికలు – వార్షిక మరియు యూనిట్/ పాఠం**

ప్రతి ఉపాధ్యాయుడు తాను బోధించే తరగతికి మరియు సబ్జక్టుకు సంవత్సరాంతానికి పిల్లల్లో ఏమి రావాలి? పిల్లలు ఏ సామర్థ్యాలు సాధించాలి? ఆ సామర్థ్యాల సాధనకు ఎటువంటి బోధన మరియు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి అని ముందే ప్రణాళిక చేసుకోవాలి. ఈ ప్రణాళికలు ముఖ్యంగా రెండు. 1. వార్షిక ప్రణాళిక 2. యూనిట్/ పాఠం ప్రణాళిక. వీటిపై ప్రతి ఉపాధ్యాయుడికి మంచి అవగాహన ఉండాలి మరియు ఆశించిన సామర్థ్యాలు పొందడానికి ముందే ఆలోచించి ప్రణాళిక తయారు చేసుకొని నిర్వహించాలి. ఈ ప్రణాళికల యొక్క మాదిరి ఫార్మాట్లు ఈ కింద ఇవ్వబడ్డాయి.

**వార్షిక ప్రణాళిక (Annual Plan) – సోపానాలు:**

1. తరగతి:
2. సబ్జక్టు:
3. సంవత్సరంలో ఈ సబ్జక్టుకు కేటాయించబడిన మొత్తం పీరియడ్లు:
4. సంవత్సరాంతానికి పిల్లల్లో ఆశించే అభ్యసన సామర్థ్యాలు:

5. వార్షిక ప్రణాళిక (నెల మరియు యూనిట్ వారీగా):

| క్ర.సం. (Sl. No.) | నెల (Months) | యూనిట్/ పాఠం (Unit/ Lesson) | పీరియడ్ల సంఖ్య (No. of periods | బోధనా వ్యూహాలు/ కార్యక్రమాలు (Teaching learning strategies/ programmes) | బోధనా వనరులు మరియు సామగ్రి (Resources for teaching [TLM]) |
|---|---|---|---|---|---|
| 1<br>2<br>3 | | | | | |

6. వార్షిక ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయుల ప్రతిస్పందన:

7. వార్షిక ప్రణాళిక మరియు దాని అమలుపై ప్రధానోపాధ్యాయుని సలహాలు మరియు ప్రతిస్పందన

బోధనా వ్యూహాలు/ కార్యక్రమాల్లో భాగంగా కేవలం తరగతి గదుల్లో కాకుండా కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు అనగా క్షేత్ర సందర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు, సామాజిక సంస్థల సందర్శన, సమాజ సేవ మొదలగు కార్యక్రమాలను కూడా వార్షిక ప్రణాళికలో చూపాలి మరియు అమలు చేయాలి.

**యూనిట్/ పాఠం (lesson) ప్రణాళిక:**

ఏమి బోధించాలి? ఎలా బోధించాలి? ఎటువంటి అభ్యసన కృత్యాలు ఇవ్వాలి? పిల్లల్ని ఏవిధంగా అభ్యసనంలో భాగస్వాములను చేయాలి? ఏమి కొత్త విషయాలు చెప్పాలి? అనేవి ఉపాధ్యాయుడు ముందు ఆలోచించి ప్రణాళిక తయారు చేసుకోవాలి. కావున, ప్రణాళిక సులభతరంగా, ఆచరణయోగ్యంగా, ఆలోచించేవిధంగా ఉండడటానికి ఒక కొత్త ఫార్మాట్ తయారు చేయడమైనది. ఈ ప్రణాళిక రెండింటికి కలిపి అనగా యూనిట్ మరియు పీరియడ్ ప్లాన్‌లను కలిగి ఉంటుంది. ఈ ప్రణాళికలోని సోపానాలు ఈ కిందివిధంగా ఉంటాయి. అన్ని సబ్జక్టులకు ఇదే ఫార్మాట్‌ను ఉపయోగించాలి.

**యూనిట్/ పాఠం** (lesson) **ప్రణాళికలోని సోపానాలు:**

1. యూనిట్/ పాఠం పేరు :
2. తరగతి :
3. యూనిట్‌కు కేటాయించిన మొత్తం పీరియడ్ల సంఖ్య :
4. సాధించాల్సిన విద్యా ప్రమాణాలు :
5. పీరియడ్ వారీగా బోధనాభ్యసన అంశాలు మరియు విధానాలు :

| పీరియడ్ సంఖ్య (Periods) | బోధించాల్సిన అంశం/ భావనలు (Teaching item/ concepts) | బోధనా వ్యూహాలు (Teaching learning strategies) | బోధనాభ్యసన సామగ్రి (Resources for teaching [TLM]) |
|---|---|---|---|
| 1<br>2<br>3 | | | |

6. టీచింగ్ నోట్స్ – Teaching Notes: (బోధనాంశాలు మరియు విధానాలపై ఉపాధ్యాయుడు అదనంగా సేకరించుకోవాల్సిన సమాచారం.

7. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు:

బోధనా వ్యూహాలు ప్రతి సబ్జక్టుకు వివిధ రకాలుగా ఉంటాయి. నేర్చుకోవడం అనేది వినడం ద్వారా, చదవడం ద్వారా కాకుండా ఇతర పద్ధతులు అంటే చర్చలు (dialogues and discussions), కృత్యాలు (activities), ప్రాజెక్టులు (projects), ప్రశ్నించడం (questioning), పరిశీలన (observation), అన్వేషణ (exploration), కనుగొనడం (discovery), విశ్లేషణ (analysis), సంశ్లేషణ (synthesis), మూల్యాంకనం (evaluation).

- ఈ ప్రణాళికకు ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఒక పెద్ద నోట్‌బుక్ పెట్టుకోవాలి. ప్రతి యూనిట్/ పాఠానికి దాదాపు 20 పేజీల వరకు వదిలేయాలి. ప్రతి ఉపాధ్యాయుడు సొంతంగా తయారై ఆ పాఠానికి సంబంధించిన బోధనాంశాలు/ భావనలపై సమాచారం అనగా ఆ అంశాలకు సంబంధించిన అదనపు సమాచారం, కొత్త ఉదాహరణలు, ఆలోచింపజేసే ప్రశ్నలు, అదనపు కృత్యాలు, సంబంధించిన కథలు, సంఘటనలు మొదలగునవి సేకరించి అనగా రెఫరెన్స్ పుస్తకాలు మరియు మ్యాగజైన్లు, వార్తాపత్రికల నుంచి సేకరించి టీచింగ్ నోట్స్ కింద రాసుకోవాలి. ప్రతి సంవత్సరం కొత్త విషయాలు ఈ టీచింగ్ నోట్స్‌కు చేర్చాలి. దీనికి ఎక్కువ పేజీలు కేటాయించాలి. ఒక ఉపాధ్యాయుని యొక్క వృత్తిపరమైన తయారీ ఈ టీచింగ్ నోట్స్ పరిశీలిస్తే తెలిసిపోతుంది. పాఠ్యపుస్తకంలో ఉన్న సమాచారాన్ని మాత్రం ఈ టీచింగ్ నోట్స్ కింద రాయకూడదు. కేవలం అదనపు సమాచారం మాత్రమే ఉదాహరణలు, కృత్యాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు మొదలగునవి రాయాలి.
- ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు అంటే పాఠం ఏ రకంగా జరిగింది? పిల్లలు ఏమి నేర్చుకున్నారు? ఏ పద్ధతి నేర్చుకోవడానికి బాగా ఉపయోగపడింది? ఏ ఏ పిల్లలు సృజనాత్మకంగా జవాబులు చెప్పారు? మంచిగా జరిగిన తరగతులు, జరగని తరగతులు, కారణాలు, మంచిగా అనిపించిన అంశాలు, విజయవంతమైన వ్యూహాలు మొదలగునవి మరియు తన అనుభవాలను ఉపాధ్యాయుడు ఇక్కడ రాయాలి.
- ప్రతి యూనిట్‌కు, ప్రతి సంవత్సరానికి టీచింగ్ నోట్స్ కింద మరియు ఉపాధ్యాయుని ప్రతిస్పందనల కింద ఉపాధ్యాయుడు రాసుకోవాలి. ఈ ప్రణాళిక కొన్ని సంవత్సరాల వరకు పనిచేస్తుంది. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు టీచింగ్ నోట్స్ కింద రాసుకోవాలి.

**గమనిక:** ఈ ప్రణాళిక యూనిట్/ పాఠం మరియు పీరియడ్ ప్రణాళిక మరియు టీచర్ డైరీతోపాటు కలిసి ఉన్నది. కావున మళ్లీ టీచర్ డైరీ అవసరం లేదు. మానిటరింగ్ అధికారులు వచ్చినపుడు ఈ ప్రణాళికను చూస్తారు. ప్రతి యూనిట్/ పాఠం ప్రణాళిక ముందుగానే రాసుకొని ప్రధానోపాధ్యాయుడికి సమర్పించాలి. ప్రధానోపాధ్యాయుడు చూసి తన సలహాలు, సూచనలు ఇచ్చి సంతకం చేయాలి. ఒక నోట్‌బుక్‌లో మొదట వార్షిక ప్రణాళిక తరవాత యూనిట్ ప్రణాళికలు రాయాలి.

### 3.4.2 మంచి తరగతి గది, వాతావరణం (Effective Classroom Environment):

తరగతి గది వాతావరణం భయరహితంగా, స్వేచ్ఛ పూరితంగా ఉండాలి. పిల్లలు మాట్లాడటానికి సందేహాలు అడగటానికి ఎప్పుడైన విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. భయం, సందేహాలు దూరమైతే పిల్లలు నేర్చుకుంటారు.

తరగతి వాతావరణం ప్రేమ పూర్వకంగా ఉండాలి. పిల్లలతో చనువుగా ఉండాలి. పేర్లతో పిలవాలి. పిల్లల కుటుంబ సంబంధమైన సమస్యలు వినాలి. స్వేచ్ఛగా ఏమైనా అడిగే వాతావరణం ఉండాలి.

- ఉపాధ్యాయుడు చిరునవ్వుతో, ప్రేమ పూర్వకంగా ఉండి పిల్లల సమస్యలు వినాలి. అవమానపరచడం, దండన, భయపెట్టడం ఉండకూడదు.
- తరగతి గదిలో ప్రోత్సాహకరమైన వాతావరణం ఉండాలి. పిల్లల ఆత్మగౌరవం పెంచేలా, వారిపై వారికి నమ్మకం కలిగించేలా పిల్లలు చేసిన పనులను ఏమి నేర్చుకొన్నా, కొంచెం నేర్చుకున్నా కూడా గుడ్ అని ఉపాధ్యాయుడు భుజం తట్టి ప్రోత్సహించాలి.
- నేర్చుకోవడం అనేది ఒక సామాజిక ప్రక్రియ పిల్లలు ఇతరుల ద్వారా చూసి, విని, ప్రతిస్పందిస్తూ నేర్చుకుంటారు. కావున తరగతిలో పరిశీలన, మొత్తం తరగతి గది చర్చలు కృత్యాల ద్వారా నేర్చుకొనే అవకాశాలు కల్పించాలి.
- ధారాళమైన వెలుతురు, గాలి, కూర్చోవడానికి సరియైన స్థలం, త్రాగునీరు మరుగుదొడ్లు మంచి తరగతి గదులు ఉంటే పిల్లలు త్వరగా అలిసిపోరు.
- నేర్చుకోవడాన్ని ప్రశంసించాలి, ప్రోత్సాహకాలు ఇవ్వాలి, ప్రతీ బాలుడు లేక బాలిక కూడా నేర్చుకొనే సామర్థ్యం ఉన్నదని మనం నమ్మాలి. ప్రతి పిల్లవాడు, శారీరకంగా, మానసికంగా ప్రశాంతంగా, సౌకర్యవంతంగా ఉండేటట్లు తరగతి గది వాతావరణం ఏర్పరచాలి. ఉపాధ్యాయుని ప్రవర్తన ప్రోత్సహించేదిగా ఉండాలి.

**అభ్యసనా వాతావరణం లోపించిన తరగతి గదులకు సూచికలు:**

- పిల్లలు నేర్చుకోవడంలో బాగుగా నిమగ్నం అయ్యే విధంగా సవాలుతో కూడిన అభ్యాసం కృత్యాలు ఇవ్వలేకపోవడం.
- ఉపన్యాస పద్ధతిలో పాఠం చెప్పడం, కేవలం వినడమనే ఒక అత్యంత స్తబ్ధత గల బోధనా పద్ధతులు అవలభించడం.
- పాఠశాల సమయంలో ఎక్కువ సమయం పిల్లలు తరగతి గదిలో కూర్చొని తమంతట తాము చదువుకోవడం లేక పుస్తకం లేక గైడులు చూసి నోటు పుస్తకంలో అదేపనిగా ప్రశ్నలు జవాబులు రాసుకోవడం, అనేది సాధారణంగా కనిపించే దృశ్యాలు.
- పదే పదే పాఠాలు చదవడం, ప్రశ్న జవాబులు రాయడం, వినడం అనే ప్రక్రియలు చేయడం, గంటల తరబడి చిన్నపిల్లలు తరగతి గదిలో కూర్చోవడం, మాట్లాడకుండా ఉండడం అనే వాటి వల్ల పిల్లలు అసహనానికి, విసుగుదలకు గురిఅవుతారు. ఎప్పుడు బడి సమయం అవుతుందా బయటకు వెళదామా అని బడిగంట కోసం ఎదురుచూస్తుంటారు.

కావున పై పరిస్థితి ఇలా కాకుండా, క్రమశిక్షణ పేరుతో, పిల్లలని మాట్లాడనివ్వకుండా, తనకు అడగాలనిపించేది, అడగనివ్వకుండా తరగతిలో ఒక ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయకూడదు. ఉపాధ్యాయుడు పిల్లలతో కలిసిపోవాలి. పిల్లలను ప్రోత్సాహకంగా తరగతి గది చర్చలలో మరియు నేర్చుకోవడంలో పాల్గొనేలా చేస్తూ ఉపాధ్యాయుడు పిల్లల అభిమానాన్ని చూరగొనాలి.

### 3.4.3 బోధనాభ్యసన విధానాలు (Teaching and Learning Process)

నేర్చుకోవడం అనేది నాణ్యమైన బోధన మీద ఆధారపడి ఉంది. బోధన అంటే చెప్పడం కాదు. వినిపించడం ద్వారా నేర్చుకునేది కాదు. బోధన అనేది ఒక ప్రక్రియ, ఒక కళ, అనేక విధానాలు అంటే చర్యలు, పరిశీలనలు, ప్రయోగాలు, పరిశోధన, ప్రాజెక్టులు, అన్వేషణలు, ప్రదర్శనలు వీటన్నింటి ద్వారా పిల్లలు అభ్యసనంలో చురుకుగా పాల్గొని నేర్చుకుంటారు.

ఈ విధానాల ద్వారా ఇచ్చిన సమస్యపై, పిల్లలు సొంతంగా ఆలోచించి తమదైన పద్ధతిలో చేసి, చూసి నేర్చుకుంటారు. పాఠశాలలో ఎక్కువ సమయం, పిల్లలు తమకివ్వబడిన సమస్యలపై ఆలోచించడం, తోటి విద్యార్థులతో

చర్చలు జరపడం, చేసి చూడటం మొదలగు వాటి ద్వారా సమస్యలను సాధించడంలో నిమగ్నం కావాలి. దీనికి ఉపాధ్యాయుడు సహాయసహకారాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

మంచి బోధనాభ్యసన విధానాలకై, పిల్లలు, పాల్గొని నేర్చుకోవడానికి ఉపాధ్యాయుడు బోధన వనరులు, బోధనాభ్యసన సామగ్రి సేకరించుకోవాలి. మరియు తయారు చేసుకోవాలి. పిల్లలు ఆలోచించడం, చేయడం ద్వారా నేర్చుకుంటారు. కావున సమాచారం ఇవ్వడంపై దృష్టి పెట్టకుండా నిశిత ఆలోచనలు, సృజనశీల నైపుణ్యాలపై వివిధ సామర్థ్య సాధనాలపై దృష్టి పెట్టాలి. ప్రేరణ, ప్రోత్సాహం ద్వారానే పిల్లలు బాగుగా నేర్చుకుంటారని, నేర్చుకోవడంలో ఇవే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి.

ఉపాధ్యాయుని బోధన లక్ష్యం, పిల్లల్లో సృజనాత్మకత , లోతుగా ఆలోచింపజేయడం, భావప్రసార నైపుణ్యాలు ఇతరులతో కలిసిపనిచేసే తత్వం, నైపుణ్యాలను పెంపొందించడం, వాటికి బాధ్యత వహించడం మొదలగు సామర్థ్యాలే పిల్లల్ని భవిష్యత్తులో మంచి సామాజిక జీవనం గడిపేలా చేస్తాయి.

### 3.4.4 ఉపాధ్యాయుల నాణ్యత – వృత్తిపరమైన బాధ్యతలు (Teacher Quality - professional responsibilities)

నాణ్యమైన బోధన అనేది ఉపాధ్యాయుల నాణ్యత పైననే ఆధారపడి ఉంటుంది. (Quality teaching is based on Quality of teacher).

**ఉపాధ్యాయుల నాణ్యత అంటే ఏమిటి?**

- బోధించే విషయంపై, బోధనా విధానాలపై ఉపాధ్యాయునికి లోతైన అవగాహన ఉండాలి.
- పిల్లల స్వభావం మరియు బాల్య దశ స్వరూపం, అవసరాలపై స్పష్టత, జ్ఞానం, అవగాహన ఉండాలి.
- పిల్లలు ఎలా నేర్చుకుంటారు? ఏ ఏ విధానాల ద్వారా పిల్లలు పాల్గొని స్వయంగా నేర్చుకుంటారు? అంటే అభ్యసనం యొక్క స్వరూపంపై (Nature of learning and how children learn) లోతైన అవగాహన ఉండాలి.
- మూల్యాంకనం అనేది పిల్లలు బాగుగా నేర్చుకోవడానికి ఉపకరించేది మరియు బోధనను మెరుగుపరిచేది అనే అవగాహనతో పిల్లలు నేర్చుకొనేటప్పుడే వారి ప్రగతిని తెలుసుకొని తగిన విధంగా పిల్లలకు నేర్చుకోవడంలో సహాయపడాలి.

పై అంశాలపై అవగాహన రావాలంటే ఒక డి.ఇడి., బి.ఇడి., చదివితే సరిపోదు. కొత్త విషయాలకై నిరంతరం పై అంశాలకు సంబంధించిన పుస్తకాలు, మేగజైనులు, పత్రికలు, పరిశోధనలు చదవాలి. అప్పుడే మనం సమర్థులైన ఉపాధ్యాయులమవుతాం. మూసపోసిన విధంగా, నిరంతరం ఒకేవిధంగా, ఒకే పద్ధతిలో బోధించడం కాకుండా, కొత్త పద్ధతులలో, విధానాల్లో చెప్పాలి. ఏ విధానం ద్వారా పిల్లలు బాగా నేర్చుకుంటున్నారో అనేది పరిశోధించాలి. అప్పుడే రేపటి తరాన్ని మంచి ఆలోచనాపరులైన, జ్ఞానులైన విద్యార్థులను తయారు చేయగల్గుతాం.

సంవత్సరాల తరబడి బోధనలో ఏ మార్పు లేకుండా, మూస విధానంలో కాకుండా, కొత్త పద్ధతులు, ఏ ఏ పద్ధతులు లేక విధానాల ద్వారా పిల్లలు తరగతి గదిలో బాగుగా పాల్గొంటారని చూడాలి. ఎలా అయితే పిల్లలు చురుకుగా ఉండి నేర్చుకుంటారు? ఎలాంటి టి.ఎల్.ఎమ్. ఉపయోగించాలి? అని ప్రతి ఉపాధ్యాయుడు తిరిగి చూసుకోవాలి. బోధించాము, అయిపోయింది అని కాకుండా బోధనా ఫలితమేమి అని తన అనుభవాలను అవలోకనం చేసుకొని తమ బోధనను మార్చుకొని మంచికి ప్రయత్నించడమే ఉపాధ్యాయుని నిజమైన కర్తవ్యం. ఎక్కువ అనుభవం అంటే ఎక్కువ

సంవత్సరాలని కాదు. ఎన్ని కొత్త పద్ధతులు అవలంభించారు. బోధనలో తనదైన జ్ఞానం ఏమి అని లెక్కకు వస్తుంది. ఒక ఉపాధ్యాయుడు బోధనా అనుభవం ద్వారా ఎక్కువ నేర్చుకుంటాడు.

**మంచి, నిపుణులైన ఉపాధ్యాయుల లక్షణాలు:**

- పిల్లలతో మంచి సంబంధాలు, పిల్లలకు మంచి స్వేచ్ఛ ఇచ్చి ప్రజాస్వామ్య పద్ధతులను అమలుచేయడం, పిల్లలచే అభిమానింపబడడం, పిల్లలను ప్రేమగా చూడడం, వారికి రక్షణ కల్పించడం.
- మంచి ప్రణాళికలు తయారుచేసుకోవడం, అమలుపరచడం. మంచి కృత్యాలు, అనుభవాలద్వారా, ప్రాజెక్టులు, అన్వేషణలద్వారా పిల్లలు స్వయంగా నేర్చుకునేటట్లు చేయడం.
- కేవలం సమాచారం ఇవ్వడం కాకుండా సిలబస్ పూర్తిచేయడం కాకుండా నేర్చుకోవలసిన సామర్థ్యాలు, నైపుణ్యాలు, జ్ఞానం అవగాహనపై దృష్టిపెట్టాలి.
- ప్రతి నిత్యం జ్ఞాన సముపార్జనకోసం నిరంతరం చదివే అలవాటు కలిగివుండి వివిధ వృత్యంతర శిక్షణా సమావేశాలకు హాజరవుతూ, గ్రంథాలయాలకు వెళుతూ, సహచర ఉపాధ్యాయులతో చర్చిస్తూ వృత్తిసంబంధ ప్రగతిని సాధించాలి.
- సబ్జెక్టుల మధ్య, వివిధ పాఠాల మధ్య, వివిధ బావనల మధ్యగల సంబంధంపై అవగాహన పెంపొందించాలి (connections) అప్పుడే పిల్లలు తమ జ్ఞానాన్ని అన్వయించుకుంటారు.
- మంచి బోధనకు, అభ్యసనానికి బాధ్యత వహించాలి. ఆలోచించి బోధనా విధానాలను ఎన్నుకోవాలి. టి.ఎల్.ఎమ్. సమర్పించుకోవాలి.
- పిల్లల శక్తి సామర్థ్యాలను వృద్ధిపరచాలి. వారిని సాధికారులుగా తయారుచేయాలి (student empowerment).
- సమభావన, సమాన అవకాశాలు కల్పించడం: విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వారు నేర్చుకునేటట్లు చేయాలి. తగు సమయం, సహాయం ఇచ్చి పిల్లలందరు ఆశించిన సామర్థ్యాలను పొందేలా కృషిచేయాలి, సాధించాలి.
- సహనం, ఓర్పుతో, పిల్లలకు అవసరమగు అదనపు సహాయాన్ని ఇచ్చి నేర్చుకోవడం సులభతరంగా, సవాలుతో కూడినదిగా చేయాలి.
- ప్రస్తుత సంఘటనలు, సామాజిక సమస్యల ఆధారంగా నీతి, మంచి, చెడు, న్యాయం, అన్యాయం, ధర్మం, అధర్మం అనేవాటిపై చర్చింపజేసి మంచి నైతిక విలువలను జీవన నైపుణ్యాలను వైఖరులను నేర్పించాలి.

## 3.5 బోధనాభ్యసన ప్రక్రియలు – ప్రస్తుత పరిస్థితి (Teaching Learning process - existing situtaion)

- బోధనాభ్యసన ప్రక్రియలు కేవలం సిలబస్ పూర్తి చేయడానికి పరిమితమైనాయి.
- ఉపన్యాసపద్ధతి, చదివి అర్థం చెప్పడం, పిల్లలు వినడం ద్వారా నేర్చుకోవడం అనే ఒక నిస్తేజపూరిత ప్రక్రియ కొనసాగడం.
- పిల్లలను పరీక్షల కోసం తయారుచేయడమే ధ్యేయంగా బోధన జరుగుతుంది. ఇందుకోసం గైడ్లు, స్టడీమెటీరియల్ ఉపయోగిస్తున్నారు.
- పిల్లల నమ్మకాలు, అభిప్రాయాలు సందేహాల వ్యక్తీకరణకు తక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం.
- పిల్లల శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం.
- చాలా కొద్దిమంది పిల్లల అవసరాలను తీర్చే దిశలో ఉండడం.
- అభ్యసనంలో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక లేకపోవడం. వారికి ఏమి రాకుండానే పై తరగతులకు వెళ్ళడం.

- చురుకైన భాగస్వామ్యం, చురుకుగా అభ్యసన ప్రక్రియలలో నిమగ్నంకావడంలేదు.
- సవాలుతో కూడిన అభ్యసన పనులు పిల్లలకు కల్పించి వాటిలో వారు చురుకుగా పాల్గొనే విధంగా బోధన ఉండకపోవడం.
- నల్లబల్ల ఉపయోగించి, చర్చలకు సంబంధించిన ప్రశ్నలు రాసి దానిపై పూర్తి తరగతి గది చర్చలో పరస్పర అవగాహనను పంచుకోవడంలేదు.
- సమవయస్కుల వారి సాయంతో నేర్చుకోవడానికి, ఇంటరాక్టివ్ అభ్యసనానికి తక్కువ ప్రాముఖ్యతనివ్వడం.
- పిల్లల వ్యక్తిగత అభ్యసన శైలులకు అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియ లేకపోవడం.
- చాలా సమయం ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ జరగపోవడం. పిల్లలు చురుకుగా పాల్గొనేలా లేకపోవడం.
- పాఠశాలల్లో ఎక్కువ సమయం పిల్లల టీచర్ చెప్పింది వినడం, చదువుకోవడం, పుస్తకాలు, గైడుల నుండి చూసి కాపీచేసుకోవడానికే పరిమితం కావడం. అవగాహనకోసం చర్చలు, అభిప్రాయాలు పంచుకోవడమనేవి కనిపించవు. పాఠశాలల్లో పిల్లలు గడిపే సమయమంతా వాళ్ళు నేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు చర్చించడం, సలహాలివ్వడం, చేసి చూపించడం, పరస్పరం చర్చించే రీతిలో జట్టుపనుల వంటి వాటికి కేటాయించడం మొదలగునవి జరగడం లేదు.
- టీచర్స్ ప్రెపరేషన్ ప్రస్తుత పరిస్థితి

## 3.6 RTE Act - 2009 - పదజాలం, వివరణ (RTE Act - 2009 Terms - Description)

ఆర్‌టిఇ 2009 – 5వ అధ్యాయం–29వ సెక్షన్‌లో ఇలా పేర్కొన్నారు.

“పిల్లల్ని కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనడం ద్వారా నేర్చుకోవాలి” (promoting learning through explorations, discovery in a child friendly and child centered ways)

**నిర్వచనాలు:**

### 3.6.1 కృత్యం (Activity):

ఉదా॥ భీముడికి ఇష్టమైన వంటకాలు గళ్లలోని అక్షరాలలో దాగిఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి. (3వ తరగతి తొలకరిచినుకులు–3) తెలుగువాచకంలోని యూనిట్–1 2.బాలభీముడులోని ‘ఆ’ కృత్యం)

| | | | | | |
|---|---|---|---|---|---|
| పు | ల | డ్డు | హ | బొ | క |
| లి | జి | ప | ల్వా | బ్బ | జ్జి |
| హో | లే | కో | వా | ట్లు | కా |
| ర | బి | డి | వ | డ | య |
| బూ | రె | లు | పా | య | సం |
| చ | క్కె | ర | పొం | గ | లి |

ఉదా : లడ్డు

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

ఈ కృత్యాన్ని వ్యక్తిగతంగా, జట్టుగా చేయవచ్చు. ఇది సవాలుతో కూడి ఉండి పిల్లలు చురుకుగా పాల్గొంటారు. జట్లలో చర్చించి సమాధానాలు రాస్తారు. పదాలకోసం అన్వేషిస్తారు. పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటారు. అవసరమనిపిస్తే పాఠ్యాంశాన్ని మళ్లీమళ్లీ చదువుతారు. నిర్దిష్ట సమయం తర్వాత పిల్లలు రాసిన పదాలు చదివి చెప్పమనాలి.

పాఠశాల విద్యకు సంబంధించినంతవరకు కృత్యం అనేది ఒక ప్రక్రియ. పిల్లలు చురుకుగా తమంతటతాము పాల్గొంటూ పూర్వజ్ఞానాన్ని వినియోగిస్తూ, నిత్యజీవిత అనుభవాలను జోడిస్తూ నేర్చుకునే ప్రక్రియ. కృత్యం (చేయడం) ఆధారంగా జరిగే అభ్యసనాన్ని కృత్యాధార అభ్యసనం అంటారు.

**కృత్యాధార అభ్యసనం:**

తరగతి గదుల్లో పిల్లల అభ్యసనం కృత్యాల ఆధారంగా జరిగే దానిని కృత్యాధార అభ్యసనం అని చెప్పవచ్చు. ఈ పద్ధతి గత కొన్ని సంవత్సరాలుగా ఆచరణలో ఉంది కాని చాలామంది ఇప్పటివరకు ఈ పద్ధతిపైన సరైన అవగాహన లేకుండా, సరిగా అన్వయించకుండానే ఈ పద్ధతి ద్వారా బోధించడానికి ప్రయత్నం జరుగుచున్నది. కృత్యాధార పద్ధతిని అవలభించాలి? నిజంగా ఇది అవసరమా? అసలు ఈ పద్ధతి ఎలా ఆవిర్భవించింది? అనే ప్రశ్నలు ఉపాధ్యాయున్ని ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయి.

స్థూలంగా చెప్పాలంటే కృత్యం అనే భావన చాలా పురాతనమైనది. పిల్లల అభ్యసన ప్రక్రియ మౌళిక నియమాలపై ఆధారపడి ఉంది. నిజమైన కృత్యాధార అభ్యసనం అంటే కేవలం శారీరక కదలికలే కాకుండా మానసిక అంశాలతో మిళితమై ఉండాలి.

**పిల్లలు ఈ సందర్భాలలో బాగుగా నేర్చుకుంటారు:**

అభ్యసనంలో వారిని భాగస్వామ్యం చేసినప్పుడు అనగా ప్రశ్నించి వారిని ఆలోచింప చేసినప్పుడు.

**కృత్యము :** కృత్యాల ద్వారా నేర్చుకోవడం అనేది అనుభవ పూర్వకంగా నేర్చుకోవడం (experiential learning) కృత్యాలు పనిచేయడం కావచ్చు, పరిశీలనలు కావచ్చు, గ్రూపు చర్య కావచ్చు.

**కృత్యాలు :**

1. Speed of evaporatory liquids.
2. How much of Income, the parents spending on their children education

కృత్యం అంటే నేటికి కూడా చాలా మంది ఉపాధ్యాయులు రకరకాలుగా అభిప్రాయపడ్తుంటారు. ఉదా:

- కృత్యం అంటే కేవలం శారీరకమైనది. అసలు అభ్యసనప్రక్రియతో దీనికి ఎలాంటి సంబంధం ఉండదు.
- కృత్యాలు 1,2 తరగతులకు మాత్రమే ఉపయోగకరం. పై తరగతులలో వీటిని ఉపయోగించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.
- కృత్యం నిర్ధారిత లక్ష్యాలు, విధానాలు, ఫలితాలతో కూడి ఉండాలి.
- కృత్యాధార బోధనవల్ల సకాలంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యం కాదు.

**కృత్యం – ఉదాహరణలు:**

ఉదా:
1. అయస్కాంతాలు ఎలా ఆకర్షించుకుంటాయి?
2. లోలక చలనాన్ని ఏది నియంత్రిస్తుంది?
3. ద్రవాలయొక్క బాష్పీభవనస్థానం
4. మొక్కల పేర్లు ఇచ్చి వాటిని వర్గీకరించమనాలి.

**కృత్య లక్షణాలు:**

పిల్లలలో ఆశించిన విధంగా అభ్యసనం వేగంగా, అర్థవంతంగా ఉండాలంటే కృత్యానికి నిర్దిష్ట లక్షణాలు ఉండాలి. ఉదా.

- ఆలోచనలు రేకెత్తించాలి.
- సవాలుతో కూడి ఉండాలి.
- వ్యక్తిగతంగా, జట్లలో, పూర్తి తరగతిలో చేసేదిగా ఉండాలి.
- బహుళ తరగతి బోధనకు ఉపయోగపడేదిగా ఉండాలి.
- స్థాయికి తగినట్లు ఉండాలి.
- లక్ష్యాత్మకంగా, ఆచరణాత్మకంగా ఉండాలి.
- ఆసక్తికరంగా, పాల్గొనడాన్ని పురికొల్పేదిగా ఉండాలి.
- చేర్పులు, మార్పులకు వీలైనదిగా ఉండాలి.
- తక్కువ ఖర్చు, ఖర్చులేనిదిగా ఉండాలి.

పిల్లల ఆసక్తులు, అభిరుచులు, అనుభూతులు, యిష్టాయిష్టాల ఆధారంగా పాఠ్యాంశాల ఇతివృత్తాల ఆధారంగా కృత్యాలు ముందే రూపొందించుకొని తరగతిగదిలో కల్పించాలి. ఇవి వ్యక్తిగతంగా, జట్లుగా, పూర్తి తరగతి పనులుగా ఇవ్వాలి. కృత్యాలు కల్పించడానికి ముందు కృత్యాలలో ఎలా పాల్గొనాలో తెలిపే సూచనలు స్పష్టంగా అందరికీ అర్థమయ్యే విధంగా ఇవ్వాలి. కృత్యాలలో పాల్గొనే సందర్భంలో పిల్లలు ఎలా పాల్గొంటున్నారో గమనించాలి. అందరూ పాల్గొనేలా ప్రోత్సహించాలి. అవసరమైన సాయం అందించాలి. పిల్లలు నేర్చుకునే తీరును అంచనావేయాలి. నేర్చుకున్న అంశాలను పిల్లలతో చర్చించాలి. పిల్లల ప్రతిస్పందనలను టీచర్ తన డైరీలో రికార్డు చేయాలి.

### 3.6.2 కనుగొనడం (Discovery):

ఏదైనా పత్రాన్ని మనం చెప్పడం కాకుండా పిల్లలే స్వయంగా కనుక్కునేలా ప్రోత్సహించాలి. ఉదా: మునగడం, తేలడం, మన పరిసరాలలో ఉన్న కొన్ని వస్తువులు అనగా పెన్సిల్, కట్టెముక్క, ఇనుపరేకు, ప్లాస్టిక్ కప్పు మొదలగు వాటిలో ఏవి నీటిలో తేలుతాయి లేక మునుగుతాయో చెప్పించాలి. తరువాత చేసిచూసి కనుక్కోవాలి. వారు మొదలు ఊహించింది తప్పు లేక ఒప్పు తెలుసుకుంటారు. ఇలాగే కొన్ని దృగ్విషయాలను మనం చెప్పకుండా పిల్లలు చేసి తమంతట తాము కనుక్కోవాలి.

ఈ రకమైన అభ్యసనం పిల్లలలో ఉత్సుకతను ఇనుమడింపచేస్తుంది. సవాలుతో కూడి ఉండడంవల్ల పిల్లలు చురుకుగా పాల్గొంటారు. ఒక నూతన అంశాన్ని కనుగొన్నామన్న తృప్తి వారికి నూతనోత్తేజాన్ని కలిగిస్తూ మరింత వేగంగా నేర్చుకునేలా చేస్తుంది. ఇది అర్థవంతమైన అభ్యసనానికి పురికొల్పుతుంది. ఈ పద్ధతి వల్ల పిల్లలు బాలశాస్త్రవేత్తలుగా అనుభూతి చెందుతారు.

**కనుగొనడం ద్వారా అభ్యసనం (Discovery learning)**

ఉదా: బోధించే తరగతి పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలలో కనుగొనడం, అన్వేషణల ద్వారా నేర్చుకునే అవకాశం ఉన్న భావనలు/కృత్యాలను గుర్తించి అవసరమైతే చిన్న చిన్న చేర్పులు, మార్పులు చేసుకుని పిల్లలకు తామే స్వయంగా కనుగొనడం, అన్వేషించడం ద్వారా నేర్చుకునే అవకాశాలు పిల్లలకు కల్పించాలి. పిల్లలు పాల్గొనే తీరును రికార్డు

చేయాలి. సృజనాత్మకత వెలిబుచ్చిన పిల్లలను అభినందించాలి.

- ఇనుము, అల్యూమినియం, గాజు, పింగాణీ మొదలగు పదార్థాలు ఏవి మంచి ఉష్ణ గ్రాహకాలు
- ఏ ద్రవ పదార్థాలు మరిగే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. లేక తక్కువగా ఉంటాయి. ఊహించండి, చేసి కనుక్కోండి.
- అన్ని మొక్కల పెరుగుదల సమానంగా ఉంటుందా. భేదాలు ఉంటాయా, తెలుసుకోండి. ఎర్రమట్టి, నల్లమట్టి, ఒండ్రుమట్టి, దీనిలో ఎక్కువ కాలం తేమ ఉంటుంది. మొక్కలు వాటి పరిశీలన ద్వారా కనుక్కోండి.

### 3.6.3 అన్వేషణ (పరిశోధన) (Explorative Survey)

1. ఉదా॥ మీ ఇంటి చుట్టుపక్కల కొన్ని ఇళ్లను చూడండి. వాటిపై కప్పులు ఎలా ఉన్నాయో కింది పట్టికలో రాయండి. (3వ తరగతి - మనం - మనపరిసరాలు. 10 రకరకాల ఇళ్లు)

| క్ర.సం. | ఇంటి రకం | ఇంటి పైకప్పు | |
|---|---|---|---|
| | | చదునుగా | ఏటవాలుగా |
| | | | |

1. ఏరకమైన ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి?
2. వాటిపై కప్పులు ఎలా ఉన్నాయి?

ఈ రకమైన కృత్యాలు పిల్లలతో తెలుసుకోవాలన్న తపనను రగిలిస్తాయి. రకరకాల కోణాలలో తమదైన శైలిలో సమాచారం కోసం అన్వేషిస్తారు. సమాచారాన్ని విశ్లేషిస్తారు. ఫలితంగా ఒక సాధారణీకరణకు రాగలుగుతారు. తమ అభిప్రాయాలను ధృడపరచుకుంటారు. ఉపాధ్యాయులు విశ్లేషణాత్మక ప్రశ్నలు అడిగి పిల్లల అన్వేషణ, పరిశోధన ద్వారా కనుగొన్న విషయాన్ని సహేతుకంగా రాబట్టాలి. ఇటువంటి కృత్యాలు కల్పించడంవల్ల పిల్లలు తమంతటతామే తెలుసుకున్నామన్న భావన కలుగుతుంది. పాఠ్యపుస్తక సమాచారం ద్వారా పొందిన జ్ఞానాన్ని అన్వయిస్తారు. వృద్ధి పరచుకుంటారు.

ఇంకొక ఉదా: మీ బడి ఆవరణలోకాని, మీ ఇంటి పెరట్లోగాని ఏ ఏ రకాల మొక్కలు ఉన్నాయి. ఏ ఏ రకాల కీకటాలు, పురుగులు ఉన్నాయి. పరిశీలించి దాని జీవవైవిధ్యం చెప్పమనాలి.

**అన్వేషణ ద్వారా అభ్యసనం (Learning through exploration):**

ఉదా:

- అభ్యసనం అనేది శిశుకేంద్రీకృతంగా జరగాలి.
- పిల్లలు తమ చుట్టు ఉన్న ప్రపంచాన్ని నిత్య జీవిత అనుభవాలు, ఉత్సుకతతో పలు అంశాలను అన్వేషిస్తూ నూతన అంశాలను కనుగొంటారు.
- భావనలు చెప్పితే విని పిల్లలు నేర్చుకుంటారనుకోవడం కాదు. పిల్లలు చేయడం, పరిశీలించడం ద్వారా భావాలను అవగాహన చేసుకోవాలి లేదా సొంతంగా కనుక్కోవాలి.

- కనుగొన్న అనుభవాల నుండి అన్వేషణ ద్వారా పిల్లలు స్వీయ అవగాహనను నిర్మించుకుంటారు. అదే సందర్భంలో ముఖ్యమైన ఇతర నైపుణ్యాలు, వైఖరులు పెంపొందించుకుంటారు.
- ఉపాధ్యాయులు పిల్లల అన్వేషణలు, కనుగొన్నవి అర్థవంతంగా ఉండేట్లు వారిని ప్రోత్సహిస్తూ తగు సహకారాన్ని వారికి అందించాలి.
- పిల్లలకు వారంతట వారే పలు నూతన విషయాలను కనుగొనడం అనేది వారికి మంచి ప్రేరణను కల్గిస్తుంది. కనుగొనే అంశాలు అభ్యసన లక్ష్యాలకు చెందినవై ఉండాలి. ఇది ప్రత్యేక వనరులను కల్పించడం, సవాలుతో కూడి ఉండడం, అభ్యసన లక్ష్యాల సాధనకు ఉపకరించే ప్రశ్నలు వేయడం వంటి వాటివల్ల సాధ్యమవుతుంది.
- ఉపాధ్యాయులు పిల్లల అభ్యసనాన్ని పూర్తిగా తాము అనుకున్న రీతిలో జరగాలనుకొని కృత్యాలను రూపొందించుకొని కల్పిస్తే వారు నూతన అంశాలను కనుగొనే స్వేచ్ఛను కోల్పోతారు. వారి సృజనాత్మకను కట్టడి చేసిన వారౌతారు.
- ఎప్పుడైతే పిల్లలు అన్వేషించాలని, కొత్త అంశాలను కనుగొనాలను నిర్ధారించుకుని ప్రయత్నిస్తారో, ఉదా॥ అప్పుడు వారు శ్రద్ధగా ఆయా కృత్యాలలో పాల్గొనడం, అసలైన అభ్యసనం జరగడం మనం చూడవచ్చు. ఎప్పుడైతే పిల్లలు అన్వేషణకు, కనుగొనేందుకు అనుమతిస్తామో అప్పుడు వాళ్లు తమ అభ్యసనంపై పూర్తి నియంత్రణను కలిగి ఉంటారు. తమ అవగాహనను, నైపుణ్యాలను, వైఖరులను తమ అవసరాలు, అనుభవాలకు తగ్గట్టుగా అభివృద్ధి పరచుకొంటారు. ఒక పాఠం రాసి, దానిని ఏ విధంగా కృత్యాల ద్వారా, కనుక్కోవడం (Discovery) ద్వారా, అన్వేషణ ద్వారా, Exploration ద్వారా పిల్లలు స్వయం చేసి, చూసి నేర్చుకుంటారు.

**అన్వేషణ – ఉదాహరణలు:**

1. ఏ ఏ కారణాల వల్ల ఋతువులు కాలాలు ఏర్పడుతాయి.
2. ఏ ఏ ద్రవ పదార్థాలు తొందరగా మరియు ఆలస్యంగా ఆవిరి అవుతాయి.
3. గ్రామంలోని కుటుంబాలు తమ ఆదాయంలో ఎంత శాతం పిల్లలు పోషణపై ఖర్చు పెడతారు.
4. కుటుంబాలలో పిల్లలు, పెద్దలు రోజుకు ఎంత సమయం టి.వి. చూడడంలో గడుపుతున్నారు.
5. గత వారంలో ఒక తరగతిలో పిల్లలు తీసుకొన్న ఆహార పదార్థాల జాబితా మరియు వాటి పోషక విలువలు (పిండిపదార్థాలు, ప్రొటీన్స్, కొవ్వు పదార్థాలు) తయారు చేయండి.

### 3.6.4 శిశుకేంద్రీకృత విద్య (Child Centred Education)

చదువు అనేది శిశుకేంద్రంగా పిల్లలు నేర్చుకునేవిధంగా కొనసాగాలి. అంటే పిల్లల అనుభవాలకు, వారి ఆలోచనలకు, క్రియాశీల భాగస్వామ్యానికి పెద్దపీట వెయ్యడం. ఇందుకోసం ఉపాధ్యాయులు పిల్లల మానసికాభివృద్ధిని, వారి అభిరుచులను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని బోధనాభ్యసన ప్రక్రియలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి. ఇవి వైవిధ్యభరితంగా ఉండి, పిల్లల భౌతిక, సాంస్కృతిక, సామాజిక ప్రాధమ్యాలకు ప్రాధాన్యతనిచ్చేవిగా ఉండాలి. పిల్లల అభిప్రాయాలకు విలువనిచ్చేవిగా ఉండాలి. తరగతి గదులలో బోధనాసందర్భంగా పిల్లలు ప్రతిక్షణం చురుకుగా పాల్గొంటూ తమంతట తాము నేర్చుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడం ప్రధానం కావాలి. ఉపాధ్యాయుడు ఒక సలహాదారుగా, మార్గదర్శిగా, సౌలభ్యకర్తగా వ్యవహరించాలి.

## 3.7 పిల్లల స్వభావంపై అవగాహన (Understanding Childhood)

– పిల్లలు ఈ విశ్వంలో ఉన్న ప్రతి వస్తువును, దృగ్విషయాలను తెలుసుకోవాలనే ఉత్సుకతతో ఉంటారు. ఈ ఉత్సుకత స్వాభావికం. పిల్లలందరిలో ఉంటుంది. దీనిని కొనసాగించడానికి, పెంపొందించడానికి ప్రయత్నం జరగాలి.

- పిల్లలు శక్తి వంతంగా ఉంటారు (Children are energitic) పిల్లలు ఒక చోట కూర్చోకుండా ఎప్పుడు ఏదో ఒక పని చేస్తుంటారు. మాట్లాడుతుంటారు. ఆడుతుంటారు. ఎందుకంటే ఎప్పుడు వారు ఉత్సాహంగా మరియు శక్తితో ఉంటారు. దీనిని నేర్చుకోవడంలో ఉపయోగించాలి. బలవంతంగా కూర్చోబెట్టి సవాలుతో కూడిన (challenging learning tasks) ఏ పని ఇవ్వకుండా, వారిని శాశ్వతంగా ఏ పని చేయకుండా ఒక అలవాటును చేయకూడదు (Culture of silence and idealness).

**పిల్లలు ఇతరులతో కలిసే సామాజిక స్వభావం కల్గి ఉంటారు**

పిల్లలు ఇతరులతో కలిసి పని చేయడానికి ఇష్ట పడతారు. పెద్దలతో కలిసి ఉండటానికి ఉత్సవాల్లో, పండుగల్లో అందరితో కలిసి ఉండాలని, పనులు చేయాలని కోరుకుంటారు. ఇలా పాల్గోనటం ద్వారా సామాజిక నైపుణ్యాలు అలవడుతాయి కావున గ్రూపు పని, మొత్తం తరగతి పని ద్వారా కృత్యాలు, ప్రాజెక్టులు చేయించాలి.

**పిల్లలు ప్రశంసను, ప్రోత్సాహాన్ని కోరుకుంటారు**

ప్రశంసలు, ప్రోత్సాహం వల్ల పిల్లలు బాగా ఉత్తేజితులై అభ్యసనంలో పాల్గోంటారు. నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. మంచి ప్రవర్తనను అలవర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. తమను గమనించాలని కోరుకుంటారు. ప్రాధమికంగా అభ్యసనం ప్రశంస, ప్రోత్సాహంతోనే జరుగుతుంది. దండన, భయం వల్ల నేర్చుకోలేరు. చదువునుండి, అలాంటి ప్రదేశం నుండి దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తారు.

**పిల్లలు దండనను విమర్శను, అవమాన పరచడాన్ని స్వీకరించడానికి ఇష్టపడరు.**

పిల్లలు దండన, అవమాన పరచడం, విమర్శ, భయపెట్టడం, తక్కువచేసి మాట్లాడటం, ఒక రకమైన సీరియస్ వాతావరణాన్ని ఇష్టపడరు. వీటికి దూరంగా ఉంటారు. అలాంటి వ్యక్తులనూ ఇష్టపడరు. ద్వేషిస్తారు.

## 3.8 స్నేహపూరిత వాతావరణం (Child Friendly Environment)

పిల్లలు ఆనందంగా, ఆహ్లాదకరంగా నేర్చుకోవాలి. భయం, ఒత్తిడిలేని స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నచోటనే పిల్లల్లో వికాసం బాగా జరుగుతుందని మనందరికి తెలిసిందే. పిల్లల అభిప్రాయాలకు, అభిరుచులకు తగిన స్థానం కల్పించినప్పుడు మాత్రమే వారు ఆహ్లాదంగా, ఆనందంగా ఉండగల్గుతారు. శిశుకేంద్రీకృత బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించి బోధనలో పిల్లలు చురుకుగా పాల్గొనేలా చేయాలి. ఇటువంటి వాతావరణం తరగతి గదిలో కల్పించినప్పుడు మాత్రమే అది స్నేహపూరిత వాతావరణం అని చెప్పవచ్చు.

**స్నేహపూరిత వాతావరణ లక్షణాలు:**

- భయం లేకుండా ఉపాధ్యాయుడు పిల్లలకు స్వేచ్ఛనిచ్చి, తెలియని అర్థంకాని విషయాలను జంకులేకుండా పిల్లలు అడిగే వాతావరణం కల్పించడం.
- పిల్లలందరూ పాల్గొనడం.
- స్థాయికి తగిన బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించబడడం.
- కృత్యాలు ఉత్సాహం, ప్రేరణ, ఆసక్తి కలిగించేవి ఉండాలి.
- ఉపాధ్యాయుడు మార్గదర్శిగా, సలహాదారుగా, సౌలభ్యకర్తగా, స్నేహితుడిలా వ్యవహరించడం.
- పరస్పరం, తోటి వారి ద్వారా నేర్చుకునే అవకాశం ఉండడం.
- అభిప్రాయాల్ని గౌరవించడం.

- ఒత్తిడి, దండనలేని భయరహిత వాతావరణం.
- అనుభవాలు, భావాలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఉండడం.
- అభినందన, ప్రోత్సాహం, ప్రేరణ, అవకాశం వంటి వాటికి ప్రాధాన్యత ఉండడం. మొదలగునవి.

దీనికి సంబంధించిన తరగతిగది ఉదాహరణ ఈ అధ్యాయంలోనే తెలుసుకుందాం.

## 3.9 అభ్యసనం అంటే? (What is Learning?)

చాలా మంది 'అభ్యసనం' అంటే పుస్తకంలోని సమాచారాన్ని ఉపన్యాసపద్ధతి ద్వారా పిల్లలకు అందించడం, ప్రశ్నల ద్వారా అందించిన సమాచారాన్ని రాబట్టడంగానే భావిస్తారు. దీనివల్ల చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు కేవలం చెప్పడం, విద్యార్థి విని అర్థంచేసుకొని గుర్తు పెట్టుకోవడం జరుగుతున్నది. వాస్తవంగా అభ్యసనమంటే సమాచారం అవగాహన చేసుకొని అనుభవం ద్వారా జ్ఞానంగా మార్చుకోవడం. అవసరమైనప్పుడు, సందర్భోచితంగా ఈ జ్ఞానాన్ని వినియోగించగలగాలి. ఈ మేరకు సరైన అభ్యసనా అనుభవాలు పొందకపోవడం వలన పిల్లలకు బట్టీ విధానం తప్ప మరో మార్గం లేని పరిస్థితి నెలకొన్నది.

ఆధునిక విద్యావేత్తలు పరిశోధనలు చేసి పిల్లలందరిలోనూ అభ్యసించే శక్తి ఉందని నిరూపించారు. దీని ప్రకారం పిల్లలు స్వంతంగా జ్ఞానాన్ని నిర్మించుకోగలరు. పిల్లలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచి వారి పూర్వజ్ఞానం, పూర్వానుభవాలతో జ్ఞానాన్ని నిర్మించుకోనేందుకు ఉపాధ్యాయులు సంధానకర్తలుగా సౌలభ్యకర్తలుగా (ఫెసిలిటేటర్) ఉండాలి.

సాంప్రదాయంగా భావిస్తున్నట్లు ఉపాధ్యాయులు జ్ఞానదాతలు కారు, పిల్లలు జ్ఞానగ్రహీతలు కారు. జ్ఞాన నిర్మాతలు. అంతేకాని ఉపాధ్యాయుని సూచన ప్రకారం నడుచుకొనే 'మరమనషులు' కారు.

పై అంశాలను పరిశీలిస్తే సమాచారాన్ని పూర్వానుభవాలతో సంధానం చేసుకొని సామర్థ్యాలకు పదును పెట్టుకొని సందర్భానుసారం వినియోగించే శక్తిని పెంపొందించుకోవడమే అభ్యసనం అని చెప్పవచ్చు.

## 3.10 అభ్యసన స్వభావం, పిల్లలు ఎలా నేర్చుకుంటారు?
## (Nature of learning - How children learn)

- పిల్లలు కేవలం వినడం లేక చదవడం ద్వారానే కాకుండా అనేక ఇతర పద్ధతుల ద్వారా కూడా నేర్చుకొంటారు. అనగా అనుభవాలు (Experience), పనులు, కృత్యాలు చేయడం ద్వారా (learning by doing) ప్రయోగాలు చేయడం (experimentation), చర్చలు (discussion), అడగడం/ ప్రశ్నించడం, ఆలోచించడం, ప్రతిస్పందించడం, ఆలోచించి స్వంతంగా రాయడం, (asking / questioning, listening,thinking, reflecting and expressing, one self) మొదలగు వాటి ద్వారా నేర్చుకొంటారు.
- ఉత్సాహంగా నేర్చుకోవడం అనేది పిల్లలందరికి స్వాభావికంగానే ఉంటుంది. అందరు పిల్లలు నేర్చుకోగలరు. నేర్చుకొనే స్వామర్థ్యం పిల్లలందరికీ ఉన్నది. నేర్చుకోవడం అనేది పాఠశాలలోనే గాకుండా బయట వాతావరణంలో కూడా జరుగుతుంది. అభ్యసనాన్ని మెరుగుపరచాలంటే తప్పనిసరిగా తరగతి గది అభ్యసనాన్ని బడి బయట కృత్యాలతో, అనుభవాలతో అనుసంధానం చేయాలి. చేయడం ద్వారా పరిశీలన ద్వారా, ఆలోచించడం ద్వారా బాగుగా నేర్చుకుంటారు.
- అర్థాన్ని గ్రహించడం, అవగాహన చేసుకోవడం, తార్కికంగా ఆలోచించడం, సమస్యల సాధన, అన్వేషించడం, కనుగొనడం, చర్చలు మొదలగు వాటి ద్వారా అభ్యసనం బాగా జరుగుతుంది.

- పిల్లలు మానసికంగా, శారీరకంగా, మేథోపరంగా సంసిద్ధులు కాకముందే బడికి పంపితే అభ్యసనం జరుగదు. ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలు పాఠాలను బట్టీ పట్టి అప్ప చెబుతారే, కాని ఆ సమాచారాన్ని అవగాహన చేసుకోరు, నిత్య జీవితానికి అన్వయించుకోలేరు. బళ్లో కూడా నేర్పే అంశం పట్ల పిల్లలకు ప్రాథమిక అవగాహన లేదా తగిన సామర్థ్యాలు లేకున్నా కూడా పిల్లలకు నేర్చుకొనే విషయం పట్ల అయిష్టత ఏర్పడుతుంది. ఆ సబ్జెక్టును కష్టమైనదిగా భావిస్తారు. కాబట్టి తప్పనిసరిగా మేథోపరంగా సంసిద్ధులను చేయడం మన బాధ్యత.
- అభ్యసనం బాగా జరగాలంటే తగిన ప్రశ్నల ద్వారా పిల్లలను ఆలోచింప చేయాలి. కృత్యాలు, సమస్యలు, ప్రాజెక్టులు ఇచ్చి దానిపై పిల్లలను మాట్లాడించాలి. చేసింది, నేర్చుకొన్నది రిపోర్టుల రూపంలో రాయమనాలి. తరగతి గదిలో ప్రదర్శించి చర్చకు పెట్టమనాలి. ఇలా చేస్తే పిల్లలు సంతోషంగా, బాగుగా నేర్చుకొంటారు. ఇటువంటి పనులలో వైవిధ్యం, సవాలు (challenge) ఉంటుంది. విసుగుదల ఉండదు. పనులు చేయడం ద్వారా నేర్చుకుంటున్నారు. కావున ఏకాగ్రత ఉంటుంది. పిల్లలు ఇష్టంగా చేయడం వల్ల వాటిలో, ఉత్సాహంగా పాల్గొంటారు. నేర్చుకోవడం సులభంగా తెలియకుండానే జరుగుతుంది. పనుల్లో నిమగ్నం అవుతారు కాబట్టి అల్లరి చేయడం మొదలగు క్రమశిక్షణా సమస్యలు ఉత్పన్నం కావు.
- అభ్యసనం అనేది పరిసరాలలో పిల్లలు పరస్పర ప్రతిస్పందనాల ద్వారా, పరిశీలనల ద్వారా, సమాజంలోని వివిధ వ్యక్తులతో జరిపే పరస్పర చర్చల ద్వారా జరుగుతుంది.
- పిల్లలు తమకున్న పూర్వ జ్ఞానం ద్వారా కొత్త జ్ఞానం పొందడానికి ప్రయత్నిస్తారు. జ్ఞాన నిర్మాణం అనేది పిల్లలు సొంతంగా పరిసరాలలో, వ్యక్తులలో పరస్పర చర్చ, ప్రతిస్పందనల (interactive) ద్వారా జరుగుతుంది. పిల్లలందరికీ పూర్వ జ్ఞానం వేరు వేరుగా ఉంటుంది. కాబట్టి కొత్త అంశాల పట్ల అంశాలకు అవగాహన చేసుకోవడం కూడా వేరుగా ఉంటుంది. కాబట్టి పిల్లలు తమ అభ్యసనంలో ఒకే రీతిలో ఉండరు. పిల్లల జ్ఞాన నిర్మాణానికి, తగిన అనుభవాలు, కృత్యాలు, చర్చల ద్వారా ఆలోచింపజేయడం అనేవి చేయాలి.
- నేర్చుకోవడానికి ముఖ్యమైనది తరగతి గది వాతావరణం, అనగా భయరహిత వాతావరణం. పిల్లలకు భద్రత, ప్రేమ ఆప్యాయత చూపించడం, ఉపాధ్యాయుడు పిల్లలతో కలిసిపోయి వారు నేర్చుకునేటట్లు చేయడం, వ్యక్తిగతంగా చెప్పడం, తెలియని విషయాలు అడగమని పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. తరగతి గది పరిశుభ్రంగా ఉండాలి. నల్లబల్ల, చార్టులు ఉపయోగించి బోధించాలి. పాఠానికి సంబంధించి వివిధ భావనల అవగాహనకు, కొన్ని ప్రశ్నలు నల్లబల్ల పై రాసి, ఆ ప్రశ్నలపై చర్చింపజేయాలి. చర్చ జరిపిన అంశాలతో పోల్చుకోవాలి. పిల్లలను పాఠం చదివించి, చర్చలు చేయించాలి. ముఖ్యమైన వాటిని నల్ల బల్లపై రాయాలి. దీనివల్ల పిల్లలు ఆ ప్రశ్నల గురించి ఆలోచిస్తారు. తామే జవాబులు సొంతంగా చెబుతారు. ఇతరులు చెప్పిన దాన్ని వింటారు. ఇలా తరగతి గదిలో నేర్చుకోవడం జరుగుతుంది. దీన్నే (interactive learning) చర్చలు, ప్రతిస్పందనల ద్వారా నేర్చుకోవడం అంటారు. ఒక మంచి సామాజిక వాతావరణం తరగతి గదిలో ఏర్పడుతుంది. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఇలాంటి విధానాల ద్వారా లభిస్తుంది. అందరు పిల్లలు చురుకుగా ఉంటారు. చర్చల్లో పాల్గొంటారు. ఇలాగే కృత్యాలు, ప్రయోగాలు, పరిశీలనలు కూడా చేయించడం ద్వారా అభ్యసనాన్ని ఉత్సాహభరితం చేసి పిల్లలందరూ నిమగ్నం అయ్యేటట్లు చెయ్యొచ్చు.
- ఐతే నేర్చుకొనేటప్పుడు తప్పులు జరగడం చోటుచేసుకుంటుంది. పిల్లల తప్పులను ఎత్తి చూపడం, నిందించడం, ఇతరులతో పోల్చడం కించపరచడం వంటివి చేయకూడదు. పిల్లలు చేసిన వాటిలో ఏమేం చేశారో గుర్తించాలి.

అభినందించాలి. వారు చేసిన తప్పులను పిల్లలే సరిదిద్దుకునేలా తరగతిలో చర్చ నిర్వహించాలి. సరైనది ఏదో ఉపాధ్యాయుడు వివరించి, పిల్లల్ని తాము రాసిన వాటిని సరిపోల్చుకోమని అనాలి. (competition) దీని వల్ల పిల్లలు నేర్చుకొనే ప్రక్రియలో తమకోసం పాల్గొంటారు. అదే పనిగా తప్పులు వెదికి 'X' లు పెట్టి ఎత్తిచూపినంత మాత్రాన, ఆ తప్పు ఎందుకు జరిగిందో గుర్తించలేడు. తప్పులు పోతాయన్న భయంతో/ న్యూనతా భావంతో మాట్లాడటానికి, తెలియజేయడానికి, ప్రదర్శించడానికి ముందుకు రారు. దీనివల్ల అభ్యసనం కుంటుపడుతుంది. జరగదు.

**భాగస్వామ్య అభ్యసనం (Collaborative learning)**

'నేర్చుకోవడం' అనేది ఒక సామాజిక ప్రక్రియ, ఇతరులతో మాట్లాడుతూ , ఇతరులు మాట్లాడేది వింటున్నప్పుడు, చర్చల్లో పాల్గొంటున్నప్పుడు, తోటి వారితో కలిసి పనిచేయడం ద్వారా అప్రయత్నంగానే అనేక విషయాలను గ్రహిస్తుంటారు. ఇది సందర్భోచితంగా కూడా ఉంటుంది. ఐతే సాధారణంగా పెద్దలకు గానీ, తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులు తాము చెప్పడం వల్లే అన్ని విషయాలను పిల్లలు నేర్చుకుంటున్నారని భావిస్తుంటారు. కొన్ని పిల్లలకు మనం ఏమి విషయాలు చెప్పాలి? కేవలం ఇవి మాత్రమే పిల్లలకు తెలుసా? మిగతావి పిల్లలకు ఎలా తెలుసు? అని ఆలోచిస్తే పిల్లలు నేర్చుకొనే విధానం బోధపడుతుంది. పిల్లలు తమ తోటి వారితో కల్సి ఆడడం, పాడడం, ముచ్చటించడం, చర్చించడం, వాదించడం, కల్సి పనిచేయడంవంటివి కార్యకలాపాల ద్వారా ఎక్కువగా నేర్చుకొంటారు. విషయాలు తమ తోటి వారితో చర్చించడం వల్ల వారి జ్ఞానం విస్తృతమైతుంది. ఇలా ఇతరులతో కలిసి నేర్చుకొనే పద్ధతిని జట్టు పనుల ద్వారా కల్పించవచ్చు. ఇది భాగస్వామ్య అభ్యసనానికి తోడ్పడుతుంది. దీనినే పాల్గొనడం ద్వారా నేర్చుకోడం అనవచ్చు.

**పిల్లలు ఎలా నేర్చుకొంటారు?**

ఆలోచన అభ్యసనానికి మూలం. మానసిక శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పరిశోధనల ప్రకారం పిల్లలలో నేర్చుకోగలిగిన శక్తి అంతర్గతంగా ఉంటుంది. ఇది పుట్టుకతోనే సంక్రమిస్తుంది. పిల్లలు సాధారణంగా పరిసరాల ద్వారా వస్తువులతో పరస్పర ప్రతిచర్యలు జరిపి సమవయస్కులు, పెద్దల సహకారంతో నేర్చుకొంటారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు కల్పించిన సందర్భోచితమైన అర్థవంతమైన కృత్యాలలో పాల్గొని పూర్వజ్ఞానం ఆధారంగా నూతన జ్ఞానాన్ని నిర్మించుకుంటాడు. అయితే పిల్లలు నేర్చుకోవడంలో ముఖ్యపాత్రను పోషించే ప్రక్రియలను తెలుసుకొందాం. అవి:

- ఆలోచించడం
- పరిశీలించడం
- ప్రశ్నించడం
- భాగస్వాములు కావడం
- పరస్పర ప్రతిచర్య జరపడం
- నిరంతర అన్వేషణ
- కనుగొనడం
- చర్చించడం
- పరస్పరం భావాలను పంచుకోవడం
- భౌతిక, మేధోపరమైన కృత్యాలలో పాల్గొనడం
- సందర్శించడం

అయితే పిల్లలకు అభ్యసనానుభవాలను కల్పించేటప్పుడు మనం ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొంటున్నామా? అభ్యసనంలో ఈ ప్రక్రియలు చోటుచేసుకోకపోతే నేర్చుకున్నది తాత్కాలికమా? శాశ్వతమా? సంపూర్ణమా? అసంపూర్ణమా? అలోచించండి!

## 3.11 పిల్లలు నేర్చుకోవడంలో ఎందుకు వెనుకబడుతున్నారు?
## (Why children fail in learning)

గత దశాబ్ధకాలం నుండి గుణాత్మక విద్యా కార్యాక్రమాలు ఉద్యమస్థాయిలో నిర్వహించబడుతున్నప్పటికీ పిల్లలు అభ్యసనలో వెనుకబడి ఉన్నట్లు గమనించడం జరిగింది. ACER 2000 ప్రకారం 8వతరగతి విద్యార్థుల్లో 20.62% మంది పేరాగ్రాఫ్/ కథను చదవలేకపోతున్నారు.

పిల్లల అభ్యసనకు అనేక ఆటంకాలు నిరూత్సాహపరుస్తున్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

- ప్రస్తుత సిలబస్‌లో ఉన్న పాఠాలు నేర్చుకోవాలంటే పిల్లలకు కనీస భాషాసామర్థ్యాలు అనగా చదవడం, సొంతంగా తమ భావాలను రాయడం, చదివిన దానిని అర్థంచేసుకొని సొంత మాటల్లో రాయడం, గణితంలో కనీసం చతుర్విధ ప్రక్రియలు అనగా కూడిక, తీసివేత, గుణకారం, సంఖ్యాజ్ఞానం మొదలగునవి రావాలి. ఇవి రాకపోతే పిల్లలు చదవడానికి ప్రయత్నించరు. వారు సొంతంగా చదివి అర్థం చేసుకుంటే, చదువులో అసలు వెనుకబడరు.
- సరైన అభ్యసన కృత్యాలు కల్పించకపోవడం.
- పిల్లలు స్వేచ్ఛగా ఆలోచించి, పాల్గొని వ్యక్తీకరించే అవకాశం ఇవ్వకపోవడం.
- గైడ్లు, నోట్స్ ఉపయోగించడంవల్ల, పిల్లలు ఆలోచించి స్వయంగా, స్వంతంగా తమ భావాలను వ్యక్తపరచడం జరగడంలేదు. ఆ సంస్కృతిని మనం పెంపొందించడంలేదు.
- భావనలు పూర్తిగా అవగాహన కాకముందే పాఠాన్ని ముగించడం. మరోపాఠం చెప్పడం.

  ఉదా. తీసివేత భావన అవగాహన కాకుండానే గుణకారం చేయించడం, తరువాత భాగాహారం చేయించడం ఫలితంగా పిల్లలు పై తరగతులకు వెళ్ళినా ఇంకా తీసివేతల్లోనే ఉండడం.
- భాషాకాఠిన్యత, సూచనలు పదజాలంపై అవగాహన కల్పించకపోవడం.
- పిల్లల ఆసక్తి, అభిరుచులు, వైఖరులను పరిగణనలోకి తీసుకోకపోవడం.
- పిల్లల్ని నిరుత్సాహపరచడం, వివక్ష చూపడం, పిల్లలు నేర్చుకోలేక ముందుకు పోకపోవడం, నిరుత్సాహం, భయం కలగడం.
- మూస విధానాల్లో బోధించడం, పిల్లలు తమదైన శైలిలో నేర్చుకొనే అవకాశం ఇవ్వకపోవడం.
- పిల్లల్లో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి, తగిన పనుల ద్వారా వారిని చదువులో నిమగ్నం చేయకపోవడం.

**సమాచారం ఎప్పుడు జ్ఞానంగా మారుతుంది?**

పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల్లో ఉన్న సమాచారాన్నంతా యాంత్రిక, బట్టీ విధానాల్లో పిల్లల మెదళ్ళలో కుక్కేస్తున్నారని:. దీనివల్లనే పిల్లల్లో వివేచన, విశ్లేషణ, సర్దుబాటు, సమస్యా పరిష్కార శక్తి లోపిస్తున్నాయని చాలా మంది విమర్శిస్తున్నారు.

అభ్యసనం అంటే సమాచారం పొందడం కాదు. సాధారణంగా సమాచారం అనేది చిన్న చిన్న భాగాలుగా, అసమగ్రంగా ఉంటుంది. సమాచారం మార్పులు, చేర్పులకు లోబడి ఉంటుంది. అభ్యసన కోణంలో పరిశీలించినపుడు సమాచారం ఒక ముడిసరుకు.

కరికులంలో భావనలకు సంబంధించిన సమాచారం సాధారణంగా పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, చిత్రాలు, ఛార్టులు, వార్తా పత్రికలు, మ్యాగజైన్లు, దృశ్యశ్రవణ రూపాలలో ఉంటుంది.

అయితే కరికులంలో నిర్ధారించిన భావనలకు సంబంధించిన సమాచారాన్ని తరగతి గదిలో అర్థవంతమైన, ఉపయోగకరమైన బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా, అనుభవాల ద్వారా (experimental) జ్ఞానంగా నిర్మించబడాలి. పిల్లల పూర్వ అనుభవాలు, కృత్యాలలో నిమగ్నంకావడం వల్ల పిల్లలు ఆలోచించి, పరిశీలించి, పరిశోధించి, నిర్ధారణకు రావడం ద్వారా సమాచారం జ్ఞానంగా మారుతుంది. ఈ జ్ఞానం ద్వారా నైపుణ్యాలను పెంచగలగినప్పుడు అది సామర్థ్యంగా మారుతుంది. ఈ విధంగా పిల్లలు సామర్థ్యం పొందినపుడు భావనలను శాశ్వతత్వం చేకూరుతుంది. ప్రతి భావనపై పిల్లలను ఆలోచింపచేయాలి. దానికి సంబంధించి వారి పూర్వజ్ఞానం, వ్యక్తపరచేటట్లు చేయాలి. చర్చలలో పాల్గొనేటట్లు చేయాలి. బోధనాభ్యసన యాంత్రికంగా కాకుండా క్రియాశీలంగా జరిగేట్లు చేయాలి.

## 3.12 అభ్యసన స్వభావం నియమాలు (Nature and principles)

- అభ్యసనం అనేది వ్యక్తిగతంగా కంటే ఇతరుల ద్వారా, సమాజం ద్వారా జరుగుతుంది.
- జ్ఞానేంద్రియాల ద్వారా నేర్చుకున్నది బౌద్ధిక, అభ్యసనానికి తోడ్పడుతుంది. బాల్యదశలో పిల్లలు చూడడం ద్వారా, చేయడం ద్వారా బాగా ఎక్కువగా నేర్చుకుంటారు.
- అనుభూతులు, ప్రేరణ ద్వారా పిల్లలు ప్రభావవంతంగా వేగంగా నేర్చుకుంటారు.
- ఆసక్తి మరియు ఆహ్లాదం అనేవి ప్రాథమిక దశలో విద్యార్థి ఎంత బాగా పాఠశాలలో నేర్చుకుంటున్నాడు అనేది నిర్ణయిస్తాయి.
- ప్రేరణ, ఆసక్తి, నేర్చుకోవడంలో నిమగ్నం కావడం, తమ సంతోషం అనేవి అభ్యసనానికి ఉపకరించే ముఖ్యమైన అంశాలు.
- భాష మరియు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ప్రాథమికంగా నేర్చుకోవడానికి ఉపకరిస్తాయి. కావున ప్రాథమిక స్థాయిలో భాష మరియు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలి.
- ఉపాధ్యాయులు పిల్లలకు సహాయంచేసి మంచిగా, త్రికరణ శుద్ధిగా, ఇష్టంగా ప్రయత్నిస్తే క్లిష్టమైన భావనలు కూడా పిల్లలకు అవగాహన చేయించవచ్చు.
- అనుభవ పూర్వకమైన కృత్యాలు, అనుభవాల ద్వారా నేర్చుకోవడం (Learning by doing) అనుభవాలు పంచుకోవడం సామూహిక అభ్యసనం collaborative learning మొదలగునవి ప్రభావవంతమైన అభ్యసనానికి తోడ్పడతాయి.
- తరగతి గదిలో పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి పరస్పర చర్చల ద్వారా, కృత్యాల ద్వారా, జ్ఞాన నిర్మాణానికి కృషి చేయాలి. పిల్లలను భావనలపై ఆలోచింపచేయాలి. వారి సొంత భావాలకు అనుభవాలు పంచుకోవడానికి, వ్యక్తీకరించడానికి అవకాశమివ్వాలి. ఈ రకంగా పిల్లలలో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.
- అభ్యసనంలో సమస్యాసాధనకు పెద్దపీట వెయ్యాలి. సమస్యలు తెలుసుకొని వాటిపై సమాచార సేకరణ పరిశోధన, చర్చలద్వారా సమస్యలకు తగు పరిష్కారాలు ఇవ్వాలి.
- సమస్యల పరిష్కారానికి, యత్న, దోష పద్ధతి మంచిది. పిల్లలు సమస్యలు సాధించేటప్పుడు ఇచ్చిన అంశాలపై భావ వ్యక్తీకరణ చేసేటప్పుడు తప్పులు చేయడం సహజం. తప్పులు చేస్తూనే నేర్చుకుంటారు. కావున తప్పులపైననే మనం దృష్టి పెట్టకుండా పిల్లల ప్రయత్నాలు, అభిరుచి, ఆసక్తి గమనించి ప్రోత్సహించాలి. తప్పుల నుంచే పిల్లలు నేర్చుకుంటారు.

- చురుకుగా ఉండి నేర్చుకోవడం (Active Learning) ప్రాథమకి దశలో అతి ముఖ్యమైనది. చర్చలు, కృత్యాలు, శిక్షలు, భయంతో కూడుకున్న పాఠశాల మరియు తరగతి గదులు, పిల్లల మానసిక మరియు శారీరక ఎదుగుదలను ఆటంకపరుస్తాయి మరియు ఇవి నేర్చుకోవడాన్ని నిరోధిస్తాయి.
- పిల్లలు నేర్చుకునేటప్పుడు పెద్దలు గమనించి తగు విధంగా సహాయ సహకారాలందిస్తే పిల్లలు బాగా నేర్చుకుంటారు. ఆత్మస్థైర్యంతో ముందుకు పోతారు.
- అన్వేషణ పద్ధతి (exploration learning) చేయడం ద్వారా నేర్చుకోవడం (learnign by doing) ప్రాక్టికల్స్ చేసి కనుక్కోవడం (Discovery) సమస్యా పరిష్కారం పద్ధతి (problem solve), ఆటలు, సబ్జెక్టుపరమైన ఆటలు, అనుభవపూర్వక అభ్యసనం చురుకైన అభ్యసంన, నేర్చుకునే ప్రక్రియలో పిల్లలు అందరు పాల్గొనడం, ప్రక్రియ నైపుణ్యాల ద్వారా నేర్చుకోవడం, అనేవి, ప్రాథమిక విద్య దశలో ముఖ్యమైన పద్ధతులు. ఇవి ఏమేరకు మనం తరగతి గదుల్లో ఉపయోగిస్తున్నాం అనేది ప్రతి ఉపాధ్యాయుడు ఆలోచించాల్సిన విషయం.
- పిల్లలు స్వతహాగా ఉత్సాహంగా, ఆసక్తిగా ఉంటారు. (Curosity) దీనిని మనం ప్రోత్సహించాలి. అవకాశం ఇవ్వాలి. ఇదే మానవ చరిత్రను తిరగ రాస్తుంది. నేర్చుకోవడంపట్ల ఉత్సుకత పిల్లలలో నశించిననాడు మనం దేశ నిర్మాణం చెయ్యలేం. పరిశీలనలు, ప్రాజెక్టుపనులు, క్షేత్రపరిశీలనలలో పిల్లలు చురుకుగా పాల్గొని బాగుగా నేర్చుకుంటారు. జ్ఞాననిర్మాణానికి దోహదపడతాయి.
- పిల్లల ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం పెంచి పోషించాలి. తక్కువ చేసి మాట్లాడకూడదు, బాగుగా చదువుతున్నావని మంచి సమర్థన, ప్రోత్సాహం, మంచి పనులను మంచి ప్రయత్నాలను అభినందించడం అనేవి పిల్లలు మానసిక మరియు మేధోపరమైన ఎదుగుదలకు తోడ్పడతాయి.
- తొందరపెడితే, భయపెడితే లేక వత్తిడికి గురిచేస్తే, ఇతరులతో పోల్చితే అభ్యసనం జరగదు. తగు సమయం, ప్రోత్సాహకర మరియు వత్తిడిలేని భయరహిత వాతావరణంలో పిల్లలు నేర్చుకుంటారో మరయు అన్ని రంగాలలో ఎదుగుతారు.
- భాష, గణితంతోపాటు ఆటలు, పాటలు, కథలు, పరిశీలనలు, బొమ్మలు వేయడం, మొదలగువాటి ద్వారా ప్రాథమిక విద్యను సుసంపన్నం చెయ్యాలి. వాటి ద్వారా పిల్లలకు బడి మరియు చదువుపట్ల ఆసక్తి మరియు నేర్చుకోవడంలో ఆనందం పొందుతారు. ఆసక్తి, అనురక్తి, సంతోషం అనేవి పిల్లల ప్రాథమిక విద్యకు మూలస్తంభాలు.

**అభ్యసనం ఎలా జరగాలి?**

నేర్చుకోవడమనేది వినడం, చదవడం, రాయడం ద్వారా కాకుండా ఈ క్రింది విధాలుగా ఉంటుంది.

- కృత్యాల ద్వారా
- అన్వేషణలు
- కనుగొనడం
- సమస్యా పరిష్కారం
- సంభాషణలు
- చర్చలు

- మైండ్ మ్యాపింగ్
- సామాజిక అభ్యసనం
- పూర్తి తరగతిగది
- గ్రూపు కృత్యాలు
- అనుభవాల ద్వారా అభ్యసనం జరగాలి

## 3.13 కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం యొక్క అమలు - బాధ్యతలు (Learning through Activities, Explorations and Discovery - Implementation and Responsibilities)

ఉచిత నిర్బంధ విద్యకు బాలలహక్కు-2009 చట్టంలో అభ్యసనం అనేది కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా జరగాలని విస్పష్టంగా పేర్కొంది. దీనిని అమలు చేయాల్సింది క్షేత్రస్థాయిలో తరగతిగదిలో బోధనాభ్యసన ప్రక్రియలు చేపట్టే ఉపాధ్యాయులు. కొన్ని దశాబ్దాలుగా కృత్యాధార బోధన విధానాల గురించి పలు కార్యక్రమాలలో పలు వేదికలపై చర్చించుకోవడం జరిగింది. పాఠ్యపుస్తకాలు కూడా కృత్యాధార పద్ధతి ఆధారంగా రూపొందించడం జరిగింది.

1. తరగతి స్థాయిలో కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం జరిగేలా చూస్తే పూర్తి బాధ్యత ఉపాధ్యాయులదే. దీనికి ఉపాధ్యాయుడు ఆలోచించి ముందే చర్చకు సంబంధించి ప్రశ్నలు, కృత్యాలు మొదలగునవి సిద్ధం చేసుకొని తరగతి గదిలోకి రావాలి. అంటే ఉపాధ్యాయుని తయారీ, చదవడం, నోట్స్ రాసుకోవటం అనేవి అత్యంత ముఖ్యమైనవి. అన్వేషణ, కనుగొనడం, కృత్యాలకు తగిన ఉదాహరణలు లేక పనులు ఇచ్చి అవి చేయడం ద్వారా కొత్త విషయాలను నేర్చుకునేటట్లు ఉపాధ్యాయుడు చేయాలి. కొత్త కృత్యాలు, అన్వేషణలు, ప్రాజెక్టులు ఉపాధ్యాయులు తమ టీచింగ్ నోట్స్‌లో రాయాలి.
2. తరగతి గది బోధన ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునిది.
3. జరిగిన అభ్యసనాన్ని, ప్రగతిని నివేదికల రూపంలో ఎస్.ఎం.సి. సమావేశాలలో, మండలస్థాయిలో జరిగే సమీక్షా సమావేశాలల్లో సమర్పించి చర్చించే బాధ్యతను ప్రధానోపాధ్యాయులు స్వీకరించాలి.
4. పాఠశాలలను సందర్శించే మానిటరింగ్ అధికారులు, విషయనిపుణులు తరగతి గది బోధనను పరిశీలించి కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా అభ్యసనం ఆశించిన విధంగా జరుగుతుందో లేదో గమనించాలి. తగిన మార్గదర్శనం చేయాలి.
5. విద్యాశాఖ DIET, CTE, ఎస్.సి.ఇ.ఆర్.టి. క్షేత్రస్థాయిలో బోధించే ఉపాధ్యాయులకు కృత్యాలు, కనుగొనడం, అన్వేషణల ద్వారా సమర్థవంతమైన అభ్యసనం ఏ విధంగా జరుగుతుందో తెలిపే / అవగాహన ఏర్పరిచే విధంగా చక్కటి మెటీరియల్స్ రూపొందించి శిక్షణను నిర్వహించాలి. శిక్షణానంతరం అనుసరణీయ కార్యక్రమం చేపట్టాలి. పాఠశాలల్లో బోధన అభ్యసన ప్రక్రియలను పరిశీలించాలి. శిక్షణకంటే ఎక్కువగా ఉపాధ్యాయుడు స్వయం ప్రేరేతుడై ఉపక్రమించాలి.

## 3.14 అమలుకు సూచికలు (Indicators of Implemntation)

- ఉపాధ్యాయుని ప్రణాళిక, Teaching Notes లో పిల్లలను చర్చింపచేసే ప్రశ్నలు, కృత్యాలు కలిపించాలి.
- పిల్లలు అడ్డు/నిలువు వరుసల్లో సిర్థంగా కూర్చొనకుండా వలయాకారం, అర్థ వృత్తాకారం, గ్రూపుల్లో తరచుగా మారుతూ ఉండాలి.
- పిల్లలు కేవలం ఉపాధ్యాయుడు చెప్పేది వినడం కాకుండా – ప్రశ్నించడం, చెప్పడం, తోటివారితో చర్చించడం, గ్రూపుల్లో పనిచేయడం, నివేదించడం వంటివి చేయాలి.
- బోధన ఉపన్యాసన పద్ధతి, నేర్చుకోవడం, వినడం ద్వారా కాకుండా చర్చలు, ప్రశ్నించడం, కృత్యాలు చేయడం, ప్రాజెక్టు మొదలగువాటి ద్వారా జరగాలి.
- నిఘంటువులు, అట్లాసులు, లాగరిథమ్స్, గ్రాఫ్‌లు, మ్యాప్‌లు, పట్టికలు, పటాలు వంటి వనరులను పిల్లలు స్వయంగా వినియోగిస్తూ నేర్చుకోవాలి.
- ఉపాధ్యాయుని వద్ద బోధనా సామగ్రి, పిల్లలందరి వద్ద అభ్యసన సామగ్రి ఉండాలి.
- ఉపాధ్యాయుని సంసిద్ధత – పాఠ్య ప్రణాళికలో కృత్యాలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, క్రీడలు వంటి కృత్యాలను స్పష్టంగా పేర్కొనాలి. సామగ్రిని సేకరించాలి.
- పిల్లలు బొమ్మలను, సామగ్రిని పరిశీలిస్తూ, గణిత క్రీడలు, భాషాక్రీడల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రయోగాలు చేస్తూ అభ్యసన కృత్యాలలో నిమగ్నం కావాలి.
- మూల్యాంకనం నిరంతరంగా సమగ్రంగా నిర్వహిస్తూ ఉండడం, ఆ ప్రగతిని నమోదు కల్పించాలి.
- ప్రారంభ పరీక్ష, Formative, Summative Assessment లలో పిల్లల స్థాయిలో ప్రగతి కనిపించడం.

## 3.15 ముగింపు (Conclusion)

ఈ అధ్యాయంలో మనం విద్యాహక్కు చట్టంలో పొందుపర్చిన విధంగా అభ్యసనం ఏ విధంగా ఉండాలో తెలుసుకున్నాం. అలాగే పిల్లలు నేర్చుకునే విధానాలు, ఆహ్లాదకర, స్నేహపూరిత, శిశుకేంద్రీకృత వాతావరణం ఎలా కల్పించవచ్చో తెలుసుకున్నాం. ఈ అంశాలలో పేర్కొన్న విధంగా తరగతి గదులు రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. నేర్చుకోవడం అంటే కేవలం పాఠ్యపుస్తకంలోని సమాచారాన్ని విన్పించి ఏవో కొన్ని ప్రశ్నలు అడిగి, ప్రశ్నలకు జవాబులు గైడులు, స్టడీ మెటీరియల్ చూసి రాయమని, ఈ విధంగా పిల్లలు ఆశించిన విధంగా స్పందించారని తద్వారా బాగా నేర్చుకున్నారని భావించకూడదు. పిల్లలు అన్వేషణల ద్వారా, పరిశోధనల ద్వారా కృత్యాధార పద్ధతిలో తమంతట తామే కనుగొనడానికి అనువుగా ఉండే బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించినప్పుడు, పిల్లలు వాటిలో చురుకుగా పాల్గొని అభ్యసానుభవాల్ని పొందినప్పుడు మాత్రమే నేర్చుకోవడం జరుగుతుందని భావించాలి. ఈ దిశలో ఉపాధ్యాయులు సృజనాత్మక, ఉత్తేజపూరిత, స్నేహపూర్వక, సమ్మిళిత వాతావరణం కలిగి ఉండేలా తరగతి గదుల ప్రక్రియలను నిర్మించుకోవాలి.

## 4. భయరహిత వాతావరణం - భయం, ఆందోళన, దండన వంటి వాటి నుండి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించుటకు తోడ్పడాలి

**(Fear Free Learning Environment - Making children free from fear trauma and anxiety and helping the child to express views freely )**


4.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
(Basic Questions - Think and Reflect)

4.2 నేపథ్యం (Context)

4.3 భయంలేని వాతావరణం – ప్రస్తుత పరిస్థితి
(Fear Free Environment Existing Situtaion)

4.4 పిల్లలు శారీరక, మానసిక దండనలకు, లైంగిక వేధింపులకు వివక్షతకు ఎందుకు గురౌతున్నారు?
(Why children subjected to physical, mental, sexual abuses and discrimination)

4.5 RTE - 2009 – భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ గురించి ప్రస్తావించిన సెక్షన్లు, వివరాలు
(RTE - 2009 Related sections for Fear free Environment and Freedom)

4.6 దండనలు – రకాలు (Types of punishments / abuses)

4.7 పిల్లలు అసహనానికి ఎందుకు గురౌతారు?
(Why children feel tired and bored in schools)

4.8 పిల్లలను దండించడంపై నమ్మకాలు, అపోహలు (Myths & Beliefs on punishment to children)

4.9 పిల్లల స్వభావం (Nature of the Child)

4.10 పిల్లలను ఎందుకు దండిస్తారు? కారణాలు – విశ్లేషణ – ఎంత వరకు సమర్థనీయం
(Why children are Punished - Reasons - Analysis)

4.11 దండన ఫలితాలు (Impact of Punishments)

4.12 బాలల హక్కులు – ఉపాధ్యాయుల స్పందన, హక్కుల ఆధారిత బోధన
(Child Rights - teachers Sensitivity and Rights Oriented Pedagogy )

4.13 భయరహిత వాతావరణం – వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలు
(Fear Free Environment - Implementation)

4.14 పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం వీటి ప్రాముఖ్యం
(Promoting self confidence and Self esteem in children. Its Importance)

4.15 భయరహిత, దండనలేని వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలు – బాధ్యతలు
(Fear Free and Punishment free environment and Freedom - Implementation - Responsibilities)

4.16 భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలుకు సూచికలు
(Fear Free Environment, Freedom of expression - Indicators of Implementation)

4.17 ముగింపు (Conclusion)

## మన పిల్లల్ని చంపకండి

పౌరసమాజంలో శారీరక శిక్షలకు తావులేదు. భారతదేశం ప్రజాస్వామిక దేశం మాత్రమేగాదు. గురువును మంచి మిత్రుడుగా భావించే 'సమున్నత గురుశిష్య పరంపర' గొప్ప వారసత్వంగా గల దేశం కూడా. శిష్యుల అభ్యున్నతే ధ్యేయంగా సర్వం త్యజించిన గురువుల గాథలెన్నో మనకున్నాయి. రెండు దశాబ్దాలకు పూర్వం కూడా కౌమరదశలోని విద్యార్థుల్ని సంపూర్ణ మానవులుగా మలిచేందుకు మన పాఠశాలలెంతో పరిశ్రమించేవి. ఇప్పుడు కొంతమంది మన టీచర్లకు వృత్తిపట్ల నిబద్ధతా, నైపుణ్యాలూ లేవు. ఇలాంటివారు తరగతి గదుల్లో హేతుబద్ధంగా, సహనశీలంగా వుంటారని ఎలా భావించగలం?

పిల్లలపట్ల మన హింసాత్మక ధోరణి ఎంతటి దుష్పరిణామాలకు దారితీస్తుందో గత సంవత్సరపు అమెరికా అధ్యయనం వెల్లడిస్తోంది. "నానాటికి యువతరంలో పెరుగుతున్న సమాజ వ్యతిరేక ధోరణికి పాఠశాలల్లో శిక్షలు ఒక కారణం. అరాచకత్వాన్ని అడ్డుకునేందుకు మనం వేసే శారీరక శిక్షలు వ్యతిరేక ఫలితాన్ని ఇస్తున్నాయి. పరిస్థితులు మరింత విషమించడమే మనకు మిగులుతుంది" అని ఈ అధ్యయనంలో తేలింది.

ప్రేమించే టీచర్‌ను, శాంతంగా ఉండి కలిసిమెలిసి ఉండి, ప్రోత్సహించే టీచర్‌నే పిల్లలు బాగుగా అభిమానిస్తారు, ఇష్టపడతారు. అటువంటి ఉపాధ్యాయుల ద్వారా వచ్చే ఏ రకమైన ప్రోత్సాహమైన, సూచనలైనా పిల్లలు స్వీకరిస్తారు, ఆచరిస్తారు.

**– ది హిందు – పత్రిక సంపాదకీయం**

**(సౌజన్యం – చదువు)**

రవీంద్రనాథ్ ఠాగూరు తన పాఠశాల విద్య ప్రారంభంపై ఈ రకంగా అన్నాడు. 'అయిదేళ్లప్పుడు నన్ను బలవంతంగా పాఠశాలకు పంపించినపుడు నా మొత్తం హృదయం ఆ నిర్జీవమందిరం మీద ఎదురుతిరిగింది. అక్కడెటువంటి రంగుల జాడలేదు. జీవితరమ్యలీల లేదు. ఆ పాఠాలకి తమ చుట్టూ పొంగిపొర్లుతున్న జీవితంతో ఏమీ సంబంధం లేదు. ఆ పాఠాలకి తమ చుట్టూ పొంగిపొర్లుతున్న జీవితంతో ఏమీ సంబంధం లేదు. నేనే స్వర్గంలో మేల్కొన్నానో, ఏ ప్రకృతి ఒడిలో, ఏ పరమ సౌందర్యంలో కళ్లు తెరిచానో, ఆ స్వర్గం నుంచి నేనొక ప్రవాసినయిపోయాను.

మన విద్యా వ్యవస్థ పిల్లల్ని పిల్లలుగా అంగీకరించడానికి నిరాకరిస్తుంది. వాళ్లు తమ అల్లరితో దుందుడుకు పిల్లలుగా ఉంటున్నందుకూ, పెద్దవాళ్లు కానందుకూ వాళ్లని శిక్షించాలని చూస్తుంది. ఆ అల్లరి నిజానికి అల్లరి కాదనీ, అది ప్రకృతి వాళ్లకిచ్చిన వరమనీ, ఆ చలనశీలత్వం వల్లనే, ఆ అశాంతత్వం వల్లనే వాళ్లు సదా ఏదో ఒక కొత్తదానికో, కొత్త కోణానికో తమ నేత్రాల్ని తెరుచుకుంటూ ఉంటారనీ, ఆ ఆకతాయితనం వల్లనే ఎల్లప్పుడూ ఏదో ఒక కొత్త ప్రపంచపు తలుపుతట్టే అవకాశాన్ని పొందబోతున్నారనీ మన విద్యావేత్తలకెలా అర్థమవుతుంది? వాళ్ళెప్పుడు గ్రహిస్తారు? చివరికి జరిగేదేమంటే తల్లి ప్రకృతి ఒక వైపు బడిపంతులు మరొకవైపూ లాగుతుంటే ప్రతి పిల్లవాడూ ఆ రెండు విరుద్ధశక్తుల మధ్యా పెనుగులాడే ఒక రణరంగంగా మారపోవడమే కదా.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# 4. భయరహిత, దండనలేని వాతావరణం – వ్యక్తీకరణ, స్వేచ్ఛ
## (Fear Free Environment - Freedom for Expression)

### 4.1 ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
### (Basic Questions -Think and Reflect)

1) ఉపాధ్యాయులు పిల్లలను ఎందుకు దండిస్తారు? (Why teachers punish the children?)
2) భయరహిత తరగతి గది వాతావరణం అంటే ఏమిటి? (What is fear free classroom environment?)
3) పిల్లల హక్కులు అంటే ఏమిటి? అవి ఏవి? వీటిపై ఉపాధ్యాయుని స్పందన ఎలా ఉండాలి? (What are child rights? What is Teachers sensitivity towards child rights?)
4) బాలల హక్కుల ఆధారిత బోధన శాస్త్రం అంటే ఏమిటి? (What is child rights oriented pedagogy?)
5) దండన, అవమాన పరచడం, భయపెట్టడం వాటి ప్రభావం పిల్లలపై ఎలా ఉంటుంది? (What is the impact of punishment, insulting and fear?)
6) భయరహిత, దండన లేని వాతావరణ ప్రభావం పిల్లలపై ఎలా ఉంటుంది? (What is the impact of fear free environment?)
7) దండనలేని భయరహిత వాతావరణం ఏర్పరచడంలో ఉపాధ్యాయుల మరియు తల్లిదండ్రుల పాత్ర ఏమిటి? (Role of teachers and parents in the implementation of fear free classroom and school environment?)

### 4.2 నేపథ్యం (Context)

భారతదేశంలో అనాదిగా విద్యావిధానంలో విద్యనేర్చుకోవటంలో శిక్షించడం తప్పనిసరి అని, దాని ద్వారానే విద్య వస్తుందనే భావన ఉంది. ఇది పూర్వకాలంలో గురుకులాలలో, నేడు ఆధునిక సమాజంలో, ప్రస్తుత విద్యావిధానంలో కొనసాగుతూనే ఉంది.

బాలలు భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలిగే, దండనలేని, ఆలోచనలకు అవకాశమున్న వాతావరణాన్ని 'భయరహిత వాతావరణం' అనవచ్చును. దండన, దూషణ, పోల్చడం, కించపర్చడం లేకుండా పిల్లలు ఆనందంగా స్వేచ్ఛగా పాల్గొనడం, మాట్లాడడం, ప్రశ్నించడం వంటివి చేయడానికి అనువైన వాతావరణం అని అర్థం. ఈవాతావరణంలో విద్యార్థి అభ్యసనాన్ని పొందగలడు. పిల్లలు తమ స్వభావరీత్యా స్వేచ్ఛను కోరుకుంటారు. స్వేచ్ఛకు పరిమితులు విధిస్తే, దండనలకు గురిచేస్తే, భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే వాతావరణం కల్పించకపోతే పిల్లలు తమ సహజ స్వభావాన్ని కోల్పోతారు. కాబట్టి మనం పిల్లల స్వభావాన్ని తప్పక అర్థం చేసుకోవాలి.

### 4.3 భయంలేని వాతావరణం – ప్రస్తుత పరిస్థితి (Fear Free Environment Existing Situtaion)

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజమంతా పిల్లలు క్రమశిక్షణతో ఉండాలని అందుకు శారీరక శిక్షలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. దీంతో పిల్లలు భయం, ఒత్తిడి, ఉద్విగ్నతలకు లోనవుతున్నారు. ఒక్కోసారి టీచర్ల ముఖకవళికలకు, అధికారయుత కంఠధ్వనికే పిల్లలు భయపడుతున్నారు. ఇది పిల్లల అభ్యసనంపై, భావి జీవితంపై తీవ్ర

ప్రభావం చూపుతున్నది. పాఠశాలల్లో అమలవుతున్న విధానాలు పిల్లల ఆలోచనాశక్తిని అణచివేయడం, ధైర్యంగా ప్రశ్నించకపోవడం, సృజనాత్మకతకు అవకాశం లేకపోవడం వంటి వాటికి కారణమవుతున్నాయి.

పాఠశాలలతో పాటు హాస్టళ్ళు, బాలనేరస్థుల సంక్షేమ గృహాలలో కూడా బాలలపై శారీరక, మానసిక దండన కొనసాగిస్తున్నారు. భారత ప్రభుత్వ మహిళా శిశుసంక్షేమ శాఖ నిర్వహించిన అధ్యయనం ప్రకారం మొత్తం బాలల్లో 69% మంది ఈ రకమైన హింసకు గురౌతున్నారు అని తేలింది. వీరిలో 54.68% బాలురు, 45.32% మంది బాలికలు వున్నారు.

పాఠశాలల్లో బాలమిత్ర వాతావరణం లేకపోవడం, భావాలను వ్యక్తీకరించడానికి అవకాశం ఇవ్వకపోవడం, దండించడం, పిల్లల్లో ఉన్న నైపుణ్యాలు ప్రదర్శించుటకు అవకాశమివ్వకపోవడం వంటివి పిల్లలను బడి నుండి దూరం చేస్తున్నాయి. వారు మానసికంగా కృంగిపోవడానికి, ఆత్మవిశ్వాసం కోల్పోవడానికి కారణమవుతున్నాయి.

## 4.4 పిల్లలు శారీరక, మానసిక దండనలకు, లైంగిక వేధింపులకు వివక్షతకు ఎందుకు గురౌతున్నారు? (Why children subjected to physical, Mental, sexual abuses and discrimination)

- ఉపాధ్యాయులు విధించే ఏరకమైన శారీరక దండన అయినా, మానసిక వేదన అయినా పిల్లల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలుసుకోకపోవడం.
- దండనల వలన అభ్యసనం సాధ్యమనే నమ్మకాన్ని మార్చుకోకపోవడం.
- బాలల హక్కులకు భంగం కలిగించే చేష్టలకు ఉపాధ్యాయ వర్గం దూరం కాకపోవడం.
- దండనలకు దూరంగా, motivation, encouragement మొదలగు పద్ధతులను ఉపయోగించి చూడకపోవడం.
- ఒక్కోసారి తల్లిదండ్రులే దండించమని టీచర్లను కోరడం.
- ప్లిలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు లేకపోవడం.
- వివిధ అంశాలలో పిల్లల భయాందోళనలను మరియు పిల్లల ప్రవర్తనను గురించి ఎప్పటికప్పుడు టీచర్లు, తల్లిదండ్రులు మాట్లాడుకోకపోవడం.
- పిల్లలు చేసే మంచి పనులను తల్లిదండ్రులతో ప్రశంసించకపోవడం.
- దండన కాదు సహాయం అవసరం అని ఉపాధ్యాయులు గుర్తించకపోవడం.
- ఉపాధ్యాయులు బోధనాభ్యసన సమయంలో చురుకుగా ఉన్నవారిని, ఫలితాలు బాగా సాధించిన వారిని మెచ్చుకుంటూ, మిగిలినవారిని చిన్నబుచ్చడం. అందరు విద్యార్థులతో ఒకేరకమైన ప్రేమాభిమానాలతో వ్యవహరించకపోవడం.
- సాధారణంగా చదువులో వెనకబడిన విద్యార్థులు ఉపాధ్యాయులకు దూరంగా మెలగడం, వారి సామర్థ్యాన్ని గుర్తించి ఆయా రంగాలలో ప్రోత్సహించకపోవడం.
- తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులు, కుల,మత, లింగ, భాష, ప్రాంతాల ఆధారంగా విద్యార్థుల పట్ల వివక్షచూపడం
- పిల్లల్లో నమ్మకం, ఆసక్తి, ధైర్యం, సాధించగలనన్న స్ఫూర్తి, సమస్యలను ఎదుర్కొనే స్థైర్యం ఉపాధ్యాయులు కల్పించకపోవడం.
- ఉపాధ్యాయులు తరగతిగదిలో ప్రజాస్వామిక విలువలు, సాంఘిక న్యాయం, సమానత్వం వంటి వాటిని నమ్మడం, ఆచరించడం ద్వారా తరగతిగదిలో అభ్యసన వాతావరణం కల్పించడంతో పాటు విలువలను పెంపొందించకపోవడం.
- పాఠశాల బాల్యంలో పెంపొందించవలసిన శారీరక, మానసిక, జ్ఞానాత్మక అభివృద్ధికి బదులుగా ఒత్తిడి, భయాందోళనలు బాలల్లో పెంపొందడం.

- విద్యార్థి గౌరవానికి ప్రాధాన్యత నిచ్చునట్లుగా, బాలల హక్కులను కాపాడునట్లుగా పాఠశాల వాతావరణం ఉండకపోవడం.
- విద్యార్థులలో ఉండే సామర్థ్యాలను, శక్తులను గుర్తించి అవి పెంపొందించే విధంగా బోధించకపోవడం.

పై అన్ని పరిస్థితులకు కారణాలు ఆలోచించి సమస్యలు పరిష్కరించాలి కాని దండించరాదు. మన శక్తిని అధికారాన్ని పిల్లలపై చూపడం కాకుండా సమస్యను అర్థంచేసుకొని పరిష్కరించడం ద్వారా ప్రేమాభిమానాలతో ఉండడం ద్వారా పిల్లల్లో ఆశించిన మార్పును సాధించాలి.

పిల్లల ఇష్టాలు, అయిష్టాలు తెలుసుకోవడం ద్వారా, వారి అభిప్రాయాలను గౌరవించడం ద్వారా అభ్యసనంలో మెరుగుదల సాధించవచ్చు.

పిల్లల పరిసరాలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేలా ఉంచాలి. ఏ పరిసరాలలో పిల్లలు పెరుగుతారో ఆ పరిసరాల ప్రభావం పిల్లలపై ఎంతగానో ఉంటుంది. జీవితాంతం ఆ ప్రభావం కొనసాగుతుంది. పిల్లలు భయానికి, ఒత్తిడికి గురయిన వాతావరణంలో పెరిగితే ఉత్తమ పౌరులుగా ఎదగడానికి అవకాశముండదు. ఎవరయితే తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలరో వారు ఆలోచించడం, విశ్లేషించడం, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోగలగడం, సమాజంపట్ల స్పందించగలుగుతారు. దండనలవల్లనే చదువు వస్తుందని, స్వేచ్ఛనివ్వడం మంచిది కాదని, క్రమశిక్షణగా మెలగాలని అనుకోవడం అపోహే. ఇవన్ని పిల్లల స్వభావానికి వ్యతిరేకమని గుర్తించాలి. క్రమశిక్షణ అంటే మాట్లాడకుండా ఉండడం, చెప్పింది చేయడం కాదని తెలుసుకోవాలి. చదువులో వెనకబడడానికి సరయిన కారణాలు అన్వేషించాలి. 5వ తరగతిలోని విద్యార్థులకు తరగతి సామర్థ్యాలు రాకపోతే 1 నుండి 4వ తరగతి స్థాయి అంశాల సాధనకు అనుగుణంగా బోధన జరపాలి. విద్యా విషయకంగా ఒక విద్యార్థి వెనకబడడాన్ని పదే, పదే ప్రస్తావిస్తే, అందరి ముందర అవమానపరిస్తే ఆ విద్యార్థి ముందుగా పాఠశాలకు గైర్హాజరవడం, చివరికి డ్రాపౌట్ కావడం జరుగుతుంది. పిల్లలకు స్నేహపూర్వక అభ్యసన వాతావరణం కల్పించడం, వ్యక్తీకరణకు స్వేచ్ఛనివ్వడం ద్వారా పిల్లల్లో ఆశించిన ఫలితాలను సాధించవచ్చును.

## 4.5 RTE - 2009 – భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ గురించి ప్రస్తావించిన సెక్షన్లు, వివరాలు (RTE - 2009 Related sections for Fear free Environment and Freedom)

ఉచిత నిర్బంధవిద్యకు బాలల హక్కు (ఆర్.టి.ఇ.) చట్టం–2009 సెక్షన్ 17లో ఈ కిందివిధంగా ఉంది.

బాలలను శారీరకంగా శిక్షించటం, మానసికంగా వేధించడం నిషేధం.

- సెక్షన్ 17 సబ్ సెక్షన్(1) ప్రకారం ఏ బాలుడు/ బాలికను కూడా శారీరక శిక్షకూ, మానసిక వేధింపులకు గురిచేయరాదు.
- సబ్‌సెక్షన్ (2) ప్రకారం సబ్‌సెక్షన్ (1)లోని అంశాలకు విరుద్ధంగా ప్రవర్తించినవారు ఆ వ్యక్తికి వర్తించే ఉద్యోగ నియమాల ఆధారంగా క్రమశిక్షణ చర్యకు గురౌతారు.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన బాలలు ఏవిధమైన వివక్షకు గురికాకుండా, ప్రాథమిక విద్యను చేపట్టి, పూర్తిచేయడానికి ఎటువంటి అవాంతరాలు రాకుండా 'స్థానిక సంస్థలు', ఆయా ప్రభుత్వాలు విధిగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్.టి.ఇ. చట్టంలోని సెక్షన్ 8, సెక్షన్ 9 నిర్దేశిస్తున్నాయి.
- బాలల హక్కులు అతిక్రమించినపుడు ఇతర చట్టాల ప్రకారం అంటే భారత శిక్షాస్మృతి ప్రకారం 1989 ఎస్.సి., ఎస్.టిలపై దౌర్జన్యాల నిరోధక చట్టం ప్రకారం తీసుకునే చర్యలకు ఆర్.టి.ఇ. చట్టం అవరోధాలేమి కల్పించలేదు.

- సెక్షన్ 29 సబ్‌సెక్షన్(2) క్లాజు 'జి' ప్రకారం పాఠ్యప్రణాళిక, మూల్యాంకన సమయంలో భయం, ఆందోళన వంటి వాటినుంచి బాలలను విముక్తంచేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటంలో సహాయపడాలి. సెక్షన్ 30, సెక్షన్ 31 ప్రకారం బాలల హక్కుల సంరక్షణ జాతీయ కమీషన్, రాష్ట్ర కమీషన్ బాలల హక్కుల పరిరక్షణ కొరకు ఏర్పాటు చేయబడ్డాయి.

ఎలాంటి దండనలు, వివక్షతలు లేకపోవడం, భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశముండడం, అభ్యసనానికి అనుకూలమైన బాలమిత్ర వాతావరణాన్ని సృష్టించడం, ఒత్తిడి లేకుండా లక్ష్యాలను సాధించడం వంటివి 'భయరహిత వాతావరణం'లోనే సాధ్యం. భయరహిత వాతావరణానికి, వ్యక్తీకరణకు ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు పాటుపడాలి.

## 4.6 దండనలు – రకాలు (Types of Punishments/ Abuses)

**1. శారీరక దండన:**

పిల్లలను కొట్టడం, గుంజీలు తీయించడం, గిచ్చడం, తొడపాశం పెట్టడం, గోడకుర్చీ నిలబెట్టడం, స్కూలు బ్యాగులు తలపై ఉంచి నిలబెట్టడం, మోకాళ్లపై నిలబెట్టడం, ఒకరితో మరొకరికి చెంపదెబ్బలు వేయించడం, కాళ్లకిందనుండి చేతులతో చెవులు పట్టుకొని వంగమనడం, కరెంటు షాక్ పెట్టడం, చెవిమెలివేయడం, పరుగెత్తించడం, ఎండలో నిలబెట్టడం, జుట్టుపట్టి లాగడం, రెండువేళ్ళమధ్య కర్రపెట్టి ఒత్తడం, కర్రతో లేదా ఇతర వస్తువులతో కొట్టడం, తల, చేతులు, పిరుదులు ఇతర శరీర భాగాలపై కొట్టడంవంటి శరీరానికి నొప్పికలిగించే పనులు శారీరక దండన కిందికి వస్తాయి.

**2. మానసిక దండన:**

పిల్లలను మానసికంగా హింసించడం అంటే పిల్లలను తిట్టడం, న్యూనతపర్చడం, కించపరచడం, ఆటలు, పాటలలో పాల్గొనుటకు అవకాశమివ్వకపోవడం, ప్రధానోపాధ్యాయుల దగ్గరకు పంపడం, ఇంటికి పంపించడం, తరగతిలోకి అనుమతించకపోవడం, తల్లిదండ్రులను వారితోటే రప్పించడం, వారి ముందర తిట్టడం. ఇతరులతో పోల్చడం, చీదరించుకోవడం, అవమానపర్చడం, పేర్లు పెట్టడం, తల్లిదండ్రులు చేసే పనిని, వృత్తిని, కులాన్ని అపహాస్యం చేయడం, ఆరోగ్యస్థితిని, లావుగా, బక్కగా ఉన్నావని వెక్కిరించడం, గాడిద, మొద్దు అని రాసి మెళ్లోవేయడం, బెదిరించడం, తృణీకరించడం, వైకల్యాన్ని ఎత్తిచూపడం, గేటు బయట నిలబెట్టడం మొదలైన వాటిని మానసిక దండనగా చెప్పవచ్చు.

**3. వివక్ష:**

కుల, మత, భాష, రంగు, జాతి, లింగ, ప్రాంతము మొదలగు వాటిలో తేడాలు చూపడాన్ని వివక్షతగా చెప్పవచ్చు.

**4. లైంగిక వేధింపులు:**

ప్రస్తుత పరిస్థితుల్లో తన జీవితంలో లైంగిక వైధింపులకు గురికాని బాలికలు అరుదుగా ఉంటారు. బాలురపై కూడా వేధింపులు ప్రస్తుతం మనం చూస్తూ ఉన్నాం. లైంగిక వేధింపులు రకరకాలుగా ఉంటాయి.

- శరీర అవయవాలను చేతులతో, ఇతర వస్తువులతో తాకడం.
- అశ్లీల బొమ్మలను, చిత్రాలను చూపించడం.
- అసభ్యకరమైన సైగలు చేయడం.
- ద్వంద్వార్థం వచ్చే మాటలను మాట్లాడడం.
- పిల్లల అవయవాలను వర్ణించడం.

- కౌగిలించుకోవడం, ముద్దుపెట్టుకోవడం,
- రాతపూర్వకంగా అశ్లీలంగా భావాన్ని వ్యక్తీకరించడం.

## 4.7 పిల్లలు అసహనానికి ఎందుకు గురౌతారు?
## (Why children feel tired and bored in schools)

- క్రియాశీలంగా ఉండడంలేదు.
- బాల్యదశలో ఉండే ప్రకృతి సిద్ధమైన ఉత్సాహం, కుతూహలం, బడిలో చేరిన తరువాత ఎందుకు కనిపించడంలేదు.
- గంటలతరబడి ఒకేచోట, ఒకేరకమైన పనిని చేయించడం
- ఆలోచనలు రేకెత్తించే పనులు ఇవ్వకపోవడం, అభ్యసనంలో నిమగ్నం చేయలేకపోవడం
- ఛాలెంజింగ్ లక్ష్యాలు నిర్దేశించకపోవడం.
- అధిక సంఖ్య కలిగిన తరగతి గదులు.
- విద్యార్థుల నుండి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు విద్యాపరమైన ఫలితాలను ఎక్కువగా ఆశించడం.
- చదువంటే ఉపాధ్యాయులు బోధించడం, పిల్లలు చదవడం, రాయడం అనే ప్రగాఢ నమ్మకం.
- క్షేత్ర పరిశీలనలకు చోటివ్వకపోవడం.
- ఆటస్థలం అందుబాటులో లేకపోవడం, ఉన్నా ఆటలు ఆడించకపోవడం.
- టి.వి. మరియు ఇంటర్నెట్ ప్రభావం, గంటల తరబడి టి.వి., కంప్యూటర్ల ముందు కూర్చోవడం.
- ఉపన్యాస పద్ధతిలో బోధన జరగడం, బోధనాభ్యసనలో పిల్లలకు భాగస్వామ్యం లేకపోవడం.
- బలవంతంగా చూచిరాతను ఎక్కువసార్లురాయించడం.
- పిల్లల భావప్రకటనకు చోటివ్వకపోవడం, ప్రశ్నలకు జవాబులు ఆలోచించి సొంతంగా కాకుండా గైడ్లు, పుస్తకాలు, స్టడీ మెటీరియల్ చూసి అదేపనిగా రాయడం.
- పిల్లలకు మాతృభాష కాకుండా ఇతర భాషలను బలవంతంగా రుద్దడం.
- పిల్లలు చెప్పిన విషయాలు నమ్మకపోవడం.
- పిల్లలపై ప్రేమ, నమ్మకం చూపకపోవడం.
- ఉపాధ్యాయులు తమ ఏకపక్ష నిర్ణయాలను విద్యార్థులపై బలవంతంగా రుద్దడం.
- పిల్లలకు పనిగంటలు ఎక్కువ కావడం. సెలవు రోజులలో కూడా పనిచేయించడం. ఆడుకోవడం, కుటుంబంతో, స్నేహితులతో గడిపే సమయం లేకపోవడం.
- ప్రత్యేక తరగతులు నిర్వహించడం.

## 4.8 పిల్లలను దండించడంపై నమ్మకాలు, అపోహలు
## (Myths & Beliefs on punishment to children)

దండిస్తేనే చదువు వస్తుందని నమ్మడం. తమకు అలాగే చదవు వస్తుంది కాబట్టి తాము బోధించే వారికి కూడా అలాగే బోధించడం సరైనదని భావించడం.

పిల్లలను భయపెట్టినప్పుడే క్రమశిక్షణతో వింటారని భావించడం.

పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు దండించే పరిస్థితులు పిల్లలు బాగా చదవాలనే కోరికతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిపై ఒత్తిడి కలుగజేయడం వల్ల ప్రతికూల స్వభావం ఏర్పడడం మినహా ఆశించిన ఫలితాలు నెరవేరవు. దండన అనేది మనం ఏం ఆశించి విధిస్తున్నాం? అభ్యసనానికి, దండనకు ఏం సంబంధమో ఆలోచించాలి. పిల్లల అభ్యసనం బోధనాభ్యసన ప్రక్రియలు, పిల్లలకు కల్పించిన అవకాశాలు, నైపుణ్యాలు, ఆసక్తులు, వైఖరులనుబట్టి ఆధారపడి ఉంటుంది. అవికాకుండా నియంత్రించడం ద్వారా, దండనల ద్వారా అభ్యసనం సాధ్యంకాదు. భయపూరిత వాతావరణంలో అభ్యసనం జరగదు. పిల్లల్లో ఆశించిన సామర్థ్యాలు రాకపోతే అందుక కారణాలు అన్వేషించి పరిష్కారమార్గాలను ఆలోచించి అమలు చేయాలి కాని స్వేచ్ఛను హరించడం, దండనలకు గురిచేయడం వంటి భయపూరిత వాతావరణం కల్పంచరాదు. పిల్లల స్వభావానికి వ్యతిరేకమైన విధానాలను అవలంబించడం కాకుండా ఇంట్లో, పాఠశాలల్లో పిల్లల స్వభావాన్ని అర్థంచేసుకొని, బాల్యం ఒక నిర్మాణాత్మక దశ అని గుర్తించి భయరహిత వాతావరణాన్ని కల్పించి, భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛనివ్వడం ద్వారా పిల్లల్లో ఆశించిన ఫలితాలు సాధించవచ్చును.

భయరహిత వాతావరణం, వ్యక్తీకరణం స్వేచ్ఛ అనేవి విద్యావ్యవస్థలోని వృత్తిపర, నైతిక అంశాలను దాటి ఇప్పుడు చట్టపరమైన అంశంగా మారింది. బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009 భయరహిత వాతావరణం బాలలుండే ప్రతిచోట కల్పించాలనే అంశాన్ని చర్చించింది.

## 4.9 పిల్లల స్వభావం (Naure of the Child)

- ప్రతీ విషయాన్ని కుతూహలంగా పరిశీలిస్తారు, తెలుసుకోడానికి ప్రశ్నిస్తారు
- ప్రయోగాత్మకంగా చేసి చూస్తారు.
- కుదురుగా ఒకచోట ఉండకుండా అన్ని చోట్లా తిరుగుతుంటారు, ప్రతీది తెలుసుకోవాలనుకుంటారు.
- తమ అనుభవాలను, తెలిసిన విషయాలను తోటివారితో పంచుకుంటారు.
- తోటివారితో ప్రతిస్పందించడం ద్వారా అనేక కొత్త విషయాలు తెలుసుకుంటారు. తెలిసిన విషయాలను వారితో పంచుకుంటారు.
- చాలా చురుకుగా, శక్తివంతంగా ఉంటారు. అన్నిట్లో ఉత్సుకతతో పాల్గొంటారు.

ఈ భయరహిత వాతావరణాన్ని ఇంట్లో, పాఠశాలలో, సమాజంలో కల్పించకుండా స్వేచ్ఛ ఇవ్వకపోతే మనం పిల్లల స్వభావానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్లే.

పాఠశాలలకు వచ్చిన విద్యార్థి తన సహజ స్వభావాన్ని కోల్పోకుండా 'భయరహిత వాతావరణాన్ని' కల్పించాలి. భద్రత ఉన్నచోట పిల్లలు స్వేచ్ఛగా ఉంటారు. భయం ఉండే ఆ వతావరణంలో జిల్లాల్లో మనం ఆశించే ఫలితాలు సాధించలేం. పాఠశాలకు వచ్చిన విద్యార్థిని అనేక రకాలుగా నియంత్రించడం చేస్తే లాభంకంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఇక్కడే కూర్చోవాలని, ఎక్కువ మాట్లాడరాదని, చెప్పిన పనే చేయాలని, ఇతర విషయాలు కనీసం ఆలోచించరాదని విధించే నియమాలవల్ల పిల్లలు ఆలోచించేవారిగా కాకుండా ఆధారపడేవారిగా తయారవుతారు. పిల్లల ఆసక్తులను, అనాసక్తులను, నైపుణ్యాలను గుర్తించాలి. వాటికి అనుగుణంగా వారికి పనులను అప్పగించాలి. లక్ష్యాలను నిర్దేశించాలి. ఎవరైనా వారికి ఆసక్తి ఉన్న రంగంలో కష్టాలున్ననూ, ఇష్టంగా పూర్తిచేయడానికి శ్రమిస్తారు. ఇష్టమైన పనికొరకు ఎంత సమయమైనా వెచ్చిస్తారు.

**బాల్యం నిర్మాణాత్మక దశ:**

పిల్లల బాల్యం ఒక నిర్మాణాత్మక దశ. ఈ దశలో ప్రతీది వెంటనే, వేగంగా గ్రహిస్తారు. ఆలోచిస్తారు, విశ్లేషిస్తారు. ఈ దశలో ఏ వతావరణంలో పెరిగితే అదే జీవితాంతం కొనసాగుతుంది. ఈ దశలో భయపడితే భయపడతారు. ధైర్యం కల్పిస్తే, సమస్యలను ఎదుర్కోవడం అలవాటు చేస్తే ధైర్యవంతులుగా సమస్యలను ఎదుర్కొంటారు. స్వేచ్ఛ కల్పించడం ద్వారా మానసిక వికాసం జరుగుతుంది. నూతన ఆవిష్కరణలకు అవకాశం కల్పించినట్లవుతుంది. కాబట్టి ఈ నిర్మాణాత్మక దశలో పిల్లల స్వభావానికనుగుణంగా ప్రవర్తించి వారి నైపుణ్యాలకు, ఆసక్తులకు అనుగుణమైన వాతావరణాన్ని సృష్టించాలి. ఒక నిర్మాణాత్మక జీవితాన్ని అందించే కీలకదశలో పిల్లలకు భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛను కల్పిస్తే అభ్యసనంతోపాటు భావిజీవితాన్ని కూడా సక్రమ పద్ధతిలో నిర్మించుకోవడానికి అవకాశం కల్పించినట్లు అవుతుంది.

## 4.10 పిల్లలను ఎందుకు దండిస్తారు? కారణాలు – విశ్లేషణ – ఎంత వరకు సమర్థనీయం (Why children are Punished - Reasons - Analysis)

ఈ కింద ఇవ్వబడిన కారణాల వల్ల ముఖ్యంగా పిల్లల్ని దండించడం, అవమానించడం, నీకు చదువురాదని, మొద్దువని అంటారు.

- **చదువులో వెనుకబడడం**
- **ఇంటి పని,చెప్పిన పని చేయకపోవడం, చదువుకొని రాకపోవడం.**
- **బాగుగా చదవలేకపోవడం, రాయలేకపోవడం**
- **పాఠశాలకు ఆలస్యంగా రావడం, బడి సమయంలో బయట తిరగడం.**
- **అల్లరి చేయడం, పిల్లలు ఒకరినొకరు కొట్టుకోవడం, తోటి పిల్లలతో ఘర్షణ.**
- **బడి ఆస్తుల్ని, సామాజిక ఆస్తులను పాడుచేయడం.**

ఈ కారణాల వల్ల దండించడం జరుగుతుంది. ఈ పరిస్థితి ఈ విధంగా ఉండడం అనేది ఎందుకు జరుగుతుంది. ఎవరు బాధ్యులు విశ్లేషిద్దాం.

**చదువులో వెనుకబడడం:**

పిల్లలు నేర్చుకోవడానికే బడికి వస్తున్నారు. బడి పిల్లల అభ్యసనానికి బాధ్యత వహించాలి.పిల్లలు వెనుకబడటానికి ముఖ్య కారణం వారికి కనీస సామర్థ్యాలయిన రాయడం, చదవడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు రాకపోవడం. ఈ కనీస సామర్థ్యాలు లేకుంటే వారు అభ్యసనంలో పాల్గొనరు. చదవడానికి ప్రయత్నించరు. ఈ కనీస సామర్థ్యాలు 2వ తరగతి లోపే పిల్లలందరికి వచ్చేట్టు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి. లేకుంటే కనీస సామర్థ్యాలు లేని పిల్లలకు సిలబస్ పూర్తిచేయడం కాకుండా, కనీస సామర్థ్యాలు వచ్చే వరకు ప్రత్యామ్నాయ బోధన (Remedial Teaching) చేపట్టి, కనీసం చదవడం, రాయడం, లెక్కలు వచ్చిన తరువాతే సిలబస్‌లో బోధించాలి. చదువులో అందరు పిల్లలు ఒకే రీతిగా ఉండరు. కొందరు బాగుగా ముందుంటారు. కొందరు వెనుకబడతారు. అది పిల్లల ఎదుగుదలకు సంబంధించినది. అటువంటప్పుడు పిల్లలకు వ్యక్తిగతంగా చేయూత ఇచ్చి అవగాహన కలిగించి ప్రోత్సహించాలి. అందువల్ల పిల్లలకు తమపై తమకు నమ్మకం కలుగుతుంది. బాగా చదవడానికి ప్రయత్నిస్తారు.కావున పిల్లలు చదువుల్లో వెనక బడడం వారి తప్పు కాదు. చదవలేక పోవడం, రాయలేక పోవడం వారి తప్పు కాదు. ఎక్కడో మనం వారిని పట్టించుకోలేదు. వారిని మనం వదిలేశాం. మనమే వారిని సరిదిద్దాలి. దీనికి పాఠశాల బాధ్యత వహించాలి.

పిల్లలు తప్పులు  చేయడం సహజం. అసలు నేర్చుకోవడం అనేదే తప్పులు చేస్తూ నేర్చుకుంటారు. అది సహజం, తప్పులు చేసిన ఫరవాలేదు. ప్రయత్నించడం ముఖ్యం అని ఉపాధ్యాయులు పిల్లలకు చెప్పాలి." నేర్చుకోడంలో తప్పులు చేయడం సహజం" (Doing mistakes is ok) అని నల్లబల్లపై రాయాలి.

పిల్లలలో అపారమైన సామర్థ్యం ఉంది. పిల్లలు ఎటువంటి క్లిష్ట భావననైనా నేర్చుకోగలరు. దీనికి ఉపాధ్యాయు సహకారం ఉండాలి. పిల్లల్ని ప్రోత్సహించాలి. తప్పులు చెయ్యొద్దు, చేస్తే దండిస్తాం అనే సమాచారం ఉంటే పిల్లలు అసలు ప్రయత్నించరు. భయరహిత ప్రోత్సాహకర వాతావరణంలోనే పిల్లలు బాగుగా నేర్చుకొంటారు. నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు.

కావున చదువులో వెనుకబడడం అనేది ఉపాధ్యాయుల మీద, పాఠశాల మీద ఆధారపడి ఉంది. నేర్చుకోవడానికి వచ్చిన పిల్లలపై కాదు. కావున దండించడం నిరాశపరచడం, చదవలేకపోవడానికి, ఫెయిల్ కావడానికి వారే కారణమని అనడం సరియైంది కాదు. పిల్లల చదువుకు కేవలం బడి మరియు ఉపాధ్యాయులే బాధ్యత వహించాలి.

**Only teacher can change the situation:**

- I can make a difference
- I will make a difference
- I want to make a difference

**ఇంటిపని, చెప్పిన పని చేయకపోవడం, చదువుకొని రాకపోవడం:**

ఇంటిపని  చెయ్యకపోవడం, చదువుకొని రాకపోవడం దానికి ముఖ్య  కారణం పిల్లలు ఇంటిపని సొంతంగా చెయ్యలేకపోవడం మరియు చేసే సామర్థ్యం లేకపోవడం, చెయ్యలేని పిల్లలని ఉత్తేజితులను చెయ్యకపోవడం. పాఠంపై పట్టు ఉంటే పిల్లలు ఇచ్చిన సమస్యలు సాధిస్తారు. దానిలో ఆనందపడతారు. ఇంటిపని కంటే ముందు  తరగతి గదిలో ఇచ్చిన సమస్యలను పిల్లలు చేయగల్గుతున్నారా అని ఉపాధ్యాయుడు  చూడాలి. లేకుంటే ఎందుకు చేయలేకపోతున్నారని స్వయంగా ఒక సమస్య లేక అభ్యాసం ఇచ్చి చేయమని పరిశీలించి కారణాలు తెలుసుకోవాలి. వారిని చేసేటట్లు చేసి, తరువాత ఇంటి పని ఇవ్వాలి. ఏ మాత్రం పిల్లలు ప్రయత్నించినా, తప్పులున్నా కూడా పిల్లల్ని అభినందించాలి. పిల్లలు ఇంటి నేపథ్యం చదివే వాతావరణం, ప్రోత్సాహకర వాతావరణం ఉన్నదా అని కూడా ఉపాధ్యాయుడు అవగాహన పెంచుకోవాలి.

కావున ఇంటి పని చేసేట్టు వాళ్లకు సహకారం ఇవ్వాలి. ప్రోత్సహించాలి. దండిస్తే, భయపెడితే సమస్య పరిష్కారం కాదు. పిల్లలు భయంతో బడికి హాజరుకారు. కొంతకాలానికి బడి వదిలేస్తారు. భయరహిత వాతావరణంలో స్వేచ్ఛతోనే పిల్లలు తమదైన శైలిలో ప్రయత్నిస్తారు. ప్రయత్నమే పిల్లలు నేర్చుకోవడానికి తొలిమెట్టు. ఉపాధ్యాయులు ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహించాలి.

**అల్లరి చేయడం, పిల్లలు ఘర్షణ పడడం, కొట్టుకోవడం:**

సాధారణంగా పిల్లలు అల్లరి చేస్తుంటే, ఘర్షణ పడుతుంటే ఉపాధ్యాయులు ఇరు వర్గాలను దండిస్తారు.

పిల్లల స్వభావాన్ని మనం పరిశీలిస్తే వారిలో చాలా శక్తి  ఉంటుంది. ఒక దగ్గర గంటల తరబడి కూర్చోలేరు. లేవడానికి, మాట్లాడటానికి, బయట తిరగడానికి వాళ్ల  శరీరం, మరియు బుద్ధి కోరుతుంది. ఏదో ఒకటి చేయాలనే ఉత్సాహం ఉంటుంది. తహ తహ ఉంటుంది. మరి దీని కనుగుణంగా మనం పిల్లలకు పని కల్పించాలి. అంటే పుస్తకం చదవడం, లేక పుస్తకం/గైడులోచూసి ప్రశ్న జవాబులు రాయడం అనేది చురుకైన పని కాదు. వస్తువులను పరిశీలించడం. సొంతంగా ఆలోచించి రాయడం, చర్చల్లో పాల్గొనడం, సమాచారాన్ని  సేకరించడం, బొమ్మలు గీయడం, కథలు చదివి, విని వాటిపై మాట్లాడించడం ప్రయోగాలు, క్షేత్రపరిశీలన చేయటం  మొదలగునవి సవాలు గల అభ్యసన ప్రక్రియలు. పిల్లలకు

మంచిపని కల్పించడం అంటే ఈ ప్రక్రియల్లో వారిని నిమగ్నం చేసి, వ్యక్తిగతంగా కాని లేక గ్రూపు కాని పని ఇచ్చి చేయిస్తే. వారు అమిత ఆసక్తి, ఏకాగ్రతతో ఉత్సాహంగా పాల్గొంటారు. అప్పుడు అల్లరి చేయడం అనేది. ఘర్షణ వాతావరణం, క్రమశిక్షణా రాహిత్యం అనేవి ఉండవు. పనులు చేయడం, సమస్యను సాధించడంలో నిమగ్నమవుతారు.

ఇటువంటి ప్రక్రియలు ఇచ్చి పిల్లలను పాల్గొనడం చేయాలంటే ఉపాధ్యాయుడు ఆలోచించి వివిధ కృత్యాలను ప్లాను చేసుకోవాలి. వారు కృత్యాలు చేస్తుంటే సహాయకారిగా ఉండాలి. తరగతిలో ఆలోచింప చేసే ప్రశ్నలు నల్లబల్లపై రాసి చర్చలు చేయించాలి. చురుకైన అభ్యసన, బోధన ప్రక్రియ వల్ల విద్యార్థులు రోజంతా చురుకుగా ఉంటారు. బాల్యంలో ఉన్న ఉత్సాహం, చురుకుదనం, క్రియాశీలత, సృజనశీల నైపుణ్యాలను ఉపాధ్యాయుడు చదువులోకి మలచుకోవాలి. దీనికి ఉపాధ్యాయుడు ఉపయుక్త గ్రంథాలు చదవాలి. మంచి కృత్యాలను, ప్రాజెక్టులను ప్లాను చేసుకొని పిల్లలతో చేయించాలి. బాల్యంను అవగాహన చేసుకొని, దానికి తగ్గట్టుగా పిల్లలకు ప్రేరణ ఇస్తూ వారిని వివిధ పద్ధతుల్లో నేర్చుకోవడానికి ఉపాధ్యాయుడు తయారు కావాలి. ఇటువంటి పరిస్థితులలో దండించడం అనే ప్రశ్న తలెత్తదు.

**పాఠశాలకు ఆలస్యంగా రావడం, బడి సమయంలో బయట తిరగడం:**

పిల్లలు పాఠశాలకు ఆలస్యంగా రావడానికి ముఖ్య కారణం 1. బడి అంటే ఇష్టం లేకపోవడం 2. పిల్లల కుటుంబ నేపథ్యం.

పిల్లలకు కుటుంబ నేపథ్యం పరిశీలిస్తే, పిల్లల్ని బడికి తయారుచేయాలంటే అది ఒక ప్రక్రియ, పిల్లలను నిద్ర లేపడం, స్నానం చేయించడం, భోజనం వండి పిల్లలకు పెట్టడం, బడి సమయం అవుతోందని పిల్లలను హెచ్చరిస్తూ వారిని త్వరగా తయారవ్వమని చెప్పడం, స్కూలు బ్యాగు సర్దడం మొదలగునవి చదువుకోని బాగుగా ఉన్న కుటుంబాలలో జరిగే ప్రక్రియ ఇది. కాని నిరక్షరాస్య, పనిచేస్తున్న పేద కుటుంబాలలో పిల్లల్ని పై విధంగా బడికి తయారు చేయడం కనిపించదు. ఆహారం కూడా తయారుకాదు. సమయం తెలిపే గడియారం కూడా ఇంట్లో ఉండదు. కొందరు తల్లిదండ్రులైతే ఉదయాన్నే పనికి వెళ్తారు. ఇటువంటప్పుడు పిల్లలే స్వయంగా బ్యాగుతో బడికి వస్తారు. ఆహారం తీసుకొని కూడా రారు. కావున పాఠశాలకు అన్ని విధాల తయారయిరారు. ఆలస్యంగా వస్తారు. కొంతమంది ఇంటిలో పొలంలో పనిచేసి కూడా వస్తారు.

ఈ పరిస్థితి ఉపాధ్యాయునికి అవగాహన ఉండాలి. పిల్లల కుటుంబనేపథ్యం, కుటుంబ పరిస్థితులు, వాటిపై ఉపాధ్యాయుడు అవగాహన ఉంచుకోవాలి. తప్పనిసరిగా పిల్లల ఇంటికి వెళ్లి కూర్చోని తల్లిదండ్రులతో మాట్లాడితే, కుటుంబం గురించి, పిల్లల పరిస్థితుల గురించి ఉపాధ్యాయులకు తెలుస్తుంది. దీనితో ఉపాధ్యాయుడు సరైన నిర్ణయం తీసుకొని పిల్లల్ని ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాని బడికి ఆలస్యంగా వచ్చారని, రాలేదని, ఇంటి పనిచేయలేదని కారణం తెలుసుకోకుండా దండిస్తే, అవమానిస్తే పిల్లలు బడిపైన, ఉపాధ్యాయులపైన అయిష్టత పెంచుకుంటారు. బడికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తారు.

బడిలో ఉన్న భయం వల్ల ప్రోత్సాహకర పరిస్థితులు లేకపోవడం వల్ల, గంటల తరబడి కూర్చోబెడతారు. కదలనివ్వరు, మాట్లాడనివ్వరు, ఇరుకైన గదులు, దారాళమైన వెలుతురు, గాలి ఉండకపోవడం, త్వరగా అలిసిపోవడం మొదలగు వాటి వల్ల పిల్లలు ఈ వాతావరణంకు దూరంగా ఉండటానికి ఇష్టపడతారు. కావున ప్లిలలను తరగతి గదిలో తిరగనివ్వాలి. బయటకు తీసుకెళ్ళాలి. ఆటలు ఆడించాలి. వారిని చురుకుగా ఉంచేట్లు ప్రయత్నించాలి. స్వేచ్ఛనివ్వాలి. వారితో చనువుగా ప్రేమపూర్వకంగా ఉండాలి. కావున పిల్లల బాల్యదశపై ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన ఉండాలి.

పిల్లలు కారణం లేకుండా ఏది చెయ్యరు. మనం ఆ కారణాలు అర్థం చేసుకోవాలి. పిల్లలకు ఏది ఇష్టం, ఏది ఇష్టం లేదు, ఎలా ఉంటే వారికి ఇష్టం అని పిల్లల్ని అడిగి తెలుసుకోవాలి. వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. పిల్లల

వికాసానికి, నేర్చుకోవడానికి ఒక చిన్న అభినందన, భుజంతట్టి ప్రోత్సహించడం అవసరం కానీ, దండన, చిన్నబుచ్చడం, నీకు రాదు అనడం, అవమానించడం, పరుషంగా మాట్లాడటం, ఒక నాగరికత గల, వివేకవంతులైన మనుషులు చేయాల్సింది కాదు. కోపం, ఆగ్రహం, ఉద్వేగాలకు పెద్దలే కంట్రోల్ చేసుకోకపోతే పిల్లలెలా చేస్తారు. మనం ఎలా ఉంటే పిల్లలు అలా ఎదుగుతారు. దీనిలో రెండో సందేహం లేదు. మన విలువలు, మన అలవాట్లు, మన ప్రవర్తనే పిల్లలకు వస్తాయి. వేరొక విధంగా జరగటానికి ఆస్కారమే లేదు. మనం ఆదర్శవంతమైన జీవనాన్ని కరుణ, ఆప్యాయత, బాధ్యతాయుతమైన ప్రవర్తనను విద్యార్థులకు చూపించాలి. పిల్లలు విని నేర్చుకోవడం కాకుండా చూసి అనుకరిస్తూ నేర్చుకుంటారు.

## 4.11 దండన ఫలితాలు (Impact of Punishments)

శారీరక దండన పిల్లలపై సానుకూల ప్రభావం చూపదు. ఇది మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది. దీనివల్ల పిల్లల మనసులు ప్రతికూల ప్రభావానికి గురవుతాయి. అంతేకాకుండా వారిలో ఆత్మన్యూనతా భావం పెంపొంది హింసద్వారానే ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే తప్పుడు ఆలోచన వారిలో కలుగుతుంది. దీని ప్రభావం సమాజంపై పడుతుంది. కాబట్టి ప్రతి పాఠశాలలో శారీరక, మానసిక దండనలు, వివక్షలులేని 'భయరహిత వాతావరణం' కల్పించాలి. పిల్లల్ని అవమానిస్తే, కించపరిస్తే వారు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. భయస్తులుగా, బిడియస్తులుగా తయారవుతారు.

ఉపాధ్యాయ, విద్యార్థి సంబంధాలు పిల్లల అభ్యసనంపై ప్రభావం చూపుతాయి. కాబట్టి పాఠశాలలో, తరగతిగదిలో ఉపాధ్యాయులు ప్రేమ, నమ్మకం, ప్రోత్సాహం ఇవ్వడం చేస్తే పిల్లలు ఆసక్తిగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొంటారు. తద్వారా మంచి ఫలితాలు సాధ్యమవుతాయి.

## 4.12 బాలల హక్కులు – ఉపాధ్యాయుల స్పందన, హక్కుల ఆధారిత బోధన (Child Rights - Teachers Sensitivity and Rights Oriented Pedagogy )

బాలలే మన భావిభారత పౌరులు. జాతి నిర్మాతలు, వీరిపైనే దేశ సమగ్రత, అఖండత, అభివృద్ధి ఆధారపడివుంటుంది. పిల్లల అభివృద్ధి మనం ఇచ్చే నాణ్యమైన సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన విద్య మీదనే ఆధారపడి ఉంటుంది. మనం మన పిల్లలను బడిలో, ఇంటిలో ఏ రకంగా చూస్తున్నాం. పిల్లలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాం అనే దానిమీద వారి అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

పిల్లల హక్కులను గౌరవించడం, అమలుపరచడం ద్వారా ఉపాధ్యాయులు పిల్లల్ని దేశానికి ఉపయోగపడే ఒక మంచి మానవ వనరులుగా రూపొందించవచ్చు.

**పిల్లల హక్కులు**

పిల్లల హక్కులను స్థూలంగా నాలుగు ప్రధాన హక్కులుగా చూడవచ్చు. ఒక్కో ప్రధాన హక్కు కింది ఇతర ఉప హక్కులుంటాయి. ఈ ప్రధాన హక్కులు ఈ విధంగా ఉన్నాయి.

1. **అభివృద్ధి చెందేహక్కు (Right to development):** దీనిలో విద్యను పొందే హక్కు తల్లిదండ్రులచేత వేరుచేయకుండా ఉండడం, తల్లిదండ్రులనుంచి తగు శ్రద్ధ, మార్గదర్శకత్వాన్ని పొందే హక్కు, బాలలు శారీరక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక, నైతికంగా అభివృద్ధి చెందే హక్కును కలిగిఉన్నారు.

   ప్రశంసలు పొందే హక్కు, స్వేచ్ఛగా ఆలోచించే హక్కు, సమానత్వపు హక్కు, నాణ్యమైన ఉచిత విద్యను పొందే హక్కు, తల్లిదండ్రులనుండి, ఉపాధ్యాయులనుండి ప్రేమ ఆప్యాయతలను పొందే హక్కును కలిగి ఉన్నారు.

   కావున అన్ని వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి. మనం ఇవ్వటం అని కాకుండా పిల్లలు పొందే

హక్కు కలిగి ఉన్నారు అని అవగాహన కలిగివుండాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని రకాలైన కృత్యాలు, అభ్యసన అనుభవాలను స్వేచ్ఛాయుత వాతావరణంలో కల్పించాలి. వివక్షత చూపరాదు.

**2. జీవించేహక్కు (Survival Rights):**

- సంపూర్ణ ఆరోగ్యంతో ఉండే హక్కు
- పోషకాహారం పొందే హక్కు
- పరిశుభ్రమైన తాగునీటి హక్కు
- ఆడుకునే హక్కు
- విశ్రాంతి పొందే హక్కు
- సమాన ఆరోగ్య అవకాశాలను పొందే హక్కు
- శారీరక, ఆర్థిక దోపిడీనుండి విముక్తి పొందేహక్కు కలిగిఉన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలు జీవించాలి. అందరికీ సమానమైన అవకాశాలు కల్పించి వారు బాగుగా జీవించేటట్లు చెయ్యాలి.

**3. భాగస్వామ్యహక్కు (Right to particiapte):**

- ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే హక్కు.
- మనిషిగా గుర్తింపు పొందేహక్కు.
- గౌరవాన్ని పొందే హక్కు
- ప్రశంసలు పొందే హక్కు
- భావవ్యక్తీకరణ హక్కు
- అభిప్రాయాల్ని వ్యక్తపరచేహక్కు
- సమాచారం పొందే హక్కు
- స్వేచ్ఛగా ఆలోచించే హక్కు
- మత స్వాతంత్ర్యపు హక్కు
- ప్రేమ, స్నేహాన్ని కలిగివుండే హక్కు
- వివక్షతలనుండి విముక్తి పొందే హక్కు

నేర్చుకోవడంలో పిల్లలు పాల్గొన్నపుడే వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించినపుడే వారు స్వేచ్ఛగా పాల్గొని జ్ఞాన నిర్మాణం చేసుకుంటూ అభివృద్ధి చెందుతారు. పిల్లలు ఏ ఏ అంశాలలో అభిరుచి కలిగిఉన్నారో గమనించి ఆయా ఆటలు, పాటలు ఇతర నైపుణ్యాలలో పాల్గొనేటట్లు చేస్తూ వారిని అభివృద్ధి పరచాలి.

**4. రక్షణ పొందేహక్కు(Protection Rights):**

- పిల్లలు శారీరక, ఆర్థిక దోపిడీకి గురికాకుండా రక్షణ పొందే హక్కు.
- లైంగిక (మానసిక, శారీరక) వేధింపులనుండి విముక్తి పొందే హక్కు.
- తల్లిదండ్రుల సంరక్షణలో ఉండే హక్కు.
- ప్రేయ ఆప్యాయతలను పొందే హక్కు.

- సామాజిక భద్రత పొందే హక్కు
- అవమానంనుండి రక్షణ పొందేహక్కు
- హింస, వేధింపులనుండి రక్షణ పొందే హక్కు

లింగ వివక్ష, కులవివక్ష, మత వివక్ష, ప్రాంత వివక్ష, దోపిడీ, దౌర్జన్యం, హింస వంటి వాటినుండి రక్షణ పొందే హక్కులు బాలలు కలిగి ఉన్నారు. దండన, శిక్షలు ప్రమాదాలనుండి రక్షణ పొందే హక్కును కలగివున్నారు.
అందరికి సమాన అవకాశాలు కల్పించాలి. బడి బాల్యానికి రక్షణ కల్పించే ఒక ప్రదేశం. భద్రత, ఆప్యాయత, సమస్యలు అడిగి తెలుసుకొని పిల్లలను సమస్యను నుండి దూరం చేయాలి. బడి వారికి ఒక సమస్య కాకూడదు.

కావున ఉపాధ్యాయులు బాలల హక్కులను దృష్టియందుంచుకొని వారు ఆనందంగా ఉత్సాహంగా ఉండే విధంగా చేయాలి. పిల్లల్లో స్వాభావికంగా ఉండే కుతూహలం, ఉత్సుకతను పెంచి పోషించాలి. పిల్లలకు ఇంటి దగ్గర, సమాజంలో ఎక్కడైనా వేదింపులు వుంటే తెలుసుకొని అరికట్టాలి. ఏమైనా సమస్యలు ఉంటే మా ఉపాధ్యాయునికి చెపుతాం అనే ధీమాను విద్యార్థులు కలిగి ఉండేలా చేయాలి. పాఠశాల బాలల హక్కుల పరిరక్షణ కేంద్రంగా పనిచేయాలి. బోధనలో అభ్యసనలో ఈ హక్కుల అమలు కన్పించాలి. బాలల హక్కులే మానవ హక్కులు. పిల్లల, శారీరక, మానసిక నైతిక అభివృద్ధికి పాఠశాల వివిధ కృత్యాలు, కార్యక్రమాలు నిర్వహించాలి. భయరహిత, స్వేచ్ఛాపూరిత, దండనలు లేని పాఠశాల వాతావరణాన్ని అమలుచేయాలి. దీనికి బాధ్యత వహించాలి.

## 4.13 భయరహిత వాతావరణం – వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలు
## (Fear Free Environment - Implementation)

- పిల్లలతో చర్చించి నియమాలు రూపొందించడం
- పిల్లల్లో మంచి ప్రవర్తన, సానుకూల దృక్పథంపై దృష్టిపెట్టడం, ప్రశంసించడం.
- పిల్లల నుండి ఆశించే ఫలితాలను, ప్రవర్తనలను గురించి వారితో సంప్రదించడం.
- సానుకూల దృక్పథం పెంపుదలకు వివిధ వ్యూహాలను అమలుపరచడం
- ఒకరి ప్రగతిని మరొకరితో పోల్చకపోవడం.
- పిల్లలు ప్రతిస్పందించడానికి అవకాశమివ్వడం.
- పరిమితులను వివరించడం, ప్రగతిపై స్పష్టతనివ్వడం
- అవసరమయినప్పుడు తగిన అవకాశాలివ్వడం.
- విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులతో చర్చించడం, సాధ్యమైనంత వరకు పిల్లల మంచిని, వారు చేయగలిగే వాటి గురించి చెప్పడం.
- పిల్లలతో చర్చించి సమయానికి తగిన వ్యూహాలను అమలుచేయడం.
- సానుకూలమైన శ్రద్ధచూపటం
- పిల్లలు మంచిగా ఉండే సందర్భాలు గుర్తించి వారిని మెచ్చుకోవడం.
- తమ పని త్వరితంగా పూర్తిచేసే పిల్లలకు అదనపు పని కల్పించడం.
- స్వల్ప సంఘటనలు, లోపాలను విస్మరించడం.

- 'నువ్వు ఈ విధంగా చెయ్యాలి' అని చెప్పడానికి బదులు 'నేను ఈ విధంగా చేస్తాను' అని చెప్పేలా అవకాశమివ్వడం, తగిన స్వేచ్ఛనివ్వడం.
- 'చేయవద్దు' అనే ఆదేశాలను ఉపయోగించకుండడం
- పిల్లలతో సకారాత్మక ధోరణిలో మాట్లాడడం
- పిల్లలు తమంతట తాము పరిమితులు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం.
- అవసరమైన తరగతిగది ఏర్పాటు చేయడం.
- విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించి వాటిని తప్పనిసరి చేయడం.
- అర్థవంతమైన ఆలోచన రేకెత్తించే పనులను కల్పించడం.
- పిల్లలు అభిప్రాయాలు వ్యక్తపరచేలా భావప్రకటనకు అవకాశమివ్వడం.
- పిల్లలు చెప్పింది పూర్తిగా వినడం, వారిపై నమ్మకాన్ని ప్రదర్శించడం.
- కృత్యాధార బోధన పద్ధతి ద్వారా పిల్లలను ఎక్కువగా భాగస్వాములను చేయడం.
- పిల్లలకు ఇష్టమైన అంశాలను ప్రోత్సహించడం.
- పిల్లల కుటుంబ నేపథ్యాన్ని అర్థంచేసుకోవడం.

## 4.14 పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం వీటి ప్రాముఖ్యం

## (Promoting self confidence and Self esteem in children. Its Importance)

- ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం ఏవ్యక్తినైనా తాను అనుకున్న గమ్యాన్ని చేరుస్తాయి. బడి వాతావరణం, ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధన వీటిని పెంపొందించేవిధంగా ఉండాలి. వీటిని పెంపొందించకున్న పరవాలేదుకాని ఎటువంటి పరిస్థితుల్లోకూడా వీటిని పోగొట్టే విధంగా కించపర్చడం, అవమానపర్చడం, వివక్షణ చూపెట్టడం, నీకు చదువురాదని అందరి ముందు అనడం లాంటివి చేయకూడదు. స్వాభావికంగా ప్రతి బిడ్డ ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం కలిగివుంటారు. ఇవి వ్యక్తులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళతాయి.
- పిల్లలు తదానుభూతి పొందవలసిన అవసరముంది.
- పిల్లల్లో సామర్థ్యం ఉన్నది. అందరి పిల్లలు నేర్చుకోగలరు. నేర్చుకునేది ఉపాధ్యాయునిమీదనే ఆధారపడి ఉన్నది. నేర్పేవిధానం బాగుండాలి. దానిపై ఆలోచించాలి అనే ఆలోచన ఉపాధ్యాయులకు ఉండాలి.
- ఏ విషయమైనా చెప్పేటప్పుడు సంక్లిష్టం చేయకుండా, అర్థవంతంగా, వివరంగా ఉదాహరణలతో చెప్పాలి. సుదీర్ఘమైన ఉపన్యాసంలా ఉండరాదు.
- పిల్లల అభిప్రాయాలను కించపరచరాదు, ఖండించరాదు.
- లక్ష్యాన్ని నిర్ధారించినపుడు పిల్లలస్థితిని అర్థం చేసుకోవాలి, లక్ష్యసాధనలో సహకరించాలి.
- పిల్లల పని 100% లేకపోయినప్పటికి వారిని ప్రశంసించి, వందశాతం లక్ష్యాలు సాధించుటకు సహాయం కొనసాగించాలి.
- పెద్దవాళ్ళను అర్థంచేసుకొని, గౌరవించినట్లే పిల్లల పట్ల ప్రవర్తించాలి.
- పిల్లలపై మన అంచనాలు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించాలి.

- ప్రతి పిల్లవాడు ప్రత్యేకమే. వారి నైపుణ్యాలను గుర్తించకుండా అన్ని అంశాలు సాధించాలని ఒత్తిడికి గురిచేస్తే విద్యార్థి ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. భవిష్యత్తుపై సానుకూల దృక్పథం కోల్పోతారు.
- పిల్లల లోపాలను సవరించునపుడు సానుకూలంగా వ్యవహరించాలి.
- ఆత్మవిశ్వాసం, సాంఘిక నైపుణ్యాలు వంటివి బాల్యంలోనే పెంపొందించవలసి ఉంటుంది.
- నూతన నైపుణ్యాలను పెంపొందించుకొని వాటిపై పట్టుసాధించేలా చూడాలి.
- తమ సొంత ప్రగతిని విశ్లేషించుకొనేలా మన చర్యలుండాలి.
- మన పట్ల ఎవరైనా ఎలా ప్రవర్తించాలనుకుంటామో అలా పిల్లల పట్ల మన ప్రవర్తన ఉండాలి.
- పిల్లలకున్న అన్ని సమస్యలను పరిష్కరించకుండా, ఆ సమస్యలను సొంతంగా వారే పరిష్కరించుకునేలా సహకారం అందించాలి. తాను సొంతంగా ఏదైనా సాధించగలననే నమ్మకాన్ని కలిగించాలి.
- పిల్లల్లో భావోద్వేగ, నీతి, సాంఘిక, ఆదర్శవంత విలువలు, సృజనాత్మకత, మేధోపరమైన అంశాలను పెంపొందించే వాతావరణాన్ని కల్పించాలి. అలాంటి పనులు ఇవ్వాలి.
- ఒకరి జీవితంలో సంతోషాన్ని, విజయాలను సాధించే వైఖరిని పెంపొందించే శక్తివంతమైన కారకమే ఆత్మస్థైర్యం. ఇది ఎల్లప్పుడూ మాటల్లో, చేతల్లో, నిర్ణయాల్లో, నమ్మకాలలో ప్రతిబింబించాలి.
- ఆత్మస్థైర్యం ఉన్న పిల్లలు తమపట్ల నమ్మకాన్ని కలిగి ఉండడం, ఇతరులపట్ల సరిగ్గా ప్రవర్తించడం, పరిస్థితులను తగినట్లుగా ఎదుర్కోవడం, తమచుట్టూ ఉన్న ప్రపంచంపట్ల జాగరూకత కలిగి ఉంటారు. కాబట్టి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ఎలాంటి పనులు చేయరాదు.
- ఇతరుల ముందు కించపరచరాదు, తక్కువ చేసిమాట్లాడరాదు.
- లైంగికంగా, శారీరకంగా వేధింపులకు గురయిన బాలలు పూర్తిస్థాయిలో ఆత్మస్థైర్యం కోల్పోతారు.
- పిల్లలను కఠిన పదజాలంతో దూషిస్తే పిరికివారిగా, భయస్థులుగా, బిడియస్థులుగా తయారవుతారు. ప్రోత్సాహకరమైన మాటలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి.
- పిల్లల్లో వారిపట్ల వారికి బలమైన నమ్మకాన్ని పెంపొందించాలి.
- అనుభవపూర్వక అభ్యసనం, సంక్లిష్టమైన విచారణ, సృజనాత్మకత కలిగిన కరికులం, శారీరక, భాష, గణితాలు పిల్లల అభివృద్ధికి తోడ్పడతాయి.
- జట్టు పనులు, ప్రాజెక్టు పనుల వంటి పరస్పర సహకారానికి అవసరమైన వాటిని బోధనాభ్యసనలో ఉపయోగించాలి.
- ప్రాజెక్టులు, జట్టులో పనిచేయుట అనేవి, సాంఘిక అభ్యసనానికి, సమాజ పరిస్థితుల అవగాహనకు తోడ్పడతాయి.
- యోగా, ధ్యానం వంటివి పిల్లలు తమ శారీరక, మానసిక శక్తులను నియంత్రించే శిక్షణనిస్తాయి.
- సృజనాత్మక రచన, సభలు, సమావేశాలలో మాట్లాడడం, కళలు, నాటకాల వంటి వాటిలో పిల్లలు పాల్గొనేట్లు చూడాలి.
- ఇందుకు ఉపాధ్యాయుల పాత్రలో, బోధనాభ్యసన ప్రక్రియలలో నిర్ణయాత్మకమైన మార్పు రావాలి.
- పాఠ్యాంశాల బోధన సమయంలో నిజ జీవిత అంశాలను జతపరిచి బోధించాలి.
- ప్రాపంచిక సమస్యలు, సంగీతం, పుస్తకాలు, కళలపై చర్చలు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయి.
- మానవ మేధస్సు పారాచూట్ వంటిది. అది తెరచుకున్నప్పుడే విస్తృతమవుతుంది. కాబట్టి పరిసరాలలోని అన్ని

అంశాలకు ఎక్స్‌పోజర్ అయినప్పుడే చాలా అంశాలు అవగాహన అవుతాయని గుర్తించాలి. విస్తృతమైన జ్ఞానం, చర్చల్లో అవకాశాలు పిల్లలకు ఇవ్వాలి.

- మానవ హాస్యచతురత ద్వారా సంబంధాలను, జట్టుపనులను అభివృద్ధి చేస్తే వాటి ద్వారా నమ్మకం, విశ్వాసం పెంపొందుతాయి.

## 4.15 భయరహిత, దండనలేని వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలు – బాధ్యతలు (Fear Free and Punishment free environment and Freedom - Implementation - Responsibilities)

భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి పాఠశాలల్లో, సమాజంలో కరపత్రాలు, పోస్టర్స్, నినాదాలు రాయడం, కళాజాతలు, ప్రజాప్రతినిధులతో, మీడియాలో మాట్లాడించడం ద్వారా అవగాహన కల్పించాలి. పిల్లలు తమ భావాలు స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి చైల్డ్ సెల్స్, హెల్ప్‌లైన్స్, టోల్‌ఫ్రీ నంబర్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఉపాధ్యాయులు పాఠశాలల్లో పిల్లలను దండనకు గురిచేయమని, బెత్తం ఉపయోగించమని, ఎలాంటి వివక్షతకు గురిచేయని భయరహిత వాతావరణాన్ని, భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించుటకు అవకాశాలను కల్పిస్తామని ప్రతిన చేయాలి. దీనికి తల్లిదండ్రులు, అధికారులు, సమాజంలో ఉన్న ప్రతీ ఒక్కరు బాధ్యత వహించాలి.

- కార్పోరల్ పనిష్‌మెంట్, అవమానించడం జరిగితే బాలల హెల్ప్‌లైన్‌కు మాట్లాడాలి. (టోల్ ఫ్రీ నెంబరు 888) మానిటరింగ్ సెల్ (సి.పి.ఎం.సి)ని ఏర్పాటు చేయాలి.
- పాఠశాల స్థాయిలో సభ్యులుగా ఇద్దరు టీచర్లు, తల్లిదండ్రులు, న్యాయవాది, డాక్టరు, బాలల హక్కుల కార్యకర్త మరియు విద్యార్థులను ఉంచాలి.
- వీరు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించి తగు నిర్ణయాలు, చర్యలు వెంటనే తీసుకోవాలి.
- జిల్లా మెజిస్ట్రేట్ అధ్యక్షులుగా జిల్లాస్థాయి సి.పి.ఎం.సి.ని ఏర్పాటుచేయాలి. ఈ కమిటీ కోర్పోరల్ పనిష్‌మెంట్‌లపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తుంది.

**సి.పి.ఎం.సి.:**

- శారీరకదండన, బాలలపై లైంగిక దాడి, మానసిక వేధింపులు, వివక్షతలాంటి ఫిర్యాదులను జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలి.
- శారీరక దండన, లైంగిక దాడులు, వేధింపులు నిరోధించడానికి తగుచర్యలు తీసుకోవాలి. ఇందుకొరకు సి.పి.ఎం.సి.లో ఒక పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేయాలి.
- సి.పి.ఎం.సి. ఇలాంటి సంఘటనలకు చేసిన సిఫారసులను 48 గంటల్లోగా జిల్లా స్థాయి అధికారులకు తెలియజేయాలి.
- సమస్య ప్రాథమిక పరిష్కారాన్ని విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఆమోదించకపోతే అలాంటి ఫిర్యాదుల సెకండరీ పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదుచేసుకోవడానికి సిపిఎంసి అవకాశం కల్పించాలి.

**పాఠశాల యాజమాన్య సంఘం పాత్ర:**

- విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలు తమ హక్కులు అనుభవించడానికి సహకరించాలి.
- ప్రతిపిల్లవాడు పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తూ తమ సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి

తెచ్చుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలి.

- ఎటువంటి శారీరక, మానసిక దండలను అనుమతించకూడదు. ఇందుకుగాను పాఠశాలలో సి.పి.ఎం.సి.లను టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, డాక్టరు, న్యాయవాదితో ఏర్పాటుచేయాలి.
- విద్యార్థులు తమ ఫిర్యాదులు నిర్భయంగా అందజేయుటకు తగు వాతావరణాన్ని కల్పించాలి.
- తరచుగా ఎస్.ఎం.సి.లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలి.

**పాఠశాల పాత్ర:**

- ప్రతీ పాఠశాలలో శారీరక, మానసిక వివక్షవంటి వేధింపుల నిరోధానికి ఒక కమిటీని ఏర్పాటుచేయాలి.
- విద్యార్థులు తమకు కలిగిన ఇబ్బందులను నిర్భయంగా వ్యక్తపర్చడానికి ప్రతి తరగతిగదిలో ఒక ఫిర్యాదు పెట్టెను ఏర్పాటుచేయాలి.
- అన్ని రకాల భయాలు, దురభిమానాలు, వివక్షలకు తావులేని వాతావరణం నెలకొల్పటానికి సిబ్బంది కృషి చేయాలి. పిల్లలకు అవసరమైన కౌన్సిలింగ్ సౌకర్యం కల్పిస్తూ బాలమిత్ర వాతావరణం గల పాఠశాలగా తయారుచేయాలి.
- బాలలకు సంబంధించిన హక్కులు, విద్యాహక్కులపై స్ఫూర్తిని కలిగించడానికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను, అవగాహన సదస్సులను ఉపాధ్యాయులకు ఏర్పాటుచేయాలి.
- ప్రతి పాఠశాలలో శారీరకదండన, మానసిక వేధింపులు, వివక్షలపై వార్షిక సామాజిక తనిఖీని నిర్వహించాలి. ఈ నివేదికలు బహిర్గతం చేయాలి.
- ప్రతి పాఠశాలలో 'మా పాఠశాలలో ఎలాంటి శారీరక, మానసిక, వివక్షతలు లేని స్నేహపూర్వక వాతావరణం ఉంది' అనే బోర్డును ప్రదర్శించాలి.

## 4.16 భయరహిత వాతావరణం, వ్యక్తీకరణ స్వేచ్ఛ – అమలుకు సూచికలు

## (Fear Free Environment, Freedom of expression - Indicators of Implementation)

- ప్రతి పాఠశాలలో కూడా 'మా పాఠశాలలో భయరహిత, దండనలేని వాతావరణం, పిల్లలకు స్వేచ్ఛ మరియు చెప్పడానికి అవకాశం ఉన్నది' అని రాసి పెట్టాలి.
- ప్రతి పాఠశాలలో సి.పి.ఎం.సి.ల ఏర్పాటు.
- పాఠశాల నోటీసుబోర్డులో కార్పోరల్ పనిష్మెంట్స్ లేవనే సూచన బోర్డుల ఏర్పాటు.
- ప్రతి తరగతి గదిలో విద్యార్థుల నుండి ఫిర్యాదులు స్వీకరించడానికి వీలుగా బాక్సుల ఏర్పాటు.
- రెగ్యులర్‌గా ఎస్.ఎం.సి. సమావేశాల నిర్వహణ, భయరహిత వాతావరణంపై చర్చించిన మినిట్స్.
- బాలల సభను ఏర్పాటు చేయడం.
- పాఠశాలలో కౌన్సిలింగ్ సెల్ ఏర్పాటుచేయడం – ఉపాధ్యాయుల సమీక్ష
- వార్షిక సామాజిక తనిఖీ నిర్వహణ – నివేదికలను బహిర్గతపర్చడం.
- ప్రతీ పాఠశాలలో ఆటస్థలం, లైబ్రరీ, మంచినీటి, టాయిలెట్ సౌకర్యం కల్పించి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించడం.
- కార్పోరల్ పనిష్మంట్స్ ఉన్న పాఠశాలల గుర్తింపు రద్దుచేయడం.

- పాఠశాలలకు గుర్తింపునిచ్చేటప్పుడు భయరహిత వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మేనేజ్‌మెంట్ నుండి కార్పోరల్ పనిష్‌మెంట్ అమలు చేయమని ధృవీకరణ తీసుకోవడం.
- నమోదైన విద్యార్థులు అంతా పూర్తిస్థాయిలో హాజరవ్వడం.

## 4.17 ముగింపు (Conclusion)

బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (ఎస్‌సిపిసిఆర్), అలాగే రాష్ట్రస్థాయి కార్పోరల్ పనిష్‌మెంట్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటుచేయాలి. చట్టం అమలుతోపాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులు ఏ విధంగా విద్యను నేర్చుకుంటారనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

×××

*సమున్నత మానవ సమాజ లక్షణంగా మనం ప్రజాస్వామ్యాన్ని నిర్వహించుకుంటున్నాము. ఆధునిక విద్యావేత్తలందరూ ప్రవర్తిస్తున్నదీ పునః పునః ఉద్ఘాటిస్తున్నదీ తరగతి గదిలో ఈ ప్రజాస్వామ్యాన్ని గురించే అత్యున్నత ప్రజాస్వామిక, సామాజిక సంబంధాలకు అంకురార్పణ జరగాల్సిందీ మన విద్యా వ్యవస్థలోనే, విద్యా విధానంలోనే.*

*మన తరగతి గది అందుకు అనుగుణంగా ఉందా? అక్కడ ఒక అథారిటీ రాజ్యమేలుతోందా? స్వేచ్ఛాసుమాలు పరిమళిస్తున్నాయా? అక్కడ ఒక అగాధం విస్తరిస్తోందా? అనుబంధం పురి విప్పుతోందా? భయానికీ అభద్రతకూ తావులేని తమ సొంత ప్రపంచాన్ని పిల్లలు తమ తరగతి గదిలో దర్శించుకోగలుగుతున్నారా? అశ్లీలత, పోటీతత్వం, అత్యాశ, అక్కడ అంతరాలను పెంచుతున్నాయా?*

*చిన్నారి లోకంలో లేని ప్రజాస్వామ్యం పెద్దల సంకుచిత ప్రపంచంలో ఎక్కడ నుంచి వస్తుంది? ఎలా నిలదొక్కుకుంటుంది? ఎలా ఒక సంస్కృతిగా వికసిస్తుంది? ఈ దృష్టి నుంచి మనం మన తరగతి గదిని చూస్తున్నామా?*

**– (సౌజన్యం – చదువు)**

**చదువు – పిల్లలు, స్వేచ్ఛ–చర్చ**

*ఉపాధ్యాయుడు కుమ్మరించిన అంశాల్ని పిల్లలు ఎంత నిర్విరామంగా బుర్రల్లో నింపుకుంటారో అంతగా వారు తమ వివేచనను కోల్పోతారు. ప్రపంచ గమనంలో, మార్పులో వారు అంతగా తమ ప్రమేయాన్ని పోగొట్టుకుంటారు. తమకు నిమిత్తం లేనిదాన్ని రుద్దుతున్నప్పుడు పిల్లలు ఎంత నిరాసక్తంగా భరిస్తారో వాళ్ళు జీవితంలో అంతగా సర్దుకొని పోగల, అజమాయిషీకీ లోబడగల జీవులుగా మారుతారు. ప్రపంచం పట్ల మనం వారికందిస్తున్న అసమగ్ర, పాక్షిక దృక్పథం పిల్లల్నిలా మారుస్తుంది.*

**– ఫాలో ఫెరీ**

# 5. నిరంతర సమగ్ర మూల్యాంకనం (Continuous & Comprehensive Evaluation)


5.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
(Basic Questions - Think and Reflect)
5.2 నేపథ్యం (Context)
5.3 మూల్యాంకనం – ప్రస్తుత పరిస్థితి (Assessment - Existing Situation)
5.4 RTE-2009 - మూల్యాంకనం (RTE - 2009 - Evaluation)
5.5 జాతీయ విద్యా ప్రణాళిక చట్టం–2005 – మౌలిక సూత్రాలు
(National Curriculum Framework - 2005 Core Principles)
5.6 రాష్ట్ర విద్యా ప్రణాళిక పత్రం–2011 – మౌలిక సూత్రాలు మరియు మూల్యాంకనం పై దృక్పథం
(State Curriculum Frame Work -2011 - Core Principles and Perspectives on Evaluation)
5.7 పాఠశాల విద్య – రాష్ట్ర దృక్పథం (School Education - State Vision)
5.8 CCE – పరీక్షల సంస్కరణలు (CCE - Examinations Reforms)
5.9 నిరంతర సమగ్ర మూల్యాంకనం–భావనలు–అవగాహన (CCE- Conceptual understanding)
5.9.1 పిల్లల సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటి?
(What is Comprehensive Development of the child?)
5.9.2 CCE ఎందుకు? (Why CCE?)
5.9.3 CCE లక్షణాలు (Characteristics of CCE)
5.10 మూల్యాంకనం స్వభావం (Nature of Assessment)
5.10.1 నేర్చుకోవడంలో భాగంగానే (అభ్యసనం జరిగేటప్పుడే మూల్యాంకనం) మూల్యాంకనం
(Assessment as Learning)
5.10.2 అభ్యసనం కొరకు (మెరుగుపర్చడానికి) మూల్యాంకనం (Assessment for Learning)
5.10.3 అభ్యసనం యొక్క మూల్యాంనం (Assessment of Learning)
5.11 మూల్యాంకనం చేయాల్సిన అంశాలు (1–5 మరియు 6–9 తరగతులు)
(Areas of Assessment (1-5 and 6-9 classes)
5.12 వేటిని మూల్యాంనకం చేయాలి? (What to assess?)
5.13 CCE – ఎలా మూల్యాంకనం చేయాలి? – విధానాలు (CCE – How to assess? – Procedures)
5.14. నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Assessment)
5.15 సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Assessment)
5.16 సహపాఠ్యాంశాల మూల్యాంకనం (Assessment of other curricular areas)
5.17 CCE – రిజిష్టర్లు, రికార్డులు (CCE - Registers and Records)
5.18 CCE – నిర్వహణ – బాధ్యతలు (CCE - Implementation - Roles & Responsibilities)
5.19 CCE – అమలు – సూచికలు – ఆధారాలు
(CCE - Indicators of implementation - Evidences)
5.20 ముగింపు (Conclusion)

## బోధనా కళ

పిల్లలు ఒక అంశాన్ని ఎంత బాగా నేర్చుకోగలరు అనేది దాన్ని నేర్చుకొనే సమయంలో వాళ్ళు అంశాన్ని ఎలా చూస్తున్నారనే దాన్నిబట్టి దాన్ని నేర్చుకోవడంలో తమ శక్తిపట్ల ఎంత విశ్వాసం కల్గివున్నారనేదాన్నిబట్టి వుంటుంది. 'మేం చెయ్యగలం, మాకా శక్తివుంది' అని ఆత్మవిశ్వాసం వున్నపుడు ఎంత కష్టమైనదాన్నైనా వాళ్ళు సాధించగలరు. 'ఈరోజో రేపో ఇది నాకు దక్కితీరుతుంది' అనే దృష్టితో పిల్లలు అంశాన్ని చూస్తున్నారా? ఇది నాకు కష్టం. ఇంత కష్టమైంది నేనెప్పుడూ చూడలేదు. అనే దృష్టితో దాన్ని చూస్తున్నారా? అనేది గుర్తించి నేర్పడానికి పూనుకోవడమే అసలైన బోధనా కళ.

**– జాన్ హోల్ట్**

---

## పిల్లలూ – తప్పులూ

పిల్లలు మాట్లాడేటప్పుడూ, చదివేటప్పుడూ, రాసేటప్పుడూ, మరేదైనా పని చేసేటప్పుడూ ఏతప్పు దొర్లినా వెంటనే దాన్ని సరిదిద్దాలని లేకుంటే అది సరిచెయ్యలేని అలవాటుగా మారిపోతోందని మనలో చాలా మంది పెద్దవాళ్ళు అనుకొంటారు. ఈ సిద్ధాంతంపట్ల నాకు నమ్మకంలేదు. పిల్లలు నడవడం దగ్గర్నుంచి రాయడందాకా ప్రతి పనీ తప్పులుచేస్తూనే నేర్చుకోడానికి ప్రయత్నం చేస్తారు. ఆ తప్పుల్ని ఒక క్రమంలో వాళ్ళే సరిదిద్దుకొంటారు.

తాము చేసే పనివల్ల తామనుకొన్న ఫలితం రాకపోతేనే, పెద్దలు చేసే పనికీ తమ పనికీ పెద్ద తేడా వున్నట్లనిపిస్తేనే పిల్లలు దానికనుగుణంగా తమ తప్పుల్ని సరిదిద్దుకొంటారు. పిల్లలందరికీ ఇలా చెయ్యడం తెలుసు. చాలా బాగా తెలుసు. ప్రతీ తప్పును అదేపనిగా వెతికిపట్టుకొనే పెద్దలుండే ఇళ్ళలో సైతం పెద్దలు సరిచేసే తప్పులకన్నా పిల్లలు తమంతటతాము సరిదిద్దుకొనే తప్పులు ఎక్కువ.

**– జాన్ హోల్ట్**

జ్ఞానాన్ని కేవలం ప్రత్యేక నైపుణ్యం గాని లేదా అటువంటి నైపుణ్యాల ప్యాకేజిగా గాని భావించడం లేదు. అది నిరంతర ప్రక్రియ. సమగ్ర రూపకల్పన, సమూహారం, విస్తృత ప్రాపంచిక దృక్పథం. మనషులు తమకై తాము ఉమ్మడిగా నిర్మించుకుని బలపరచుకునే సమిష్టి బాధ్యత.

అలాకాక, విద్య కేవలం నైపుణ్యసము పార్థనే అని మనం భావించినట్లయితే అప్పుడది పూర్తి సాంకేతిక వ్యవహారంగా మారిపోవడమే కాక, ఆ సాంకేతిక వ్యవహారం కూడా వస్తూత్పత్తి లక్షణాన్ని సంతరించుకుంటుంది. అంటే జ్ఞానం అనుభవంగా కాక కమాడిటీగా మారుతుంది. దానికి ఉత్పత్తిదారులూ, కొనుగోలుదారులూ వచ్చి చేరతారు.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెలకువలు)**

# 5. నిరంతర సమగ్ర మూల్యాంకనం
## (Continuous Cmprehensive Evaluation)

### 5.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
### (Basic Questions - Think and Reflect)

1. మదింపు అంటే ఏమిటి? (What is assessment?)
2. నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఏమిటి?
   (What is Continuous and What is Comprehensive Evaluation?)
3. మూల్యాంకనం ఎందుకు? దాని ఉద్దేశ్యం ఏమిటి? (Why evaluation? What is its purpose?)
4. వేటిని మదింపు చేయాలి? (What to assess?)
5. ఎలా మదింపు చేయాలి? (How to assess?)
6. మదింపు ద్వారా పిల్లలకు ఇచ్చే సమాచారం స్వభావం ఏమిటి? ఎందుకు?
   (What is the nature of the feed back? why and to whom?)
7. ఏ విధంగ మదింపు సమాచారాన్ని రిపోర్టు చేస్తాం? రిపోర్టింగ్ పద్ధతులు ఏమిటి?
   (How to report -reporing process?)
8. సి.సి.ఇ లో ఎవరు, ఏ ఏ బాధ్యతలు ఏఏ స్థాయిలలో స్వీకరించాలి?
   (What are the roles and responsibilties for effective implementation of CCE at various levels?)

### 5.2 నేపథ్యం (Context)

మూల్యాంకనం అనగానే పిల్లలకు పరీక్షలు నిర్వహించడం అనే భావన మనలోఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం కూడా మూల్యాంకనాన్ని పరీక్షల కోణంలో మాత్రమే చూడడానికి అలవాటు పడినారు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని నిరంతరం బట్టీ పట్టించి పరీక్షలలో రాయడమే బోధనా లక్ష్యంగా మారిపోయింది. మూల్యాంకనం పేరిట నిర్వహించే పరీక్షలు పిల్లలలో పాఠశాలపట్ల, నేర్చుకోవడంపట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి బదులుగా భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

పిల్లల ప్రగతిని మాపనం చేయడానికి ఉపయోగించే మార్కులు, ర్యాంకులు పిల్లలపై నిరంతరం ఒత్తిడి కలిగిస్తున్నాయి. అందువల్ల వారి శారీరక, మానసిక వికాసాలకు ఆటంకం కల్గుతుంది. మార్కుల సాధనే ధ్యేయంగా బోధనాభ్యసన ప్రక్రియలు కూడా మార్పు చెందాయి. మూల్యాంకనం పిల్లల అభిరుచులు, సామర్థ్యాలతో సంబంధం లేకుండా ఏక మొత్తంగా సాగే పరీక్షాకార్యక్రమంగా అమలవుతుంది. పరీక్షా ఫలితాల సాధనలో అవాంఛనీయ అంశాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అసంబద్ధమైన పోటీ తత్వం పిల్లల ఉద్వేగ వికాసానికి, జీవన నైపుణ్యాల సాధనకు తావులేకుండా పోయింది. యూనిట్, టర్మినల్ పరీక్షల పేరుతో నిర్వహిస్తున్న మూల్యాంకనం, పిల్లలు ఉత్తీర్ణులయ్యారు, కాలేదు అని ముద్ర వేయడానికి మాత్రమే తోడ్పడుతోందే తప్ప లోపాలను గుర్తించి సామర్యాల సాధనను మెరుగుపరచేందుకు ఉపయోగపడడం లేదు.

ప్రస్తుత మూల్యాంకనం ఉపాధ్యాయ కేంద్రీకృతంగా అమలవుతోంది. ప్రగతి పత్రాల పేరిట పిల్లలకు అందించే సమాచారంలో పాఠ్య విషయాలపై మూల్యాంకనం మాత్రమే చోటుచేసుకుంటుంది. చాలా సందర్భాలలో మనం నిరంతర, సమగ్ర మూల్యాంకనం నిర్వహిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ పాఠ్యవిషయాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నాం.

సహపాఠ్యాంశాలకు  అనగా ఆరోగ్య–వ్యాయామ విద్య, కళలు–సాంస్కృతిక విద్య, పని–కంప్యూటర్ విద్య, విలువల విద్య–జీవన నైపుణ్యాలు మొదలగు వాటికి తగినంత ప్రాధాన్యత నివ్వడంలేదు. పైగా నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఎక్కువగా పరీక్షలు పెట్టడమనే అపోహ పడుతున్నాం. విధాననిర్ణయ కర్తలు, విద్యారంగ నిపుణులు,  ఉపాధ్యాయులు నిరంతర, సమగ్ర మూల్యాంకనం యొక్క నిజమైన స్వభావాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

## 5.3 మూల్యాంకనం – ప్రస్తుత పరిస్థితి (Assessment - Existing Situation)

- విద్యా లక్ష్యాలకు మరియు మూల్యాంకనం చేసే విధానం మరియు అడిగే ప్రశ్నలకు సంబంధం లేకపోవడం.
- విద్యార్థుల అభ్యసనాన్ని కేవలం రాతపరీక్షల ద్వారానే మాపనంచేయడం జరుగుతుంది. మౌఖికం మరియు ప్రదర్శనలకు అవకాశం తక్కువ ఉండడం.
- పరీక్షలలో పిల్లల ప్రగతి ఆధారంగా, బోధనలో మార్పులు లేక సరణనాత్మక బోధన జరగడం లేదు. పిల్లల ప్రగతి బాగా లేకున్నా కూడా, తరవాత సిలబస్ చెప్పడం చేస్తున్నారు. పిల్లలకు వచ్చినా రాకున్నా సిలబస్‌కు పూర్తి ప్రాముఖ్యత ఇచ్చి మా పని అయిపోయింది అనిపిస్తున్నారు.
- పిల్లలలో ఆలోచనశక్తి, విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షించే ప్రశ్నలు కాకుండా, కేవలం బట్టీపట్టి జవాబులు రాసే ప్రశ్నలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.
- అభ్యసనం అనేది పుస్తకాధారితం అయింది. సమాచారం ఇవ్వడం మరియు ఇచ్చిన దానిని యథాతథంగా పరీక్షించడం అనేది విద్యలో పరమార్థం అయినది.
- విద్యా ప్రణాళిక, విద్య యొక్క ముఖ్య ఉద్దేశ్యం– విద్యార్థిని సర్వతోముఖాభివృద్ధి కలిగిన ఒక పరిపూర్ణ మానవునిగా తయారు చేయడం. కాని కేవలం, భాషలు, గణితం, సైన్సు, సాంఘికశాస్త్రాలకే ప్రాధాన్యత ఇస్తూ, కళలు, ఆటలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, విలువలు ఏవైతే వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి, సమాజంలో కలిసి జీవించడానికి తోడ్పడతాయో, వాటిని విస్మరించడం జరిగింది.
- బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడు పిల్లలు ఏ విధంగా, ఎంత వరకు నేర్చుకుంటున్నారు అనేది అప్పటికప్పుడు తెలుసుకోకుండా పరీక్షల వరకు ఆగి, అప్పుడు తెలుసుకొని, ఎంత మంది ఎంత వరకు నేర్చుకొన్నారు అనే దాన్ని చూస్తున్నారు.
- పరీక్షల ఆధారంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మార్చుకోవడం కానీ అభివృద్ధి పరచుకోవడం గానీ, లేక ఎలా? ఏ పద్ధతిలో చెబితే ఫలితం బాగా వస్తుందో ఆలోచించడం లేదు. పిల్లల ప్రగతి కేవలం వారి ప్రతిభా పాటవాల మీదనే ఆధారపడి ఉన్నది అనేది ఎక్కువ మంది ఉపాధ్యాయుల నమ్మకం.
- బోధన అనేది పరీక్షలకు అనుగుణంగా పరీక్షలకు తయారు చేయడం లేక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని చేయడం జరుగుతుంది. అందువలనే గైడ్లకు, నోట్సుకు, ప్రశ్న జవాబుల సామాగ్రికి, టెస్ట్ పేపర్‌కి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు.
- మూల్యాంకన విధానాలను బట్టి చదువు ఉంటుంది. అంటే ఉపాధ్యాయుల పనితీరు మరియు పిల్లల తయారీ కూడా పరీక్షలకు లోబడే ఉంటుంది.

పిల్లలకు పాఠశాలలో అందజేయవలసిన అభ్యసనానుభవాల నేపథ్యంలో వ్యక్తిపరంగానూ, సమాజ పరంగానూ విద్యాలక్ష్యాలను రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం వివరిస్తుంది. ఇది పాఠశాల విద్యా కార్యక్రమాలకు, పాఠ్యప్రణాళిక,

పాఠ్యపుస్తకాల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది. విద్యాలక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధమైన కృత్యాల రూపకల్పన, బోధనాంశాల, బోధనావిధానాల ఎంపిక, సామగ్రి, మూల్యాంకన విధానాలు మొదలైనవాటిపై ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం సూచించింది. తద్వారా పిల్లల్లో గుణాత్మకమైన విద్యను సాధించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది.

## 5.4 RTE-2009 - మూల్యాంకనం (RTE-2009 – Evaluation)

విద్యను పొందే హక్కుతోపాటు విద్యా నాణ్యతపై కూడా ఆర్.టి.ఇ. దృష్టిసారించింది. ఎలిమెంటరీ విద్యలో గుణాత్మకత సాధనకు అవసరమైన నియమావళిని ఆర్.టి.ఇ. చట్టంలోని 5వ భాగం పేర్కొంది.

పాఠ్యప్రణాళిక, మూల్యాంకనం రూపొందించడంలో కింది అంశాలు దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది.

- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి..
- పిల్లవాని సమగ్ర అభివృద్ధి జరగాలి.
- పిల్లల్లో జ్ఞానాన్ని, శక్తులను, నైపుణ్యాలను పెంపొందించాలి.
- బాలల పూర్తిసామర్థ్యం మేరకు శారీరక, మానసిక సామర్థ్యాల అభివృద్ధి జరగాలి.
- పిల్లల మనసులు గాయపరచకుండా పిల్లలను నిర్భయంగా, ఆందోళన ఒత్తిళ్ళు లేకుండా చేసి వారు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తంచేసేలా చూడాలి, దానికి సహాయపడాలి మరియు ప్రోత్సహించాలి.
- పిల్లలను కేంద్రంగా చేసుకొని వారు నేర్చుకునే పద్ధతుల్లో, అనువైన విధానాల్లో అనగా ఆవిష్కరణ, పరిశీలన, పరిశోధన, కనుగొనడం ద్వారా నేర్చుకొనేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఉండాలి.
- పిల్లల జ్ఞాన అవగాహనను, అర్థం చేసుకున్న విదానాన్ని, జ్ఞానాన్ని నిజజీవిత సన్నివేశాలలో వినియోగించే సామర్థ్యాన్ని సమగ్రంగా నిరంతరంగా మూల్యాంకనం చేయాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేంత వరకు ఏ పిల్లవాడు ఎలాంటి బోర్డ్ పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.
- బాలుడు / బాలిక ఎలిమెంటరీ విద్య పూర్తి చేసిన తరువాత సూచించిన ప్రకారం వారికి ధృవీకరణ పత్రం ఇవ్వాలి.

భారత రాజ్యాంగం ప్రకారం విద్య ప్రాథమిక హక్కుగా నిర్ణయించడం వల్ల ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలంతా తప్పనిసరిగా బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందాలి. పిల్లలంతా పాఠశాలలో చేరడంతో సరిపోదు. వారు బడిలో ప్రాథమిక విద్య పూర్తిఅయ్యేదాకా కొనసాగాలి. నాణ్యమైన విద్యను పొందాలి. నేర్చుకుంటున్న విద్య నాణ్యమైనదా కాదా అనేది మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉంది. ఇంతవరకు పిల్లలను పాఠశాలలకు తీసుకురావడం వారికి మంచి విద్య అందేలా కృషిచేయడం అన్నది ఉపాధ్యాయుల నైతిక అంశంగా ఉన్నది. కానీ నేడు అది చట్టబద్ధమయింది. విద్యాహక్కుచట్టం అధ్యాయం 5, సెక్షన్ 29 సబ్‌సెక్షన్ 2 ప్రకారం పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలని నిర్దేశించింది. సమగ్రంగా అంటే పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక, ఉద్వేగ అంశాలన్నింటిని మూల్యాంకనం చేయాలి. విద్యాహక్కుచట్టం మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటపుడు ఏ ఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో స్పష్టంగా సూచించింది.

విద్యాహక్కు చట్టం సూచించిన విధంగా మూల్యాంకనం చేయడమంటే పిల్లల సామర్థ్యాల సాధనతోపాటు, బోధనాభ్యసన ప్రక్రియను ఉపాధ్యాయుని పనితీరును కూడా పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. అంటే మూల్యాంకనం ఉపాధ్యాయుని పనితీరుతో ముడిపడిన అంశంగా గుర్తించాలి. బోధనాభ్యసన ప్రక్రియ శిశుకేంద్రీకృతంగా ఉందా లేదా

అనేది మూల్యాంకనం నిర్ధారించాలి. అంటే దీనిలో జ్ఞానాన్ని కాకుండా దాన్ని అన్వయించుకునే విధానాన్ని మూల్యాంకనం చేయాలి. అన్వయం అనేది నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగించడం, తదుపరి అంశాలు నేర్చుకోవడానికి ఉపయోగించుకోవడం అనే అంశాలు మూల్యాంకనం చేయాలి. అంటే ప్రస్తుతం ఉన్న ప్రశ్నల స్వభావం మారాల్సి వుంటుంది. దానితోపాటు మూల్యాంకనం నిరంతరంగాను, సమగ్రంగాను నిర్వహించాలి కాబట్టి ప్రత్యేకంగా బోర్డు పరీక్షల అవసరం లేదని కూడా సూచించింది.

మూల్యాంకనం సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలి అంటే నిర్ధారిత సమయంలోపు పాఠ్యాంశాలన్నీ పూర్తిచేయడం కూడా ఉపాధ్యాయుల బాధ్యతగా విద్యాహక్కుచట్టం ప్రతిపాదించింది. నిరంతర సమగ్ర మూల్యాంకనం ఆధారంగా ప్రతి విద్యార్థి నేర్చుకొనే సామర్థ్యాన్ని అంచనావేసి దాని ఆధారంగానే అదనపు బోధన అందించడం. పిల్లల ప్రగతిని వారు నేర్చుకొనే విధానాన్ని మూల్యాంకనం చేసి తల్లిదండ్రులు, సంరక్షకుల సమావేశాలలో వారి ప్రగతిని ప్రదర్శించాలని కూడా సూచించింది.

### 5.5 జాతీయ విద్యా ప్రణాళిక చట్టం-2005 – మౌలిక సూత్రాలు

### (National Curriculum Frame work – 2005 Core Principles)

దేశ విద్యా వ్యవస్థ ఆధునీకరణకు ఒక సాధనం జాతీయ విద్యా ప్రణాళిక చట్రం - 2005. విద్య ఇలా ఉండాలని ఎన్.సి.ఎఫ్ సూచించింది.

- బడి బయట జీవనానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం.
- బట్టీ పద్ధతుల నుండి అభ్యసనను దూరంచేయడం.
- పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా పిల్లల్లో సమగ్ర వికాసానికి పాఠ్యప్రణాళికను పరిపుష్టం చేయడం.
- పరీక్షలను మరింత సరళంచేసి తరగతి గది జీవనానికి అనుసంధానం చేయడం.
- దేశ ప్రజాస్వామిక నియమాలకు లోబడి పిల్లల ఆసక్తులు, అభిరుచులను అభివృద్ధిపరచడం.

### 5.6 రాష్ట్ర విద్యా ప్రణాళిక పత్రం-2011 – మౌలిక సూత్రాలు మరియు మూల్యాంకనంపై దృక్పథం

### (State Curriculum Frame Work -2011 - Core Principles and Perspectives on Evaluation)

**మౌలిక సూత్రాలు (Key principles):**

వ్యవస్థలోని ప్రధాన అపోహలు, నమ్మకాలు, ధోరణులను ప్రస్తావిస్తూ సరైన పరివర్తనతో విద్యా పరిస్థితిలో మార్పు తెచ్చే వ్యవస్థాపరమైన అంశాలపై దృష్టిసారించాల్సి ఉంది. ఈ కమిటీ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్ర మౌలిక సూత్రాలను రూపొందించింది. ప్రస్తుత సవాళ్ళను ఎదుర్కొనేందుకు కొన్ని ఇతర సూత్రాలతోపాటు ఎన్.సి.ఎఫ్-2005 పేర్కొన్న మార్గదర్శక సూత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం మౌలిక సూత్రాలు కింది విధంగా ఉన్నాయి.

- పిల్లల అభ్యసనాశక్తులపై దృష్టి కేంద్రీకరించడం.
- పాఠశాలకు వచ్చేటప్పటికే పిల్లలు కలిగి ఉన్న భాష మొదలైన పరిజ్ఞానాన్ని గౌరవించడం.
- బడి బయటి ప్రపంచానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం (పాఠశాలలో విద్య తమ జీవితానికి ఏమీ సంబంధం లేనిదని విద్యార్థులు అనుకునేలా ఉండకూడదు.

- బట్టీ పద్ధతులకు దూరంగా అభ్యసన ఉండాలి. ప్రతి చర్యలతో (interactions) కూడిన అభ్యసనానికి, ప్రాజెక్టు పనులకు, విశ్లేషణలకు ప్రాధాన్యతనివ్వడం.
- పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా పిల్లల్లో సమగ్రాభివృద్ధికి దోహదపడేలా విద్యా ప్రణాళికను పరిపుష్టి చేయడం.
- పరీక్షలను సరళీకృతం చేసి తరగతి గదికి అన్వయించడం. 'అభ్యసనను మాపనం చేయడం' కాకుండా 'మాపనం చేయడం'పై దృష్టి పెట్టడం.
- సామాజిక నిర్మాణాత్మక వాదాన్ని (social constructivism), అంశాల వారి పాఠ్య ప్రణాళికను (issue based curriculum), పాఠ్యాంశాల్లో విమర్శనాత్మక బోధనను (critical pedagogy) వృద్ధిపరచాలి.
- పాఠ్య ప్రణాళికలో భాగంగా వృక్ష, జంతుజాలాన్ని పరిరక్షించడం, జీవవైవిధ్యతను, సాంఘిక భిన్నత్వాన్ని, పనిని గౌరవించడం.
- పిల్లల భాష, సంస్కృతులను తరగతి గది ఆచరణల్లో భాగం చేయడం.

పిల్లలు అభ్యసనంలో ఏ స్థాయిలో ఉన్నారో, ఎలా నేర్చుకుంటున్నారో తెలుసుకునేందుకు మూల్యాంకనం ఉపాధ్యాయునికి ఉపకరిస్తుంది. జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరుల, విశ్లేషణా సామర్థ్యాలు, విలువలు, నైతిక ప్రవర్తనావళి మొదలైన అంశాలన్నింటిని బోధనాభ్యసన ప్రక్రియలలో భాగంగా మూల్యాంకనం చేయాలి. ఇది పిల్లవానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడినదిగా ఉండాలి. అంటే శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలన్నింటిని ఎప్పటికప్పుడు సమగ్రంగా, నిరంతరంగా మాపనం చేయాలి. ఇలా చేయడంవల్ల పిల్లవాణ్ణి అన్ని కోణాలలో అర్థంచేసుకోవడానికి వీలు కలుగుతుంది.

మూల్యాంకనం కేవలం రాతపరీక్షలకు మాత్రమే పరిమితం కాదు. ఇది సామర్థ్య ఆధారితంగా, విద్యాప్రమాణాల సాధనను పరిశీలించేదిగా ఉండాలి. మూల్యాంకనంలో మౌఖిక పరీక్షకు కూడా స్థానం ఉండాలి. విద్యార్థి తన ఆలోచనలను, భావాలను వ్యక్తీకరించడానికి, సొంతంగా రాయడానికి అవకాశం కల్పించేదిగా ఉండాలి. పిల్లల నైపుణ్యాలను, విశ్లేషణాశక్తిని, సృజనాత్మకతను మాపనం చేసేందుకు అనువుగా ఉండాలి.

## 5.7 పాఠశాల విద్య – రాష్ట్ర దృక్పథం (School Education - State Vision)

రాష్ట్రంలోని పిల్లలందరూ ఉన్నతస్థాయి గుణాత్మక విద్య పొందాలనేది రాష్ట్ర ప్రభుత్వ దృక్పథం. ఇతరులపట్ల స్పందించే వైఖరులను కలిగిఉండే బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులు రూపొందాలి. తమ పరిసరాలపట్ల పరిజ్ఞానం కలిగిఉండి, విమర్శనాత్మకంగా పరిసరాలపట్ల ఆలోచించగలగాలి. జాగ్రత్తగా విని నిర్భయంగా మాట్లాడ గలగాలి. విన్నదాన్ని, చదివినదాన్ని అవగాహన చేసుకోవాలి. ప్రశ్నించే మనస్తత్వం కలిగి ఉండాలి. ఈ నైపుణ్యాలను ఉపాధ్యాయుడు పెంపొందించాలి. పిల్లలు స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తీకరించగలిగి సందేహ నివృత్తి చేసుకునేందుకు వీలుగా స్నేహపూరిత అభ్యసన వాతావరణంలో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. సమాజం నుండి నేర్చుకుని, నేర్చుకున్న దాన్ని తరగతి గదిలో ఉపాధ్యాయులు ఆచరణలో పెట్టాలి. పాఠశాలను సమాజం తనదిగా భావించి, పాఠశాల దైనందిన కార్యకలాపాల్లో పాల్గొనాలి. యాంత్రికత, భౌతికత, పోటీతత్వం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రతిస్పందన, సహకార గుణాలకు పాఠశాల చోటు కల్పించాలి. మానవీయ, నైతిక విలువలను పెంపొందింపజేయాలి.

## 5.8 CCE – పరీక్షల సంస్కరణలు (CCE - Examinations Reforms)

- CCE ద్వారా, పరీక్ష విధానాలలో ఈ కింది సంస్కరణలు ప్రతిపాదించడం జరిగింది.

- పిల్లల ప్రగతిని అంచనా వేయడం ఎప్పుడో ఒకసారి అని కాకుండా, నిర్మాణాత్మక మదింపు ద్వారా తరగతి గదిలో బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడే అంచనా వేయడం జరుగుతుంది.
- నేర్చుకోవడం అనేది జ్ఞాపకం చేయడం నుండి వేరుపరచి, విద్యార్థులు ఆలోచించి స్వంతంగా వ్యక్తీకరణం చేయడంపై దృష్టి పెట్టాలి. మరియు దీన్ని ప్రోత్సహించాలి.
- మూల్యాంకనం అనేది విద్యా ప్రమాణాలు ఏ మేరకు విద్యార్థులు పొందారో అని తెలుసుకొనే విధంగా ఉంటుంది. అంటే విద్యార్థులు ఏ మేరకు అభ్యసనా లక్ష్యాలు, విద్యా లక్ష్యాలు పొందారు? అని తెలుసుకోవడం మీద శ్రద్ధ పెట్టాలి.
- ఉపాధ్యాయులు స్వయంగా తయరుచేసుకొన్న ప్రశ్నపత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా పరీక్షల కోసం ప్రశ్నపత్రాలను కొనడం, మండల స్థాయిలో లేక పాఠశాల సముదాయం స్థాయిలో గాని తయారుచేసినవి ఉపయోగించకూడదు. ఉపాధ్యాయుడు తాను ఏమి బోధించాడు? ఎలా బోధించాడు? ఏ ఏ విద్యా ప్రమాణాలను సాధించడానికి బోధించాడు? అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాన్ని తయారు చేసుకోవాలి. ప్రశ్నలు ఆలోచించి, విశ్లేషించి, పిల్లలు తమ సొంతంగా వివరించే విధానానికి అనుకూలంగా ఉండాలి. పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ప్రశ్నలు దోహదపడాలి. పరీక్షలు పిల్లలు సొంతంగా తమ ప్రతిభా పాటవాలను వ్యక్తపరచేవిధంగా ఉండాలి. జవాబులు వారి ప్రతిభకు వెలికితీసే విధంగా ఉండాలి.
- ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థివారీగా, విషయవారీగా, పిల్లల ప్రగతి రిజిస్టర్ అనగా CCE register ను నిర్వహించాలి.
- మదింపు అనేది కేవలం రాత పరీక్షల ద్వారానే కాకుండా, మౌఖికం, ప్రదర్శన, కృత్యాలు చేయడం, ప్రాజెక్టులు, పరిశీలనలు, తరగతి గది పని, వారు రాసిన రిపోర్ట్‌ల ద్వారా కూడా జరగాలి.
- కళలు, ఆటలు, ఆరోగ్యవిద్య, విలువలు, పని అనుభవం మొదలగు వాటిని మూల్యాంకనంలో భాగంగా చేయడం ద్వారా మూల్యాంకనాన్ని సమగ్రంగా చేయడం జరిగింది. (Comprehensive Assessment).
- మూల్యాంకనం సమగ్రమే కాకుండా విద్యార్థులు నేర్చుకొనేటప్పుడు వారు చదివేటప్పుడూ, రాసేటప్పుడూ, లెక్కలు చేసేటప్పుడు, జట్టు పనిలో పాల్గొనేటప్పుడు – చర్చలు జరిగేటప్పుడు వారు మాట్లాడే విధానాన్ని, వివిధ అంశాలపై వారు వ్యక్తపరిచే భావనల పై ఆధారపడి వారి ప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయాలి. ఈ విధంగా తరగతి గదిలో బోధనా అభ్యాసనం జరగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకుంటున్నాడు అనేది ఉపాధ్యాయుడు అవగాహన చేసుకొని మదింపు చేస్తే దానిని నిర్మాణాత్మక మదింపు అంటాం. ఈ విధంగా మనం ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసనాన్ని అవగాహన చేసుకొని మదింపు చేయడాన్ని నిరంతర మూల్యాకనం అంటారు.
- పిల్లల ప్రగతి పత్రం, అన్ని అంశాలపై అనగా కరిక్రులం, కో కర్రికులం, విద్యార్థి ఆరోగ్యం, హాజరు మొదలగు అన్ని అంశాలపై ప్రగతిని సూచిస్తుంది.
- మాస వారీగా పాఠశాల యాజమాన్య కమిటీ మరియు తల్లిదండ్రుల సమావేశాలల్లో పిల్లల ప్రగతిని చర్చించాలి. పిల్లలు చదవడం, రాయడం, లెక్కలు చేయడం, ఇచ్చిన అంశం పై ధారాళంగా మాట్లాడించడం మొదలగునవి తల్లిదండ్రుల ముందు ప్రదర్శించాలి.
- పాఠశాలలు జూన్‌లో మొదలవగానే ప్రతి సబ్జెక్టులో ఒక ప్రారంభ పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని తెలుసుకొని దానిపై ఆయా విద్యార్థులను ఏ స్థాయికి తీసుకురావాలి అని ప్రతి ఉపాధ్యాయుడు ఒక టార్గెట్ పెట్టుకోవాలి. ఆ విధంగా పెట్టుకున్న టార్గెట్‌పై ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రణాళిక వేసుకొని నిరంతరం ప్రయత్నించాలి. అప్పుడే మనం మన వృత్తికి న్యాయం చేసినవారమవుతాం.

## 5.9 నిరంతర సమగ్ర మూల్యాంకనం–భావనలు–అవగాహన (CCE- Conceptual understanding)

పిల్లలు సమగ్ర అభివృద్ధిని సాధించాలని ఇందుకోసం పాఠశాలలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్.టి.ఇ–2009 ద్వారా మనకు తెలుస్తుంది. పిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, భావోద్వేగపరంగా అభివృద్ధిని చెందాలి. ఇందుకోసం పాఠ్య విషయాలతో పాటు పిల్లల ఆసక్తులు, విలువలు, వైఖరులు మొదలగు వాటిలో కూడా పిల్లలు అభివృద్ధి చెందాలి.

### 'నిరంతరం' అనగా (What is continuous)

పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనాన్ని, విస్తృత అర్థంలో పరిశీలించినపుడు పిల్లల పెరుగుదల వికాసాలకు ఖచ్చితమైన ప్రాధాన్యతనివ్వవలసి ఉంటుంది.

**'నిరంతరం'** అంటే పిల్లల ప్రగతిని ఒక సంఘటనకో, సందర్భానికో ఎప్పుడో ఒక మూడు (3) గంటల పరీక్షకు పరిమితం చేయకుండా ఎల్లప్పుడూ పరిశీలించడం. అనగా నిరంతరం పాఠశాలలోపల, వెలుపల పిల్లల శారీరక, మానసిక వికాసాలను తరచుగా ఒక క్రమపద్ధతిలో పరిశీలిస్తున్నామని ప్లిలకు తెలియకుండానే పరిశీలించాలి. అభ్యసన లోపాలను గుర్తించి సవరణాత్మక చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ స్వీయ మూల్యాంకనం చేసుకోగలగాలి.

### 'సమగ్రం' అనగా (What is comprehensive)

**అనగా పిల్లల సర్వతోముఖాభివృద్ధి. అంటే పిల్లల శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాలలో అభివృద్ధి అని అర్థం.** ఇందుకోసం విద్యాప్రణాళికలో నిర్వచించిన పాఠ్య, పాఠ్యేతర అంశాలను విడివిడిగా చూడకుండా రెండింటికీ సమాన ప్రాధాన్యతను ఇవ్వడమే. అనగా భాష, గణితం, సైన్సు, సాంఘికం వంటి విషయాలతోపాటు కళలు, పని, విలువలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం. ఇది పిల్లల పెరుగుదల, వికాసాలను పాఠ్యాంశాల దృష్టితోనే కాకుండా వారి అభిరుచులు, వైఖరులు, సామర్థ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. **సమగ్ర విద్యలో కళలు, సాహిత్యం, సౌందర్య వివేచన, తాత్విక చర్చ, శిల్పం, సంగీతం వంటి విషయాల్లో అత్యున్నత అంశాల బోధన వుండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.**

వీటితోపాటు సృజనాత్మక, విశ్లేషణాత్మక, తార్కిక అంశాలకు కూడా మూల్యాంకనం సమాన ప్రాధాన్యతనిస్తుంది.

### 5.9.1 పిల్లల సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటి?
### (What is Comprehensive Development of the child?)

విద్య ద్వారా పిల్లలలో సంపూర్ణ వికాసం సాధించాలన్నది విద్యా లక్ష్యం అయినపుడు సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చేసుకోవడం అవసరం. పాఠశాల విద్య పిల్లలు శారీరకంగా ఎదిగే వయసుతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి విద్య శారీరక వికాసానికి అంటే పిల్లలు వయసుతో తగిన, ఆరోగ్యం, ఎత్తు, బరువు వుండేలా చూసేందుకు అవసరమైన ఆరోగ్యవ్యాయామ అంశాలు, కీలకం కావాలి. అలాగే స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడం, సమస్యలకు కుంగిపోకుండా ఎదురు నిలిచి సమస్యలను పరిష్కరించే నేర్పురావాలి. మంచి వైఖరులతో ఉత్తమ అభిరుచి కలిగిన వ్యక్తిగా సామాజిక బాధ్యత నిర్వర్తించగలగాలి. వీటన్నింటి ద్వారా విషయ పరిజ్ఞానం పొందగలగాలి. కాబట్టి సమగ్ర అభివృద్ధి అంటే పిల్లలు పాఠ్యపుస్తకాల ఆధారంగా జ్ఞానాన్ని నిర్మించుకోవడం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఉద్వేగ, సాంఘిక, సాంస్కృతిక వికాసాలను పొందడం. ఇందుకోసం పిల్లల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలు, విలువలు పెంపొందించాలి. కాబట్టి పాఠశాల విద్యలో

ఈ అంశాలన్నీ అభ్యసనాంశాలుగా కనిపించాలి. పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే అంశాలన్నీ పాఠ్యాంశాలే. వీటిలో పాఠ్య, సహపాఠ్య అన్న విభేదనం అవసరం లేదు. పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలన్నీ పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడేవిగా వుండాలి. కాబట్టి ఈ విషయాలన్నింటిని మూల్యాంకనం చేయాలి.

### 5.9.2 CCE ఎందుకు? (Why CCE?)

మూల్యాంకనమంటే కేవలం పరీక్షలు పెట్టడం మాత్రమే కాదు. యూనిట్, టెర్మినల్ పరీక్షల పేరుతో ఎప్పుడో ఒకసారి పిల్లల సామర్థ్యాలను పరిశీలించడం వల్ల వారి అభ్యసనకు అది ఏవిధంగానూ సహాయపడదు. పైగా ఈ విధమైన పరీక్షా పద్ధతి పిల్లలు ఏ సమాచారాన్ని ఎంత వరకు గుర్తుపెట్టుకోగలిగారో పరీక్షిస్తుందో తప్ప వారి విభిన్న సామర్థ్యాలను తెలుసుకోవడానికి ఉపయోగపడదు. మూల్యాంకనం పేరుతో అనేక రకాల పరీక్షలు నిర్వహించడం వలన పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. బట్టీపట్టడానికి అవకాశం కల్పించే పరీక్షా పద్ధతులు, పిల్లల ఉద్వేగ, సాంఘిక వికాసాలను మదింపుచేయడానికి ఉపయోగపడవు. కాబట్టి పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యంకనం చేయవలసిన అవసరం ఉంది. పిల్లలు తాము పరిశీలింపబడుతున్నామని వారికి తెలియకుండా మూల్యాంకనం చేయడం వల్ల వచ్చే ఫలితాలు వారికి పునరభ్యాసం కలిగించడానికి ఎంతగానో తోడ్పడతాయి. భయరహిత వాతావరణంలో స్వేచ్ఛగా మూల్యాంకనం చేయడం వల్ల ఎప్పటికప్పుడు లోపాలు గుర్తించి సవరణాత్మక కృత్యాలు నిర్వహించడానికి వీలుకలుగుతుంది. పాఠ్య విషయాలతోపాటు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి సంబంధించిన ఆసక్తులు, అభిరుచులు, శారీరక ఎదుగుదల, విలువలు, వైఖరులు, కళాభిరుచి ఇలా అన్ని అంశాలపై ఒక అవగాహన కలిగివుండి, వాటిని వాటిలో పిల్లల అభిరుచిని, ప్రగతిని తెలుసుకుకోవాలి. అప్పుడే మూల్యాంకనాన్ని సమగ్రమైనదిగా భావిస్తారు.

### 5.9.3 CCE లక్షణాలు (Characteristics of CCE)

మూల్యాంకనం – పిల్లలు సమాచారాన్ని గుర్తుపెట్టుకుని బట్టీపట్టి పరీక్షలలో రాయడానికి మాత్రమే ఉద్దేశించినది కాదు. తరగతి గదిలో కల్పించే అభ్యసన అనుభవాలు పిల్లల జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ రంగాలలో తీసుకొచ్చే మార్పులను మదింపుచేసి మెరుగుపరచడానికి తోడ్పడాలి. పాఠశాలలో వివిధ విషయాల రూపంలో అందించే సమాచారం విషయ పరిజ్ఞానాన్ని కల్గించడానికి సరిపోదు. పిల్లల భావి జీవితానికి అవసరమైన విశ్లేషాత్మక, సృజనాత్మక తార్కిక ఆలోచనాశక్తి, స్వీయ క్రమశిక్షణ, సామాజికంగా సర్దుబాటు చేసుకోవడం సమస్యల పట్ల సున్నితంగా ప్రతిస్పందించడం, పరిష్కరించుకోవడం మొదలైన జీవన నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంపొందించడం పాఠశాల బాధ్యత (ఎన్.సి.ఎఫ్ – 2005). ఇవి పాఠ్యపుస్తకాల ద్వారా సాధించడానికి పాఠశాలలో ఎన్నో రకాలైన కార్యక్రమాలు నిర్వహించవలసి వుంటుంది. వీటన్నింటిని మనం ఇంతవరకు పాఠ్యేతర అంశాలుగా, సహపాఠ్యాంశాలుగా భావిస్తున్నాం. వాటికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పిల్లల్లో సమగ్ర వికాసానికి భంగం కలుగుతుంది. అందుచేత రాష్ట్ర విద్యా ప్రణాళిక పత్రం–2011 పాఠ్య, సహపాఠ్యాంశాలనే విభేదం లేకుండా అన్నింటిని పాఠ్యాంశాలుగానే భావించాలని (ఎస్.సి.ఎఫ్. – 2011) సూచించింది. కాబట్టి నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పిల్లల శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక వికాసాలన్నీ సమాన ప్రాధాన్యతలో మూల్యాంకనం చేయాలని నిర్దేశించుకోవడం జరిగింది. ఈ కోణంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం ఏమి ఆశిస్తుందో పరిశీలిద్దాం.

– పిల్లల జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం, మూల్యాంకనం చేయడం.

- బట్టీపట్టడాన్ని, సమాచారాన్ని గుర్తుపెట్టుకోవడమనే తరగతి గది ప్రక్రియల స్థానంలో విశ్లేషణాత్మక ఆలోచనలతో సొంతంగా జ్ఞాన నిర్మాణం చేసుకోవడాన్ని ప్రోత్సహించడం, సొంతంగా తమ ఆలోచనలను, భావాలను వ్యక్తపరిచేటట్లు చేయడం.
- మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా పరిగణించడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లల అభ్యసన సామర్థ్యాలను బోధనాభ్యసన విధానాలను మెరుగపరచు కోవడం మరియు నిరంతరం పరిశీలిస్తూ సవరణలు చేసుకోవడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లలు ఎక్కడ నేర్చుకోలేకపోతున్నారో తెలుసుకొని తగువిధంగా బోధించడం.
- బోధనాభ్యసన ప్రక్రియ విద్యార్థి కేంద్రీకృతంగా సాగేందుకు తోడ్పడాలి.

నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియలలో భాగంగా అమలుచేయాలి. దీనివల్ల పిల్లల సంపూర్ణ వికాసానికి తోడ్పడే విభిన్న తరగతి గది అంశాలు ఎంత వరకు సమర్థంగా ఉపయోగపడుతున్నాయి అనేది తెలుసుకోవడానికి వీలుకలుగుతుంది. నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పాఠ్య, సహపాఠ్య అంశాలు అన్న విభేదం లేకుండా అన్నింటినీ సమాన ప్రాధాన్యత కలిగిన అంశాలుగా గుర్తించి అమలుచేయాలి.

మూల్యాంకనం అభ్యసనంలో అంతర్భాగంగా నిరంతరం జరిగే ప్రక్రియగా నిర్వహించడానికి తగిన ప్రణాళికను తయారుచేసుకోవాలి. మూల్యాంకన స్వభావాలను అర్థం చేసుకోవాలి.

## 5.10 మూల్యాంకనం స్వభావం (Nature of Assessment)

### 5.10.1 నేర్చుకోవడంలో భాగంగానే మూల్యాంకనం (అభ్యసనం జరిగేటప్పుడే మూల్యాంకనం) (Assessment as learning)

పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలు పిల్లల సమగ్ర వికాసానికి దోహదపడేవిగా ఉండాలి. పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పాల్గొని నేర్చుకుంటున్నపుడు వారిని మూల్యాంకనం చేయడాన్ని అభ్యసనం జరిగేటపుడు మూల్యాంకనం చేయడం అంటాం. ఉదాహరణకు పిల్లలు ఒక అంశంపై తరగతి గదిలో జరిగే చర్చలలో పాల్గొన్నపుడు వారు విషయాన్ని అర్థంచేసుకోవడానికి ఏవిధంగా ప్రశ్నిస్తున్నారు, తమ అభిప్రాయాలను ఏవిధంగా వ్యక్తంచేస్తున్నారు అనే అంశాలను ఉపాధ్యాయుడు పరిశీలించడానికి అవకాశం వుంటుంది. ఈ సందర్భంలోనే పిల్లల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రయత్నం కూడా జరుగుతుంది. అంటే పరిశీలన ద్వారా పిల్లలు ఏమి నేర్చుకున్నారు అనేది మూల్యాంకనం చేయడం జరుగుతోందన్నమాట. అభ్యసనం, మూల్యాంకనం వేరువేరుగా కాకుండా అభ్యసనం జరుగుతున్నపుడే మూల్యాంకనం కూడా ఉంటుంది. ఎప్పటికప్పుడు పిల్లలు తమనుతాము సరిచేసుకుంటూ నేర్చుకోవడానికి ఉపాధ్యాయుడు సహకరించగలుగుతాడు. ఇది ఫార్మాటివ్ అసెస్‌మెంట్. పిల్లలకు నేర్చుకోవడానికి ఒక కృత్యం లేక ప్రాజెక్టు ఇచ్చినపుడు, అది చేసి మనకు నివేదిక ఇస్తే అతను అతను ఏం నేర్చుకున్నాడో అని తెలుస్తుంది. దీన్నిబట్టి విద్యార్థి ప్రగతి కూడా తెలుస్తుంది. నేర్చుకోవడంలో ప్రగతి తెలుసుకోవడమే మాపనం లేక మూల్యాంకనం.

### 5.10.2 అభ్యసనం కొరకు (మెరుగుపర్చడానికి) మూల్యాంకనం (Assessment for Learning)

తరగతి గదిలో అభ్యసన సన్నివేశాలలో పిల్లలు పాల్గొని నేర్చుకుంటున్నపుడు వారిని పరిశీలిస్తూ విద్యార్థి నేర్చుకుంటున్నాడా లేదా! ఏఏ అంశాలలో ఇబ్బందిపడుతున్నాడు? ఏఏ అంశాలలో మరింత సహాయం అవసరం ఏ రకమైన సహకారం అందించినట్లయితే నేర్చుకోగలుగుతాడు? అనే విషయాలను దృష్టిలో ఉంచుకుని పరిశీలించడం,

బోధనలో మార్పు చేసుకొనేందుకు చర్యలు చేపట్టడాన్ని అభ్యసనం మెరుగుపరచడానికి చేసే మూల్యాంకనం అంటాం.

సాధారణంగా మనం మూల్యాంకనం కోసం పరిశీలించడమో, పరీక్ష నిర్వహించడమో చేస్తుంటాం. కానీ ఫలితాలను ఆధారంగా చేసుకొని విద్యార్థికి ఏ ఏ అంశాలలో సహకారం అవసరమో గుర్తించి చర్యలు చేపట్టడంలో దృష్టిపెట్టడం జరగదు. అభ్యసనాన్ని మెరుగుపరచడానికి మూల్యాంకనం పరిశీలించిన తర్వాత మెరుగుపరచడానికి సహకారం అందించడం ఎంతో అవసరం. పిల్లల నోటుపుస్తకాలను, ఇంటిపనిని పరిశీలించినపుడు పిల్లలు ఎక్కడ తప్పులు చేస్తున్నారు? ఎక్కడ ఇబ్బందిపడుతున్నారు అని తెలుస్తుంది. దీన్నిబట్టి పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు అనే దానిపై ఉపాధ్యాయునికి ఒక అవగాహన వస్తుంది. ఇది ఫార్మాటివ్ అసెస్‌మెంట్.

### 5.10.3 అభ్యసనం యొక్క మూల్యాంనం (Assessment of Learning)

పిల్లలు ఆయా విషయాలను ఎంతవరకు నేర్చుకున్నారో తెలిపేదే అభ్యసనం యొక్క మూల్యాంకనం. విద్యార్థులు వివిధ అభ్యసన కృత్యాలలో పాల్గొంటూ వివిధ భావనలను, వ్యవహార రూపాలను, ప్రకియా నైపుణ్యాలను పొందుతారు. ఇలా పిల్లలు పొందిన జ్ఞానాన్ని కొంతకాలం తర్వాత పరీక్షించడమే “అభ్యసనం యొక్క మూల్యాంకనం”. ఇది పిల్లల మార్కులు, గ్రేడుల రూపంలో ప్రదర్శితమౌతుంది. ఇదిఉపాధ్యాయులు లేదా బాహ్యానికషల లేదా రెండింటిచేత మూల్యాంకనం చేయబడుతుంది. ఈ విధానంలో చాలామంది విద్యార్థులు ఒకేసారి ఒకేవిధంగా మూల్యాంకనం చేయబడతారు. సాధారణంగా టర్మ్ పూర్తయిన తరువాత నిర్వహించే పరీక్షలు “అభ్యసనం యొక్క మూల్యాంకనం”ను తెలియజేస్తాయి. ఇది పిల్లల అభ్యసన సాధనపై తుది నిర్ణయాన్ని ప్రకటించే పద్ధతి. అనగా త్రైమాసిక, అర్ధవార్షిక, సంవత్సరాంత పరీక్షలు వాటికి ఉదాహరణలు. ఇది సమ్మేటివ్ అసెస్‌మెంట్.

## 5.11 మూల్యాంకనం చేయాల్సిన అంశాలు (1–5 మరియు 6–9 తరగతులు) (Areas of Assessment (1-5 and 6-9 classes)

***ప్రాథమికస్థాయి (1–5 తరగతులు)***

- ప్రథమ భాష తెలుగు/ఉర్దూ
- గణితం
- పరిసరాల విజ్ఞానం
- ఇంగ్లీషు
- కళలు, సాంస్కృతిక విద్య
- ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగా, ధ్యానం
- పని, కంప్యూటర్ విద్య
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వైఖరులు

***ఉన్నత పాఠశాల స్థాయి (1–9 తరగతులు)***

- ప్రథమ భాష
- ద్వితీయ భాష
- తృతీయ భాష
- గణితం

- సామాన్యశాస్త్రం
- సాంఘికశాస్త్రం
- కళలు, సాంస్కృతిక విద్య
- ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగా, ధ్యానం
- పని, కంప్యూటర్ విద్య
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వైఖరులు

## 5.12 వేటిని మూల్యాంకనం చేయాలి? (What to assess?)

**భాషలు:**

1. వినడం, ఆలోచించి మాట్లాడడం
2. చదవడం,అర్థంచేసుకుని ప్రతిస్పందించడం
3. సొంతంగా రాయడం (స్వీయరచన)
4. పదజాలాభివృద్ధి
5. సృజనాత్మక వ్యక్తీకరణ, ప్రశంస
6. భాషను గురించి తెలుసుకోవడం

**గణితం:**

1. భావనల అవగాహన, సమస్య సాధన (Problem Solving)
2. కారణాలు చెప్పడం-నిరూపణ (Reasoning and Proof)
3. వ్యక్తీకరణ (Communication)
4. సంధానం (Connections)
5. ప్రాతినిధ్యం-దృశ్యీకరణ (Representation-Visulisation)

**పరిసరాల విజ్ఞానం**

1. విషయావగాహన
2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం
3. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు
4. సమాచార నైపుణ్యాలు
5. బొమ్మలు, మ్యాపులు గీయడం, నమూనాలు తయారుచేయడం
6. వైఖరులు, ప్రశంస, నిత్యజీవిత వినియోగం

**విజ్ఞాన శాస్త్రం**

1. విషయావగాహన
2. ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం
3. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు

4. సమాచార నైపుణ్యాలు
5. బొమ్మలు, గ్రాఫ్‌లు గీయడం, నమూనాలు తయారుచేయడం ద్వారా భావప్రసారం
6. సౌందర్యాత్మక స్పృహ – వైఖరులు ప్రశంస జీవ వైవిధ్యం – నిత్యజీవిత వినియోగం

**సాంఘికశాస్త్రం**

1. విషయావగాహన
2. విషయాన్ని చదివి అర్థంచేసుకోవడం, వ్యాఖ్యానించడం
3. సమాచార నైపుణ్యాలు
4. సమకాలీన, సామాజిక అంశాలపై ప్రతిస్పందన
5. పటనైపుణ్యాలు
6. సునిశితత్వం – ప్రశంస, వైఖరులు

**కళలు, సాంస్కృతిక విద్య**

1. రంగులు వేయడం, చిత్రాలు గీయడం, అలంకరించడం, నమూనాలు బొమ్మలు తయారు చేయడం
2. ట్యాన్‌గ్రామ్, ఓరిగామి, కుట్లు, అల్లికలు
3. నాటికలు, ఏకాంకికలలో నటించడం, కొరియోగ్రఫీ,
4. పాటలు పాడడం, వాద్యపరికరాల వినియోగం, నృత్యం – స్థానిక కళారూపాలు ప్రదర్శించడం, మైమ్
5. మన సంస్కృతి, కళలు, సాహిత్యం

**ఆరోగ్య, వ్యాయామవిద్య**

1. ఆసక్తిగా పాల్గొనడం నియమ నిబంధనలు పాటించడం, క్రీడాస్ఫూర్తి, ప్రత్యేక నైపుణ్యాలు
2. యోగ, ధ్యానం, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి.
3. కుటుంబ సంబంధాలు, భద్రత, ప్రథమ చికిత్స
4. ఆరోగ్యం, పౌష్టికాహారం, మంచి ఆహారపు అలవాట్లు.
5. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మంచి అలవాట్లు

**పని, కంప్యూటర్ విద్య**

1. నమూనాలు వస్తువుల తయారీ, పనిముట్లు, సామగ్రి వినియోగం.
2. వ్యక్తుల సేవల వినియోగం, ఉత్సవాలలో పాల్గొనడం (అంతర కరికులమ్ కార్యక్రమాలు, బాధ్యతలు నిర్వర్తించడం)
3. కంప్యూటర్ ఆధారంగా నేర్చుకోవడం
4. కంప్యూటర్‌ను వినియోగించడం
5. సామాజిక కార్యక్రమాలు, శ్రమదానం

**విలువల విద్య, జీవన నైపుణ్యాలు**

1. మంచి, చెడు విచక్షణాజ్ఞానం, సత్ప్రవర్తన

2. రాజ్యాంగ విలువలు
3. సహనం, దయ, తధానుభూతి మొదలగు వ్యక్తిగత విలువలు
4. జీవననైపుణ్యాలు, ఆలోచనా నైపుణ్యాలు
5. ఉపాధ్యాయులు, సహాధ్యాయులు పాఠశాల, ప్రభుత్వ ఆస్తుల పట్ల సరైన వైఖరులు కలిగి ఉండడం.

## 5.13 CCE - ఎలా మూల్యాంకనం చేయాలి? - విధానాలు

## (CCE – How to assess? – Procedures)

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పాఠశాలలో నిర్వహించే మూల్యాంకన విధానాలు పిల్లలను సంపూర్ణంగా పరిశీలించి నమోదుచేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయులు తరగతిగది లోపల బయట పిల్లలను పరిశీలిస్తూ చేసే అంశాలతోపాటు క్రమానుగతంగా నిర్ణీత కాలవ్యవధులలో నిర్వహించే మూల్యాంకనం కూడా అవసరమే. ఇవి వారాంత, పక్ష, మాస, టర్మినల్ రూపాలలో కూడా ఉండడం అవసరం. అయితే ఏ మూల్యాంకన విధానం అయినప్పటికి వచ్చే ఫలితాలను బట్టి ఏ ఇద్దరినీ ఒకరితో ఒకరిని పోల్చకూడదు. అంటే మూల్యాంకనం పిల్లలు ఎలా నేర్చుకున్నారు? ఏమి నేర్చుకున్నారు? అనే అంశాలు పరిశీలించడంతోపాటు నేర్చుకున్న అంశం స్థిరంగా ఉండేందుకు కూడా మూల్యాంకనం తోడ్పడాలి. జ్ఞానము, అవగాహన వినియోగం, విశ్లేషణ, నూతన సందర్భాలలో సర్దుబాటుచేసుకోవడమనే అంశాలతోబాటు అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ప్రత్యేక ఆసక్తులు, శారీరక ఎదుగుదల ఆరోగ్యకరమైన విషయాలుకూడా నిశితంగా మూల్యాంకనం చేయాలి. ఈ విధమైన మూల్యాంకనం రెండు రకాలు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మాటివ్ అసెస్‌మెంట్)
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం (సమ్మేటివ్ అసెస్‌మెంట్)

## 5.14 నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Assessment)

తరగతి గదిలో కల్పించిన అభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొంటున్నప్పుడు, బోధన జరుగుతున్నప్పుడు విద్యార్థి ఏ విధంగా నేర్చుకుంటున్నాడో పరిశీలించి నమోదు చేయడం ద్వారా పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరచడానికి కృషిచేయడాన్ని **నిర్మాణాత్మక మూల్యాంకనం** అంటారు. నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది భయరహిత వాతావరణంలో, పిల్లలకు ఆసరాగా నిలిచి అభ్యసనను వేగవంతం చేసుకోడానికి ఉపకరించేది. ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సందర్భాలలో ఉపాధ్యాయుడు పిల్లలకు సహాయకారిగా నిలిచి సరిదిద్ది ముందుకు నడిపించాలి. కేవలం మార్కులు, గ్రేడుల రూపంలో కాకుండా పిల్లలకు వారి సామర్థ్యాల సాధనా స్థితిగతులను వివరణాత్మకంగా తెలిపి వారికి సరైన సూచనలు సలహాలు ఇచ్చి ప్రోత్సహించి అభ్యసనాన్ని మెరుగుపరచడానికి నిర్మాణాత్మక మూల్యాంకనం సహాయపడుతుంది. తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల సమాధానాలు, పాఠం మధ్యలో మరియు చివర ఉన్న ప్రశ్నలు, అభ్యాసాల గురించి చర్చిస్తున్నప్పుడు పిల్లలు చర్చల్లో పాల్గొని ఇచ్చే సమాధానాలు, పిల్లలు రాసిన నోటుపుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్టుపనులు, జట్టు పనులు మొదలైన వాటి ఆధారంగా పిల్లలు ఏమి నేర్చుకున్నారో, ఎలా నేర్చుకుంటున్నారనేది ఉపాధ్యాయుడు అంచనా వేయవచ్చు. దీన్నే **నిర్మాణాత్మక మూల్యాంకనం** అంటాం.

బోధనాభ్యసన జరుగుతున్న సమయంలో నిరంతరం ఫీడ్‌బ్యాక్ ఇస్తూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమను తాము సరిచేసుకునే వీలుకల్పిస్తుంది. అవసరమైన మార్పులు చేసుకోవడానికి తోడ్పడుతుంది.

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రధానంగా నాలుగు రకాల సాధనాలను ఉపయోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు (10 మార్కులు)
2. రాత అంశాలు (నోటుపుస్తకాలు, ఇంటిపని మొ॥వి) (10 మార్కులు)
3. ప్రాజెక్టు పనులు (10 మార్కులు)
4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్) (20 మార్కులు)

**1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు**

పాఠశాలలో కల్పించే బోధనాభ్యసన సన్నివేశాలలో పిల్లలు పాల్గొనే విధానం, వారు నేర్చుకునే క్రమాన్ని, ప్రగతిని తెలియజేస్తుంది. కాబట్టి ఉపాధ్యాయుడు వివిధ బోధనాభ్యసన ప్రక్రియల్లో పిల్లలు ఎలా పాల్గొంటున్నారో? ఎలా ప్రతిస్పందిస్తున్నారో? పరిశీలించడం ద్వారా పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయడానికి వీలు కలుగుతుంది. అభ్యసన ప్రక్రియలలో పిల్లల భాగస్వామ్యాన్ని ప్రతిస్పందనలను వివిధ అభ్యసన సన్నివేశాల ద్వారా పరిశీలించవచ్చు.

- పాఠ్యాంశంపై జరిగే చర్చలలో
- కృత్యాలు, జట్టుపనులు చేస్తున్నపుడు
- ప్రాజెక్టు పనులలో పాల్గొన్నపుడు
- నమూనాలు, మాదిరులు, పటాలు, గ్రాఫ్‌లు రూపొందిస్తున్నపుడు
- సృజనాత్మక కృత్యాలలో పాల్గొంటున్నపు
- మైండ్‌మాపింగ్‌పై జరిగే చర్చల్లో పాల్గొన్నపుడు
- పాఠం మధ్యలోని, పాఠం చివర ఉన్న ప్రశ్నలకు సమాధానాలను గురించి చర్చిస్తున్నపుడు.

ఉపాధ్యాయుడు తరగతి గదిలో, తరగతిగది బయట పిల్లలను పరిశీలించాలి. తరగతిగదిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠం వింటున్నది, లేనిది, పిల్లలు పరస్పర చర్చల (participation, discussion) లో పాల్గొంటున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి పరిశీలన అనేది ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

తరగతిగది బయట పిల్లల క్రమశిక్షణ, ప్రవర్తన, వివిధ అంశాలకు ప్రతిస్పందన, చిత్రాలు గీయటం, పాటలు పాడటం, ఆటలు ఆడటం, ఆహారపుటలవాట్లు, ఆరోగ్యపు అలవాట్లు, వ్యక్తిగత పరిసరముల పరిశుభ్రత, విచక్షణా పరిజ్ఞానం మొదలైన విషయాలలో పిల్లలను పరిశీలించడం ద్వారా మదింపు చేయవచ్చు. మరియు పరిశీలనల ఆధారంగా వివిధ సామర్థ్యాలలో ఎలా ఉన్నాడో అంచనా వేయవచ్చు. వీరికి సలహాలు ఇచ్చి ఇంకా మెరుగుపరుకునేటట్లు తప్పులు సరిదిద్దుకునేటట్లు చేయవచ్చు.దీనికోసం తరగతిగది లోపల, తరగతిగది బయట ఎల్లప్పుడూ ఉపాధ్యాయుడు, విద్యార్థిని పరిశీలిస్తూ ఉండాలి.

**మౌఖిక పరీక్ష (Oral Test):**

తరగతిగదిలో పిల్లలు అభ్యసన సన్నివేశాల ద్వారా నేర్చుకుంటున్న అంశాలను గురించి పరిశీలించడానికి మౌఖిక పరీక్షను ఉపాధ్యాయుడు ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. ప్రతిరోజూ తరగతిగదిలో పాఠం చెబుతున్న సందర్భంలో విద్యార్థికి ఎంతవరకు అర్థమయిందో తెలుసుకోవడానికిఉపాధ్యాయుడు రకరకాల ప్రశ్నలు వేస్తూ తెలుసుకుంటూ ఉంటాడు. దీనిని కూడా మౌఖిక పరీక్షగా గ్రహించవచ్చు. వినడం/ మాట్లాడడం అనే సామర్థ్యాన్ని పరీక్షించడానికి వివిధ సందర్భాలలో రకరకాల కృత్యాలు నిర్వహిస్తుంటాం. పిల్లలు ధారాళంగా చదవడం, చదివి అవగాహన చేసుకొని సొంత

మాటలలో చెప్పడం. అలాగే 'గణితంలో' మనోగణితానికి (నోటిలెక్కలు) చెందిన అంశాన్ని ఉపాధ్యాయుడు రకరకాలుగా ప్రశ్నించి తెలుసుకొంటూ ఉంటారు. ఇలా రాతపూర్వకంగా కాకుండా 'అడిగే' రూపంలో ప్రశ్నించే విధానాన్ని మౌఖిక పరీక్షగా చెప్పుకోవచ్చు. ఇది ఒక నిర్దుష్టమైన సమయానికి చెందినది కాక నిరంతరంగా, సమగ్రంగానూ కొనసాగే పరీక్షగా గుర్తించాలి.

**టీచర్ డైరీ:**

పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలలో పిల్లల ప్రగతిని, పాల్గొంటున్న విధానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేసుకోవడానికి టీచర్‌డైరీ ఉపాధ్యాయునికి ఎంతగానో ఉపయోగపడుతుంది. బోధన జరుగుతున్నప్పుడు, బోధనానంతరం విద్యార్థుల ప్రతిస్పందనలను, కొందరి విశేష ప్రతిభను, లేదా అవగాహనా లోపాలను నమోదు చేయడానికి, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడానికి ఉపాధ్యాయునికి ఉపయోగపడుతుంది. కనుక టీచర్‌డైరీ పిల్లల సామర్థ్యాలను మదింపు చేసి నమోదుచేసుకోడానికి ఉపాధ్యాయునికి రోజువారీ ఉపయోగపడే సాధనంగా భావించాలి.

**2. పిల్లలు రాసిన అంశాలు**

పిల్లలు తాము నేర్చుకున్న అంశాలపై తమ అభిప్రాయాలను జోడిస్తూ సొంతంగా రాస్తారు. ఇవి పిల్లలు సాధించిన సామర్థ్యాల గురించి అర్థం చేసుకోవడానికి సాధనాలుగా ఉపయోగపడతాయి. తరగతిగదిలోనూ, ఇంటి దగ్గర పిల్లలు అనేక అంశాలను రాస్తారు. వీటన్నింటిని నిర్మాణాత్మక మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకోవాలి. పిల్లలు తరగతి గదిలో వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన అనేక విషయాలను నోటుపుస్తకాలలో, ఇంటిపని పుస్తకాలలో, పాఠ్యపుస్తకాలలో రాస్తూ ఉంటారు. వీటన్నింటినీ పరిశీలించినప్పుడు పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? దీన్నిబట్టి వారి అవగాహన, ప్రగతిని అంచనా వేయవచ్చు. ఎక్కడెక్కడ తప్పులు చేస్తున్నారు? పరిశీలించి సొంతంగా రాయడానికి తగిన సహకారం అందించడానికి వీలుకలుగుతుంది.

**(అ) నోటు పుస్తకాలు:**

పిల్లలు పాఠశాలలోనూ, ఇంటివద్ద తమ నోటు పుస్తకాలో రాసిన జవాబులు, చేసిన లెక్కలు మొదలైన వాటిని పరిశీలించి విద్యార్థి ప్రగతిని తెలుసుకోవాలి. ఏ విషయంలో ఎంత వెనుకబడి ఉన్నాడనేది తెలుసుకోవడం ద్వారా విద్యార్థికి అనువైన బోధనాభ్యసనను అందించడానికి వీలుకలగుతుంది. పిల్లలందరినీ నోట్‌పుస్తకములు తెచ్చుకోవడానికి ప్రోత్సహించాలి. పిల్లల నోట్ పుస్తకంలో పాఠ్యాంశాలకు సంబంధించిన అంశములు, ప్రశ్నలు, జవాబులు, వివిధ అంశములలో వారికి నచ్చిన అంశములు, ప్రయోగ విధానములు, బొమ్మలు గీయటం, వివిధ సమస్యలు, ప్రాజెక్టు పనులు, పరికల్పనలు మొదలైన అంశములను వ్రాయడానికి ప్రోత్సహించాలి.

**(ఆ) పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలు, అభ్యాసాలు:**

నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాలలో పాల్గొంటూ సామర్థ్యాలను సాధించడానికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలు రూపొందాయి. కాబట్టి పిల్లలు పాఠ్యపుస్తకాలలో కూడా చాలా అంశాలను చర్చించడం మరియు రాయవలసి ఉంటుంది. పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే ప్రశ్నలకు సమాధానాలు, కృత్యాలులోని పట్టికలు నింపడం, సమాచార సేకరణ పట్టికలు నింపడం, అవసరమైన నివేదిక రాయడం మొదలైనవన్నీ పాఠ్యపుస్తకాలలో రాయవలసి ఉంటుంది. పాఠ్య బోధన, చర్చల సందర్భంలోను మరియు పాఠ్యపుస్తకాలలో పిల్లలు రాసిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకొని వారి ప్రగతిని అంచనా వేయాలి. పాఠం చివర ఇచ్చిన అభ్యాసాలకు పిల్లలు ఆలోచించి, సొంతంగా తమదైన జవాబులు రాయాలి. గైడ్లలో, పుస్తకాలలో చూసి రాయకూడదు.

**(ఇ) పిల్లల డైరీ:**

పిల్లల దినచర్య వారి స్పందనలు, చూసిన విన్న ఘటనల అనుభూతులు, అనుభవాలు మొదలైన వాటిని పొందుపరచి రాసినదే పిల్లల డైరీ.

పిల్లల డైరీ ద్వారా భాషా సామర్థ్యాలు, వారి నిజాయితీ, అభిరుచులు, పదజాలం, ఆసక్తులు, భాషను ఉపయోగించు తీరు తెలుసుకోవచ్చు.

**(ఈ) సంఘటన రచన (అనెక్డోటల్ రికార్డ్):**

ఏదైనా ఒక సంఘటన లేదా సన్నివేశంలో విద్యార్థి ప్రవర్తనను గురించి ఉపాధ్యాయుడు రాయడానికి ఉద్దేశించిన రికార్డును సంఘటన రచన లేదా అనగ్డోటల్ రికార్డ్ అంటారు. Anecdote అనగా ఒక ప్రత్యేక సంఘటనను గురించి సంక్షిప్తంగా రాయడం. ప్రతి ఉపాధ్యాయుడు ఒక అనెక్డోటల్ రికార్డు (సంఘటనల రిజిష్టరు)ను నిర్వహిస్తారు. అనెక్డోటల్ రికార్డు నమూనాను పరిశీలించండి.

| Name of the student: ........................................ Class:..................... Session: ..................... | | |
|---|---|---|
| Occasion and Place | A factual account of the incident or situation as observed | Teachers comments or suggestion |
| | | |

*Teacher's signature & Date*

కొన్ని సందర్భాలలో పిల్లలు పెద్దవారిని ఆశ్చర్యపర్చే తీరులో ప్రవర్తిస్తారు. ఒక అంశం పట్ల పిల్లలు ధనాత్మకంగా లేదా ఋణాత్మకంగా ప్రతిస్పందించే తీరును పరిశీలించడాననికి ఇది ఉపయోగపడుతుంది.

- పిల్లల విశేష ప్రతిభను కనబర్చే సంభాషణ లేదా సందర్భం గురించి రాయడం.

**(ఇ) పోర్ట్‌ఫోలియో (Portfolio):**

- విద్యార్థులు చేసిన కృత్యాలను సేకరించిన వాటిని ప్రదర్శనలను, పనితీరు వివరాలను సంకలనం చేసి భద్రపరచడమే portfolio. వివిధ స్థాయిలలో వారు రాసిన వాటిని ప్రదర్శించవచ్చు. వీటిని వ్యక్తిగత portfolio అంటారు.
- ప్రత్యేక సంఘటనలను, విశేష ప్రతిభ కనబరిచినప్పుడు ఆ ఆధార పత్రాలను భద్రపరచవచ్చు.
- పిల్లలు రాసిన గేయాలు, కథలు, పాడించిన గేయాలు, గీసిన చిత్రాలు, ఉత్తరాలు మొదలైనవి.

**3. ప్రాజెక్టు పనులు**

తరగతి గదిలో కేవలం వినడం ద్వారా లేదా చదవడం ద్వారా నేర్చుకోవడం అని కాకుండా చేయడం ద్వారా, అనుభవం ద్వారా నేర్చుకోవడానికి అవకాశం కల్పించే కార్యక్రమమే ప్రాజెక్టుపనులు. దీనిద్వారా పిల్లల్లో పరిశీలన, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధిచెందుతాయి. ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొనగలుగుతారు. భాషలు, భాషేతర అంశాలలో పిల్లలు సొంతంగా జ్ఞానాన్ని పొందడానికి ప్రాజెక్టు పనులు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లలు ప్రాజెక్టులో పాల్గొన్న విధానాన్ని, రూపొందించిన నివేదికలను ఆధారంగా చేసుకొని మూల్యాంకనం చేయాలి.

"ఇచ్చిన ఒక అంశం మీద విద్యార్థి/ విద్యార్థులు కూలంకషంగా చర్చించి ఆ సమస్యను వివిధ కోణాలలో విశ్లేషించి, పరిశీలించి ఒక నివేదికను సమర్పించడం".

ఇది కొంతమంది విద్యార్థులకు జట్టు కృత్యంగా కూడా నిర్వహించవచ్చును. ఈ విధానం వలన విద్యార్థిలో స్వయం అభ్యసనం, తాను తెలుసుకున్న అంశాల మీద నిజనిర్ధారణ, కొత్త విషయాలను సేకరించడం, నమూనాలను తయారుచేయడం, సమస్యను విశ్లేషించడం, ఇతరులతో మాట్లాడడం మొదలైన గుణాలు అలవడతాయి.

**నివేదిక రూపకల్పన (Documentation):**

పిల్లలు తాము సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నివేదికను తయారుచేస్తారు. పిల్లలు నిర్వహించే కార్యక్రమాలను క్రమపద్ధతిలో రాసి ఇవ్వగలిగితే అది నివేదిక అవుతుంది. ప్రాజెక్టు పనులు, సమాచార సేకరణ మొదలగు వాటిని ఒక రిపోర్ట్ రూపంలో రాయడాన్ని డాక్యుమెంటేషన్ లేదా నివేదిక రూపకల్పన అంటారు. ఈ పనులలో వారు నిర్వహించిన తీరు, సేకరించిన సమాచారం రాయాలి.

**4. లఘు పరీక్ష (Slip Test)**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల సామర్థ్యాల సాధనను ఒక చిన్న పరీక్ష రూపంలో కూడా పరిశీలించవలసి ఉంటుంది. అయితే, ఇది సాధారణ యూనిట్ పరీక్ష కాదు. దీని గురించి ముందుగానే ప్రశ్నాపత్రం రూపొందించుకోవడం, పరీక్షల టైమ్ టేబుల్ ప్రకటించడం, నిర్ణీత సమయంలోనే పరీక్షను నిర్వహించడం వంటివి ఉండవు. ఉపాధ్యాయుడు తాను చెప్పిన పాఠ్యాంశాలలో ఎంపిక చేసుకున్న విద్యా ప్రమాణాలను పరిశీలించడానికి అప్పటికప్పుడే నిర్వహించే ఒక రాత పరీక్ష. దీని ద్వారా పిల్లల సామర్థ్యాల సాధనను ఉపాధ్యాయుడు నిర్ధారించడానికి వీలు కలుగుతుంది. దీనిపై ఎలాంటి ముందస్తు సమాచారం విద్యార్థులకు ఇవ్వనవసరం లేదు. ప్రశ్నలను నల్లబల్లపై గాని, చార్టుపై గాని రాయాలి. పుస్తకంలో ఉన్న ప్రశ్నలను, అభ్యాసాలను అలాగే ఇవ్వకూడదు. పిల్లలు ఆలోచించి సొంతంగా సమాధానాలు రాసేందుకు వీలుగా ప్రశ్నలు తయారుచేసి ఇవ్వాలి.

**ఫార్మాటివ్ అసెస్‌మెంట్ ఎప్పుడెప్పుడు నిర్వహించాలి?**

- నిర్మాణాత్మక మూల్యాంకనం రోజు వారీ తరగతి గది బోధనలో భాగం.
- విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు రికార్డులో నమోదు చేయాలి. ఉపాధ్యాయుడు వాస్తవంగా పరిశీలించి, నమోదు చేస్తేనే పిల్లలకు, సమాజానికి న్యాయం చేసినవాళ్ళమవుతాం.
- నిర్మాణాత్మక మూల్యాంకనం

  1. జూలై 2. ఆగష్టు 3. నవంబర్ 4. ఫిబ్రవరి నెలలలో నమోదు చేయాలి.
- ఉపాధ్యాయుడు పిల్లల సామర్థ్యాల సాధనను పరిశీలిస్తూ ప్రగతిని నిర్ధారించాలి.
- ప్రతి రోజు పిల్లల ప్రగతిని నమోదు చేయాల్సిన అవసరం లేదు.
- ఉపాధ్యాయుడు తన పరిశీలనల ఆధారంగా ఒక నిర్ధారణకు వచ్చి మార్కులు ఇవ్వాలి.
- టీచర్ డైరీ, నోటుపుస్తకాలు సరిచేసి ఉండడం, ప్రాజెక్టు నివేదికలు, దిద్దిన సమాధాన పత్రాలు ఆధారాలుగా ఉంచుకోవాలి.
- గ్రేడు నిర్ణయించడంలో విద్యార్థి సాధించిన మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి.
- పిల్లల ప్రగతిని పాయింట్ల స్కేలుతో సూచించాలి.

- సహ పాఠ్యాంశాలలో గ్రేడులతోపాటు వివరణాత్మక సూచికలు కూడా రాయాలి.
- కింది పట్టిక ఆధారంగా మార్కుల శాతాన్నిబట్టి గ్రేడునివ్వాలి.

| శాతం | గ్రేడు |
|---|---|
| **91-100** | **A+** |
| **71-90** | **A** |
| **51-70** | **B+** |
| **41-50** | **B** |
| **0-40** | **C** |

| విషయం | నిర్మాణాత్మక మూల్యాంకనం - 2 | | | | పొందిన మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|
| | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (10 మా) | రాత అంశాలు (10 మా) | ప్రాజెక్టు పనులు (10 మా) | లఘు పరీక్ష (20 మా) | | |
| తెలుగు | 8 | 7 | 9 | 16 | 40 | ఎ |
| గ్రేడులు | ఎ | బి+ | ఎ | ఎ | ఎ | ఎ |

**నిర్మాణాత్మక మూల్యాంకనం– లక్షణాలు:**

- బోధనాభ్యసన జరుగుతున్నప్పుడే పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో పరిశీలించడం.
- అభ్యసనను మెరుగుపరచుకోవడానికి నిరంతరం జరిగేది (on going assessment)
- అభ్యసనాన్ని మెరుగుపరుస్తుంది.
- అభ్యసనం ఎలా జరుగుతుంది అనే విధానంపై దృష్టిపెడుతుంది.
- అంతర్గతంగా నిర్ణయించుకున్న పద్ధతులు, లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది.
- అభివృద్ధి పరచవలసిన అంశాలను గుర్తించడానికి పనికివస్తుంది.
- బోధనా పద్ధతులు, విధానాలు మొదలైనవన్నీ నిరంతరం మార్చుకోవడానికి వీలైన సరళీకృతం కలిగివుంటుంది.
- ప్రగతి కోసం ప్రయత్నిస్తుంది.
- పరస్పరం నేర్చుకోవడానికి వీలుకల్పిస్తుంది.
- సూక్ష్మస్థాయి పరిశీలన.
- పిల్లల డైరీలు, నోటుపుస్తకాలు మొదలైన సాధనాల ద్వారా మూల్యాంకనం జరుగుతుంది.

## 5.15 సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Assessment)

విద్యార్థి బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకొన్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడాన్ని సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటారు. ఇవి కోర్సు మొత్తం పూర్తిఅయిన తర్వాత లేదా నిర్ధారిత పాఠ్యప్రణాళిక పూర్తయిన తరువాత పిల్లల సాధనను పరీక్షించే పద్ధతి. ఈ పద్ధతిలో విద్యార్థి తాను చదివిన కోర్సుద్వారా ఏమి నేర్చుకున్నాడు?, ఎంత వరకు నేర్చుకున్నాడు? అనే అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సాధారణంగా రాత (పేపర్ – పెన్సిల్) పరీక్షల రూపంలో మాత్రమే నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పాఠ్యవిషయాలను మాత్రమే పరీక్షించడం జరుగుతుంది. పిల్లలు

ఎంత నేర్చుకున్నారు అని పరీక్షించడం. టర్మినల్, వార్షిక పేరిట నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనం విద్యార్థులకు వారి సాధనను, మార్కులు, ర్యాంకుల రూపంలో అందజేస్తుంది. ఉత్తీర్ణత సాధించారో లేదో మాత్రమే తెలియజేస్తుంది. విద్యార్థులు చదివిన అంశాలన్నీ అవగాహన చేసుకొని స్వంతంగా పరీక్షలలో రాయవలసి రావడం వల్ల పిల్లల్లో పరీక్షలపట్ల భయం, వ్యాకులత ఉండదు. ఈ తరహా అంతర్గత మూల్యాంకన విధానం పరీక్షల పేరిట పిల్లల మధ్య కలిగే అవాంఛనీయ పోటీని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. దీని స్వభావాన్ని మరింతగా నిశితంగా అర్థంచేసుకుందాం.

- ఇది అభ్యసనను మూల్యాంకనం చేసే పద్ధతి.
- సాధారణంగా టర్మ్, వార్షిక పరీక్షల రూపంలో నేర్చుకున్న మొత్తాన్ని పరీక్షిస్తుంది. అనగా త్రైమాసిక (Quarterly), అర్ధ వార్షిక (Half Yearly) మరియు వార్షిక (Annual) పరీక్షలు జరపడం.
- విద్యాప్రమాణాల ఆధారంగా పిల్లల ప్రగతిని ఉపాధ్యాయుడు స్వయంగా తయారుచేసిన పరీక్షా పేపర్‌తో పరిశీలించే పరీక్ష పద్ధతి.
- పరీక్ష నిర్వహణ కోసం ఉపాధ్యాయులు సబ్జెక్టువారీగా నిర్ధారించిన విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి (విషయవారీ భారత్వ పట్టికలను పరిశీలించండి.)

## భారత్వ పట్టికలు

### తెలుగు

| తరగతి | అంశం | ఫార్మేటివ్: పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు | ఫార్మేటివ్: రాత అంశాలు | ఫార్మేటివ్: ప్రాజెక్టు పనులు | ఫార్మేటివ్: లఘు పరీక్ష | ఫార్మేటివ్: మొత్తం | సమ్మేటివ్: వినడం, మాట్లాడడం ప్రశంస, మౌఖికం | సమ్మేటివ్: చదవడం – మౌఖికం | సమ్మేటివ్: చదవడం – రాత | సమ్మేటివ్: రాయడం | సమ్మేటివ్: సృజనాత్మకత – మౌఖికం | సమ్మేటివ్: సృజనాత్మకత – రాత | సమ్మేటివ్: పదజాలం / భాషాంశాలు | సమ్మేటివ్: మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1–2 | భారత్వం | 20% | 20% | 20% | 40% | 100% | 20% | 10% | 20% | 40% | 10% | – | – | 100% |
| | మార్కులు | 10 | 10 | 10 | 20 | 50M | 10 | 5 | 10 | 20 | 5 | – | – | 50M |
| 3–5 | భారత్వం | 20% | 20% | 20% | 40% | 100% | 10% | 10% | 20% | 30% | – | 10% | 20% | 100% |
| | మార్కులు | 10 | 10 | 10 | 20 | 50M | 5 | 5 | 10 | 15 | – | 5 | 10 | 50M |
| 6–9 | భారత్వం | 20% | 20% | 20% | 40% | 100% | 10% | – | 20% | 30% | – | 20% | 20% | 100% |
| | మార్కులు | 10 | 10 | 10 | 20 | 50M | 10 | – | 20 | 30 | – | 20 | 20 | 100M |

- మౌఖిక పరీక్షను ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరం లేదు. మౌఖిక పరీక్షకు సంబంధించిన విద్యా ప్రమాణాలకు కేటాయించిన మార్కులను ఉపాధ్యాయుడు తమ పరిశీలనల ఆధారంగా లేదా అంతకుముందు నమోదుచేసిన ఫార్మేటివ్ మూల్యాంకనం ఆధారంగా కేటాయించి పిల్లల ప్రగతిని నమోదుచేయాలి.
- రాత పరీక్ష కోసం ఆయా సబ్జక్టులవారీగా నిర్ధారించిన భారత్వాల ప్రకారం విద్యాప్రమాణాల ఆధారంగా ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి.

- సంగ్రహణాత్మక మూల్యాంకనం ఒక విద్యా సంవత్సర కాలంలో రెండుసార్లు నిర్వహించాలి. కాబట్టి మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం. అక్టోబర్ మాసంలో, రెండవ సంగ్రహణాత్మక మూల్యాకనం మార్చి లేదా ఏప్రిల్ మాసంలో నిర్వహించాలి. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నపత్రం రూపొందించుకొనేటప్పుడు అక్టోబర్ నెలవరకు పూర్తయిన సిలబస్‌ను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నాపత్రం రూపొందించు కొనేటప్పుడు పూర్తి పాఠ్యపుస్తకాన్ని అనగా అన్ని అధ్యాయాలను పరిగణలోకి తీసుకోవాలి.
- సమ్మేటివ్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించినపుడు అన్నిరకాల ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అనగా వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు, లక్ష్యాత్మక ప్రశ్నలు మొదలగునవి.
- ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నపత్రంలో ఒకే విభాగంగా ఇవ్వాలి. ప్రాజక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.
- ఈ ప్రశ్నలు పిల్లలు నేర్చుకున్న భావనల ఆధారంగా విశ్లేషించడానికి తార్కికంగా ఆలోచించడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి తన సొంత అభిప్రాయాలను జోడించి రాయడానికి అనుకూలంగా ఉండాలి.
- పై రెండు మూల్యాంకనాలలో నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల ప్రగతి పరిశీలన మౌఖిక, రాతరూపాలలో అంచనావేస్తే, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో రాతరూపంలో మాత్రమే అంచనా వేయాల్సి ఉంటుంది. అయితే ప్రాథమిక తరగతులలో అనగా 1, 2 తరగతులకు మౌఖిక పరీక్షను కూడా నిర్వహించాలి.
- నిర్ధారిత సిలబస్ ఆధారంగా ఉపాధ్యాయుడు స్వయంగా ప్రశ్నపత్రం రూపొందించుకొని మూల్యాంకనం చేయాలి.
- ఇతర సంస్థలు, వ్యక్తులు రూపొందించిన ప్రశ్నాపత్రాలు ఉపయోగించకూడదు.ఐతే ఉపాధ్యాయులు ప్రశ్నపత్రం రూపకల్పన గురించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో చర్చించి సహాయం పొందవచ్చు.
- ఉపాధ్యాయుడు ప్రశ్నపత్రం ఆధారంగా ప్రాథమిక 'కీ' తయారు చేసుకోవాల్సిన అవసరం లేదు.
  ఎందుకంటే సమ్మేటివ్ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు స్వభావరీత్యా సొంతంగా రాయడానికి, విశ్లేషణాత్మకంగా రాయడానికి వీలుగా వుంటాయి. కాబట్టి తరగతిలో పిల్లలందరూ ఒకేరకమైన సమాధానం రాస్తారని భావించకూడదు.
- పిల్లలు సొంతంగా సమాధానాలు రాయడానికి ప్రశ్న పత్రం తోడ్పాడాలి. పాఠ్యపుస్తకంలో సూచించుకున్న దానికన్నా భిన్నమైన సమాధానం పిల్లలు తమ సొంత ఆలోచనలు, అనుభవాలతో రాసి వుండవచ్చు. అది సరైనది అయినపుడు దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
- ఒక విద్యాప్రమాణంలో ప్రశ్నలన్నీ ఒక విభాగంలోనే ఉంటాయి. కాబట్టి ఆ విధ్యాప్రమాణానికి ఎన్ని మార్కులు ఇచ్చారు? పిల్లలు ఎన్ని మార్కులు సాధించారు అనేది సులభంగా తెలుసుకోవచ్చు.
- సాధారణంగా ఉపాధ్యాయులు ఇంతకుముందు సమాధానపత్రాలు దిద్దినట్లే ప్రస్తుతం కూడా సమాధాన పత్రాన్ని దిద్ది మార్కులు వేయవచ్చు. ఐతే సమాధానాలు విద్యార్థికి విద్యార్థికి మారుతూ ఉంటాయి కాబట్టి జాగ్రత్తగా చదివి మార్కులు కేటాయించాలి.
- సమాధాన పత్రం దిద్దిన తరువాత పైన కేటాయించిన గడులలో ఏ విద్యాప్రమాణానికి ఎన్ని మార్కులు వచ్చాయి? మొత్తం మార్కులు, గ్రేడు రాయాలి.
- గ్రేడు నిర్ణయించడంలో విద్యార్థి సాధించిన మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి. కింది పట్టిక ఆధారంగా మార్కుల శాతాన్నిబట్టి గ్రేడునివ్వాలి.

కింది ఉదాహరణను పరిశీలించండి. రజియా ఎనిమిదో తరగతి చదువుతోంది. జీవశాస్త్రంలో సమ్మేటివ్ ఒకటిలో తాను పొందిన మార్కులు, విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో పరిశీలించండి.

| వివరాలు | విద్యాప్రమాణాలు | | | | | | మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|---|
| సామర్థ్యాలు | భా.అ. | ప్రశ్న,పరి | ప్రయో,క్షేత్ర | స.సై.,ప్రాజె | బో.ప.న | ప్ర,వి,జీవ | | |
| పొందిన మార్కులు | 20 | 8 | 10 | 6 | 11 | 7 | 62 | $B^+$ |
| గ్రేడు | $B^+$ | A | $B^+$ | $B^+$ | $B^+$ | A | | |

**సబ్జెక్టు వారీగా విద్యాప్రమాణాలు, భారత్వ పట్టికలు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో విషయ నిపుణులు రూపొందించిన నిరంతర సమగ్ర మూల్యాంకనం మాడ్యూల్‌లో వివరంగా ఇవ్వడం జరిగింది. వాటి ఆధారంగా ప్రశ్నపత్రాలను రూపొందించుకొని ఉపాధ్యాయులు సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించాలి. దీన్ని సంవత్సరంలో 3సార్లు నిర్వహించాలి. (సెప్టెంబర్, డిసెంబర్/ జనవరి, ఏప్రిల్ మాసాలలో).**

## 5.16 సహపాఠ్యాంశాల మూల్యాంకనం (Assessment of other curricular areas)

- సహపాఠ్య అంశాలను మూల్యాంకనం చేయడంలో ఇతర పాఠ్య విషయాల మాదిరిగా కాకుండా కేవలం సంగ్రహణాత్మకంగా సంవత్సరంలో 3 సార్లు మాత్రమే మూల్యాంకనం చేయాలి.
- వీటికి నిర్ధారిత రాత పరీక్ష ఉండదు. ఉపాధ్యాయులు పరిశీలన ఆధారంగా గ్రేడులు ఇవ్వాలి.
- సహ పాఠ్యాంశాలలో విద్యా ప్రమాణాల వారీగా పిల్లల ప్రగతిని పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- పిల్లలు పాల్గంటున్న తీరును, ప్రదర్శిస్తున్న నైపుణ్యాలను, ఆచరిస్తున్న విధానాలను పరిశీలించి మార్కులు, గ్రేడులు ఇవ్వాలి. వీటితోపాటు వివరణాత్మక సూచికలు కూడా రాయాలి.
- సహపాఠ్యాంశాలు నాలుగు. ఒక్కో అంశం కింద ఐదు సామర్థ్యాలు ఇవ్వబడ్డాయి. ఒక్క సామర్థ్యానికి 10 మార్కులు. అంటే ఒక్కొక్క అంశానికి 50 మార్కులు ఉంటాయి. మొత్తం నాలుగు అంశాలకు 200 మార్కులు ఉంటాయి. ఉదాహరణకు ఒక అంశం కింద ఇవ్వబడింది.

| క్ర.సం. | పేరు | సాధించాల్సిన సామర్థ్యాలు | | | | | గ్రేడు (50 మా.) |
|---|---|---|---|---|---|---|---|
| | | ఆటలలో పాల్గొనడం, క్రీడాస్ఫూర్తి (10 మా.) | యోగా, మెడిటేషన్, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి. (10 మా.) | వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత – ఆరోగ్య అలవాట్లు (10 మా.) | భద్రత – ప్రథమ చికిత్స (10 మా.) | ఆరోగ్యం, పోషకాహారం, మంచి ఆహార అలవాట్లు (10 మా.) | |
| | | | | | | | |

$A^+$ - చాలా బాగున్నది, కొనసాగించండి. ఇది అత్యుత్తమం.

A - బాగున్నది, ఉన్నత శ్రేణికి ప్రయత్నించండి. ఉత్తమం

$B^+$- ఫర్వాలేదు, కృషిచేస్తే ఇంకా బాగా చేయగలరు.

B - నామమాత్రంగా చేయగలుగుతున్నారు. మరింత కృషి అవసరం.

C - ఉపాధ్యాయుడి సహకారం అవసరం, ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.

## 5.17 CCE – రిజిష్టరు, రికార్డులు (CCE - Registers and Records)

ఆయా మాసాలలో పూర్తిచేసిన పాఠ్యాంశాల మదింపు చేయవలెను. FA నిరంతరంగా బోధనాభ్యసనలో అందర్భాగం చేస్తూ పిల్లలకు గ్రేడులు ఇస్తాం. SAలో రాత పరీక్ష నిర్వహించి అందులో కూడా గ్రేడులు ఇస్తాం. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా 5 అంశాల గ్రేడింగ్ స్కేల్ – $A^+$, A, $B^+$, B and C పై విద్యార్థి ప్రగతిని నిర్ధారిస్తాం. మార్కుల ఆధారిత గ్రేడులు విద్యార్థి ప్రగతిని అంచనావేయటానికి సులభమయిన మార్గం.

భాషా, భాషేతర అంశాలతోపాటు సహపాఠ్యాంశములయిన ఆరోగ్యం మరియు వ్యాయామ విద్య, సాంస్కృతిక విద్య, విలువలు మరియు వైఖరులు కూడ మదింపు చేయబడుతాయి.

- $SA^1$, $SA^2$, $SA^3$ (Summative Assessment) నిర్వహించే 3 సందర్భాలలో సహపాఠ్య అంశాలు అంచనా వేయబడుతాయి. మార్కుల ఆధారిత గ్రేడింగ్ సహపాఠ్యఅంశాలలో విద్యార్థులకు ఇవ్వబడుతుంది.
- ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతిగది / విషయం నకు సంబంధించిన ఒక సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహిస్తాడు. ఇందులో ప్రతి విద్యార్థి ప్రగతిని నమోదు చేస్తాడు. ఈ ప్రగతిని ప్రగతిపత్రం/కుములేవిట్ రికార్డులో పొందుపరచి తల్లిదండ్రులకు పరిశీలనార్థం పంపిస్తారు.
- కుములేవిట్ రికార్డ్ ప్రతి విద్యార్థికి 1–5, 6–10 తరగతుల వరకు నిర్వహించబడుతుంది. దీన్ని 8వ తరగతి పూర్తి అయిన పిదప ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసినట్లుగా సర్టిఫికెట్ ప్రధానం చేయబడుతుంది. ఈ కుములేటివ్ రికార్డులో గడిచిన 8 సంవత్సరాలలో పిల్లవాని అన్ని అంశాలు అనగా హాజరు, పాఠ్య, పాఠ్యేతర అంశాలలో ప్రగతి మరియు తల్లిదండ్రుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రతిబింభిస్తాయి.

## 5.18 CCE – నిర్వహణ–బాధ్యతలు (CCE - Implementation - Roles & Responsibilities)

నిరంతర సమగ్ర మూల్యాంకనంను ఎప్పటికప్పుడు అన్ని పాఠ్యాంశాలలోని అన్ని సామర్థ్యాలను పరిశీలించి అంచనా వేయాలి.

పాఠ్యాంశాల వారీగా పరిశీలించిన అంశాలను రిజిష్టర్‌లో నమోదు చేసే బాధ్యత ఉపాధ్యాయునిది.

- తరగతి గదిలోని పిల్లలందరికీ బాధ్యత వహించాల్సింది ఉపాధ్యాయుడు.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణ, బాధ్యత నిర్వహించాల్సింది ప్రధానోపాధ్యాయుడు, ఆయా ఉపాధ్యాయులు దీనికి బాధ్యత వహించాలి. పర్యవేక్షించాలి.
- కాంప్లెక్సు స్థాయిలో సిసిఇ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయునిది.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణలో ఎస్ఎంసి, పిటిఏ కూడా పర్యవేక్షణ బాధ్యత నిర్వహించాలి.
- మండల స్థాయిలో సిసిఇ నిర్వహణ అమలు బాధ్యత నిర్వహించాల్సింది మండల విద్యా శాఖాధికారి (ఎం.ఇ.ఓ.) మరియు వారి సిబ్బంది.
- జిల్లా స్థాయిలో సిసిఇ నిర్వహణ, అమలు, పర్యవేక్షణ జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ) బాధ్యత వహించాలి.

## 5.19 CCE – అమలు – సూచికలు – ఆధారాలు
## (CCE - Indicators of implementation - Evidences)

సిసిఇ పాఠశాల ఆధారిత, ఉపాధ్యాయునికి సంబంధించిన మూల్యాంకనం. ఈ ప్రశ్నాపత్రంలను ఖచ్చితంగా ఉపాధ్యాయుడే తయారు చేయాలి. కాని ఇతర సంస్థల నుండి గాని వ్యక్తుల నుండి గాని పొందరాదు. పిల్లల ప్రగతిని పైన వివరించిన 5 అంశాల గ్రేడింగ్ స్కేల్‌పై మార్కుల ఆధారంగా నిర్ధారించి, నమోదు చేయాలి. విద్యా ప్రమాణాలలో విద్యార్థులు సాధించిన గ్రేడ్లను $A^+$, A, $B^+$, B and C గా గుర్తించాలి. ప్రతి పాఠశాల నిర్దేశించిన విద్యా ప్రమాణాల సాధనకు కృ,ట చేయాలి. ప్రతి విద్యార్థికి నిర్దేశించిన సామర్థ్యాల సాధనకు సంబంధించిన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని విశ్వసించాలి. విద్యార్థుల ప్రగతి ఆధారంగా తరగతి గది / పాఠశాలకు గ్రేడు ఇవ్వబడుతుంది. ఇది ఎంతమంది విద్యార్థులు $A^+$ మరియు A సాధించారనే దానిపై నిర్ణయించబడుతుంది. సహపాఠ్యాంశాల మూల్యాంకనంనకు పలు రకాల మూల్యాంకన సాధనాలు ఉపయోగించబడి, గ్రేడింగ్ ఇవ్వబడుతుంది.

ప్రతి ఉపాధ్యాయుడు సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహించాలి. ఇందులో ప్రతి విషయానికి చెందిన అభ్యసనా సూచికలు అనగా విద్యా ప్రమాణాలు ఒక బేస్‌లైన్‌పై ఎంత మేరకు ప్రగతిని సాధించారనే విషయాన్ని గ్రేడుల రూపంలో నమోదు చేయాలి. కుములేటివ్ రికార్డు కూడ నిర్వహించబడుతుంది. ఇది రెండు దశలలో ఉంటుంది. 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక, 6 నుండి 10వ తరగతి వరకు ప్రాథమికోన్నత. 8వ తరగతి అనంతరం సర్టిఫికెట్ ప్రధానం చేయబడుతుంది. SCERT వారు సిసిఇ అమలుకు అవసరమయిన మార్గదర్శకత్వమును, శిక్షణలను, కరదీపికలను తయారుచేసి ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు, డిసిఇబికి అందిస్తుంది. ఈ కార్యక్రమాలన్నింటిని ఎస్.ఎస్.ఏ. సమన్వయంతో ఎస్.సి.ఇ.ఆర్.టి. నిర్వహిస్తుంది.

సిసిఇ అమలు జరుగుతున్న ఆధారాలకు ఈ కింది వాటిని గమనించాలి. తద్వారా ఒక పాఠశాలలో సిసిఇ అమలు జరుగుతున్న తీరును అంచనా వేయవచ్చు.

1) ఉపాధ్యాయుడు సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నాపత్రాలు, పిల్లల నోటుపుస్తకాలు
2) పాఠ్యపుస్తకాలలోని పిల్లల స్వీయ మూల్యాంకనం, ప్రణాళికలు, వార్షిక మరియు యూనిట్/ పాఠ్యప్రణాళికలు
3) సి.సి.ఇ. రిజిష్టర్ నిర్వహణ
4) ఉపాధ్యాయుల డైరీ
5) పిల్లల డైరీ
6) పోర్ట్‌ఫోలియోలు
7) అనెక్‌డొట్స్
8) పరిశీలన నివేదికలు
9) చెక్‌లిస్ట్‌లు
10) సమాధాన పత్రాలు
11) పిల్లల ప్రదర్శనలు
12) పాఠ్యపుస్తకంలో ఇవ్వబడిన అభ్యాసాలు, ప్రశ్నలకు పిల్లలు ఆలోచించి సొంతంగా రాయడం.
13) ప్రాజెక్టు పనుల నివేదికలు
14) క్యుములేటివ్ రికార్డ్
15) ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయుల రివ్యూ మినిట్స్ బుక్.
16) గైడ్లు, స్టడీమెటీరియల్స్ ఉపయోగించకపోవడం.

# నిరంతర సమగ్ర మూల్యాంకనం - పిల్లల ప్రగతి నమోదు - రిజిష్టరు నమూనా

తరగతి : ______________ విషయం: ___________

| క్ర. సం. | విద్యార్థి పేరు | M/G | BL. | నిర్మాణాత్మక మూల్యాంకనం | | | | | | | | | | | | | | | | | | | | సంగ్రహణాత్మక మూల్యాంకనం | | | | | | | | | | | | | | | | | | | | | వార్షిక ఫలితం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | FA1 | | | | | FA2 | | | | | FA3 | | | | | FA4 | | | | | SA1 | | | | | | | SA2 | | | | | | | SA3 | | | | | | | 4వ FA + 3వ SA ల మొత్తం | |
| | | | | 1 | 2 | 3 | 4 | M | 1 | 2 | 3 | 4 | M | 1 | 2 | 3 | 4 | M | 1 | 2 | 3 | 4 | M | 1 | 2 | 3 | 4 | 5 | 6 | M | 1 | 2 | 3 | 4 | 5 | 6 | M | 1 | 2 | 3 | 4 | 5 | 6 | M | M | G |
| | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |

*గమనిక:* ప్రగతి నమోదు రిజిష్టరులో తరగతి వారీగా, సబ్జెక్టు వారీగా వివరాలు నమోదు చేయాలి.

**FA** నిర్మాణాత్మక మూల్యాంకనం, **SA** సంగ్రహణాత్మక మూల్యాంకనం

**FA** లో 1.పిల్లల భాగస్వామ్యం - ప్రతిస్పందనలు, 2. పిల్లలు రాసిన అంశాలు, 3. ప్రాజెక్టు పని, 4. లఘు పరీక్ష, **M** పొందిన మొత్తం మార్కులు, **G** గ్రేడు

**SA** లో 1 నుండి 6 వరకు ఉన్న సంఖ్యలు విద్యా ప్రమాణాలను సూచిస్తాయి.

**ప్రారంభ పరీక్ష (BL - Baseline):** దీన్ని 134, 135వ పేజీలలో సూచించిన విధంగా నిర్వహించాలి.

**వార్షిక ఫలితం:** చివరి అనగా 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం, 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని మార్కులను కలిపి వార్షిక ఫలితాన్ని నిర్ణయించాలి.

# 6. పాఠశాల పని దినాలు - పని గంటలు

## (School Working Days - Working Hours)

**6.1** మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
**(Basic Questions - Think and Reflect)**

**6.2** నేపథ్యం **(Context)**

**6.3** పాఠశాల పని దినాలు, పని గంటలు – ప్రస్తుత పరిస్థితి
**(School Working Days and Working Hours – Existing Situation)**

**6.4** **RTE-2009 -** పాఠశాల పని దినాలు, పని గంటలు – సెక్షన్లు వివరణ – పదజాలం వివరణ
**(RTE-2009 - Sections and Details on School Working Days and Working Hours and Terminology)**

**6.5** **RTE** లో సూచించిన విధంగా పాఠశాల పని దినాలు, పని గంటలు – అమలు
**(School Working Days - Working Hours as per RTE - 2009 - Implementation)**

**6.6** పని దినాలు, పని గంటలు – అమలు – బాధ్యతలు
**(School Working Days - Working Hours - Implementation - Roles and Responsibilities)**

**6.7** పని దినాలు, పని గంటలు – అమలుకు సూచికలు
**(School Working Days, Working Hours – Indicators of Implementation)**

**6.8** ముగింపు **(Conclusion)**

## పిల్లల పెరుగుదల

పిల్లలు ద్వేషంతో చూసే వాతావరణంలో పెరిగితే పోట్లాడడం అలవర్చుకొంటారు. గుర్తింపు పొందే వాతావరణంలో పెరిగితే మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొంటారు. పిల్లలు భయంతో పెరిగితే అభద్రతకు లోనౌతారు. విశ్వాసం గల స్థితిలో జీవిస్తే వివేచన నేర్చుకుంటారు. పిల్లలు గేలి చేయబడుతూ పెరిగితే సిగ్గుతో కుంచించుకొంటారు. స్నేహపూరిత వాతావరణంలో పెరిగితే తాము నివసించే ప్రపంచం గొప్పదనుకుంటారు. పిల్లలు 'అయ్యో పాపం' అనే స్థితిలో పెరిగితే తమపై తాము జాలిపడుతుంటారు. ప్రేమాభిమానాల మధ్య పెరిగితే పరిపూర్ణ వ్యక్తులుగా పెరుగుతారు.

**– డోరోతి లా నోల్ట్**

---

## ఉపాధ్యాయుడి బాధ్యత

మీరు చెప్పింది పిల్లలు వినాలనుకుంటే మీరు పిల్లలు చెప్పేది వినడానికి సిద్ధపడండి. వాళ్ళకి బోధించవద్దు. వాళ్ళు నేర్చుకోవడానికి సహాయపడండి. వాళ్ళ దగ్గర ఎప్పుడూ చిరునవ్వుతో ఉండడం, వాళ్ళతో కలిసి నవ్వడం ముందుగా మీరు నేర్చుకోండి. అప్పుడు పిల్లలు మీకు విద్యార్థులుగా గాక మిత్రుల్లాగా ఉంటారు. మీ దగ్గర నేర్చుకోవడానికి, మీతో ఆనందం పంచుకోవడానికి, కష్టాలు మీతో చెప్పుకోవడానికి ముందుకు వస్తారు.

నా దృష్టిలో ఉపాధ్యాయుడి ప్రప్రథమ బాధ్యత ఇది.

**– కల్పకం చావలి, భారతీయ విద్యాభవన్**
**(సౌజన్యం – చదువు)**

---

## సజీవ బోధన (Organic Teaching) సెల్వియా ఆష్టన్ వార్నర్

ప్రతి బిడ్డలో ఒక మహాసృజనాత్మకత ఉంటుందని సెల్వియా నమ్మకం. అది నాగరికుల కంటే ప్రకృతి ఒడిలోని సుఖజీవులకంటే దగాపడ్డ కష్టజీవుల్లో మరింత ఉంటుందని ఆమె విశ్వాసం. ఈ సృజనాత్మకతను మనం వెల్లువెత్తిస్తే ఆ బిడ్డలు ప్రపంచాన్ని పదిలంగా నిలబెడతారు. లేకుంటే విధ్వంసం ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది. అప్పుడు సర్వనాశనం జరుగుతుంది. బిడ్డలోని ఈ సృజనశీలతను వెలికితీయడం ఎలా? – అనేదే ఏ టీచరైన వేసుకోవల్సిన ప్రశ్న. దీనికి టీచర్ కళాకారుడు కావాలి. సృష్టికర్త కావాలి. నిరంతరాన్వేషి కావాలి. తన హృదయాన్ని మొదట తట్టి లేపుకోవాలి. ఆ టీచర్ ఈ పని చేయగలడనేది సెల్వియా సిద్ధాంతం. అందుకే ఆమె వాచకాల్ని వ్యతిరేకిస్తుంది. వర్క్‌బుక్స్‌ని ద్వేషిస్తుంది. హృదయమున్న టీచరే విద్యకు సర్వస్వమంటుంది. బిడ్డల్లోని అంతర్లీనమైన జ్ఞానం నుంచి పసివాడు ఎదుర్కొన్న జీవితం నుంచి కావాల్సినంత సామగ్రి దొరుకుతుందని ఆమె అనుభవం. దీనినే ఆమె 'సజీవబోధన' అంటుంది.

**– "చదువు విజ్ఞానం"**

# 6. పాఠశాల పనిదినాలు, పనిగంటలు
## (School Working Days - Working hours)

### 6.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
### (Basic Questions - Think and Reflect)

1) పాఠశాల అంటే ఏమిటి? (What is school?)
2) పాఠశాల సంసిద్ధత అంటే ఏమిటి? (What is school readyness?)
3) ఏ ఏ కర్రికులం అంశాలు పాఠశాలలో అమలు చేయాలి?
   (What curricular areas are to be implemented in school?)
4) విద్యా సంబంధమైన కార్యక్రమాల స్వభావం ఏమిటి?
   (What is the nature of academic programmes?)
5) పని, పనికి కేటాయించిన సమయం అంటే ఏమిటి? (What is time on task?)
6) బోధనా సమయం మరియు ఉపాధ్యాయుల తయారీ సమయం అంటే ఏమిటి?
   (What is instructional time and preparation time?)
7) బోధనాభ్యసన సమయంలో చేయాల్సినవి, చేయకూడనివి.
   (Suggested do's and dont's during instructional time?)
8) ప్రభావ వంతమైన మానిటరింగ్ మరియు సహాయం చేయడం మరియు అంతర కర్రికులం కార్యక్రమాల అమలులో ప్రధానోపాధ్యాయుని పాత్ర ఏమిటి?
   (Role of H.M. in effective monitoring and supporting and undertaking cross curricular events and reposnsibilities)

### 6.2 నేపథ్యం (Context)

ఎన్ని వనరులు ఉన్నా, ఎంత సామగ్రి ఉన్నా వాటిని ప్రణాళికాబద్ధంగా తరగతిగదిలో వినియోగించి, సత్ఫలితాలు సాధించాల్సింది ఉపాధ్యాయుడే. ఏ విద్యా కార్యక్రమమైనా విజయవంతం కావాలంటే, ఆ కార్యక్రమం క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అందుబాటులో ఉన్న సమయం, వనరులు, దృష్టిలో ఉంచుకొని తగిన ప్రణాళికతో ముందు వెళ్ళాలి. అప్పుడే లక్ష్యసాధన జరిగి గుణాత్మక విద్య సాధ్యమవుతుంది. దీనికోసం అందుబాటులో ఉన్న పనిదినాలు, సిలబస్, ఉపాధ్యాయులు, వనరులు ంమొదలగువాటిని గుర్తించి ముందుగానే తగిన ప్రణాళిక రూపొందించుకోవాలి.

పాఠశాల పనిగంటలు మొత్తం పిల్లలల అభ్యసనం కోసం ఉద్దేశించబడినవే కాబట్టి పిల్లలందరూ పాఠశాల సమయాన్ని పూర్తిగా సద్వినియోగపరుచుకునేలా పాఠశాల ప్రణాళిక ఉండాలి. ఉపాధ్యాయులు పాఠశాల పూర్తిసమయాన్ని పిల్లలు నేర్చుకోవడానికి వినియోగించాలి తప్ప కొద్దిసేపు బోధించి మిగతా సమయం మీరు చదువుకోండి, గైడ్లలో, తోటివారి నోటుబుక్కులలో చూసి రాసుకోండి అని, ఏదైనా పని చెప్పి అంటే బొమ్మలు గీయమనో, నాలుగైదుసార్లు రాయమనో, బట్టీపట్టమనో చెప్పి పిల్లలు అభ్యసన సమయాన్ని దుర్వినియోగం చేయకూడదు. అంతేకాకుండా కుర్చీలో కూర్చుని పేపరు చదవడం పిల్లల నోటుపుస్తకాలు, జవాబుపత్రాలు దిద్దడం, మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించిన రిజిష్టర్లు, హాజరు రిజిష్టర్లు, నిరంతర సమగ్ర మూల్యాంకనానికి సంబంధించిన రికార్డులు, రిజిష్టర్లు వంటి ఇతర పనులు

చేయరాదు. ఇటువంటి పనులు ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం – 2009 ప్రకారం పాఠశాల పనివేళలకు ముందుకాని, తర్వాతకాని చేయాలి. పాఠశాల సమయం పూర్తిగా పిల్లలది. అది వారి అభివృద్ధి కోసం వెచ్చించాలి.

పిల్లల పాఠశాల సమయాన్ని నూటికి నూరుశాతం సద్వినియోగం చేసుకోవాలంటే అందుకు తగిన ప్రణాళికను ఉపాధ్యాయులు రూపొందించుకొని అమలు చేయాలి. పిల్లలను అభ్యసనంలో పూర్తిగా లీనమగునట్లు చేయాలంటే కల్పించాల్సిన కృత్యాలు, చర్చలకు ప్రశ్నలు దానికి సంబంధించిన వ్యూహాలు, సామగ్రిని ఉపాధ్యాయులు ముందుగానే చేసుకోవాలి. ఈ విషయంలో ఉపాధ్యాయ తయారీ అనేది అత్యంత కీలకం. బోధనాభ్యసన సామగ్రిని, నల్లబల్ల పనిని పరస్పర ప్రతిస్పందన/ చర్చ సందర్భంగా విరివిగా వినియోగించాలి. అభ్యసనంలో వెనుకబడిన పిల్లల అభ్యసన ప్రగతికి ఉపాధ్యాయులు జవాబుదారీ తనాన్ని వహించాలి. పిల్లలందరూ ఆశించిన మేరకు నేర్చుకుంటే అప్పుడే అది నాణ్యతగల విద్య కేవలం 30 లేక 40 శాతం మంది పిల్లలు మాత్రమే చేయగలిగితే అది నాణ్యమైన విద్య కాదు. ఆ పాఠశాల నాణ్యమైనది కాదు.

ఆర్.టి.ఇ-2009 మార్గదర్శకాల ఆధారంగా పాఠశాల పనిదినాలు, పనిగంటలు, పాఠ్య ప్రణాళిక భారత్వాలలో తీసుకోవాల్సిన మార్పులకు సంబంధించి ఈ అధ్యాయంలో పేర్కొన్న ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగింది.

## 6.3 పాఠశాల పని దినాలు, పని గంటలు – ప్రస్తుత పరిస్థితి
## (School Working Days and Working Hours – Existing Situation)

ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల పనిదినాలు ఒకే రకంగా ఉన్నప్పటికి పనిగంటలలో తేడాలు ఉన్నాయి.

**పాఠశాలల వారీగా పనివేళలు:**

| పాఠశాల | పనివేళలు |
|---|---|
| 1. ప్రాథమిక | ఉ.గం.9.00 నుండి సా. 3.35 వరకు (మ.12.15 నుండి 1.15 లంచ్) |
| 2. ప్రాథమికోన్నత | ఉ.గం.9.00 నుండి సా. 4.05 వరకు (మ.12.15 నుండి 1.15 లంచ్) |
| 3. ఉన్నత | ఉ.గం.9.45 నుండి సా. 4.40 వరకు (మ.12.35 నుండి 1.45 లంచ్) |

మొత్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు గడిపే సమయం కింది విధంగా ఉంది.

ప్రాథమిక పాఠశాలలు : 5 గంటల 10 నిమిషాలు (విరామ సమయం కాకుండా)
ప్రాథమికోన్నత పాఠశాలలు : 5 గంటల 40 నిమిషాలు (విరామ సమయం కాకుండా)
ఉన్నత పాఠశాలలు : 5 గంటల 40 నిమిషాలు (విరామ సమయం కాకుండా)

ఈ పాఠశాలల పనివేళలపై సమాజం మార్పును ఆశిస్తోంది. ఎందుకంటే

- వివిధ కారణాలవల్ల పిల్లలు/ ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆలస్యంగా రావడం లేదా ముందుగా వెళ్ళడం వల్ల పాఠశాల సమయం వృథా అవుతుండడం.
- ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 4.30/5.00 గంటల వరకు పనిచేయడం. కాని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 3.45 వరకు మాత్రమే పనిచేయడం. తల్లిదండ్రులు ఇది కూడా చర్చిస్తున్నారు.
- ప్రాథమికస్థాయి పిల్లలు పాఠశాల వదిలి ఇంటికి వచ్చే సమయానికి తల్లిదండ్రులు ఇంటికి చేరుకోకపోవడం.

- విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలో ఉంటే ఎక్కువ విషయాలు నేర్చుకుంటారనే అభిప్రాయం కలిగి ఉండడం.
- పాఠశాల సమయం తక్కువగా ఉండడంవల్ల పాఠ్యేతర అంశాల నిర్వహణకు తగిన సమయం ఉండకపోవడం.
- సాయంత్రం పాఠశాల సమయం తక్కువగా ఉండడం వల్ల లైబ్రరీ నిర్వహణకు అవకాశం లేకపోవడం.

## 6.4 RTE-2009 - పాఠశాల పని దినాలు, పని గంటలు – సెక్షన్లు వివరణ – పదజాలం వివరణ (RTE-2009 - Sections and Details on School Working Days and Working Hours and Terminology)

- ఆర్‌టిఇ–2009 ప్రకారం 6–14 సంవత్సరాల మధ్య ఉన్న బాలలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉంది.
- దీని ప్రకారం పని దినాలు మరియు పనిగంటలు పేర్కొంటూ సెక్షన్ 19, 25 లకు అనుబంధంగా షెడ్యూల్ ఇవ్వడం జరిగింది.
- ఈ షెడ్యూల్‌లో పిల్లలందరికి నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించడానికి నియమాలు, ప్రామాణికాలు పేర్కొనడం జరిగింది.
- షెడ్యూల్‌లోని క్ర.సం. 3లో విద్యా సంవత్సరంలో కనీస పనిదినాలు / బోధనా గంటలు సూచించడం జరిగింది.
- షెడ్యూల్‌లోని క్ర.సం. 4లో ఉపాధ్యాయులకు వారానికి కనీస పనిగంటలు ఎన్ని ఉండాలో సూచించడం జరిగింది.
- ఈ చట్టంలోని షెడ్యూల్‌లో నిర్దేశించిన నియమాలు, ప్రామాణికాలు ప్రతీ పాఠశాల పాటించాలి. ఒకవేళ వీటి ఉల్లంఘన జరిగితే (అలా జరగనట్టయితే) సదరు పాఠశాల గుర్తింపు రద్దు చేస్తారు.

**ఆర్‌టిఇ–2009 షెడ్యూల్ – దానిలోని అంశాలు:**

### షెడ్యూల్

(సెక్షన్లు, 19, 25)

బడికి నియమాలు, ప్రామాణికాలు

| క్ర.సం. | అంశం | నియమాలు, ప్రామాణికాలు |
|---|---|---|
| 3 | విద్యా సంవత్సరంలో కనీస పనిదినాలు / బోధనా గంటల సంఖ్య | i) ఒకటి నుండి అయిదవ తరగతి వరకు రెండు వందల పనిదినాలు<br>ii) ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు రెండు వందల ఇరవై పనిదినాలు<br>iii) ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో ఎనిమిది వందల బోధనా గంటలు.<br>iv) ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో వెయ్యి బోధనా గంటలు |
| 4 | టీచర్లకు వారానికి – కనీస పనిగంటలు | బోధనకి కనీసం నలభై అయిదు గంటలు (తయారీతో కలిపి) |

**చట్టంలో పేర్కొన్న పదజాలాలు, వివరణ:**

ఎ) **షెడ్యూల్:** షెడ్యూల్ అనగా ఆర్‌టిఇ-2009 చట్టానికి అనుబంధంగా ఇచ్చింది.

బి) **బడి:** బడి అంటే ప్రాథమిక విద్యను అందజేస్తూ గుర్తింపుపొంది, తగిన నియమాలతో నడుస్తున్నది.

సి) **విద్యా సంవత్సరం:** ఒక సంవత్సరంలో పాఠశాల ప్రారంభానికి మరియు ముగింపుకు ప్రభుత్వం ప్రకటించిన కాలపరిమితి.

డి) **పాఠశాల పనిదినాలు:** ఒక విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు (ఆర్‌టిఇ-2009 ప్రకారం) పాఠశాల పనిచేసే రోజుల సంఖ్య

ఇ) **బోధనా గంటలు:** పాఠశాలలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు కలిసి బోధనాభ్యసన ప్రక్రియలో గడిపే సమయం

ఎఫ్) **టీచర్లకు వారానికి కనీస పనిగంటలు:** ఒక నిర్దేశిత వారంలో ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొనే సమయం. ఇందులో ఉపాధ్యాయుడు తయారీకి అవసరమైన సమయం కూడా కలిసి ఉంటుంది.

జి) **పీరియడ్:** కాలపరిమితి కలిగిన బోధనా సమయం

## 6.5 RTE లో సూచించిన విధంగా పాఠశాల పని దినాలు, పని గంటలు - అమలు (School Working Days - Working Hours as per RTE - 2009 - Implementation)

ఆర్‌టిఇ-2009 చట్టంపై షెడ్యూల్‌లో నిర్దేశించిన మేరకు బోధనా గంటలు, పనిదినాలు మరియు పాఠ్యాంశాల భారత్వం, ఉపాధ్యాయునికి వారానికి కనీస పనిగంటలను పాఠశాలల్లో అమలుపరచుటకు పాఠశాల సమయాన్ని ఆర్.టి.ఇ-2009లో సూచించిన విధంగా కిందివిధంగా మార్పుచేయడం జరిగింది. దీనిపై ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది.)

| క్ర.సం. | పాఠశాల | పనివేళలు | సూచనలు |
|---|---|---|---|
| 1. | 1 నుండి 5 తరతగతులు | ఉ.9.00 నుండి<br>సా. 4.30 వరకు | ఫస్ట్ బెల్ - ఉ.8.45 ని.<br>సెకండ్ బెల్ - ఉ. 8.50 ని. |
| 2. | 6 నుండి 8 /<br>6 నుండి 10 తరగతులు | ఉ. 9.00 నుండి<br>సా. 4.30 వరకు | ప్రార్థన - ఉ. 8.50 నుండి<br>- ఉ.9.00 వరకు<br>తరగతి ప్రారంభం - ఉ. 9.00 నుండి. |

షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలను దృష్టిలో పెట్టుకొని, పై పనివేళలను అనుసరించి పాఠశాల సమయ సారిణి (స్కూల్ టైంటేబుల్)ని కింది విధంగా నిర్ణయించడమైనది.

అలాగే విషయాల వారీగా భారత్వ ప్రాతిపదికగా పీరియడ్లను కేటాయింపు పట్టికను తరగతివారీగా కింద సూచించడం జరిగింది.

## పాఠశాలల సమయ సారిణి (టైం-టేబుల్)

| పీరియడ్ | 1 నుండి 5 తరగతులు | 6-8 / 6-10 తరగతులు |
|---|---|---|
| 1వ పీరియడ్ | ఉ. 9.00 నుండి 9.50 వరకు | ఉ. 9.00 నుండి 9.50 వరకు |
| 2వ పీరియడ్ | 9.50 - 10.35 | 9.50 - 10.35 |
| స్వల్ప విరామం | 10.35 - 10.45 | 10.35 - 10.45 |
| 3వ పీరియడ్ | 10.45 - 11.30 | 10.45 - 11.30 |
| 4వ పీరియడ్ | 11.30 - 12.15 | 11.30 - 12.15 |
| భోజన విరామం | 12.15 - 01.15 | 12.15 - 01.15 |
| 5వ పీరియడ్ | 01.15 - 02.05 | 01.15 - 02.05 |
| 6వ పీరియడ్ | 02.05 - 02.50 | 02.05 - 02.50 |
| స్వల్ప విరామం | 02.50 - 03.00 | 02.50 - 03.00 |
| 7వ పీరియడ్ | 03.00 - 03.45 | 03.00 - 03.45 |
| 8వ పీరియడ్ | 03.45 - 04.30 | 03.45 - 04.30 |

## పాఠ్యాంశాల వారీగా భారత్వం (పీరియడ్ల కేటాయింపు)

| 1 నుండి 5 తరగతులు | | 6-8 / 6-10 తరగతులు | |
|---|---|---|---|
| విషయం | పీరియడ్లు | విషయం | పీరియడ్లు |
| ప్రథమభాష (తెలుగు) | 12 | ప్రథమ భాష (తెలుగు) | 6 |
| ద్వితీయభాష (ఇంగ్లీషు) | 6 | ద్వితీయభాష (హిందీ) | 4 |
| గణితం | 12 | తృతీయభాష (ఇంగ్లీషు) | 6 |
| పరిసరాల విజ్ఞానం | 6 | గణితం | 8 |
| శారీరక, ఆరోగ్య విద్య | 4 | భౌతిక శాస్త్రం | 4 |
| కళలు - సాంస్కృతిక విద్య | 2 | జీవశాస్త్రం | 4 |
| నాట్యం-చిత్రలేఖనం-సంగీతం | 2 | సాంఘికశాస్త్రం | 6 |
| విలువలవిద్య, జీవననైపుణ్యాలు | 2 | శారీరక, ఆరోగ్య విద్య | 2 |
| పని విద్య, కంప్యూటర్ విద్య | 2 | కళలు - సాంస్కృతిక విద్య | 2 |
| | | నాట్యం-చిత్రలేఖనం-సంగీతం | 1 |
| | | విలువలవిద్య, జీవననైపుణ్యాలు | 2 |
| | | పని అనుభవం | 1 |
| | | కంప్యూటర్ విద్య | 2 |
| మొత్తం పీరియడ్లు | 48 | మొత్తం | 48 |

**పాఠ్యాంశాల వారీగా భారత్వం (పీరియడ్ల కేటాయింపు)**

| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
|---|---|---|---|---|---|---|---|---|
| సోమ | తెలుగు | తెలుగు | గణితం | గణితం | ఆర్ట్ & క్రాఫ్ట్ | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఫిజికల్ ఎడ్యుకేషన్ |
| మంగళ | తెలుగు | తెలుగు | గణితం | గణితం | ఆర్ట్ & క్రాఫ్ట్ | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఫిజికల్ ఎడ్యుకేషన్ |
| బుధ | తెలుగు | తెలుగు | గణితం | గణితం | పని విద్య | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఎథిక్స్ & విలువలు |
| గురు | తెలుగు | తెలుగు | గణితం | గణితం | పని విద్య | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఫిజికల్ ఎడ్యుకేషన్ |
| శుక్ర | తెలుగు | తెలుగు | గణితం | గణితం | డాన్స్&మ్యూజిక్ | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఎథిక్స్ & విలువలు |
| శని | తెలుగు | తెలుగు | గణితం | గణితం | డాన్స్&మ్యూజిక్ | ఇంగ్లీష్ | ఇవిఎస్ | ఫిజికల్ ఎడ్యుకేషన్ |

**8వ తరగతి – సమయ సారిణి**

| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
|---|---|---|---|---|---|---|---|---|
| సోమ | గణితం | సాంఘిక | కంప్యూటర్ విద్య | ఇంగ్లీష్ | తెలుగు | బయోసైన్స్ | ఆర్ట్ | గణితం |
| మంగళ | గణితం | సాంఘిక | కంప్యూటర్ విద్య | ఇంగ్లీష్ | తెలుగు | బయోసైన్స్ | ఆర్ట్ | డాన్స్&మ్యూజిక్ |
| బుధ | గణితం | సాంఘిక | పిజికల్సైన్స్ | ఇంగ్లీష్ | తెలుగు | బయోసైన్స్ | ప్ర.ఉ. | ఫిజికల్ ఎడ్యుకేషన్ |
| గురు | గణితం | సాంఘిక | ఫిజికల్సైన్స్ | ఇంగ్లీష్ | తెలుగు | బయోసైన్స్ | ప్ర.ఉ. | వర్క్ ఎడ్యుకేషన్ |
| శుక్ర | గణితం | సాంఘిక | ఫిజికల్సైన్స్ | ఇంగ్లీష్ | తెలుగు | ఎథిక్స్ | ప్ర.ఉ. | ఫిజికల్ ఎడ్యుకేషన్ |
| శని | గణితం | సాంఘిక | ఫిజికల్సైన్స్ | ఇంగ్లీష్ | తెలుగు | ఎథిక్స్ | ప్ర.ఉ. | గణితం |

**సమయ సారిణి (టైంటేబుల్) రూపకల్పనలో పాటించాల్సిన సూచనలు:**

- ఉపాధ్యాయుల అందుబాటు
- సబ్జెక్టు వారీగా ఇచ్చిన కర్రికులమ్ వెయిటేజి
- తరగతి గదుల అందుబాటు
- రెండు వరుస పీరియడ్లలో 'భాష' బోధన రాకుండా చూడటం.

  ఉదా. తెలుగు పీరియడ్ తర్వాత వెంటనే హిందీ గానీ ఆంగ్లం పీరియడ్ గానీ రాకుండా చూడడం.

## 6.6 పని దినాలు, పని గంటలు – అమలు – బాధ్యతలు

## (School Working Days - Working Hours - Implemnetation - Roles and Responsibilities)

- పాఠశాల పనిదినాల అమలును పరిశీలించు బాధ్యత పర్యవేక్షణాధికారులతోపాటు ప్రధానోపాధ్యాయునికి కూడా ఉంటుంది.
- కాగా ప్రతి పాఠశాలలో సమయసారిణి అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయుడిదే.

**ఇందుకు ప్రధానోపాధ్యాయుడు కింది విషయాలపై దృష్టి సారించాలి:**

- ప్రధానోపాధ్యాయుడు ప్రాథమికంగా ఎక్కువ అనుభవం ఉన్న ఉపాధ్యాయుడు. కావున ప్రధానోపాధ్యాయుడు తప్పక ఒక సబ్జెక్టుకి / తరగతికి బాధ్యతతీసుకోవాలి.
- ఉపాధ్యాయులు హాజరుకానప్పుడు ఆ తరగతిని కూడా ప్రధానోపాధ్యాయుడు తీసుకొని కొత్త విషయాలు, నైతిక విలువలు పిల్లలతో చర్చించాలి.

- బోధనా గంటలు – వాటి సద్వినియోగం.
- అందుబాటులో ఉన్న ఉపాధ్యాయుల సమయాన్ని సద్వినియోగపరచుకోవడం.
- ఉపాధ్యాయులు అందుబాటులో లేనపుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం.
- ఏ తరగతిలోని విద్యార్థులు కూడా ఖాళీగా ఉండకుండా చూడడం. దీనికోసం లైబ్రరీ, ఇతర వనరులను ఉపయోగించుకొనేటట్లు చూడడం.
- ప్రాథమిక స్థాయిలో శారీరక, ఆరోగ్య విద్య, కళలు, సాంస్కృతికవిద్య, నాట్యం, చిత్రలేఖనం, సంగీతం, విలువల విద్య, జీవన నైపుణ్యాలకు సంబంధించిన పీరియడ్లను అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులకు కేటాయించడం.
- ప్రత్యేక కారణాలతో పనిదినాల సంఖ్య తగ్గితే వాటికి ప్రత్యామ్నాయంగా పనిచేసేటట్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవడం.
- కర్రికులమ్ వెయిటేజ్‌లో నిర్దేశించిన పీరియడ్ల సంఖ్య తగ్గకుండా చూడడం.
- ఉపాధ్యాయుడు అందుబాటులో లేకుంటే పిల్లలే సొంతంగా ఆయా కార్యక్రమాలు నిర్వహించుకొనేటట్లు తగిన సూచనలను ఇవ్వడం. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు బాధ్యతవహించడం.
- ఉపాధ్యాయుల తయారీ మరియు బోధనకు సంబంధించి తయారుచేసుకున్న ప్రణాళికలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం.
- పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పండుగలు ఉత్సవాలకు తగిన సమయాన్ని కేటాయించుకోవడం.
- ఆయా ఉత్సవాల నిర్వహణకు ముందుగానే ప్రణాళిక వేసుకొని నిర్వహణ బాధ్యతలు ఆయా ఉపాధ్యాయులకు అప్పగించాలి. అంతర కర్రికులమ్ కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు ప్రణాళిక వేసుకొని ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జ్‌గా పెట్టి నిర్వహించాలి.

**పనిగంటలు సద్వినియోగ పరచుకోవాలంటే ముందుగా ఉపాధ్యాయులు సంసిద్ధులు కావాలి. అందుకనుగుణంగా వారి తయారీ ఉండాలి. ఇందుకోసం**

- ముందుగా ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేసుకోవాలి.
- పిల్లల స్థాయికనుగుణంగా అభ్యసన ప్రక్రియలు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- అవసరమైన అభ్యసన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి.
- పిల్లలకు వ్యక్తిగత, జట్టు పనులను కల్పించాలి.
- పనిగంటల సక్రమ వినియోగంలో తోటి ఉపాధ్యాయుల, విషయ నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరించాలి.
- ప్రతి రోజు చదువుకోవడం ఒక అలవాటుగా చేసుకోవాలి. చదివిన కొత్త విషయాలను టీచింగ్ వర్క్‌లో రాసుకొని పిల్లలకు చెప్పాలి.

**ఉపాధ్యాయుని దగ్గర ఉండాల్సిన కనీస టి.ఎల్.ఎం:**

- పాఠ్యపుస్తకాలు
- బోధించే సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ కాపీలు
- గత 5 సంవత్సరాలలో అందించిన మాడ్యూళ్లు
- టీచర్స్ డైరీ
- నిరంతర సమగ్ర మూల్యాంకన రిజిష్టర్
- రెఫరెన్స్ పుస్తకాలు / నిఘంటువులు / మ్యాగజైన్లు

- కథల పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలు
- అకడమిక్ గైడెన్స్ రిజిష్టర్
- సంవత్సర, యూనిట్ / పాఠ్యప్రణాళిక
- రెఫరెన్స్ పుస్తకాలు, ఉపయోగకరమైన పుస్తకాలు
- శ్రేష్టమైన, బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులున్న పాఠశాల మాత్రమే ఆదర్శవంతమైన పాఠశాలగా ఉంటుందని చెప్పవచ్చు. ఎందరో ఉపాధ్యాయులు పాఠశాలపనిగంటలకంటే ఎక్కువ సమయం పాఠశాలలో పిల్లలతోపాటు బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొంటూ వారికి గుణాత్మక విద్యను అందించే దిశలో కృషి చేస్తున్నారు. ఇకపోతే కొంతమంది పాఠశాల పనిగంటలలో పూర్తి సమయం బోధనకు కేటాయించకుండా ఇతరత్రా పనులు చేస్తూ ఏదో మొక్కుబడిగా తమ ఉద్యోగ సమయాన్ని వృథా చేస్తున్నారు. మరికొంతమంది ప్రణాళికాబద్ధంగా పనివేళలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతూ సతమతమవుతున్నారు. అనవసరంగా ఒత్తిడికి గురవుతున్నారు.

**పనిగంటల సద్వినియోగానికి తరగతి గదిలో అనుసరించాల్సినవి:**

- పిల్లలకు వ్యక్తిగత, జట్టుపనులను కల్పించాలి.
- తరగతి గదిలో కల్పించబోయే అభ్యసన ప్రక్రియల వివరాలను డైరీలో రాసుకోవాలి. ఆశించిన, సాధించిన ఫలితాలకు చేర్పులు, మార్పులు, ప్రతిస్పందనలు నమోదు చేసుకోవాలి.
- అభ్యసన ప్రక్రియలలో పిల్లలందరూ పాల్గొనేలా చూడాలి. ప్రక్రియలలో పిల్లల భాగస్వామ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి.
- నల్లబల్లను ఉపయోగించి చర్చించాల్సిన అంశాలు, కాన్సెప్ట్ రాసి దాని ఆధారంగా తరగతిలో చర్చలు నిర్వహించాలి.
- విద్యార్థులు చెప్పిన అంశాలు నల్లబల్లపై రాయాలి. ఉపాధ్యాయుడు నల్లబల్ల దగ్గర నిలబడి, విద్యార్థుల దగ్గరకు వెళుతూ, విద్యార్థులను గమనిస్తూ చురుకుగా ఉండి అభ్యాసనను నిర్వహించాలి.

పాఠశాల పనిగంటలను సంపూర్ణంగా బోధనకే కేటాయించాలంటే, ఉపాధ్యాయులు అందుకనుగుణంగా తమ పనితీరును, వృత్తిపరనైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం సెలవుదినాలను వినియోగించుకోవాలి. సాధారణంగా ఏడాదికి పాఠశాల పనిదినాలుకాకుండా 165 నుండి 145 వరకు వివిధ రకాల సెలవులు ఉంటాయి. ఈ రోజులలో బోధనా విధానాలలో వస్తున్న నూతన పోకడలు, బోధనాపర పుస్తకాలు, రెఫరెన్సు పుస్తకాలు వంటివి చదివి అవగాహన ఏర్పరచుకోవాలి. అవగాహనాంశాలను తోటివారితో పంచుకోవాలి. చర్చించాలి. ఒక నోట్‌బుక్‌లో రాసుకోవాలి. పాఠ్యపుస్తకాలు పిల్లలకు కాబట్టి పాఠ్యపుస్తకానికి అదనంగా జోడించి కొత్త విషయాలు ఉదాహరణలతో బోధించాలి. పాఠ్యపుస్తకాలలోని విలువలకు అదనంగా విలువలను బోధించాలి.

## 6.7. పనిదినాలు, పనిగంటలు – అమలుకు సూచికలు
## (School Working Days, Working Hours – Indicators of Implementation)

- పాఠశాలలో పనిదినముల చార్ట్ ప్రదర్శించి ఉండడం.
- కర్రికులమ్ వెయిటేజి పట్టిక ప్రదర్శించి ఉండడం.
- సమయసారిణికి తగినట్లుగా బోధన జరగడం.
- ఉపాధ్యాయులవారీగా సమయసారిణి ప్రదర్శించి ఉండడం.

- ఉపాధ్యాయుడు అందుబాటులో లేనపుడు చేసుకున్న ప్రత్యామ్నాయ ఏర్పాటుకు సంబంధించిన రిజిష్టర్ నిర్వహణ.
- ఉపాధ్యాయులు తమ ఖాళీ సమయాన్ని, బోధన తయారీకి ఉపయోగించుకోవడం.
- ఏ తరగతిలోని పిల్లలు కూడా ఖాళీగా ఉండకుండా, ఏదో ఒక పనిలో, స్వయం అభ్యసనంలో నిమగ్నమై ఉండడం.
- కో–కర్రికులర్ యాక్టివిటీస్ సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉండడం.
- పాఠశాల స్థాయిలో వివిధ పండుగలు, ఉత్సవాలు, ముఖ్యదినములు నిర్వహించబడుతుండడం.

## 6.8 ముగింపు (Conclusion)

ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి. చట్టంలో పేర్కొన్న విధంగా పనిదినాలు, పనిగంటలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు (ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలకు చెందినవి) విధిగా పాటించాలి. పిల్లలకు కేటాయించిన బోధనా సమయం నూటికి నూరుశాతం సద్వినియోగం కావాలి. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయ తయారీ ఉండాలి. తరగతి గదులన్నీ సానుకూల, అభ్యసన, స్నేహపూరిత, ఆహ్లాదకర వాతావరణంతో కూడి ఉండాలి. వార్షిక ప్రణాళికాబద్ధంగా ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పిల్లలందరికీ గుణాత్మక విద్యను అందించేదిశలో ఉపాధ్యాయులందరూ కృషిచేయాలి. ఈ కృషిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ పాత్రను పోషిస్తూ అందరికీ మార్గదర్శకులుగా ఉండాలి.

×××

**పిల్లలకే నా హృదయం అంకితం**

*పిల్లలకు బోధించాలంటే మీరు వాళ్ళంటే ఇష్టపడాలి. అప్పుడే పిల్లలలో శ్రమను సంతోషాన్ని స్నేహపూరిత భావాన్ని, మానవత్వాన్ని మనం తీర్చిదిద్దగలం. ఉపాధ్యాయుడు ప్రతి పిల్లవాడి హృదయాన్ని అన్వేషించాలి, అభిమానించాలి, పిల్లల అనురాగంలో తానే ఒక పసివాడైపోవాలి. పిల్లల్ని ప్రేమించడమంటే పిల్లలతో కలిసి మాట్లాడడం, చర్చించడం, కార్యకలాపాల్లో పాల్గొనడం, పిల్లల్లో పిల్లలుగా మారడం. అప్పుడు మాత్రమే పిల్లలు, తమ కుటుంబాలనీ పాఠశాలనీ పనినీ జ్ఞానాన్నీ మాతృదేశాన్నీ ప్రేమించేటట్లు చెయ్యగలం. ఉపాధ్యాయుడు పిల్లవాడి కుటుంబంలో ఒక సభ్యునిగా, ఒక తల్లిగా ఉండి తీరాలి.*

**– సుహోమ్లిన్ స్కీ**

# 7. పాఠశాల యాజమాన్య కమిటీలు

## (School Management Committees)

7.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
(Basic Questions - Think and Reflect)

7.2 నేపథ్యం (Context)

7.3 బడి ఎవరిది? ఎవరికి బాధ్యత వహించాలి? ఎందుకు?
(To Whom the school belongs. To whom the school is accountable and Why?)

7.4 పాఠశాల నిర్వహణ అంటే ఏమిటి?
(What is School Management?)

7.5 RTE - 2009 - లో పాఠశాల యాజమాన్య సంఘాల గురించి ప్రస్తావించిన సెక్షన్లు, వివరాలు – కమిటీ ఏర్పాటు, విధులు
(RTE - 2009 About SMC - Formation of SMCs and SMCs Roles and Responsibilities)

7.6 RTE చట్టం – పదాలు, వివరణ (RTE - 2009 Terminology - Description)

7.7 పాఠశాల యాజమాన్య కమిటీలకంటే ముందు పరిస్థితి
(Situation before SMCs comes into Existence)

7.8 పాఠశాల యాజమాన్య కమిటీలు ఎందుకు? వాటిని ఎందుకు స్వాగతించాలి?
(Why SMCs and Why should we welcome SMCs)

7.9 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు – ప్రస్తుత పరిస్థితి – ప్రభావం
(SMC Meetings - Present Situations and its Impact)

7.10 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు – అమలు – విధానాలు
(Conducting SMC Meetings - Proceedures )

7.11 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో చర్చించి అమలు చేయవలసినవి
(Items to be discussed in the SMC Meeting and its Implementation)

7.12 పాఠశాల యాజమాన్య కమిటీల పనితీరు – అమలు – సూచికలు
(Functional aspects of SMCs - Implementation)

7.13 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ – సూచికలు
(Indicators of Implementation for Effective Conduct of SMC Meetings)

7.14 ముగింపు (Conclusion)

**బాల్యపు హక్కులు – పాఠశాల**

పిల్లలు చేసే ప్రతి పని శ్రమే. పని చేసే ప్రతి బిడ్డ బాల కార్మికుడే అనేదే న్యాయమైన వాదం. బడికి పోని పిల్లలు రేపో మాపో పనికి పోక, లేక చెయ్యకతప్పదు. అప్పుడు మనకు రెండు రకాల పిల్లలు కనిపిస్తారు. ఒకరు శ్రమించే పిల్లలు అంటే బాలకార్మికులు మరొకరు పూర్తిగా బడిలో చదువుకునేవారు. ఈ పునాది మీదనే బడికి పోని ప్రతి బిడ్డా బాలకార్మికుడనే తాత్విక అంశం ఆధారపడి ఉంది. ఇలా మనం, ఒప్పుకున్నప్పుడు ప్రతి బిడ్డకు బాల్యం ఒక హక్కు, తాను వికసించడానికి, తన సామర్థ్యాలను వెలికితీసుకోవడానికి గల అన్ని అవకాశాలను వినియోగించుకోవడం అతని హక్కు. పని ఏ రూపంలో ఉన్నా అది బిడ్డకు గల ఈ హక్కును కాలరాచేదే.

పూర్తి స్థాయిలో బడిలో చదువుకొనే పిల్లలు మాత్రమే చాకిరీకి దూరంగా ఉన్నట్లు లెక్క అని మనం నమ్మితే పిల్లల్ని పూర్తిగా బడిలో ఉంచినప్పుడు మాత్రమే వాళ్ల బాల్యపు హక్కు పరిరక్షించబడుతుందని మనం అంగీకరించాల్సి ఉంటుంది. పనిని తప్పించి బాల్యపు హక్కుని పరిరక్షించేదిగా, నిలబెట్టేదిగా మనం పాఠశాలలని చూడాలి. ఇది బడికి ఉండాల్సిన నిజమైన లక్షణం. ఇక్కడే వ్యక్తమవుతుంది. అప్పుడు బాల్యపు హక్కును కాపాడడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, అందరికి చదువు నేర్పడం ఇవన్నీ ఒకే గొలుసులోని లింకులుగా మనకు కనిపిస్తాయి. వీటిలో ఒక దానిని విస్మరించి మరోదాన్ని పట్టుకోవడం వల్ల సమస్య ఏ మాత్రం పరిష్కారం కాదనీ, ఆ ప్రయత్నం విఫలమైతీరుతుందని అర్థమవుతుంది. ఒకసారి పిల్లల్ని పనికి పంపించడం మంచిది కాదని, అది తప్పనిసరి అవసరం కాదనీ ఒప్పిస్తే, పిల్లల్ని బడిలో చేర్చడం దానికదే జరుగుతుంది. అప్పుడు బడి నుంచి సమాజం ఎక్కువ ఫలాల్ని ఆశిస్తుంది. దాని వెనువెంటే సమాజం బడిని గురించి పట్టించుకోవడం పెరుగుతుంది. విద్యా బోధనలో వాసి దానంతట అదే రాకతప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

**– కీ॥ శే॥ మామిడిపూడి నాగార్జున**

**(సౌజన్యం – చదువు)**

సమగ్ర విద్య ఎలా ఉంటుందో గాంధీజీ మనకొక దర్శనాన్నిచ్చారు. ఆయన మాటలు చూడండి. 'ఆది నుండి హృదయ వికాసం పొందిన బిడ్డ విషయం తీసుకోండి. నూలు వడకడం, వడ్రంగం, సేద్యం వంటి ఉపయుక్తమైన ఒక వృత్తిలో శిక్షణ పొందుతూ, ఆ కళకు సంబంధించిన జ్ఞానం, పనిముట్ల వినియోగం, వాటి తయారీ నేర్చిన బిడ్డ, అతను. అంగసౌష్టవం, ఆరోగ్యవంతమైన శరీరం, అనుభవజ్ఞానం, నిత్యం ఎదురయ్యే పరీక్షల్లో ఉత్తీర్ణుడు కాగలిగే మనశ్శక్తి కలిగి ఉంటాడతను. కేవలం విద్వత్తుతో కూడిన మెదడు కాదతనిది.

మానసిక విద్యతో గణితశాస్త్రాన్ని, తన వృత్తిని జయప్రదం చేయగల వివిధ శాస్త్రాల సంపూర్ణ జ్ఞానాన్ని మేళవించుకుని ఉంటాడతను. మనోల్లాసం కోసం సాహిత్యపఠనాన్ని కూడా జతపరిస్తే, ఆ విద్య సంపూర్ణమవుతుంది. ఇక్కడ మనష్యుడంటే కేవలం మెదడో, దేహమో, హృదయమో, ఆత్మ ఏ ఒక్కటో కానేకాదు. పూర్ణమానవుడి వికాసానికి ఈ అన్ని శక్తుల సమ్మేళనం అవసరం. ఇదే విద్య గురించిన నిజమైన అర్థశాస్త్రం.'

ఇటువంటి జ్ఞానాన్వేషణ వల్ల, విద్యాప్రధానం వల్ల మాత్రమే మానవుడు పురోగమిస్తాడు. తన జీవితాన్ని, ప్రపంచాన్ని మరింత మానవీయం చేసుకోగలుగుతాడు.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# 7. పాఠశాల యాజమాన్య సంఘాలు
## (School Managemnet Committee)

### 7.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
### (Basic Questions - Think and Reflect)

1) పాఠశాల సాధించాల్సినది ఏమి? లక్ష్యాలు?
   (What is the purpose of the school - aims and objectives?)
2) పాఠశాల ఎవరిది? (To whom the school belongs?)
3) పాఠశాల బాగుగ నడవాలంటే (నిర్వహింపబడాలంటే), ఆశించే లక్ష్యాలను పొందాలంటే ఎవరు బాధ్యత వహించాలి? ఎందుకు?
   (Who should take responsiblity for effective functioning of school and achieving it's aims and why?)
4) ఎస్.ఎమ్.సి. ఎందుకు? దాని ఆవశ్యకత ఏమిటి? (Why SMC? What is its purpose?)
5) పాఠశాల నిర్వహణ అంటే ఏమిటి? దీనిలో ఏ ఏ కార్యక్రమాలు/పనులు ఉంటాయి.
   (What is school management? What are the major activities in school management?)
6) ఎస్.ఎమ్.సి. యొక్క విధులు, బాధ్యతలు ఏమిటి?
   (What are the roles and responsibilities of SMC?)
7) ఎస్.ఎమ్.సి. సభ్యులు పాఠశాల అభివృద్ధి కోసం పాల్గొనాలంటే ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల పాత్ర, బాధ్యతలు, సహాయ సహకారాలు ఏమిటి?
   (What is the role of H.M and Teachers for effective involvment of SMC members in school developmnet?)
8) ఎస్.ఎమ్.సి. చాలా బాగుగా పని చేస్తుందనటానికి నిదర్శనం మరియు సూచికలు ఏమిటి?
   (What are the indicators of effective functioning of SMCs?)

### 7.2 నేపథ్యం (Context)

భారతదేశంలో అనాదిగా పిల్లల విద్యకు సమాజం బాధ్యత తీసుకొని, తన ఆధ్వర్యంలో పాఠశాలలను నిర్వహించేది. మంచి ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య, విలువలు నేర్పించేవారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల నియామకం, వారి పోషణ బాధ్యత ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రులు, సమాజ పెద్దలు కలిసి విజయవంతంగా నిర్వహించేవారు. ఈవిధమైన బాధ్యత చాలా విజయవంతంగా నడిచింది. భారత స్వాతంత్ర్యానంతర సమాజం తీసుకునే ఈ బాధ్యతను ప్రభుత్వం తీసుకున్నది. తద్వారా సమాజ భాగస్వామ్యం ద్వారా పాఠశాల నిర్వహణ క్రమంగా తగ్గుతూ వచ్చింది. అసలు మొత్తం లేకుండానే పోయింది. పాఠశాల నిర్వహణ బాధ్యత ఇప్పుడు ప్రధానోపాధ్యాయుడి బాధ్యత అయ్యింది. ప్రధానోపాధ్యాయులు కేవలం పై అధికారులకే బాధ్యత వహిస్తున్నారు. పై అధికారులే తమను పిల్లల విషయంలో అడగాలని భావిస్తున్నారు? గ్రామీణ ప్రాంతంలో ఉన్న బీద తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్ళి తమ పిల్లలు ఎలా చదువుతున్నారు? పాఠశాల ఎలా పనిచేస్తున్నది? ఉపాధ్యాయులు తమ బాధ్యతను ఎలా నిర్వహిస్తున్నారు? అని అడిగే పరిస్థితులు వారికి

కల్పించబడడం లేదు. ఇది జరిగేటట్లు పాఠశాల బాధ్యత వహించడంలేదు. పేద తల్లిదండ్రులు, నిరక్షరాస్యులు, అడగలేని ధైర్యం వారిని బడికి ఆవలే ఉంచుతుంది.

ప్రజలకొరకు సమాజంలో అనేక సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. సమాజ సంస్థలలో పాఠశాలలది ప్రముఖస్థానం. సమాజ అభివృద్ధి అంతా ఆ సమాజంలోని విద్యా పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి విద్యా సాధనకు ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత కాలంలో ప్రభుత్వ యాజమాన్యంతోపాటు ప్రైవేటు యాజమాన్యాలు కూడా అనేక రకాల పాఠశాలలను ఏర్పాటు చేశారు. పాఠశాలలకు, సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఏ సంస్థలోనైనా ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఏ సంస్థ అయినా, కార్యక్రమం అయినా అద్భుతమైన ఫలితాలను సాధిస్తుందనేది చారిత్రక సత్యం.

## 7.3 బడి ఎవరిది? ఎవరికి బాధ్యత వహించాలి? ఎందుకు?

## (To Whom the school belongs. To whom the school is accountable and Why?)

బడి సమాజం యొక్క సూక్ష్మరూపం. సమాజానికి చెందిన పిల్లలందరూ బడిలోచేరి విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత తిరిగి సమాజాభివృద్ధికే కృషిచేయాల్సి ఉంటుంది. భావి భారత పౌరులను తయారుచేసేది బడి. కాబట్టి బడి సమాజం మొత్తానికి బాధ్యత వహించాలి. విద్యకు సంబంధించి పూర్తి బాధ్యతను వహించే బడి మొత్తం సమాజానికి చెందినది. సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే బడి ఏర్పాటయింది. కాబట్టి బడి కార్యకలాపాలలో, బడి ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి.

**బడి ఎవరికి బాధ్యత వహించాలి? ఎందుకు బాధ్యత వహించాలి?**

విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి బడి ఏర్పాటు చేశారు. కాబట్టి బడి సమాజానికి, సమాజంలోని సభ్యులకు బాధ్యతవహించవలసి ఉంటుంది.

బడిలో పనిచేసే వారు సమాజ భాగస్వాములుగా, బడికి బాధ్యతవహించే వ్యక్తులుగా మొత్తం సమాజానికి బాధ్యతవహించాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి బడి పూచికత్తునివ్వాలి. బడి ఏర్పరచుకున్న లక్ష్యాల సాధనకు జరుగుతున్న కృషికి సంబంధించి సమాజానికి ఎప్పటికప్పుడు వివరాలు అందించాలి. బడి సమస్యలను సమాజం తీర్చవలసి ఉంటుంది. అలాగే సమాజ సమస్యలకు సంబంధించిన చర్చ, పరిష్కారం బడిలో జరపవలసి ఉంటుంది.

## 7.4 పాఠశాల నిర్వహణ అంటే ఏమిటి?

## (What is School Management?)

విద్యా లక్ష్యాలను పాఠశాల ద్వారా సాధించుటకు విద్యా ప్రణాళిక (కర్రికులమ్) మరియు ఇతర కార్యక్రమాలను చక్కగా ప్రణాళిక చేసుకుని తగిన సంసిద్ధతతో ప్రభావవంతంగా అమలుచేసి, ఎప్పటికప్పుడు మనం ఏ మేరకు ఆశించిన లక్ష్యాలను సాధించామని మదింపు చేసుకొని పురోగతిని సాధించడానికి తోడ్పడేది పాఠశాల యాజమాన్యం.

పాఠశాల ఆశించే లక్ష్యాలను పొందడానికి వివిధ కార్యక్రమాలను పాఠశాల నిర్వహిస్తుంది. ఇవ్వబడిన కర్రికులం మరియు వివిధ పాఠ్యాంశాల అమలు, ఉపాధ్యాయులు తమ వృత్తి సంబంధమైన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేటట్లు ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించి పర్యవేక్షించాలి. విద్యార్థులు ఆశించిన సామర్థ్యాలు పొందారా? లేదా? అన్నది కూడా వివిధ సబ్జక్టుల ప్రకారంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించాలి. పాఠశాల కార్యక్రమాలు, పిల్లల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై సమాజం, తల్లిదండ్రులకు, SMC కు క్రమం తప్పకుండా నివేదించాలి. పాఠశాల

పనివేళలు, పనిదినాలు, ఉపాధ్యాయుల, పిల్లల హాజరు మొదలగు వాటిపై శ్రద్ధపెట్టి ప్రధానోపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలి. వినూత్న కార్యక్రమాలు, విద్యావిషయక నిపుణులు, సాంస్కృతిక కార్యకలాపాల నిపుణులు, వృత్తులలో నిపుణులను పాఠశాలలకు పిలిపించి కార్యక్రమం నిర్వహించాలి. బడిలో కొత్త కార్యక్రమాలు, కొత్తదనం కనిపించాలి. విద్యార్థులను బడి వాతావరణం ఉత్తేజితం చేయాలి.

**యాజమాన్యపు పనులు (Management Tasks):**

- పాఠశాల ద్వారా ఆశించే లక్ష్యాల ఆధారంగా పాఠశాల కార్యక్రమాల రూపకల్పన, ప్రణాళిక.
- ఏ లక్ష్యాల కార్యక్రమాల అమలు మరియు ఫలితాలపై విశ్లేషణ, పునశ్చరణ.
- పాఠశాల అభివృద్ధి కోసం అభివృద్ధి ప్రణాళిక తయారీ, నిర్వహణ.
- ప్రభుత్వ పథకాలు/ విధానాలను అవగాహన చేసుకొని వాటిని అమలుచేయడం.
- పిల్లలకు నాణ్యమైన బోధన మరియు మేథోపరమైన కృత్యాలు చర్చలద్వారా అభ్యసనం జరిగేలా చూడడం.
- చదువులో ముందున్న, వెనుకబడిన పిల్లలకు సమాన అవకాశాలు ఇచ్చి ముందుకు వెళ్ళేటట్టు చూడడం.
- పిల్లల శారీరక, మేథోపరమైన, నైతిక, సాంఘిక అభివృద్ధిపై ఆలోచన, తగు కార్యక్రమాల రూపకల్పన, అమలు మరియు మూల్యాంకనం.
- విద్యా ప్రణాళిక (కర్రికులమ్) కార్యక్రమాలు, అంతర విద్యా ప్రణాళిక (అంతర్ కర్రికులం) కార్యక్రమాల నిర్వహణకు బాధ్యత వహించి పనుల విభజన, అమలు.
- నాణ్యమైన బోధన, నాణ్యమైన అభ్యాసనపై ఆలోచన, అమలు, పర్యవేక్షణ.
- ఉపాధ్యాయుల తయారీ, వార్షిక, యూనిట్ / పాఠ్యప్రణాళిక, టీచింగ్ నోట్సు, టి.ఎల్.ఎమ్. తయారీ, బోధన.
- పాఠశాలలో ఉన్న వనరులపై అవగాహన మరియు వాటి వినియోగం.

అవి: గ్రంథాలయ పుస్తకాలు, ఉపాధ్యాయ రిఫరెన్స్ బుక్స్, స్నేహబాల కార్డ్స్, సైన్స్ ఎక్విప్‌మెంట్, గేమ్స్ ఎక్విప్‌మెంట్, మ్యాప్స్, గ్లోబు, చార్ట్స్, టి.వి., రేడియో, కంప్యూటర్ మొదలగునవి.

## 7.5 RTE - 2009 లో పాఠశాల యాజమాన్య సంఘాల గురించి ప్రస్తావించిన సెక్షన్లు, వివరాలు – కమిటీ ఏర్పాటు, విధులు

## (RTE - 2009 About SMC - Formation of SMCs and SMCs Roles and Responsibilities)

**పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు:**

- ఆర్‌టిఇ–2009 సెక్షన్ 21(1) ప్రకారం బడి యాజమాన్య సంఘం ఏర్పాటు చేయాలి.
- ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు నిబంధన 19 ప్రకారం చట్టం అమలులోకి వచ్చిన 6 నెలల లోపు అన్ ఎయిడెడ్ పాఠశాలలు తప్ప ప్రతి పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ తప్పక ఏర్పాటు చేయాలి.

**ఎఫ్) సెక్షన్ 21(2) ప్రకారం బడి యాజమాన్య సంఘం ఈ కింది విధులు నిర్వర్తిస్తుంది.**

ఎ) బడి పనితీరును పర్యవేక్షించడం.

బి) బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి, సిఫారసు చేయడం.

సి) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం లేదా ఇతర వనరుల నుంచి అయినా అందిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం.

డి) సిఫారసు చేసిన ఇతర విధులను నిర్వర్తించడం.

- సెక్షన్ 21(2) లోని 'ఎ' నుండి 'డి' వరకు నిర్దేశించబడిన క్లాజులలో పేర్కొన్న విధులకు అదనంగా దిగువ తెలిపిన విధులను పాఠశాల యాజమాన్య కమిటీ నిర్వర్తించాల్సి ఉంటుంది.
- చదవడం, రాయడం, గణిత పరిజ్ఞానం అవగాహన వంటి అంశాలలో పిల్లల అభ్యసనను ప్రతి తరగతికి చెందిన విద్యార్థుల నుండి రాండమ్‌గా ఎంచుకొని ప్రదర్శించమనడం.
- పిల్లల ఉపాధ్యాయుల గైర్హాజరుపై శ్రద్ధ చూపడం, ఉపాధ్యాయుల, పిల్లల గైర్హాజరును తగ్గించే చర్యలు చేపట్టడం.
- పాఠశాల పరిసర ప్రాంతంలో 6-14 సం॥ల వయస్సులో ఉన్న పిల్లలందరి జాబితా తయారు చేయడం, బడి బయటి పిల్లలు పాఠశాలలో నమోదు అయ్యేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం.
- సెక్షన్ 24లోని 'ఎ' నుండి 'ఇ'వరకు క్లాజులు (టీచర్ల విధులు, సమస్యల పరిష్కారం), సెక్షన్ 28ని (టీచర్ల ప్రైవేట్ ట్యూషన్‌లపై నిషేధం) అమలుపరిచేటట్లు చేయడం.

  ఎ) బడికి హాజరు కావడంలో సమయాన్ని, క్రమబద్ధతను పాటించేలా చూడడం.

  బి) నిర్దేశించిన సమయానికి పాఠ్యాంశాలను పూర్తిచేసేలా చూడడం.

  సి) పాఠ్యాంశాలలో రాజ్యాంగ విలువలు, బాలల సర్వతోముఖాభివృద్ధి, అభ్యసనాన్ని నిత్యజీవితానికి అన్వయించడం, నిరంతర సమగ్రమూల్యాంకనం వంటివి ప్రతిబింబించాలి.

  డి) పిల్లలు నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనావేసి, దానికి అనుగుణంగా అదనపు బోధనను, స్థాయికి తగిన బోధనను అందించాలి.

  ఇ) తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు విద్యార్థుల హాజరు, స్థాయి, ప్రగతికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలి.

  ఎఫ్) ఏ టీచరు కూడా ప్రైవేటు ట్యూషన్లను, ప్రైవేటు బోధనాపనులను చేపట్టకూడదు.

- పాఠశాల ఆవాస ప్రాంతంలోని బాలలు నమోదై, ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేటట్లు చూడడం.
- ఆర్.టి.ఇ-2009 షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రమాణాలు, నిబంధనలు పాటించేటట్లు పర్యవేక్షించాలి. అవి:

  1) ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉండడం ప్రాథమికస్థాయిలో 150కి పైగా విద్యార్థులుంటే, ప్రాథమికోన్నత స్థాయిలో 100కుపైగా విద్యార్థులుంటే ప్రధానోపాధ్యాయులుండడం ప్రాథమికస్థాయిలో 200 మించితే 1:40 ప్రకారం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉండడం,

  2) ప్రాథమికోన్నత స్థాయిలో చిత్రకళ, వ్యాయామ, వృత్తివిద్యకు పార్ట్‌టైం బోధకులు ఉండడం.

  3) అన్నికాలాలకు అనువైన భవనం ఉండడం, అవసరమైనన్ని తరగతి గదులు ఉండడం, ర్యాంపులు, మరుగుదొడ్లు,తాగునీరు, వంటగది, ఆటస్థలం, ప్రహరిగోడ ఉండడం,

  4) బోధనకు కనీసం వారానికి 45 గంటలు, తయారీకి అదనపు గంటలు కేటాయించడం. ప్రాథమిక స్థాయిలో 200 పనిదినాలు, 800 బోధనాగంటలు, ప్రాథమికోన్నతస్థాయిలో 220 పనిదినాలు, 1000 బోధనాగంటలు పనిచేసేలా చూడడం.

5) అవసరమైనన్ని బోధనా పరికరాలు, గ్రంథాలయం, క్రీడా సామగ్రి ఉండడం.

- బాలల హక్కుల పరిరక్షణలో జరిగే ఏ చిన్న తప్పిదం గాని ముఖ్యంగా శారీరక, మానసిక హింస, పాఠశాల ప్రవేశం వ్యతిరేకించడం, సెక్షన్ 3(2) ప్రకారం అర్హత కల వాటిని సమకూర్చడం వంటి అంశాలను ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం.
- సెక్షన్ 4లోని అంశాల (విద్యార్థుల వయస్సుకు తగ్గ ప్రత్యేక శిక్షణ ఏర్పాటు) అమలుకు అవసరాలను గుర్తించడం, ప్రణాళిక రూపొందించడం, పర్యవేక్షించడం.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించడం, వారిని పాఠశాలలో నమోదు చేయించడం, అభ్యసన సౌకర్యాలను కల్పించడం, పర్యవేక్షించడం, వారు పాఠశాల కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చూడడం, ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసేటట్లు చూడడం.
- పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించడం.
- పాఠశాల వార్షిక ఖర్చు ఖాతా (యు.సి.లతో పాటు) మరియు ఆదాయ వివరాలను నిర్వహించడం.
- పాఠశాలకు వచ్చిన నిధులను బ్యాంకులో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్, మెంబర్‌కన్వీనర్ ఉమ్మడి ఖాతాలో జమచేయాలి. ఈ ఖాతాను ప్రతి సంవత్సరం, అవసరమైన సందర్భాలలో ఆడిట్ చేయడానికి అందుబాటులో ఉంచాలి. ప్రతి సంవత్సరాంతంలో నిధులు విడుదల చేసే అథారిటీకి వినియోగ ధృవీకరణ పత్రాలను సమర్పించాలి. గ్రాంటుల వినియోగాన్ని పర్యవేక్షించడం, తీర్మానాలు చేయడం.
- పాఠశాల యాజమాన్య సంఘం చార్టర్డ్ అకౌంటెంట్ లేదా లోకల్ ఫండ్ ఆడిటర్ లేదా సహకార శాఖ ఆడిటర్ ద్వారా పాఠశాల ఖాతాలను ఆడిట్ చేయించాలి.
- పాఠశాలలో కనీస మౌలిక వసతుల కల్పన మరియు వినియోగం.
- బడిలో చేరిన పిల్లలందరూ ఆ బడిలో చివరి తరగతి పూర్తయ్యేవరకు కొనసాగేలా చూడడం.
- తమ పాఠశాలలో చదువు పూర్తయిన పిల్లలు డ్రాపౌట్ కాకుండా అందరినీ సమీప పాఠశాలల్లో పై తరగతులలో చేర్చడం.
- ఆయా తరగతులలో సాధించాల్సిన కనీస అభ్యసన సామర్థ్యాలు ఆ విద్యా సంవత్సరమే సాధించడం.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించి అమలు చేయడం.
- విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, తగిన చర్యలు తీసుకోవడం.
- మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించడం.
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోటుపుస్తకాలు సకాలంలో పొందేలా చూడడం.
- ప్రశంసాపూర్వకమైన విచారణ జరపడం.
- లోపాలను ఎత్తిచూపకుండా పాఠశాలలో జరిగిన ఏ కొంత ప్రగతినయినా ప్రశంసించడం.
- పిల్లల పనులు, సాంస్కృతిక అంశాలను ప్రదర్శింపజేయడం.
- కమిటీ సమావేశాల నిర్వహణ నిర్దేశించిన ఎజెండా ప్రకారం నిర్వహించడం.
- పాఠశాల ఉత్సవాలు, పండుగల నిర్వహణలో సహాయ సహకారాలు అందించడం.
- బాలల హక్కుల పరిరక్షణకు భంగం కలగకుండా చూడడం.

**పాఠశాల యాజమాన్య సంఘం ఏర్పాటుకు నిబంధనలు:**

ఈ కమిటీ ఏర్పాటు కింది విధంగా ఉంటుంది.

- విద్యాహక్కు చట్టం-2009లోని సెక్షన్ 19 సబ్‌సెక్షన్(1) ప్రకారం ప్రతి పాఠశాలలో (గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు మినహా) పాఠశాల యాజమాన్య సంఘం తప్పక ఏర్పాటు చేయాలి.
- 1-5, 1-7, 1-8 తరగతులు నిర్వహించే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకే యాజమాన్య సంఘం ఏర్పాటు చేయాలి. ఉన్నత పాఠశాలల్లో 6-8 తరగతులకు ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్య సంఘం ఏర్పాటు చేయాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన యాజమాన్య సంఘాలను మండల విద్యాధికారి, ఇతరపాఠశాలల యాజమాన్య సంఘాలను జిల్లా విద్యాశాఖాధికారి రద్దు చేసేవరకు పాఠశాల యాజమాన్య సంఘం కొనసాగుతుంది.

**ఎ) ప్రతినిధుల ఎన్నిక**

- ప్రతి తరగతికి చెందిన తల్లిదండ్రులు/ సంరక్షకుల నుండి ముగ్గురిని ప్రతినిధులుగా ఎన్నుకోవాలి. ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు అయి ఉండాలి. ముగ్గురిలో కనీసం ఒక వ్యక్తి ప్రతికూల పరిస్థితులకు చెందిన వర్గానికి, మరొకవ్యక్తి బలహీన వర్గాలకు చెంది ఉండాలి.
- ఒక తరగతిలో విద్యార్థులు ఆరుగురి కంటే తక్కువ ఉంటే మరొక తరగతి అనగా పై లేదా కింది తరగతిని కలిపి ఎన్నిక నిర్వహించాలి.
- ఎన్నుకోబడిన ప్రతినిధుల కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుంది.
- అన్ని సెక్షన్లు, మాధ్యమాలను కలిపి ఒకే తరగతిగా పరిగణించాలి.
- ఒకవేళ ఎన్నుకోబడిన ప్రతినిధికి చెందిన పిల్లలు పాఠశాలను వదలిపెడితే ఆ స్థానంలో నిర్ణీత సమయానికి కొత్తవారిని ఎన్నుకోవాలి.

**బి) ప్రత్యేక ఆహ్వానితులు**

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ఆ స్థానంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.
- మండల విద్యాధికారి మరొక టీచర్‌ను ప్రతిపాదించాలి. సాధారణంగా వీరిద్దరిలో ఒకరు స్త్రీ అయి ఉండాలి.
- పాఠశాల భవనం ఉన్న ప్రాంతానికి చెందిన కార్పొరేటర్/ కౌన్సిలర్/ వార్డు సభ్యులు.
- పాఠశాల నిర్వహిస్తున్న ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త.
- పాఠశాల నిర్వహిస్తున్న ప్రాంతానికి చెందిన మహిళా ఆరోగ్య కార్యకర్త.
- సంబంధిత గ్రామ/ వార్డులోని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు.

**సి) కో-ఆప్టెడ్ సభ్యులు**

- పాఠశాలకు సహకరించే విద్యావేత్తలు, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు, తత్వవేత్తలు వంటివారి నుండి ఇద్దరిని ఎన్నుకోబడిన పాఠశాల యాజమాన్య సంఘ సభ్యులు కో-ఆప్ట్ చేసుకోవాలి.
- పాఠశాల ఆవాస ప్రాంత సర్పంచ్/ మున్సిపల్ చైర్మన్/ మేయర్ పాఠశాల యాజమాన్య సంఘం సమావేశానికి హాజరుకావచ్చు.

**డి) చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక**

- ప్రతి తరగతి నుండి ఎన్నుకోబడిన ప్రతినిధుల నుండి ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోవాలి. వీరిద్దరిలో ఒకరు మహిళ అయి ఉండాలి. చైర్మన్, వైస్ చైర్మన్‌లలో ఒకరు బలహీన వర్గాలు లేదా ప్రతికూల పరిస్థితులకు చెందిన వర్గాలకు చెందినవారై ఉండాలి.

**ఇ) ఎన్నిక విధానం**

- ప్రతి విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయిన ఒక నెల తర్వాత తల్లిదండ్రులు, సంరక్షకులతో ప్రధానోపాధ్యాయులు వార్షిక సాధారణ సమావేశం నిర్వహించాలి.
- పిల్లల తల్లిదండ్రులు / సంరక్షకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అందరూ సమావేశానికి హాజరుకావాలి.
- గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన విద్యా సంబంధ, అభ్యసన కృత్యాలకు సంబంధించి పాఠశాల నివేదిక మరియు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలు చేయవలసిన అంశాల ప్రణాళిక సమర్పించాలి.
- పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు మరియు నిర్వహణ సంబంధ అంశాలను క్రోడీకరించాలి.
- ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఇద్దరూ సమావేశానికి హాజరుకావచ్చు. కాని ఎన్నికలో పాల్గొనుటకు ఒక్కరికే ఓటుహక్కు ఉంటుంది.
- ఒకటికంటే ఎక్కువ తరగతులలో పిల్లలు చదువుతుంటే ప్రతి తరగతి ఎన్నికలలో తల్లిదండ్రులలో ఎవరో ఒకరు పాల్గొనవచ్చు.
- ప్రధానోపాధ్యాయులు ఎన్నిక నిర్వహించాలి.
- ఎన్నిక నిర్వహించుటకు 50% తల్లిదండ్రులు/ సంరక్షకులు హాజరు కావలసి ఉంటుంది.
- చేతులు ఎత్తడం ద్వారా, అభిప్రాయం చెప్పడం ద్వారా ఎన్నిక నిర్వహించాలి. అసాధారణ పరిస్థితులలో రహస్య బ్యాలెట్ పద్ధతిని ఉపయోగించవచ్చు.
- ప్రతి రెండు నెలలకోసారి పాఠశాల యాజమాన్య సంఘం సమావేశమవ్వాలి. మొదటి సమావేశం విద్యా సంవత్సరం ప్రారంభంలో, చివరి సమావేశం విద్యా సంవత్సరం చివరలో నిర్వహించాలి. చివరి సమావేశంలో విద్యా సంవత్సరం మొత్తం విద్యా సంబంధ ప్రగతి మరియు కార్యక్రమాలను సమీక్షించుకోవాలి.
- పాఠశాల యాజమాన్య సంఘం సభ్యులెవరైనా ప్రత్యేక అజెండాతో సమావేశం నిర్వహించాలని కోరితే చైర్మన్ అనుమతితో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక సమావేశం నిర్వహించాలి లేదా రాబోయే సమావేశంలోని అజెండాలో ఆ అంశాలు చర్చించుటకు వీలుగా చేర్చాలి.
- పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో మధ్యాహ్న భోజన కమిటీ, విద్యా సంబంధ అంశాల సమీక్షా కమిటీ, నిధుల పర్యవేక్షణ కమిటీ వంటి సబ్ కమిటీలు (ఉపకమిటీలు) ఏర్పాటు చేయాలి.
- పాఠశాల యాజమాన్య సంఘం, ఉపకమిటీల సమావేశ వివరాలను రిజిష్టర్లో నమోదు చేసి అందరు సభ్యులందరికీ చదవడానికి అందుబాటులో ఉంచాలి.
- పాఠశాల యాజమాన్య సంఘం సమావేశంలో ప్రతి తరగతి నుండి కొందరు విద్యార్థులను ఎన్నుకొని చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియల వంటి వాటిలో వారి స్థాయిని ప్రదర్శింపజేయాలి. అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును సమీక్షించి మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

- ఆవాసప్రాంతంలోని 6-14 సం॥ల పిల్లల వివరాలను సేకరించి, నిర్వహించడం, ప్రతి బిడ్డ తరగతికి తగిన తరగతిలో చేరి, చివరి వరకు కొనసాగేట్లు చూడడం, వలస పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక శిక్షణను అందించి పాఠశాలలో కొనసాగేట్లు చూడడం పాఠశాల యాజమాన్య సంఘం బాధ్యత.
- ప్రధానోపాధ్యాయులు మరియు చైర్మన్ పేరిట బ్యాంకులో ఖాతా నిర్వహించాలి. పాఠశాలకు అందే నిధులు, విరాళాలను ఈ ఖాతాద్వారా నిర్వహించి, అందరితో చర్చించి, తీర్మానాలు నమోదుచేసి ఖర్చు చేయాలి. రశీదులు భద్రపరచి ఆడిట్ చేయించాలి.
- ప్రతికూల వర్గాలకు చెందినవారు అంటే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అనాథలు, వలస మరియు వీధిపిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, హెచ్.ఐ.వి. సోకినవారు.
- బలహీన వర్గాలకు చెందినవారు అంటే వెనకబడిన తరగతులు, మైనార్టీలు, వార్షికాదాయం రూ.60,000/- కంటే తక్కువ ఉన్న ఇతరులు.

ఆర్‌టిఇ-2009 సెక్షన్ 21(1) ప్రకారం ఏర్పాటు చేయబడిన పాఠశాల యాజమాన్య కమిటీ కనీసం రెండు నెలలకు ఒకసారి సమావేశమై బడి అవసరాలు, పిల్లల ప్రగతి సమస్యలు మొదలగు వాటిని గురించి చర్చించి సమావేశంలో తీసుకునే తీర్మానాలను మినిట్స్‌లో రికార్డు చేసి అందరికి అందుబాటులో ఉంచాలి. మినిట్స్‌లో రాసుకున్నవాటి అమలును పర్యవేక్షించాలి.

## 7.6 RTE చట్టం - పదాలు, వివరణ
## (RTE - 2009 Terminology - Description)

- **సెక్షన్ 21(1) ప్రకారం-** బడులన్నీ స్థానిక ప్రభుత్వానికి ఎన్నికయిన ప్రజాప్రతినిధులతో, ఆ బడిలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు, ఉపాధ్యాయులతో బడి యాజమాన్య సంఘాన్ని ఏర్పాటు చేయాలి. అయితే బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాల పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు దామాషాపద్ధతిలో ప్రాతినిధ్యం కల్పించాలి.
- **సెక్షన్ 21(2) ప్రకారం-** పాఠశాల యాజమాన్య సంఘం ఈ కింది విధులను నిర్వర్తిస్తుంది.

  **సెక్షన్ 22 :** సెక్షన్ 21, సబ్‌సెక్షన్(1) ప్రకారం ఏర్పడిన ప్రతిబడి యాజమాన్య సంఘం సిఫారసు చేసిన విధంగా బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచెయ్యాలి.

  చట్టంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు సంబంధించి ఉపయోగించిన పదాలు వివరణలు పరిశీలిద్దాం.
- **బాలలు :** 6-14 సంవత్సరాల బాల, బాలికలు.
- **తల్లిదండ్రులు:** బాలల సహజ, సవతి లేదా దత్తత తీసుకున్న తల్లి లేదా తండ్రి.
- **బడి:** ప్రాథమిక విద్యను అందిస్తూ గుర్తింపు పొందిన బడి. దీంట్లో ఇవి ఉంటాయి.
  - ఎ) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న బడి.
  - బి) తన ఖర్చులో మొత్తంకాని, కొంతభాగంకాని, సహాయంగా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి పొందుతున్న ఎయిడెడ్ పాఠశాల.
  - సి) ప్రత్యేక వర్గీకరణకు చెందిన బడి.

డి) తన ఖర్చులకు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం పొందని అన్‌ఎయిడెడ్ పాఠశాల.

- **సంరక్షకులు:** బాలుడు/బాలిక సంరక్షణ బాధ్యత కస్టడీ కలిగి ఉన్న వ్యక్తులు. వీళ్ళు సహజ సంరక్షకులు కావచ్చు, కోర్టు లేదా చట్టపరంగా ప్రకటించబడిన లేదా నియమింపబడిన సంరక్షకులు కావచ్చు.
- **బలహీన వర్గాల పిల్లలు:** సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా పేర్కొన్న కనీసం మొత్తం కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు చెందిన బాలలు.
- **ప్రతికూల పరిస్థితులలో ఉన్న బృందాలకు చెందిన పిల్లలు అంటే–** షెడ్యూల్డ్‌కులాలు, షెడ్యూల్డ్ తెగలు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం లేదా సంబంధిత ప్రభుత్వ ప్రకటన ద్వారా పేర్కొన్న తెగ, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం లేదా సంబంధిత ప్రభుత్వ ప్రకటన ద్వారా పేర్కొన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భౌగోళిక, భాష, లింగ లేదా ఏ ఇతర కారణాల వల్లనైనా గాని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు.
- **స్థానిక ప్రభుత్వం అంటే...** నగర పాలక సంస్థ లేదా నగర పాలక సంఘం లేదా జిల్లా పరిషత్ లేదా నగర పంచాయతీ లేదా పంచాయతీ ఏ పేరుతో పిలువబడినప్పటికీ బడి మీద పరిపాలనా సంబంధ నియంత్రణ కలిగిన సంస్థని సూచిస్తుంది లేదా అమలులో ఉన్న చట్టం ప్రకారం ఏదైనా గ్రామ, పట్టణ, నగరంలో స్థానిక ప్రభుత్వంగా పనిచేయడానికి అధికారం పొందిన సంస్థని సూచిస్తుంది.

**మరికొన్ని బాధ్యతలు:**

1) పాఠశాల యాజమాన్య కమిటీ ప్రత్యేక శిక్షణ అవసరమైన పిల్లలను గుర్తించాలి. వారికి శిక్షణను నిర్వహించాలి.
   - పిల్లలు తాము చేరిన తరగతిలోని వివిధ సబ్జెక్టులలో తగిన స్థాయిలో లేనట్లయితే తరగతిలో కొనసాగుటకు అవసరమైన స్థాయిని సాధించుటకు అవసరమైన ప్రత్యేక శిక్షణను అందజేయాలి. ఇందుకు పిల్లలు వయస్సుకు తగిన తరగతిలో చేరిన తరగతి స్థాయిలో ఉన్నారో, లేదో గుర్తించాలి, తరగతిలో కొనసాగే స్థాయిలో లేకపోతే ప్రత్యేక శిక్షణా కేంద్రాలలో (ఎస్‌టిసిలో) చేర్చాలి. ప్రత్యేక శిక్షణా కేంద్రాలు (ఎస్‌టిసి) ప్రత్యేక బోధనాసామగ్రితో బోధనా వ్యూహాలు అమలుచేసి విద్యార్థులు తరగతి స్థాయి సాధించుటకు పనిచేస్తాయి. ఇవి ఆవాస తరహాలో (ఆర్ఎస్‌టిసి), ఆవాస రహితంగా (ఎన్ఆర్ఎస్‌టిసి) కూడా ఉంటాయి.
2) ప్రత్యేక శిక్షణ తర్వాత పిల్లలను వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చాలి.
   - ఎంత తొందరగా వీలయితే అంత సమయం నుండి రెండు సం॥ల లోపల తరగతిలో కొనసాగే స్థాయిని సాధించిన తర్వాత సంబంధిత తరగతికి హాజరయ్యేట్లు చూడాలి. ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీ నిర్వహించాలి.
3) బడిబయటి పిల్లలను గుర్తించడం, సమీకరించడంలో స్వయంసహాయక బృందాలు, పౌరసమాజ సంస్థలు మొదలైనవి చురుకుగా పాల్గొనేలా పాఠశాల యాజమాన్య కమిటీ చూడాలి.
   - ఆవాస ప్రాంతంలోని అందరు బడిఈడు పిల్లల వివరాలు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేకరించాలి. ప్రతి ఇంటి నుండి బడి ఈడు పిల్లల సమాచారం తల్లిదండ్రులు ఇచ్చునట్లుగా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు చూడాలి. సమాచార సేకరణలో పాల్గొనాలి.

4) బడిబయటి పిల్లలకోసం ప్రత్యేక శిక్షణ

– బడిబయటి పిల్లలను బడిలో చేర్చినపుడు వారు చేరిన తరగతిలో కొనసాగే స్థాయిలేనిచో వారిని ప్రత్యేక శిక్షణ కేంద్రాలలో (ఎస్‌టిసి) చేర్చి తరగతిలో కొనసాగే స్థాయిని సాధించేలా చూడాలి.

5) ప్రత్యేక అవసరాలుగల పిల్లల గురించి పాఠశాల యాజమాన్య కమిటీలకు, ఇతర పౌర సమాజ సంస్థలకు శిక్షణనివ్వాలి.

– ప్రత్యేక అవసరాలు గల పిల్లలంటే దురదృష్టవంతులు కారని, వారికి ఉన్న ఆటంకాలకు ప్రత్యామ్నాయాలు అందిస్తే సాధారణ పిల్లలతో సమానమనే వాస్తవాన్ని సమాజం గుర్తించేలా అవగాహన కల్పించాలి. చెవులు వినబడని బాలలకు వినడానికి సహకరించే యంత్రాలను అమర్చడం ద్వారా వారు ఇతర బాలలతో సమానమని గుర్తించాలి. చదువులో వెనకబాటుతనం అనేది ఉండదని ప్రతి ఒక్కరు కొన్ని నైపుణ్యాలను కలిగి ఉంటారని వాటిలో ప్రత్యేక శిక్షణ నివ్వడం ద్వారా వారిని నిష్ణాతులుగా చేయవచ్చని సమాజానికి అవగాహన కలిగించాలి.

6) పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ తన పరిధిలోని ప్రత్యేక పాఠశాలలు, ప్రతి ప్రైవేట్ పాఠశాలల వివరాలతో పాటు సమీప ప్రాంతంలో ఉన్న బలహీన వర్గాలు, అననుకూల బృందాలకు చెందిన పిల్లల జాబితాను నిర్వహించాలి.

– పాఠశాల యాజమాన్య సంఘం తరపున చైర్మన్ ఆవాసప్రాంతంలోని పాఠశాలలు అంటే ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్, ప్రైవేట్, గుర్తింపుపొందని ఇంకా ఇతర అన్ని రకాల (నవోదయ, రెసిడెన్షియల్ మొదలగు) పాఠశాలల వివరాలను, అందులో చదివే బలహీన, అననుకూల వర్గాల పిల్లల వివరాలను కూడా సేకరించి నిర్వహించాలి.

## 7.7 పాఠశాల యాజమాన్య కమిటీలకంటే ముందు పరిస్థితి (Situation before SMCs comes into Existence)

గతంలో పాఠశాల విద్యా కమిటీల చట్టం–1998 ప్రకారం గ్రామ విద్యాకమిటీలు, పాఠశాల విద్యా కమిటీలు, అకడమిక్ మానిటరింగ్ కమిటీలు ఏర్పడినప్పటికీ వాటి విధులు, బాధ్యతల అమలు విషయంలో ఎటువంటి చట్టబద్ధమైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో పాక్షికమైన ఫలితాలను పొందడం జరిగింది.

బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ)–2009 అమలుకు కేంద్ర స్థానం పాఠశాలలు. కాబట్టి పాఠశాలలు ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసినప్పుడే వాటి మనుగడ కొనసాగుతూ ఆశించిన విద్యా లక్ష్యాలను సాధించే అవకాశం ఏర్పడుతుంది.

ప్రజల భాగస్వామ్యం మరియు సేవలు చట్టబద్ధం కాకపోవడం వల్ల విద్యాకమిటీల నిర్వహణ, అమలు నామమాత్రంగా జరిగిందనేది గతంలో ఏర్పాటు చేసిన విద్యా కమిటీల ద్వారా అనుభవంలోకి వచ్చింది.

పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కోసం ఒక చట్టబద్ధమైన కమిటీ ఆవశ్యకతను గుర్తించి, ప్రజల అభీష్టం మేరకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం –2009లో 'పాఠశాల యాజమాన్య కమిటీ'లను చట్టబద్ధమైన కమిటీగా రూపొందించి వాటికి నిర్దేశిత బాధ్యతలను, హక్కులను కల్పించడం జరిగింది.

చట్టబద్ధం కాకముందు నామమాత్రంగా నడిచిన పాఠశాల కమిటీలు చట్టం ఏర్పడిన తరువాత తమకు లభించిన చట్టబద్ధమైన హెూదాతో మరింత సమర్థవంతంగా, తప్పనిసరిగా పాఠశాల అభివృద్ధిలో తమవంతు పాత్రను పోషించవలసి ఉంది.

## 7.8 పాఠశాల యాజమాన్య కమిటీలు ఎందుకు? వాటిని ఎందుకు స్వాగతించాలి?
## (Why SMCs and Why should we welcome SMCs)

పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా బడి నిర్వహిస్తున్న ఆవాస ప్రాంతంలోని పెద్దలు, విద్యాభిమానులు, తల్లిదండ్రుల సహకారం ద్వారా ఉపాధ్యాయులు పాఠశాల నిర్దేశించుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చు. పాఠశాలకు కల్పించే వసతుల విషయంలో, బడి ఈడు పిల్లలను బడికి రప్పించడంలో, బడి బయటి పిల్లలను తిరిగి బడికి రప్పించుటలో ఉపాధ్యాయులకు స్థానికులు సహకరించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చు. కాబట్టి ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్య కమిటీని ఏర్పరచి పాఠశాల బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించుటకు కృషి చేయాలి. పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటును స్వాగతించాలి. స్థానికంగా ఎదురయ్యే సమస్యలను వారి సహాయంతో పరిష్కరించుకోవాలి. నమోదులో, హాజరులో, వసతుల కల్పనలో, గుణాత్మక విద్యా సాధనలో పాఠశాల యాజమాన్య కమిటీ సహాయం తీసుకోవాలి.

- *పాఠశాల పూర్తి సమయాన్ని బోధనాభ్యసనకు ఉపయోగించడం.*
- *ఎక్కడ మార్పులు, మెరుగుపర్చుకోవడం అవసరమో గుర్తించి దానికోసం ప్రయత్నించాలి.*
- *పిల్లల నాణ్యమైన చదువుకు బాధ్యత వహించి తల్లిదండ్రులను ఎస్.ఎమ్.సి. కు పిల్లల ప్రగతి ప్రదర్శనకు బాధ్యత వహించడం.*
- *వచ్చిన గ్రాంటులపై ఉపాధ్యాయుల అందరితో కలిసి తీర్మానం చేసి ఉపయోగించడం.*
- *మౌలిక వసతుల కల్పన వినియోగం, కమ్యూనిటీ, సమవయస్కుల సహాయంతో అభివృద్ధి చేయడం.*
- *సి.సి.ఇ. అమలు, సి.సి.ఇ. రికార్డ్, క్యుములేటివ్ రికార్డ్ నిర్వహణ, బాలల హక్కులపై అవగాహన, పిల్లల స్వభావం, అవసరాలు, అభ్యాసన స్వభావంపై అవగాహన, పట్టు, అమలు.*

## 7.8 పాఠశాల యాజమాన్య కమిటీలు ఎందుకు? వాటిని ఎందుకు స్వాగతించాలి?
## (Why SMCs and Why should we welcome SMCs)

ఎవరి పిల్లలయితే పాఠశాలల్లో చదువుతున్నారో వారిని పాఠశాలకు ఆహ్వానించి, వివిధ అంశాలపై (నమోదు, హాజరు, ప్రగతి, వసతుల కల్పన...) చర్చించడం ద్వారా, పాఠశాల కార్యక్రమాలలో భాగస్వాములుగా చేయడం ద్వారా పాఠశాలలను బలోపేతం చెయ్యవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులసంఖ్య తగ్గుతున్న నేటి పరిస్థితులలో పాఠశాల యాజమాన్య కమిటీలను పాఠశాల కార్యక్రమాలలో భాగస్వాములుగా చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చు. విద్యార్థుల ప్రగతికి ఆటంకం కలిగించే అంశాలను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో చర్చించడంద్వారా అడ్డంకులను అధిగమించవచ్చు.

ఎస్ఎంసిని పాఠశాల కార్యక్రమాలన్నింటిలో భాగస్వాములుగా చేయడం ద్వారా ఉపాధ్యాయులకు సమస్యల భారం కూడా తగ్గుతుంది. సమాజ సభ్యుల దగ్గరికి ఉపాధ్యాయులు వెళ్ళడం వల్ల బడికే లాభం చేకూరుతుంది. ఎవరు, ఎవరి దగ్గరకు వెళ్ళాలి అనే ప్రశ్న వచ్చినప్పుడు ఉపాధ్యాయులే చొరవచూపి తల్లిదండ్రులను కలవవలసి ఉంటుంది. వారిని సమావేశాలకు స్వయంగా ఆహ్వానించాలి. పిల్లలు ఎలా చదువుతున్నారనేది తల్లిదండ్రులకు తెలిసినప్పుడే వారు క్రమం తప్పకుండా పాఠశాల సమావేశాలలో పాల్గొంటారు. సమాజ సంబంధాలు నెలకొల్పుకోవడమే ప్రధానం, కాని ఎవరు ఎవరి దగ్గరకు వెళ్లాలి అనేది కాదు. తల్లిదండ్రులను కలిసే ఏ అవకాశాన్ని బడి వదులుకోరాదు. విద్యా సంబంధ,

సమాజ సంబంధ వివిధ సర్వేలు, స్థానికంగా జరిగే ఉత్సవాలు, కార్యక్రమాలు వంటి వాటిలో పాల్గొని బడికి, సమాజానికి మధ్య సంబంధాలను పెంపొందించాలి.

పాఠశాల యాజమాన్య కమిటీ క్రమబద్ధంగా సమావేశమవుతూ పాఠశాల స్థితిగతులను, అవసరాలను గురించి చర్చించినట్లయితే పాఠశాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది. పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించి, అమలుపరచడం వల్ల పాఠశాల అవసరాలు తీరడంతోపాటు విద్యా లక్ష్యాలను సాధించడం జరుగుతుంది. ఇందుకు కమిటీ సభ్యులు తమ బాధ్యతలు తెలుసుకోవడంతో పాటు సమావేశాలకు హాజరుకావడం, ప్రగతిలో భాగస్వాములుకావడం జరగాలి. తద్వారా ప్రభుత్వం, సమాజం, పాఠశాలల మధ్య సమన్వయకర్తగా కమిటీ పనిచేస్తుంది.

కావున పాఠశాల ప్రణాళికాబద్ధంగా పనిచేయడానికి గల అవసరాలను గుర్తించి, నిర్దేశించుకున్న విద్యా లక్ష్యాలు సాధించడానికి నిరంతర స్థానిక పర్యవేక్షణ అవసరం. అందుకు పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటు తప్పనిసరి. అయితే ప్రస్తుతం పాఠశాల యాజమాన్య కమిటీలు పై ఉద్దేశ్యాలకు అనుగుణంగా పని చేస్తున్నాయా? అనే విషయం ఆలోచించాలి. పాఠశాల యాజమాన్య కమిటీ చురుకైన పాత్ర పోషించిన చోట ఫలితాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.

- *వివిధ పోటీలు కార్యక్రమాల అమలు – క్విజ్, వ్యాసరచన, ప్రసంగాలు, స్కూల్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, లైబ్రరీ వీక్/ రీడింగ్ వీక్, బుక్ రివ్యూ మొదలగునవి.*
- *పిల్లల సమగ్రాభివృద్ధి అన్ని కోణాలలో ఈ అంతర విద్యా ప్రణాళిక క్రియల ద్వారా జరుగుతుంది.*
- *ఉపాధ్యాయులు తమ వృత్తిపరమైన అభివృద్ధికి కోసం అవసరమైన కార్యక్రమాలలో పాల్గొనడం, పుస్తక సమీక్ష, చర్చలు, సెమినార్లలో పాల్గొనడం వంటివి చేయాలి.*
- *బడి అభివృద్ధికి తల్లిదండ్రులు, కమ్యూనిటీ వ్యక్తులను భాగస్వాములను చేయడం. సహాయ సహకారాలు ఆశించి మంచి బడిగా తీర్చిదిద్దాలి.*
- *సంవత్సరాంతంలో బడి కార్యకలాపాలు, పొందిన ప్రగతిపై మూల్యాంకనం చేయాలి.*
- *వార్షిక నివేదిక తయారుచేయాలి.*

## 7.9 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు – ప్రస్తుత పరిస్థితి – ప్రభావం

## (SMC Meetings - Present Situations and its Impact)

రాష్ట్రంలోని ఎక్కువ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య సంఘం పరిస్థితి ఎలా ఉందో పరిశీలిద్దాం.

- ఎస్.ఎం.సి సమావేశాల నిర్వహణకు అవసరమైన చొరవ, ఆసక్తి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చూపకపోవడం.
- కమిటీ సభ్యులకు అనుకూలమైన వేళల్లో సమావేశం నిర్వహించకపోవడం.
- సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం.
- సమాచారం తెలిసినను కమిటీ సభ్యులు హాజరుకాకపోవడం.
- పాఠశాల యాజమాన్య కమిటీలకు తమ బాధ్యతలు, విధులపై అవగాహన లేకపోవడం.
- పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశం నామమాత్రంగానే నిర్వహించబడడం.

- పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు తాము సభ్యులమనే విషయం కూడా తెలియకపోవడం.
- కమిటీ సభ్యులలో ఐకమత్యం లేకపోవడం, సరయిన నిర్ణయాలు తీసుకోకపోవడం.
- నిర్దిష్టమైన ఎజెండా రూపొందించుకోకపోవడం.
- నిర్దేశిత ఎజెండా ప్రకారం సమావేశ నిర్వహణ జరగకపోవడం.
- మధ్యాహ్న భోజనం, నిధులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు వంటి అంశాలు చర్చించకుండా నామమాత్రంగా నిర్వహించడం.
- పిల్లల ప్రగతిని అంటే చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి వాటిని విద్యార్థులతో తల్లిదండ్రుల ముందు ప్రదర్శించకపోవడం.
- పిల్లల ప్రగతిని గురించి చర్చించకపోవడం.
- పాఠశాలకు మంజూరయిన గ్రాంటుల వివరాలు, ఖర్చు వివరాలు తెలియపరచకపోవడం.
- కొన్ని పాఠశాలల్లో సమావేశం నిర్వహించకపోయినా మినిట్స్ రాసి తదుపరి సంతకాలు చేయించడం.

**ప్రస్తుత పరిస్థితి – ప్రభావం:**

పైన చెప్పినట్లుగా పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశాలు మొక్కుబడిగా సాగుతుండడం మరియు కమిటీలు ఉండి బాధ్యతలు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల పాఠశాలల్లోని వాస్తవ పరిస్థితులు, ప్రగతి, అవసరాలు కమిటీ సభ్యులకు తెలియకపోవడం వల్ల పాఠశాల అభివృద్ధిలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. బడి ఎలా నడుస్తుంది? పిల్లలు ఎలా చదువుతున్నారు? అని అడిగే వ్యవస్థ లేకపోవడంవల్ల పాఠశాలలకు, ఉపాధ్యాయులకు క్రమంగా జవాబుదారితనం లేకుండా పోతున్నది. ఇందువలన కూడా నేటికి దాదాపు 40% మంది పిల్లలు మన ప్రాథమిక పాఠశాలల్లో చదవడం, రాయడం చేయలేకపోతున్నారు. కావున పాఠశాల పిల్లల చదువు విషయంలో వివక్షతకు సంబంధించి తల్లిదండ్రులకు, సమాజానికి జవాబుదారీతనం వహించాలి.

ప్రధానోపాధ్యాయునియొక్క ప్రభావవంతమైన పనితీరు, ఆయన / ఆమె నాయకత్వం, బాధ్యత వహించే స్వభావం గురించి, పాఠశాలలో అమలు జరిగే కార్యక్రమాల ద్వారా తెలుస్తుంది. వారు ప్రభావశీలురా, మంచి నాయకులా, మార్పుకోసం, మంచికోసం నిరంతరం తపించేవారా, బాధ్యత తీసుకునేవారా అని తెలుస్తుంది.

పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశాలను క్రమబద్ధంగా నిర్దేశిత ఎజెండా ప్రకారం నిర్వహిస్తూ మంచి ఫలితాలను పొందిన పాఠశాలలూ మన రాష్ట్రంలో ఉన్నాయి.

*ఒక విద్యార్థి తండ్రి మా అమ్మాయి ఎలా చదువుతున్నది? రోజూ పాఠశాలకు హాజరవుతున్నదా? అని ఒక ఉపాధ్యాయుడిని అడిగినప్పుడు మీ అమ్మాయి ఎవరు? ఏం పేరు? అని ఉపాధ్యాయులు అడిగే పరిస్థితులు ఉంటే ఆ పాఠశాల నిర్వహణ ఎలా జరుగుతుందో ఆలోచించండి. ఉపాధ్యాయులకు తాము బోధిస్తున్న తరగతిలోని విద్యార్థులందరి పిల్లల పేర్లు, వారి తల్లిదండ్రులు, వారి కుటుంబ నేపథ్యం గురించి తెలిసి ఉండాలి. పిల్లల నేపథ్యం తెలిసినపుడు పిల్లలు తరగతిలో, పాఠశాలలో ఎదుర్కొనే ఇబ్బందులను సులభంగా తొలగించవచ్చును.*

*ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి సాధించిన పాఠశాలల ఉదాహరణలు కోకొల్లలు. శ్రీ విజయానంద్ గుంటూరు పట్టణంలో ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిన సమయంలో 50 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం విద్యార్థుల నమోదు 600లకు చేరింది. అతను తల్లిదండ్రులతో, సమాజ సభ్యులతో, పెద్దలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడం వల్ల ఇది సాధ్యమయ్యింది. ఆ ప్రాంతంలోని వివిధ కార్యక్రమాలలో, జాతరలలో, ఉత్సవాలలో పాల్గొనడం, పిల్లలు, పెద్దలకు సంబంధించిన సామాజిక అంశాలకు తగిన సూచనలు, సహకారం అందించడం (ఆరోగ్య, వ్యవసాయ విషయాలలో ఎవరిని కలవాలి, ఏం చేయాలి వంటివి...) ద్వారా పాఠశాలను సమాజానికి సన్నిహితం చేయగలిగారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకోగలిగారు. అడిగిందే తడవుగా సమాజ సభ్యులు ముందుకు వచ్చి పాఠశాల కార్యక్రమాలలో భాగస్వాములయ్యి, పాఠశాల నిర్వహణ విజయవంతానికి తమవంతు సహకారం అందించారు. సమాజ సభ్యులకు ప్రధానోపాధ్యాయునిపై మంచి అభిప్రాయడం, నమ్మకం ఉంటే తమ పిల్లలను, బాధ్యతను ఆ పాఠశాలకు అప్పగిస్తారు. దీనికి కావల్సింది మనం వీలున్నప్పుడల్లా గ్రామాల్లోకి వెళ్ళి తల్లిదండ్రులను పరామర్శించి మంచిచెడ్డలు తెలుసుకోవాలి.*

## 7.10 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు - అమలు - విధానాలు (Conducting SMC Meetings - Proceedures)

ఆర్‌టిఇ-2009 ప్రకారం రెండు నెలలకు ఒకసారి పాఠశాల యాజమాన్య సంఘం (ఎస్ఎంసి) సమావేశం నిర్వహించాలి.

**సమావేశానికి ముందు:**

- సమావేశ తేదీని, సమయాన్ని నిర్ణయించాలి. అది కమిటీ సభ్యులకు అనుకూలంగా ఉండాలి.
- సమావేశపు ఎజెండా ఏర్పాటు చేసుకోవాలి (స్థానిక అవసరాలకు అనుగుణంగా)
- సమావేశానికి కనీసం 3 రోజుల ముందు కమిటీ సభ్యులకు సమావేశపు తేది, సమయం, ఎజెండాలతో కూడిన ఆహ్వాన పత్రాన్ని అందించి, రశీదు పొందాలి.
- ప్రధానోపాధ్యాయుడు వారితో స్వయంగా మాట్లాడాలి. కలిసి సమావేశానికి రమ్మని కోరాలి.
- ప్రధానోపాధ్యాయులు/ ఉపాధ్యాయులు ఎజెండా అంశాలకు అనుగుణంగా కావలసిన రికార్డులు, రిజిష్టర్లు, ప్రదర్శన అంశాలు సిద్ధం చేయాలి.
- సభ్యులు గుండ్రంగా కూర్చోవడానికి, ప్రదర్శనకు వీలుగా సమావేశ స్థలాన్ని సిద్ధం చేయాలి. తాగునీరు మొదలగు వసతులు కల్పించాలి.

**సమావేశ సమయంలో...**

- హాజరైన సభ్యుల చేత హాజరు రిజిష్టరులో సంబంధిత ఉపాధ్యాయులు సంతకాలు చేయించాలి.
- గత మాసపు తీర్మానాల అంశాల అమలుపై సమీక్ష జరపాలి.
- ఎజెండా అంశాలను ప్రదర్శించాలి. ప్రధానోపాధ్యాయులు చర్చను అంశం వారీగా మొదలుపెట్టాలి.
- చర్చించిన అంశాలన్నింటిని తీర్మానాల పుస్తకంలో ఎప్పటికప్పుడు రాయాలి.

- పిల్లల ప్రగతిని పిల్లలచే ప్రత్యక్షంగా ప్రదర్శించాలి, చర్చించాలి. తల్లిదండ్రులచే మాట్లాడింప జేయాలి. అంటే నల్లబల్లపై పిల్లలచే రాయించడం, లెక్కలు చేయించడం, చదివించడం వంటివి తల్లిదండ్రులు / ఎస్.ఎమ్.సి. సభ్యులు చేయాలి.
- విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, అభ్యసన స్థాయి, నిధుల వినియోగం, పాఠశాల అవసరాలపై చర్చించాలి. చేపట్టబోయే చర్యలను నిర్ణయించాలి. మినట్స్ బుక్‌లో నమోదుచేయాలి.
- చర్చించిన ప్రతీ అంశానికి సంబంధించి చేపట్టబోయే చర్యలను ఎవరెవరికి ఏ బాధ్యతలు అప్పగించాలో నిర్ణయించాలి.
- బడి బయట పిల్లలను బళ్ళలో తిరిగి చేర్పించడానికి కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయులకు బాధ్యతలు కేటాయించాలి.
- ప్రార్థనకు హాజరుకావలసిన, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించవలసిన కమిటీ సభ్యుల పేర్లను నిర్ణయించాలి.
- పాఠశాలకు అవసరమైన వసతుల కల్పనకు విరాళాలు ఉపాధ్యాయులతో కలసి సేకరించాలి.
- ఆ మాసపు ప్రత్యేక సందర్భాల గురించి (ఉదా: మదర్స్‌డే, చదువుల పండుగ మొదలగునవి) వాటి ప్రత్యేకతను గురించి వివరించాలి. వారిని ఆహ్వానించాలి. ప్రణాళికను రూపొందించుకోవాలి.
- పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని కమిటీ సభ్యులచే పరిశీలింపజేయాలి.
- తీర్మానాల పుస్తకంలో తీర్మానాలు, ప్రగతిని రాసి హాజరైన సభ్యులచే విధిగా సంతకం చేయించాలి.
- రాబోవు సమావేశానికి ఎజెండా రూపొందించుకోవాలి.

**సమావేశ అనంతరం:**

- తీర్మానాల ప్రతిని మండల విద్యాధికారికి సమర్పించాలి.
- తీర్మానాల్లో ప్రస్తావించిన అంశాలు అమలు జరిగేలా కమిటీ పర్యవేక్షించాలి. అందుకు ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలి.
- నిరంతరంగా గైర్హాజరవుతున్న పిల్లల తల్లిదండ్రులను కలిసి పాఠశాలకు పంపించేలా శ్రద్ధవహించాలి.

## 7.11 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో చర్చించి అమలు చేయవలసినవి (Items to be discussed in the SMC Meeting and its Implementation)

- గ్రాంటుల వినియోగం.
- బడిబయటి పిల్లలను గుర్తించి, కారణాలు పరిశీలించి, మళ్లీబడిలో చేర్చడం.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి, తగిన ఏర్పాట్లు చేయడం.
- ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులలో తరగతి స్థాయిలో ఉన్నారో, లేదో పరిశీలించి వాటి సాధనకు ఉపాధ్యాయులతో చర్చించి తగు చర్యలు తీసుకోవడం. ఇందుకు పిల్లల ప్రగతి భాష,గణితం, ఆంగ్లం మొదలగు వాటిలో తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం.
- టీచర్ల మీద విద్యేతర విధుల భారం పడకుండా చూడడం.
- క్రమం తప్పకుండా టీచర్లు బడికి వచ్చి బోధించేలా చూడడం.
- పిల్లలు బడిలో చేరడానికి నిరాకరించడం, ఉచిత సౌకర్యాలు సమకూర్చకపోవడం వంటి పిల్లల హక్కుల ఉల్లంఘన లేదా తిరస్కరణ కేసులను స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావడం.

- మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేటట్టు చూడడం, పిల్లల్ని అడిగి తెలుసుకోవడం, పర్యవేక్షించడం.
- పాఠశాల యాజమాన్య సంఘం అకౌంట్ నిర్వహించడం.
- పిల్లల హక్కులు, సౌకర్యాల ఉల్లంఘన కేసుల ఫిర్యాదుల పరిశీలన.
- ప్రత్యేక అవసరాలుగల బాలల చదువుపూర్తి చేసేందుకు అవసరమయ్యే సదుపాయాలు సమకూర్చడం.
- పిల్లలు బడికి గైర్హాజరు కాకుండా చూడడం.
- మధ్యాహ్న భోజనం, యూనిఫారం, పాఠ్యపుస్తకాలు వంటి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు సక్రమంగా పంపిణీ, వినియోగింపబడేట్లు చూడడం.
- పాఠశాల నిర్వహించే అన్ని సమీక్షా సమావేశాలలో పాల్గొని అభివృద్ధికి సహకరించడం.

## 7.12 పాఠశాల యాజమాన్య కమిటీల పనితీరు - అమలు - సూచికలు
## (Functional aspects of SMCs - Implementation)

ఆర్‌టిఇ-2009 చట్టంలో పాఠశాల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతల గురించి చర్చించాం కదా. ఇవి పాఠశాలలో సరిగ్గా అమలవుతున్నాయో లేదోనన్న విషయాన్ని వేటిని చూసి తెలుసుకోవచ్చో ఒకసారి చూద్దాం.

- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అందుబాటులో ఉండడం, ప్రణాళిక ప్రకారం నిర్ణీత సమయంలో పనులు పూర్తికావడం.
- నెలవారీ సమావేశాల నిర్వహణకు సంబంధించి.
- ఆహ్వాన పత్రాల పంపిణీ రిజిష్టర్/ఫైల్.
- హాజరు పుస్తకం, మినిట్స్ పుస్తకం.
- మినిట్స్‌లో రికార్డ్ చేసిన అంశాల అమలు
- నిధులు సక్రమంగా వినియోగింపబడి ఉండడం, సామాజిక తనిఖీ నిర్వహించడం.
- క్యాష్‌బుక్, రశీదులు ఉండడం.
- కొనుగోలు చేసిన సామగ్రి పాఠశాలలో అందుబాటులో ఉండడం.
- పిల్లలు సక్రమంగా పాఠశాలకు హాజరు కావడం.
- బడి బయట పిల్లలు లేకపోవడం.
- అన్ని సబ్జెక్టులలో పిల్లలు తరగతికి నిర్ధారించిన అభ్యసన స్థాయిని కలిగి ఉండడం.
- ఉపాధ్యాయులు వేళకు పాఠశాలకు రావడం, పూర్తి సమయం తరగతి గదిలోనే గడపడం.
- సమాజం నుండి పాఠశాలకు నిధులు, సహకారం అంది ఉండడం, పాఠశాల వసతుల కల్పనలో ప్రగతి.
- పాఠశాల మౌళిక వసతులను కలిగి ఉండడం.
- మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరుగుతూ ఉండడం.
- యూనిఫారం, పాఠ్యపుస్తకాలవంటివి విద్యార్థులందరికి అందడం.

## 7.13 పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ - సూచికలు
## (Indicators of Implementation for Effective Conduct of SMC Meetings)

- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అందుబాటులో ఉండి ప్రణాళిక ప్రకారం పనులు పూర్తికావడం, అభివృద్ధి సాధించడం.

- ఆహ్వాన పత్రముల రిజిష్టర్ / ఫైల్ ఉండాలి.  తల్లిదండ్రులకు ముట్టినట్లుగా రశీదులు ఉండాలి.
- మినిట్స్ పుస్తకం - హాజరు పుస్తకం.
- నిర్దేశించిన అజెండా అంశాల రిజిష్టర్.
- పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల జాబితా పాఠశాల గోడకు ప్రదర్శించి ఉండాలి.
- గత సమావేశాల నాటి ముఖ్యాంశాలను తెలిపే చార్టులు పాఠశాలలో అందుబాటులో ఉంచాలి.
- పాఠశాల సమస్యలను అధిగమించడానికి బాధ్యత వహించే కమిటీ సభ్యుల వివరాలు.
- ఆవాస ప్రాంతంలోని 6-14 సం॥రాల పిల్లల వివరాల పుస్తకం.
- బడి బయటి పిల్లల వివరాల పుస్తకం.
- పిల్లల పనులు - ప్రగతి ప్రదర్శనలు.
- సమాజం నుండి పొందిన విరాళాలు. వస్తువులు, ఇతర సహాయం వివరాలు.
- ఉపాధ్యాయులు వేళకు బడికి రావడం, తరగతి గదిలో సమయాన్ని గడపడం.

## 7.14 ముగింపు (Conclusion)

పాఠశాల యాజమాన్య కమిటీలు చట్ట ప్రకారం తమ బాధ్యతలను గుర్తించి అత్యంత చురుకుగా విధులను నిర్వరిస్తూ, నిరంతరం పాఠశాలను సందర్శిస్తూ, క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతూ, పాఠశాల వాస్తవిక స్థితిగతులపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉన్నప్పుడే పాఠశాల అన్ని రంగాలలో అభివృద్ధి చెంది నిర్దేశిత లక్ష్యాలను సాధించే అవకాశముంది.

పాఠశాల యాజమాన్య కమిటీలో మెంబర్ కన్వీనర్ అయిన ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ పాఠశాల యాజమాన్య కమిటీలోని సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ చురుకైన పాత్ర పోషించేలా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పాఠశాల యాజమాన్య సంఘం సమావేశాలు తరచుగా, విజయవంతంగా నిర్వహించడం అనేది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చొరవ మరియు ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. ఎస్.ఎం.సి. ఉపాధ్యాయుల విధులకు, పాఠశాల కార్యక్రమాలకు ఆటంకం అని భావించరాదు.  విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లేకపోతే పాఠశాలల మనుగడ కష్టమని గుర్తించి వారి పిల్లల ప్రగతికి ప్రాథమికంగా బాధ్యత వహించాలి.

సమాజ సభ్యుల సహకారం, పాఠశాల యాజమాన్య సంఘం భాగస్వామ్యం ద్వారా పాఠశాలలను అన్ని రకాలుగా బలోపేతం చేయవచ్చు.

×××

# 8. పాఠశాల అభివృద్ధి ప్రణాళిక

## (School Development Plan)

**8.1** మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి

**(Basic Questions - Think and Reflect)**

**8.2** నేపథ్యం **(Context)**

**8.3** పాఠశాలలు ఎందుకు ఏర్పాటు చేయబడ్డాయి? తల్లిదండ్రులు, పిల్లలు, సమాజం పాఠశాల నుండి ఏమి ఆశిస్తున్నారు?

**(Why Schools have been established. What are the expectations of society, parents and children from school)**

**8.4** **RTE - 2009** - బడి అభివృద్ధి ప్రణాళిక

**(RTE-2009 - School Development Plan )**

**8.5** పాఠశాల అభివృద్ధి ప్రణాళిక – ఉండాల్సిన అంశాలు – రూపకల్పన – అమలు

**(SDP - Items to be included, Preparing plans and its Implementation )**

**8.6** **SDP** అవసరం ఏమిటి? ఎందుకు రూపొందించుకోవాలి?

**(Why SDP and Why to develop?)**

**8.7** **SDP** ప్రస్తుత పరిస్థితి మరియు దాని ప్రభావం

**(SDP - Existing situation and its Impact)**

**8.8** **SDP** అమలు బాధ్యతలు – ప్రధానోపాధ్యాయుడు, ఎస్.ఎమ్.సి. ఛైర్మన్ సభ్యులు

**(SDP - Implementation - Roles and Responsibilities - HM, Chairman and Members of SMC)**

**8.9** **SDP** – అమలుకు సూచికలు

**(SDP - Indicators of implementation )**

**8.10** **SDP**లోని అంశాలు

**(Items under SDP )**

**8.11** నమూనా **SDP** – ఫార్మాట్

**(SDP Model Format)**

**8.12** ముగింపు **(Conclusion)**

## గురుశిష్యుల సంబంధం

విద్యా బోధనలో అన్నిటికన్నా కీలకమైంది ఏది? గురుశిష్యుల మధ్య అవిభాజ్యమైన సహజ స్నేహ బంధమే. అయితే ఈ యోగ్యత ఉపాధ్యాయునికి ఎప్పుడు లభిస్తుంది? పిల్లల్లో పిల్లవాడిగా ఉపాధ్యాయుడు మారిపోగల్గినప్పుడే. ఉపాధ్యాయున్ని గురించి ఎలాంటి అనుభూతి పిల్లలకుండాలి? సహపాటి అనే భావనే.

పిల్లల పట్ల ఈ జవాబుదారీతనం ఎవరికి సాధ్యం కాదు? హృదయాంతరాలలో దాగి, జాలువారాల్సిన పసితనం పెద్దరికపుటెడారిలో ఇంకిపోయిన వారికే. గురుశిష్యుల మధ్య కావాల్సింది సాన్నిహిత్యమేనా? కాదు. ఆంతరంగిక అభేదం. అది లేకుండా గురువు ఇచ్చేది లేదు. శిష్యుడు తీసుకొనేదీ లేదు.

**– రవీంద్రనాథ్ ఠాగూర్**

పిల్లలు పాఠశాలలో చేరినప్పటి నుండి అక్కడి వాతావరణంలో వాత్సల్యానురాగాలు, శ్రద్ధతో కూడిన సంరక్షణ ఉన్నప్పుడే భద్రత ఉన్నదని భావిస్తారు. ముఖ్యంగా తమకు ఉపాధ్యాయులలో ఉన్న సంబంధాలలో భద్రత ఉన్నదని భావిస్తే విద్యార్థులు స్వేచ్ఛగా, సున్నితంగా, నిష్కపటంగా స్పందించగలరు. వారి విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగుతుంది. అప్పుడే వారు పాఠ్య విషయాలనే కాక వారి చుట్టూ జరుగుతున్న వాటి పట్ల కూడా సహజమైన కుతూహలం, శ్రద్ధ చూపుతూ ఉత్సాహంగా వాటి గురించి నేర్చుకుంటారు. స్వేచ్ఛగా ప్రశ్నిస్తారు. స్వతంత్రంగా ఆలోచిస్తారు. చర్చిస్తారు హేతుబద్ధంగాను, భ్రాంతికి లోనవకుండాను ఆలోచించగలిగే శక్తి సామర్థ్యాలను పెంచుకోవడమే విద్య. ఏ విధమైన నిర్బంధం లేనప్పుడే నేర్చుకోవడం అనేది సాధ్యం.

**– జిడ్డు కృష్ణమూర్తి**

పాతికేళ్ల కిందట మహాత్మాగాంధీ జాతి కోసం కొత్త తరహా ప్రాథమిక విద్యా పథకాన్ని ప్రతిపాదించారు. అది బేసిక్ విద్యా ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది. పాఠశాల విద్యను సామాజిక జీవితానికి సన్నిహితంగా, సంగతంగా చెయ్యాలనీ, అందుకోసం పాఠశాల కార్యక్రమంలో కొంత కాయిక శ్రమనూ, ఉత్పాదక శ్రమనూ కూడా మేళవించాలని ఆయన భావించారు. అది భారతదేశ విద్యా చరిత్రలోనే మహత్తరమైన మలుపు, ఎన్నో బ్రిటిష్ పాలన దేశంలో స్థిరీకరిస్తూ వచ్చిన పుస్తక కేంద్ర, పరీక్షాధారిత, నిష్ఫల విద్యా వ్యవస్థ మీద అదొక తిరుగుబాటు. అదొక జాతీయ ఉద్వేగాన్ని లేవనెత్తింది.

ఆ మౌళిక లక్షణాలు ఇవి: (1) విద్యలో ఉత్పాదక కార్యకలాపం ప్రధాన భాగం కావడం, (2) పాఠశాల కరికులంని ఉత్పాదక కార్యకలాపంతోనూ, పాఠశాల చుట్టూ ఉండే భౌతిక సామాజిక పరిసరాలకు సన్నిహితంగా తీసుకుపోవడం, (3) పాఠశాలకూ, స్థానిక సమాజానికి మధ్య ఆత్మీయ సంబంధాన్ని ఏర్పరచడం.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# 8. పాఠశాల అభివృద్ధి ప్రణాళిక

## (School Development Plan)

### 8.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి

### (Basic Questions - Think and Reflect)

1) పాఠశాల అభివృద్ధి అంటే ఏమిటి? (What is meant by school development?)
2) పాఠశాలల ప్రస్తుత పరిస్థితి ఏమిటి విశ్లేషించండి?
   (What is present situation of school functioning, situation analysis?)
3) పాఠశాల అభివృద్ధికి ఏ ఏ వ్యూహాలు మరియు వనరులు అవసరం?
   (What strategy and resources are required for school development?)
4) పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అంటే ఏమిటి? ఇది ఎందుకు అవసరం?
   (What is SDP and why is it required?)
5) పాఠశాల అభివృద్ధి ప్రణాళిక ఎలా తయారు చేయాలి? ఎవరు పాల్గొనాలి?
   (How to develop SDP ? Who will participate?)
6) పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ, అమలు, ప్రభావం, మూల్యాంకన దశలు.
   (SDP development - Implementation - Impact evaluation and steps?)
7) పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అమలులో ఎవరికి ఏ ఏ బాధ్యతలు?
   (What are the roles and responsibilities of the persons in the implementation of SDP?)
8) పాఠశాల అభివృద్ధి ప్రణాళిక బాగా అమలు అవుతున్నది అని తెల్పడానికి సూచికలు
   (Indicators of implementation)

### 8.2 నేపథ్యం (Context)

పాఠశాల తాను నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి అవరమైన వనరులను గుర్తించి, సమకూర్చుకొని, అమలుకు బాధ్యత వహించే వ్యక్తులను గుర్తించి నిర్ణీత కాలవ్యవధిలో, అందరి భాగస్వామ్యంతో లక్ష్యాలను సాధించడం అనేవి ముందుగానే ఆలోచించి అంచనాలతో ప్రగతిని సాధించుటకు రూపొందించుకునే ప్రణాళికే 'పాఠశాల అభివృద్ధి ప్రణాళిక'.

### 8.3 పాఠశాలలు ఎందుకు ఏర్పాటు చేయబడ్డాయి? తల్లిదండ్రులు, పిల్లలు, సమాజం పాఠశాల నుండి ఏమి ఆశిస్తున్నారు?

### (Why Schools have been established. What are the expectations of society, parents and children from school)

సమాజ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకొరకు ఏర్పాటు చేసిన సంస్థ పాఠశాల. 'బడి' అంటే ఒక భౌగోళిక ప్రదేశం, భవనం, వస్తు సామగ్రి కాదు. బడి అంటే అభివృద్ధికి సంబంధించినది. బడిలో కొన్ని ప్రక్రియలు, కార్యక్రమాలు నిర్వహించాలి. మానవ సంబంధాలు నెలకొనాలి. ఆశించిన ఫలితాలు (outputs) రావాలి.

సమాజం కోసం బడి ఏర్పడుతుంది. ఆ సమాజానికి అవసరమైన వ్యక్తులుగా పిల్లలను బడి తీర్చిదిద్దాలి. కాబట్టి పాఠశాల ప్రభావం సమాజంపై పూర్తిస్థాయిలో ఉంటుంది. బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరి చదువుకునే ఒక ప్రదేశంగా కాకుండా పిల్లల శారీరక, మానసిక వికాసం, భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దబడడం, సమాజ అవసరాలకు అనుగుణంగా పిల్లలను తయారు చేయడం బడి తన బాధ్యతగా గుర్తించాలి. కొన్ని సబ్జెక్టులలో నిపుణత సాధించడం కాకుండా పిల్లల నైపుణ్యాలను గుర్తించి మెరుగుపరిచే ప్రక్రియ బడిలో జరగాలి. పాఠాలు చదివించడం, వాటిని పూర్తిచేయడం, పరీక్షలు నిర్వహించి, మార్కులు, గ్రేడులు ప్రకటించడం వంటివి బడి బాధ్యతల్లో చిన్న విభాగం మాత్రమే అని గుర్తించాలి. పిల్లల హక్కులను కాపాడి, పిల్లల నైపుణ్యాలను గుర్తించి, వారికి తగిన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించి, వారి సర్వతోముఖాభివృద్ధిని సాధించడం బడి నుండి ఆశిస్తున్న ముఖ్యమైన అంశాలు. ఉపాధ్యాయులు వీటికి అనుగుణంగా బడి కార్యక్రమాలను రూపొందించుకొని అమలు చేయవలసి ఉంటుంది. ఇవన్నీ విజయవంతం కావాలంటే ప్రతి పాఠశాలకు ఒక అభివృద్ధి ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. కాబట్టి బడికి ఒక ప్రణాళిక తయారుచేసుకొని దాని అమలు ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించవచ్చు.

**తల్లిదండ్రులు పాఠశాల నుండి ఏమి ఆశిస్తున్నారు?**

సాధారణంగా తల్లిదండ్రులు పాఠశాల నుండి కింది అంశాలను ఆశిస్తారు.

- తమ పిల్లలు ఆనందంగా బాగా చదవాలని, నేర్చుకోవాలని, మంచి మనిషిగా ఎదగాలని కోరుకుంటారు.
- తమ పిల్లలను దండించకూడదని ఆశిస్తారు.
- ఉపాధ్యాయులు రోజూ బడికి రావాలని, తమ పిల్లలకు చక్కగా/ బాగా చదువు చెప్పాలని కోరుకుంటారు.
- పిల్లలకు చదువుతోపాటు ఆటలు, పాటలు, నైతిక విలువలు నేర్పాలని, పిల్లలను శీలవంతులుగా తీర్చిదిద్దాలని,
- తమ పిల్లల ఆసక్తులకు, నైపుణ్యాలకు అనుగుణంగా బోధన జరగాలని,
- మంచి చదువులు, అలవాట్లు, జీవననైపుణ్యాలు అలవర్చుకోవాలని, బడి ఇవన్నీ అందించాలని కోరుకుంటారు.

**పిల్లలు పాఠశాల నుండి ఏమి ఆశిస్తున్నారు?**

- దండనలు ఉండకూడదు, ఆప్యాయత, భద్రత, ప్రోత్సాహకర వాతావరణం ఉండాలని,
- తమ ప్రగతికి ఉపాధ్యాయుడు పాటుపడాలని, అనగా అర్థమయ్యేలా బాగా చదువు చెప్పాలని,
- ఆటలు ఆడాలని, తోటివారితో మాట్లాడాలని, గడపాలని,
- తమను గుర్తించాలని, తమను పట్టించుకోవాలని,
- బడి కార్యక్రమాల్లో స్వేచ్ఛను, గౌరవాన్ని, స్నేహతత్వాన్ని, తమ అభిప్రాయాలకు విలువ ఇవ్వడాన్ని
- తనదైన శైలిలో అభ్యసించుటకు తగిన వాతావరణాన్ని కోరుకుంటారు.

**సమాజం పాఠశాలల నుండి ఏమి ఆశిస్తుంది?**

- సమాజం తన అవసరాలు తీరాలని
- పిల్లలు సృజనశీలురుగా రూపొందాలని
- పిల్లలు మానవీయ విలువలు కలవారీగా తయారుకావాలని, స్వేచ్ఛా, సమానత్వం కలిగి ఉండాలని, ఇతరులను గౌరవించాలని.
- తమకాళ్ళపై తాము నిలబడి ఎవరిపై ఆధారపడకుండా ఉండాలని
- భవిష్యత్తుకు అవసరమైన వనరులుగా, పౌరులుగా పిల్లలు తీర్చిదిద్దబడాలని కోరుకుంటుంది.

ప్రతి పాఠశాల ఈ అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకొని ఒక దార్శనికత (vision) ప్రకారం కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకొని పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. పాఠశాలలు నిర్ధారించుకున్న లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. ఇందుకోసం ప్రస్తుత పరిస్థితి విశ్లేషణ, సాధించాల్సిన ప్రగతి, అందుబాటులోని వనరులు, సమకూర్చుకోవాల్సిన వనరులు, కాలవ్యవధి, వ్యూహాలు.... మొదలగు వాటిని ఆధారంగా చేసుకొని ప్రణాళికను తయారు చేసుకోవాలి.

## 8.4 RTE-2009 - బడి అభివృద్ధి ప్రణాళిక

## (RTE-2009 - School Development Plan)

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009 సెక్షన్ 21 సబ్‌సెక్షన్ (1) ప్రకారం ప్రతి బడిలో బడి యాజమాన్య సంఘాన్ని ఏర్పాటుచేయాలి.

సబ్‌సెక్షన్ (2) ప్రకారం బడి యాజమాన్య సంఘం ఈ కింది విధులను నిర్వర్తిస్తుంది.

ఎ) బడి పనితీరును పర్యవేక్షించడం.

బి) బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి, సిఫారసు చేయటం.

సి) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం లేదా ఏ ఇతర వనరుల నుంచి అయినా అందిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం.

డి) సిఫారసు చేసిన ఇతర విధులను నిర్వర్తించడం.

- బడి అభివృద్ధి ప్రణాళిక గురించి ఆర్.టి.ఇ.-2009 సెక్షన్ 22 సబ్‌సెక్షన్ (1) లో ప్రతిబడి యాజమాన్య సంఘం సిఫారసు చేసిన విధంగా బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచేయాలి.
- సబ్‌సెక్షన్ (2) ప్రకారం సందర్భాన్ని బట్టి ప్రణాళికలకు అందించే గ్రాంట్లకు సబ్‌సెక్షన్ (1) ప్రకారం తయారుచేసిన బడి అభివృద్ధి ప్రణాళిక ఆధారమవుతుంది.

## 8.5 పాఠశాల అభివృద్ధి ప్రణాళిక – ఉండాల్సిన అంశాలు – రూపకల్పన – అమలు

## (SDP - Items to be included, Preparing plans and its Implementation )

పాఠశాల అంటే ఆర్.టి.ఇ.-2009 ప్రకారం ప్రాథమిక విద్యను అందజేస్తూ సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న సంస్థ.

పాఠశాల బాలలందరిలో విద్యాసాధనకు కృషిచేసే కేంద్రం. బాలల సామర్థ్యాలు, ఆసక్తులు, వైఖరులు, నైపుణ్యాలవంటి వాటిని వికసింపజేసే స్థలం. స్వేచ్ఛాపూరిత వాతావరణంలో తమ భావాలను వ్యక్తీకరించి, తోటి వారితో, ఉపాధ్యాయులతో చర్చిస్తూ తమకు తెలిసిన అంశాలను పంచుకుంటూ, తెలియని అంశాల గురించి సమాధానాలను అన్వేషిస్తూ, పరిశోధిస్తూ బాలలు అభ్యసించడానికి వీలు కల్పించేది పాఠశాల. బాలల సర్వతోముఖాభివృద్ధిని సాధించి, వారిని సమాజ అవసరాలకు అనుగుణంగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, రాజ్యాంగం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుటకు ఏర్పాటుచేసిన సమాజానికి అవసరమైన సామాజిక సంస్థ పాఠశాల.

కాబట్టి పాఠశాల పై లక్ష్యాల సాధనకు తనదైన దృక్పథం దార్శనికతతో పనిచేయాల్సి ఉంటుంది. పాఠశాల తాను ఏర్పాటు చేసుకొన్న లక్ష్యాల సాధనలో ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది? ప్రగతి ఎలా ఉంది? పూర్తిస్థాయి లక్ష్యాల సాధనకు ఎలాంటి కృషి చేయాలి? వంటి అంశాలు పాఠశాల రూపొందించుకునే పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై ఆధారపడి ఉంటుంది.

కాబట్టి పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతి సంవత్సరం పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి. ఇందుకోసం ముందుగా గ్రామసభను ఏర్పాటుచేయాలి. ఈ సభకు దిగువ తెలిపిన వారిని ఆహ్వానించాలి.

- పాఠశాలలో నమోదయిన పిల్లల తల్లిదండ్రులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్యలు, పాఠశాల పరిసర ప్రాంతంలో ఉన్న విద్యారంగంలో పనిచేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఉన్నట్లయితే ఆ సంస్థ ప్రతినిధి.

**పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అంటే**

- పాఠశాల అభివృద్ధి కొరకు రూపొందించేది.
- పాఠశాల సాధించాల్సిన లక్ష్యాలు, అవసరాలు గుర్తించేది మరియు వనరులను సమకూర్చుకొనేది. లక్ష్యాలను సాధించుటకొరకు ప్రణాళిక, అమలు.
- విద్యావిషయక అంశాలను చర్చించేది– ప్రస్తుత పరిస్థితులు – ఎలా ముందుకు వెళ్ళాలి.
- నిర్దేశిత సమయంలో అమలు పరిచి అనుకున్న లక్ష్యాలను సాధించేది.
- ఎవరెవరు ఏయే బాధ్యతలు నిర్వహించాలో సూచించేది. ఎంత సమయంలో సాధించేది తెలిపేది.
- తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, సమాజాన్ని భాగస్వాములను చేసి, అమలుపరిచి, అభివృద్ధి సాధించేది.
- నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేది, సమీక్షించేది.
- ప్రణాళికలో వీటిని కూడా పొందుపరచవలసి ఉన్నది.
- అవసరమైన పాఠ్యపుస్తకాల సంఖ్య (తరగతి వారీగా)
- అన్ని రకాల వాతావరణాలను తట్టుకోగల దృఢమైన భవనం
- తాగునీటి సౌకర్యం
- యూనిఫారం
- పిల్లల్లో కనీస సామర్థ్యాలయిన చదవడం, రాయడం, లెక్కలు మొదలగు వాటిని అందరి పిల్లలతో సాధించడం.
- పోషకవిలువలున్న మధ్యాహ్న భోజనం
- ఆటస్థలం
- ఉల్లాసం కొరకు వివిధ అభ్యాస క్రియలు
- ప్రత్యేక అవసరాల బాలలకు ప్రత్యేక సౌకర్యాలు
- ప్రతీ తరగతిలోని అన్ని సబ్జెక్టులలో పిల్లలందరిలో సామర్థ్యాల సాధన

పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఎక్కడ ఎక్కువ దృష్టి ఉంచాలో ప్రణాళిక ప్రతిబింబిస్తుంది. పాఠశాలలోని పిల్లలందరికీ స్నేహపూరితమైన, ఆనందదాయకమైన వాతావరణాన్ని అందించుటలో ప్రణాళిక ప్రముఖపాత్ర వహిస్తుంది.

**పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో ఉండాల్సిన అంశాలు – దృష్టిపెట్టాల్సిన అంశాలు:**

- పిల్లల నమోదు, నిలకడ, హాజరు.
- పాఠశాలకు భౌతిక వసతుల కల్పన, ఉన్న వసతుల ఉపయోగం.
- ఉపాధ్యాయుల నియామకం
- వనరుల సమీకరణ – సద్వినియోగం

- పాఠ్యప్రణాళికను ఆశించిన మేరకు లక్ష్యాత్మకంగా అమలుచేయడం.
- గుణాత్మక విద్యను అందించడం పాఠశాలలోని విద్యార్థులు తమ తరగతి స్థాయికి నిర్దేశించబడిన సామర్థ్యాలు సాధించగలగడం.
- బాలల హక్కులు కాపాడడం.
- బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించడడం.
- తల్లిదండ్రులు, సమాజ భాగస్వామ్యం పెంచడం.
- విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయడం, ప్రదర్శించడం.
- షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రమాణాల మేరకు అదనపు భౌతిక సౌకర్యాలు, పరికరాలు.
- పాఠశాల పారిశుద్ధ్యం, పాఠశాల భద్రత, ఆరోగ్యం మరియు పరిశుభ్రత.
- బాలల వైకల్యాన్ని తొలిదశలోనే గుర్తించడానికి ప్రత్యేకదృష్టి సారించడం.
- ఉపాధ్యాయ సంసిద్ధత మరియు వృత్తినైపుణ్యాలు పెంపుదల.
- నాణ్యమైన విద్యాబోధనకోసం ప్రస్తుతం అమలుచేస్తున్న బోధనావ్యూహాలు, సబ్జెక్టు స్వభావం, పిల్లల స్వభావానికి అనుగుణంగా బోధనా వ్యూహాలలో రావలసిన మార్పులు.
- అదనపు అంశాలకు సంబంధించి ఆర్థిక అవసరాలు, సంవత్సరం వారీగా ప్రణాళికలో పొందుపరచాలి.
- వనరులను గుర్తించడం, సద్వినియోగం చేసుకోవడం.
- పాఠశాల కార్యక్రమాలలో, ప్రగతిలో ఎస్.ఎమ్.సి. సమాజ భాగస్వామ్యం.
- ప్రత్యేక శిక్షణ కేంద్రాలకు అవసరమయిన నిధులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు మరియు పాఠశాల బాధ్యతల నిర్వహణకు కావలసిన అదనపు ఆర్థిక అవసరాలు వంటి వాటిని సంవత్సరం వారీగా ప్రణాళికలో పొందుపరచాలి.

ఆధారంగా రూపొందించిన పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్, కన్వీనర్ సంతకం చేసి ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వానికి సమర్పించాలి.

**పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, అమలు:**

ఒక పాఠశాల యొక్క ప్రస్తుత పరిస్థితి, ప్రాధాన్యతల వారీగా అవసరాలు, అక్కడ లభించే వనరుల వంటి అనేక అంశాల ఆధారంగా ఆ ప్రాంత విద్యా పరిస్థితిపై ఆ ఆవాసంలోని ప్రజలకు, తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉంటుంది. కావున పాఠశాల అభివృద్ధి కొరకు చేసే ప్రణాళికలో తల్లిదండ్రులను, స్థానికులకు భాగస్వాములుగా చేసి వారికి పాఠశాల పట్ల యాజమాన్య భావన కలిగించినపుడే నిర్ధారించిన లక్ష్యాలను చేరుకోగలం.

ఇందుకొరకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009 (ఆర్‌టిఇ-2009) పాఠశాల యాజమాన్య కమిటీలకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ మరియు అమలులో సముచిత స్థానం కల్పించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో ఏర్పడిన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యాభిమానులు కలిసి పాఠశాలకు సంబంధించిన అంశాల వారీగా తాత్కాలిక ప్రణాళికా స్టేట్‌మెంట్‌ను రూపొందించుకోవాలి.

- ప్రణాళిక రూపొందించడం ఎలా?
- ప్రణాళిక తయారీకి ముందు,
- ప్రణాళిక తయారీ సమయంలో,

- ప్రణాళిక తయారీ అనంతరం చేయవలసిన అంశాలను గుర్తించాలి. అందుకనుగుణంగా బాధ్యతలు పంచుకొని ప్రణాళికను రూపొందించుకోవాలి.

బడి అభివృద్ధి ప్రణాళికను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం, పాఠశాల యాజమాన్య సంఘ సభ్యుల భాగస్వామ్యంతో అందరు కలిసి ఉమ్మడిగా పరస్పరం చర్చించి సమిష్టిగా తయారుచేయాలి. బడి అభివృద్ధి ప్రణాళికలో భాగస్వామ్యం కావడం ఒక మంచి అవకాశంగా భావించాలి. తమ వంతు సహకారాన్ని అందించాలి.

**ప్రణాళిక తయారీకి ముందు:** పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాల్సిన ప్రధాన బాధ్యత మెంబర్ కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులపైనే ఉంటుంది.

- ఉపాధ్యాయుల సహకారంతో ఆవాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లల నమోదు, హాజరు, స్థాయి, బడిబయటి పిల్లల వివరాలవంటి అంశాలు, ప్రాధాన్యతల వారీగా పాఠశాల అవసరాలు, విద్యావిషయక ప్రస్తుత పరిస్థితి, ఎదుర్కొనే ఇతర సమస్యల గురించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలి.
- సమావేశ తేదీని, సమయం, చర్చనీయాంశాలను యాజమాన్యకమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌గారి ఆమోదంతో మెంబర్ కన్వీనరైన ప్రధానోపాధ్యాయులు నిర్ణయించి కమిటీ సభ్యులకు, తల్లిదండ్రులందరికీ లిఖితపూర్వకంగా సమాచారాన్ని ముందుగానే తెలియజేయాలి.
- అంగన్‌వాడీ కార్యకర్త, వార్డు సభ్యులు/ కౌన్సిలర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, మహిళా ఆరోగ్య కార్యకర్త తప్పనిసరిగా హాజరగునట్లు చూడాలి.
- సభ్యులకు సమాచారం అందించిన వివరాలు భద్రపరచాలి.
- సమావేశ నిర్వహణకు అవసరమైన సామగ్రిని, ఏర్పాట్లను (కూర్చునేందుకు ఏర్పాట్లు, తాగునీరు, మినట్స్ రిజిష్టర్, ఎజెండా అంశాలు, సభ్యుల హాజరు రిజిష్టర్ మొదలగునవి) నిర్ణీత సమయానికి ముందే సమకూర్చుకోవాలి.

**సమావేశ సమయంలో...**

- పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అధ్యక్షతన సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలి.
- ప్రార్థన అనంతరం పాఠశాల ప్రగతి నివేదికను ప్రధానోపాధ్యాయులు సమర్పించి, నిర్దేశించిన ప్రొఫార్మాలోని అంశాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి, ఏమి సాధించాలి? వనరుల లభ్యత, అమలు పరచవలసిన వ్యూహాల గురించి చర్చించాలి.
- పాఠశాలకు సంబంధించిన ప్రతి అంశంలో బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాలను కూలంకషంగా చర్చించాలి.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో ప్రాధాన్యతల వారీగా చేపట్టే అంశాలు సాధించుటకు అమలు చేయాల్సిన వ్యూహాలను చర్చించి సభ్యులందరూ చర్చించి నిర్ణయం తీసుకోవాలి.
- ఆమోదం పొందిన అన్ని అంశాలకు అవలంబించాల్సిన ప్రత్యేక వ్యూహాలు, వనరుల సమీకరణ, బాధ్యతల పంపిణీ, పూర్తి చేయాల్సిన సమయం, సహకారం అందించే వారి వివరాలు, బాధ్యత వహించేవారు ఎంతకాలంలో పూర్తిచేస్తారనే విషయాలను నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరచాలి.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ కొరకు నిర్వహించిన సమావేశం ప్రారంభం నుండి చర్చించిన అంశాలన్నింటిని మినట్స్ రిజిష్టర్‌లో రికార్డుచేయాలి. తదనంతరం సభ్యులందరు ఆమోదించినట్లుగా అందరిచేత సంతకాలు తీసుకోవాలి.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక సమావేశానికి విచ్చేసిన తల్లిదండ్రులకు, సహకరించి బాధ్యతలు పంచుకొన్న వారికి

ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి మాసం చివరలో ప్రణాళిక అమలు తీరును తెలుసుకోవడానికి తప్పనిసరిగా హాజరుకావాలని సభ్యులను కోరుతూ తదుపరి సమావేశ తేదిని తెలియజేస్తామని తెలుపుతూ సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు ముగించాలి.

**సమావేశానంతరం:**

- పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో సభ్యులందరూ ఆమోదించిన అంశాలకు అవలంబించాల్సిన వ్యూహాలు, బాధ్యతలు, పూర్తిచేయాల్సిన సమయం, సహకారం తీసుకోవాల్సిన వారి వివరాలతో ఒక స్టేట్‌మెంట్‌ను తయారుచేసి కార్యాలయంలో ప్రదర్శించాలి.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక ఒక ప్రతిని పై అధికారులకు అందజేయాలి.
- అంశాల వారీగా బాధ్యతలు అప్పగించినవారిని, వారికి సహకరించాల్సిన వారిని సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పాఠశాల అభివృద్ధికి అందరూ బాధ్యత వహించాలి.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళికను విద్యా సంవత్సరం ప్రారంభంలో తయారుచేసుకొని జూలై 1 నుండి అమలు పరుస్తూ నెలకొక పర్యాయం సమీక్షించుకొని నవంబరులో ప్రగతిని చర్చించుకొని ప్రణాళికలోని అంశాలు అమలు జరిగేలా, లక్ష్య సాధన జరిగేలా చూడాలి. అమలుపై ప్రధానోపాధ్యాయుడు పూర్తి బాధ్యతలు తీసుకొని అమలుచేయాలి.

## 8.6 SDP అవసరం ఏమిటి? ఎందుకు రూపొందించుకోవాలి? (Why SDP and Why to develop)

ప్రణాళిక లేకుండా ఏ పనీ చేయలేం! ఒక వేళ చేసినా దానివల్ల సత్ఫలితాలు సాధించడం కష్టం. ప్రణాళికావల్ల లక్ష్యాల దిశలో వచ్చే అవరోధాలను ముందుగానే గుర్తించి, ముందుచూపుతో అధిగమించవచ్చు. ఒక పాఠశాల లక్ష్యం వంద శాతం నమోదు, హాజరు, పిల్లలందరిలో తరగతిస్థాయి సాధన అయితే అందుకు అవసరమైన వనరులు, వ్యక్తులు, నిధుల వంటి వాటిని సమకూర్చుకొనుటకు ప్రణాళిక తప్పనిసరి. ఏదైనా ఒక అంశం సరయిన స్థాయిలో లేకపోతే అందుకు కారణాలు గుర్తించి సరయిన చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. పిల్లలందరిలో తగిన సామర్థ్యాలు లేకపోతే తగినంత మంది టీచర్లు, పాఠ్యపుస్తకాలు, హాజరు, ఉపాధ్యాయ సంసిద్ధత, బోధనాభ్యసన సామగ్రి, అనుసరిస్తున్న బోధనావ్యూహాలు, సమీక్షలు వంటి వాటిని పరిశీలించి సామర్థ్యాల సాధనకు కృషిచేయుటకు మరియు బాలల సర్వతోముఖాభివృద్ధి సాధనకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తోడ్పడుతుంది. కాబట్టి ప్రతి పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకొని, ప్రణాళికలోని అంశాల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలు చర్చించుకొని అమలు చేయాల్సి ఉంటుంది.

**పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీలో దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలు:**

ప్రతి విద్యా సంవత్సరం ప్రతి అంశంలో (వనరులు, నాణ్యత, హాజరు....) ప్రస్తుత స్థితిని గుర్తించి ఆ విద్యాసంవత్సరంలో అన్ని అంశాలలో సాధించాల్సిన లక్ష్యాలను విశ్లేషించుకొని నిర్ధారించుకోవాలి. గతంలో ఏం సాధించగలిగాం? ప్రస్తుతం ఏం సాధించాలి? తుది లక్ష్యసాధనకు నిర్ణీత కాలవ్యవధులలో ఏమేమి లక్ష్యాలు నిర్దేశించుకోవాలో ప్రణాళికలో పొందుపర్చుకోవాలి. ఎవరు ఏమి చేయాలని కూడా నిర్దేశించుకోవాలి.

**ప్రస్తుత పరిస్థితి విశ్లేషణ:** హాజరు, బోధన నాణ్యత, బోధన విధానాలు, పిల్లల ప్రగతి, బడిలో ఉన్న వనరుల వినియోగం, ఆటలు, పాటలు మొదలగు అంశాలలో విద్యార్థులు ఎలా ఉన్నారు? ఆశించిన స్థాయిలో ఉన్నారా? లేదా? ఎంత వెనుకబడ్డారు? కారణాలు ఏమిటి? అని మనం ఏమేరకు పాఠశాలల లక్ష్యాలు సాధించాం? అని విశ్లేషించుకోవాలి.

పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ సమయంలో బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాలను చర్చించాలి. ఏ అంశంలో సరయిన ప్రగతి లేదో దానిపై మరింత దృష్టిసారించాలి. ఒక పాఠశాల ప్రణాళికలో ఆ ప్రాంత పరిస్థితులనుబట్టి ఏదైనా వినూత్న కార్యక్రమం అమలుచేస్తే దాని ప్రగతి, చేయాల్సిన మార్పులపై చర్చించాలి. వార్షిక ప్రణాళికలో చేర్చిన అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి, ప్రగతి సాధనకు అవసరమైన మార్పులు చేసుకోవాలి.

పాఠశాల యాజమాన్య సంఘంలోని ప్రతి సభ్యుడు నాయకత్వ లక్షణాలు ప్రదర్శించి పిల్లల్లో నాణ్యమైన విద్యను సాధించుటకు, వనరులను సమర్థవంతంగా వినియోగించుటకు, స్వీయ మూల్యాంకనం వంటి కీలకాంశాలపై దృష్టిపెట్టి పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగస్వాములు కావాలి.

**ప్రణాళికలు స్థానికంగా ఎందుకు రూపొందించుకోవాలి?**

కేంద్రస్థాయి ప్రణాళికలు స్థానిక సమస్యలను, అవసరాలను గుర్తించలేవు. స్థానిక వనరుల గురించిన అవగాహన ఉండదు. ఎవరికి ఎలాంటి బాధ్యతలు అప్పగించాలో వారి వివరాలు తెలియవు. కనుక తగిన సహకారం అందదు. స్థానికులకు ఈ ప్రణాళిక తమకు నిర్దేశించబడినది అనే భావన ఉండదు, తద్వారా ప్రణాళిక అనుకున్నంత విజయవంతం కాకపోవచ్చు. పాఠశాలలో తగిన విధంగా అభివృద్ధి జరగడం, అవసరాలు తీరడం వంటివి జరగకపోవచ్చు. స్థానిక అవసరాలు, సమస్యలు తీరాలన్నా, ప్రణాళికల లక్ష్యం నెరవేరాలన్నా స్థానికుల భాగస్వామ్యం తప్పనిసరి. దీనివల్ల తమది అనే భావన కలిగి బాధ్యతలను నిర్వర్తించడానికి ఉత్సాహంగా ముందుకు వస్తారు. స్థానిక భాగస్వామ్యం, వనరుల వినియోగం సక్రమంగా జరిగి ప్రణాళిక విజయవంతం కావడానికి దోహదపడుతుంది.

క్షేత్రస్థాయి (పాఠశాల ఆవాస స్థాయి)లో తల్లిదండ్రులు/ ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన ప్రణాళిక వల్ల పాఠశాల సాధించాల్సిన లక్ష్యాల సాధనకు అవసరమైన వాస్తవిక అవసరాలు, తదనుగుణంగా వనరుల సమీకరణ, బాధ్యతల పంపిణీ వంటి విషయాలలో స్పష్టత వస్తుంది. నిర్దేశిత సమయంలో లక్ష్యాలను సాధించవచ్చు. ఈ పాఠశాల మనది అనే భావన పెంపొందుతుంది. కావున పాఠశాల అభివృద్ధి ప్రణాళిక ప్రధానోద్దేశ్యం ఆ పాఠశాల పరిధిలోని బాలలందరు ఎటువంటి వివక్షతకు గురికాకుండా పాఠశాలలో చేరి, ఎటువంటి ఆటంకం లేకుండా నాణ్యమైన ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయుటకు అవసరమైన అన్ని అంశాలను గుర్తించి అమలు చేయడం.

## 8.7 SDP ప్రస్తుత పరిస్థితి మరియు దాని ప్రభావం

## (SDP - Existing situation and its Impact)

పిల్లల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీలో పాల్గొనడం, వారి బాధ్యతలను నిర్వర్తించడంలోనూ భాగస్వాములయినపుడు పాఠశాల అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతుంది. కాని ప్రస్తుతం ప్రణాళిక తయారీ, అమలు ఎలా ఉందో పరిశీలిద్దాం.

- బడి పనితీరును ఎవరు పరిశీలించడంలేదు.
- విద్యాలక్ష్యాలను ఈ బడి ఏమేరకు సాధించింది? సాధించడానికి ఏ ఏ గుణాత్మక కార్యక్రమాలు బడి అమలుచేస్తుంది అని ఎవరూ చూడడం లేదు.
- గుణాత్మక బోధన, పిల్లలను ఆలోచింపజేసే కృత్యాలు మొదలగు వాటికోసం ఉపాధ్యాయులు ఏవిధంగా తయారవుతున్నారు? ఎలాంటి టీచింగ్ నోట్స్ తయారుచేసుకుంటున్నారు? అనే వాటిపై ప్రధానోపాధ్యాయులు, ఇతర పర్యవేక్షక అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు.

- పాఠశాలలు తమకంటూ ఒక ప్రణాళికను రూపొందించుకోవడం లేదు.
- కేవలం ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి పాఠశాలలో కూర్చొని అవసరాలను గుర్తించి ప్రణాళిక తయారుచేస్తున్నారు.
- గ్రామసభలో చర్చించడం లేదు. కేవలం కొందరు తయారు చేసిన అంశాలను నిర్ధారిస్తూ సంతకాల సేకరణ మాత్రమే ఎక్కువగా జరుగుతున్నది.
- స్థానిక వనరులను ఉపయోగించుకోవడంపై ఆసక్తి చూపించక ప్రభుత్వం నుండి నిధులు ఏ మేరకు, ఎలా రాబట్టాలో ఆలోచిస్తూ ప్రణాళిక రూపొందిస్తున్నారు.
- ప్రణాళిక గురించిన సమాచారం తల్లిదండ్రులు, ప్రజలకు అందకుండానే ప్రణాళిక తయారీ పూర్తవుతుంది.
- సిలబస్ పూర్తిచేయడమే ఒక పెద్ద లక్ష్యంగా పెట్టుకొని ఎక్కువ పాఠశాలలు పనిచేస్తున్నాయి.
- నాణ్యమైన విద్యను అందించడం కొరకు చేపట్టే చర్యల గురించి ప్రణాళికలో పొందుపరచడం లేదు. తాత్కాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతున్నది.

**దాని ప్రభావం:**

- సాధించాల్సిన లక్ష్యాలపై ఒక సమగ్ర అవగాహన లేకపోవడం వల్ల వాటిని సాధించాలనే ప్రయత్నం జరగడంలేదు.
- ప్రజలందరూ భాగస్వాములు కాలేకపోవడం వల్ల తమది అనే సొంత భావన వారిలో కలగడం లేదు.
- పాఠశాలకు, విద్యార్థులకు కావలసిన అవసరాలను ప్రాధాన్యతల వారీగా ప్రణాళికలో పొందుపరచడం లేదు, తద్వారా అవి తీరడం లేదు.
- పాఠశాల అభివృద్ధికి బాధ్యత వహించడంలో సమాజం శ్రద్ధ చూపడం లేదు.
- స్థానిక వనరుల సమీకరణ – వినియోగం జరగడం లేదు.
- పిల్లల నమోదు, హాజరు, నిలుపుదల, నాణ్యత వంటివాటిపై ప్రణాళిక ప్రభావం కనబడడం లేదు.
- సామర్థ్యాల మేరకు గుణాత్మక విద్యా సాధన జరగడం లేదు.

## 8.8 SDP అమలు బాధ్యతలు – ప్రధానోపాధ్యాయుడు, ఎస్.ఎమ్.సి. ఛైర్మన్ సభ్యులు

## (SDP - Implementation - Roles and Responsibilities - HM, Chairman and Members of SMC)

పాఠశాల అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి, లక్ష్యాన్ని సాధించడానికి ముందుగా తయారుచేసుకున్న వార్షిక పాఠశాల అభివృద్ధి ప్రణాళికను అమలు పరచడంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్, సభ్యులు మరియు ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర వహించాలి.

- సమావేశంలో చర్చించిన అంశాల అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. అనుకొన్న స్థాయిలో లక్ష్యాల సాధన లేకపోతే అందుకు కారణాలు గుర్తించి అవి పూర్తయ్యేటట్లు తగు చర్యలు తీసుకోవాలి. అప్పటికప్పుడు ప్రస్తుత స్థితి, సాధించిన ప్రగతిని, సాధించవలసిన లక్ష్యాన్ని, సమీక్షించుకోవాలి. ప్రగతి, వనరుల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాల, స్వల్పకాల లక్ష్యాలను వివిధ కాలవ్యవధులలో నిర్ధారించుకోవాలి. వాటిని సాధించుటకు కృషిచేయాలి.

**ప్రధానోపాధ్యాయుల (మెంబర్ కన్వీనర్) విధులు–బాధ్యతలు:**

- రూపొందించిన పాఠశాల అభివృద్ధి ప్రణాళికను పాఠశాలలో అందుబాటులో ఉంచాలి.
- ప్రణాళిక ప్రకారం అమలు పరచవలసిన అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రణాళికలో పొందుపర్చిన అవసరాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలకు సంబంధించి జరిగిన అభివృద్ధిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి.
- గుర్తించిన అవసరాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలు పూర్తయిన పిదప వివరాలు సభ్యులందరికి తెలియజేయాలి.
- ప్రాధాన్యత క్రమంలో సూచించుకొన్న అంశాలలో ఏవైనా వెనుకబడి ఉన్నట్లయితే మరొక పర్యాయం సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించి అవసరమైన పరిష్కార మార్గాలను రూపొందించుకోవాలి.
- సాధించిన అభివృద్ధిని నెలనెలా పాఠశాల యాజమాన్య కమిటీ తల్లిదండ్రుల సమావేశంలో తెలపాలి.
- వనరుల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలి.
- సమావేశ అంశాలను, సమీక్ష అంశాలను, పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యాలలో సాధించిన అంశాలను పై స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి.

**పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ విధులు–బాధ్యతలు:**

బడిఅభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి చైర్‌పర్సన్ ఈ కింది వాటిని నిర్వహించాల్సి ఉంటుంది.

- ప్రభుత్వం నుండి అందే నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా చూడడం, బడి అభివృద్ధి ప్రణాళికలో నిర్ణయించుకొన్న ప్రకారం ఖర్చుచేయడం.
- బడి ఈడు పిల్లలందరూ బడిలో 100% నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడం, సక్రమంగా హాజరయ్యేలా చూడడం.
- పిల్లల అభ్యసనా సామర్థ్యాలను గమనించడం, లక్ష్యాలను నిర్దేశించి తరగతి వారీ సామర్థ్యాలు సాధించేలా సమీక్షలో చర్చించడం.
- ప్రణాళికలో సూచించుకొన్న పాఠశాల మౌళిక సదుపాయాల కల్పనకు కృషిచేయడం.
- మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందేలా చూడడం.
- విద్యార్థులకు అందించే సౌకర్యాలు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం వంటివి సకాలంలో సక్రమంగా అందేలా చూడడం.
- పాఠశాల వార్షిక ఆదాయం – ఖర్చులు లెక్కలు తయారు చేసుకోవడం.
- బాలల హక్కుల పరిరక్షణకు ప్రణాళిక తయారు చేసుకొని అమలులో ప్రముఖ పాత్ర వహించడం.
- సభ్యులు, తల్లిదండ్రులు సమావేశాలకు హాజరయ్యేట్లు చూడడం.

**పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు విధులు – బాధ్యతలు:**

పాఠశాల యాజమాన్య కమిటీ రూపొందించిన ప్రణాళికను క్రమబద్ధంగా అమలు చేయడం వల్ల పాఠశాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అభివృద్ధి ప్రణాళికను రూపొందించి అమలు పరచడం అనే ముఖ్యమైన ఆశయం నెరవేరాలంటే సభ్యులు భాగస్వాములవ్వాలి. కమిటీ సభ్యులు ఈ కింది బాధ్యతలు, విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

- సభ్యులు పాఠశాల అవసరాలు గుర్తించి వాటిని కల్పించుటకు కృషిచేయాలి.
- టీచర్ల సమస్యలు తెలుసుకొని సమస్యల నివారణకు ప్రయత్నించాలి.
- బడిమానిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి కృషి చేయాలి.
- సభ్యులలో ఐకమత్యం లేకపోవడం వలన పాఠశాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని గుర్తించాలి.
- విద్య ప్రాధాన్యత పట్ల అవగాహన పెంపొందించుకోవాలి.
- సభ్యుల హాజరు, క్రమశిక్షణకు అవసరమైన కట్టుబాట్లు కలిగి ఉండాలి.
- రాజకీయాలు, కులం, మతం, ప్రాంతం వంటి విభేదాలు చూపకుండా, గ్రూపులుగా ఏర్పడకుండా, పాఠశాల అభివృద్ధికి పాటుపడాలి.
- 'చదువుకోవడం పిల్లల హక్కు – చదివించడం పెద్దల బాధ్యత'గా ప్రణాళికను అమలు పరచడంలో తమ పూర్తి సహకారం, భాగస్వామ్యం అందించాలి.

## 8.9 SDP – అమలుకు సూచికలు

## (SDP - Indicators of implementation )

పాఠశాల అభివృద్ధి ప్రణాళిక అమలు జరుగుతున్న తీరును తెలుసుకొనుటకు కింది సూచికలు ఉపకరిస్తాయి.

- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక గురించి పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ, ఎస్.ఎం.సి సభ్యులకు పూర్తి అవగాహన ఉంటుంది. ఆ విద్యా సంవత్సరంలో ఏ ఏ కార్యక్రమాలు నిర్వహించాది? ఏం సాధించాలనుకుంటున్నారో స్పష్టంగా చెప్పగలగాలి.
- రూపొందించిన పాఠశాల అభివృద్ధి ప్రణాళిక పాఠశాలలో అందుబాటులో ఉంటుంది.
- సమీక్షా సమావేశాల హాజరు రిజిష్టరు.
- సమీక్షా సమావేశాల తీర్మానాల రిజిష్టరు.
- వనరుల సమీకరణ మరియు వినియోగం రికార్డ్
- బాధ్యతలు అప్పగించిన వారి వివరాలు.
- వివిధ అంశాల ప్రగతికి నిదర్శనాల రికార్డ్ – (రివ్యూ ఆధారంగా)
- పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులకు వివిధ అంశాల సమాచారం అందించిన వివరాలు.

నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి అమోదయోగ్యమైన ప్రణాళిక రూపొందించుకొని, ప్రణాళిక ప్రకారం బాధ్యతలు పంచుకొని అందరి సహకారం తీసుకొని కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తగిన ఫలితాలను సాధించవచ్చు.

## 8.10 SDP లోని అంశాలు

## (Items under SDP)

**ఎ) విద్యార్థుల వివరాలు:**

1. **నమోదు**
2. **హాజరు**
3. **నిలకడ**

**బి) గుణాత్మక అంశాలు:**

**4. గుణాత్మక విద్యా బోధన, బోధనాభ్యసన ప్రక్రియలు**

అ) తెలుగు

ఆ) హిందీ

ఇ) ఆంగ్లం

ఈ) గణితం

ఉ) పరిసరాల విజ్ఞానం/ సైన్స్

ఊ) సాంఘిక

**5. సహపాఠ్య విషయాల కార్యక్రమాల నిర్వహణ**

అ) కళలు మరియు సాంస్కృతిక విద్య

ఆ) ఆరోగ్యం, వ్యాయామవిద్య, యోగా, మెడిటేషన్

ఇ) పని, కంప్యూటర్‌విద్య

ఈ) విలువల విద్య, జీవన నైపుణ్యాలు

**6. ఉపాధ్యాయుల సంసిద్ధత, ప్రణాళికలు, ఉపాధ్యాయ డైరీ**

**7. వనరుల సద్వినియోగం**

అ) గ్రంథాలయ పుస్తకాలు

ఆ) రిఫరెన్స్ పుస్తకాలు

ఇ) బోధనాభ్యసన సామగ్రి

ఈ) టెలివిజన్

ఉ) రేడియో

ఊ) స్నేహబాల కార్డులు

ఎ) సైన్స్ సామగ్రి

ఏ) చార్టులు, పటాలు, నమూనాలు

**8. విద్యార్థుల కనీస స్థాయిలు**

ప్రతి తరగతిలో, ప్రతి సబ్జెక్టులో కనీస అభ్యసన స్థాయిలు

(చదవడం, రాయడం, లెక్కలు చేయడం)

**9. అన్ని సబ్జెక్టులలో తరగతికి నిర్ధారించిన సామర్థ్యాలు – విద్యాప్రమాణాల ఆధారంగా ఆశించే ఫలితాలు**

**10. నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు**

(సి.సి.ఇ., రిజిష్టరు, క్యుములేటివ్ రికార్డులు)

**సి) వనరులు మరియు మౌలిక వసతులు – కల్పన మరియు వాటి వినియోగం**

**11. పాఠశాల భౌతిక వసతులు**

అ) పాఠశాల భవనం, తరగతి గదులు

ఆ) విద్యుత్

ఇ) తాగునీరు

ఈ) మరుగుదొడ్లు

ఉ) ప్రహరిగోడ

ఊ) ఫర్నిచర్

ఎ) పచ్చదనం - పరిశుభ్రత

ఏ) ఆటల సామగ్రి

**12. పిల్లల సౌకర్యాలు**

అ) పాఠ్యపుస్తకాలు

ఆ) యూనిఫారం

ఇ) మధ్యాహ్న భోజనం

ఈ) స్కాలర్‌షిప్పులు

ఉ) ఆటల సామగ్రి

**13. గ్రాంటుల వినియోగం**

అ) ఎస్.ఎస్.ఎ.

ఆ) ఆర్.ఎమ్.ఎస్.ఎ.

ఇ) ఇతరములు

**డి) పాఠశాల కార్యక్రమాలు**

**14. నిర్వహించవలసిన అంశాలు**

అ) ఎస్.ఎమ్.సి. సమావేశం, పిల్లల ప్రగతి ప్రదర్శన

ఆ) పాఠశాల వార్షికోత్సవం

ఇ) పిల్లల ప్రతిభాపోటీలు

ఈ) అంతర కరికులమ్ కార్యక్రమాలు

ఉ) ఇతర పోటీలు

## 8.11 నమూనా SDP – ఫార్మాట్ (SDP Model Format)

| క్ర. సం | అంశం | ప్రస్తుత అంశం వారీగా స్థితి విశ్లేషణ | లక్ష్యం | వ్యూహాలు మరియు వనరులు | బాధ్యత వహించేవారు | కాలవ్యవధి | మూల్యాంకనం (సాధించినది / లేనిది) |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |

- మొదటి రెండు మూడు టర్మ్‌లలో పై అంశాల అమలుతీరు మరియు సాధించిన ప్రగతిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఎస్.ఎమ్.సి. లు కలిసి అంశం వారీగా ప్రగతిని రాయాలి. వచ్చిన సమస్యలను కూడా రాయాలి.

## 8.12 ముగింపు (Conclusion)

పాఠశాల ద్వారా ఆశించే లక్ష్యాల సాధనకు ఒక అవగాహనతో ప్రతి ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులు కార్యక్రమాలను ప్లాన్ చేసుకొని వాటిని సమర్థవంతంగా కలిసి నిర్వహించుకోవాలి. పాఠశాల ఒక చక్కని ప్రదేశం. పిల్లల ఊహలకు తగిన రూపం ఇచ్చి వారి కలలను సాకారం చేసేందుకు ఏర్పాటు చేసుకున్న సంస్థ. ఈ బడి అభివృద్ధికి ఎల్లవేళలా ఆలోచించాలి.

# 9. పర్యవేక్షణ మరియు సమీక్షలు

## (Monitoring and Reviews)


9.1 మౌలిక ప్రశ్నలు - ఆలోచించండి - ప్రతిస్పందించండి

**(Basic Questions - Think and Reflect)**

9.2 నేపథ్యం **(Context)**

9.3 మానిటరింగ్ - ప్రస్తుత పరిస్థితి

**(Monitoring - Existing Situation)**

9.4 **RTE-2005 -** మానిటరింగ్

**(RTE-2005 on Monitoring)**

9.5 పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు మరియు సంబంధిత వ్యక్తుల పనితీరుపై మానిటరింగ్ -విధానాలు

**(Monitoring the functional aspects of schools, educational institutes, offices, and related persons - procedures )**

9.6 మానిటరింగ్ - విధులు - బాధ్యతలు

**(Monitoring - Roles and Responsibilities)**

9.7 మానిటరింగ్ చేయాల్సిన రంగాలు/ అంశాలు - మానిటరింగ్ చేయాల్సిన అంశాలు.

**MEO, Dy.E.O., DIET/CTE/DEO. (Areas and Items of Monitoring pertaiing to MEO, Dy.E.O., DIET/CTE/DEO)**

9.8 మానిటరింగ్ సందర్భంగా పరిశీలించాల్సిన రిజిష్టర్స్, రికార్డులు - పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, **MRC, DIET etc.**

**(Registers and Records to be observed doing monitoring – School, School Complex, MRC, DIET etc.)**

9.9 సంస్థల మరియు వ్యక్తుల పనితీరుపై సమీక్షలు - నిర్వహణ

**(Review of performance of institutions and individuals)**

9.10 మానిటరింగ్ మరియు సమీక్షల నిర్వహణ -అమలుకు సూచికలు, ఆధారాలు

**(Monitoring and reviews - Indicators of implementation and evidence)**

9.11 ముగింపు

**(Conclusion)**

మానవాళి నేడు మునుపెన్నడూ ఎరుగని సంక్షోభపుటంచులవైపు పయనిస్తోంది. ఆధునిక విజ్ఞానశాస్త్రం మన అనేకానేక సమస్యల్ని పరిష్కరించిన మాట వాస్తవమే. కానీ మనం విచిత్రంగా లోలోపల ఒంటరి వాళ్ళుగా మిగులుతున్నాం. అభివృద్ధికీ మానవాత్మకూ మధ్య సమతుల్యత కరువైన కాలంలో మనమున్నాం. ఇప్పుడు మన అస్థిత్వంకోసం కావాల్సింది ఒక మహత్తర నైతిక, ఆధ్యాత్మిక విప్లవం.

**– సర్వేపల్లి రాధాకృష్ణన్**

మనం ఎంత ప్రతిభావంతులమైనా కావచ్చు. అంతా మన ప్రతిభతోనే, శ్రమతోనే తెలియచెప్పవచ్చుననుకుంటే అది వట్టి భ్రమ! పిల్లల్ని భాగస్వాముల్ని చెయ్యడంలోనే మన విజయమంతా ఆధారపడి ఉంది. బోధనోపకరణాలు తయారుచెయ్యడం, బ్రహ్మవిద్యేమీ కాదు. మనసు పెడితే ప్రతి ఒక్కరు ఆ పని చెయ్యగలరు. ఒక చిన్న కృత్యాన్నే పలు రూపాలుగా మలుచుకోవచ్చు, పలు విషయాలు దీనితో బోధించవచ్చు. కావాల్సిందల్లా ఉపాధ్యాయుడికి సృజనాత్మకత ఉండడమే. అది లేని ఉపాధ్యాయుడు పిల్లల సృజనాత్మకతను వెలికితియ్యనూలేడు వారిని సహభాగుల్ని చెయ్యనూలేడు. **– ఏకలవ్య**

**పిల్లల ప్రపంచం**

చిన్న పిల్లల్లానే వాళ్ళ ప్రపంచం ఎంతో చిన్నది. వాళ్ళ ఆనందం, ఆసక్తి, ఆకాంక్ష కూడా ఎంతో చిన్నది. ఎంత చిన్నదైతేనేం ఆ ప్రపంచం వాళ్ళకి అంత అద్భుతమైంది, సంపూర్ణమైంది. మనం పెద్దలం తెలిసీ తెలియక వాళ్ళనాప్రపంచం నుండి దూరం చేస్తుంటాం. వాళ్ళ లోకాన్ని చులకనగా చూస్తుంటాం. మన ఇంత పెద్ద ప్రపంచం భవిష్యత్తు వాళ్ళ ఇంత చిన్న ప్రపంచంమీదే ఆధారపడి ఉందని మనం మరిచిపోతుంటాం. వాళ్ళ ప్రపంచంలో అడుగుపెట్టి వాళ్ళలో కలిసి పోవడంలో, వాళ్ళలా అనుభూతి పొందడంలో ఎంత ఆనందముందో అంత పరమార్థముందని పెద్దలుగా మనం గుర్తుంచుకుంటే ఎంత బాగుంటుంది! **– రవీంద్రనాథ్ ఠాగూర్**

కొందరు విద్యార్థిని ఆదర్శవాద పద్ధతుల్లో విద్యావంతుణ్ణి చేయాలని ప్రయత్నిస్తే మరొకొందరు వైజ్ఞానిక పద్ధతుల్లో విద్యావంతున్ని చెయ్యాలని ప్రయత్నించారు. ఈ రెండు తాత్త్విక పద్ధతుల నేపథ్యంలో మతధార్మిక సంస్థలు విద్యనొక శీలవిద్యగా, నైతిక కార్యక్రమంగా కొనసాగించాలని మరొకవైపు ప్రయత్నించాయి.

మూడవది, అభివృద్ధి ప్రధాన లక్ష్యం మనిషి ఆకాంక్షల పరిపూర్ణ సాఫల్యమని నమ్మడం. అతని వ్యక్తిత్వం సంపన్నం కావడం. అతడొక వ్యక్తిగా, కుటుంబ సభ్యునిగా, సామాజికుడిగా, పౌరునిగా, వస్తూత్పత్తిదారుడిగా, కొత్త సాకేంతిక సాధనాల్ని కనుగొనేవాడిగా, సృజనాత్మక స్వాప్నికుడిగా అతడి అన్ని రకాల బాధ్యతలూ, ఆకాంక్షలూ వాటి సమస్త సంక్లిష్టతలోనూ వ్యక్తీకరణకు నోచుకోవడం.

'మా చివరి విశ్వాసం: కేవలం జీవితకాలపు సమగ్ర అధ్యయనం మాత్రమే పూర్ణమానవుడిని రూపొందించగలుగుతుందని. వివిధ రకాల పరిమితులు, ఆంక్షలు మనిషిని ఛిన్నాభిన్నం చేస్తున్న కొద్దీ అటువంటి పూర్ణ మానవుడి అవసరం నానాటికీ పెరుగుతూవస్తోందని. నేడు జ్ఞానమనేది జీవితకాలానికి సరిపడా ఒక్కసారి కూడ పెట్టుకునే సామగ్రి కాదు. అది జీవితకాలం పొడుగుతా రూపొందించుకుంటూ రావలసిన, మనకై మనం నిర్మించుకోవలసిన ఒక తెలివిడి. జీవించడమెట్లానో నేర్చుకోవడం, దాన్నే మేం లెర్నింగ్ టు బి అంటున్నాం'. **– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

# 9. మానిటరింగ్
# (Monitoring)

## 9.1 మౌలిక ప్రశ్నలు – ఆలోచించండి – ప్రతిస్పందించండి
## (Basic Questions - Think and Reflect)

1) పాఠశాల, మానిటరింగ్ మరియు విద్యాశాఖ సంబంధమైన మానిటరింగ్ అంటే ఏమిటి?
(What is school monitoring ? What is educational monitoring?)
2) మానిటరింగ్ ఎందుకు చేయాలి – ఉద్దేశ్యం. (What is the purpose of monitoring?)
3) వేటిని మానిటరింగ్ చేయాలి– ఎలా? (What to monitor and how?)
4) నాణ్యత మానిటరింగ్ అంటే ఏమిటి? (What is quality monitoring?)
5) బాగుగా మానిటరింగ్ చేయాలంటే మానిటరింగ్ అధికారులకు ఎలాంటి విషయ నిపుణత ఉండాలి? దానికి వారు ఎలా తయారు కావాలి?
(What preparation and expertise is required on the part of monitoring staff ?)
6) విద్యలో నాణ్యత పెంచడంలో మానిటరింగ్ ఎలా ఉపయోగపడుతుంది?
(Role of monitoring in improving quality of education ?)
7) ఉపాధ్యాయులకు పాఠశాల ఆధారిత సహాయ సహకారాలు అందివ్వడం అంటే ఏమిటి?
(What is on job support ? )
8) ఎవరు ఎవరిని మానిటరింగ్ చేస్తారు, ఎప్పుడెప్పుడు? ఏమి మానిటరింగ్ చేస్తారు?
(Who will monitor, what and whom and how frequently ?)
9) సమీక్ష అంటే ఎమిటి? ఎందుకు, ఎప్పుడు చేయాలి? చదువులో నాణ్యత పెంచడంలో మానిటరింగ్ ఎలా ఉపయోగపడుతుంది?
(What is review ? Why it is required and its role in improving the quality of education?)
10) ప్రభావ వంతమైన మానిటరింగ్ మరియు సమీక్షకు సూచికలు ఏమిటి?
(What are the indicators of effective monitoring and review ?)
11) మానిటరింగ్, సమీక్షల రిపోర్టులు ఎవరికి పంపాలి? ఎవరికి అవసరం? ఇవి ఎలా ఉపయోగించుకుంటారు?
(What is the feedback and reporting machinism and to whom to present and how these reports can be utilised?)

## 9.2 నేపథ్యం (Context)

14 సంవత్సరాలు వయస్సుగల బాలబాలికలందరికి ఉచిత నిర్బంధవిద్యను అందించడానికి ఉచిత నిర్బంధవిద్య హక్కు చట్టం – 2009 అమలులోకి వచ్చింది. ఈ చట్టం బాలబాలికలందరూ చదువుకోవడానికి వీలుగా తగిన సౌకర్యాలు, గుణాత్మకత, నాణ్యతతో కూడిన చదువు అందించడానికి నియమాలు, నిబంధనలు రూపొందించింది.

ఈ చట్టం పకడ్బందీగా అమలు కావడానికి పటిష్టమైన మానిటరింగ్ వ్యవస్థ ఒకటి ఉండాలి. దానికి తగిన విధివిధానాలు నిర్దేశించుకోవాలి. ఈ అధ్యాయంలో మనం ప్రస్తుత మానిటరింగ్ విధానం ఏ విధంగా ఉంది? చట్టంలోని

వివిధ సెక్షన్లు, సబ్‌సెక్షన్లు మానిటరింగ్ ఆవశ్యకతను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా ప్రస్తావించాయి? చట్టం అమలులో మానిటరింగ్ ఏవిధంగా ఉండాలి? ఎవరెవరు ఏఏ బాధ్యతలు చేపట్టాలి? ఈ క్రమంలో వివిధ శాఖల బాధ్యతలు ఏమిటి? వంటి పలు అంశాలగురించి తెలుసుకుందాం.

## 9.3 మానిటరింగ్ – ప్రస్తుత పరిస్థితి (Monitoring - Existing situation)

- సార్వత్రిక ఎలిమెంటరీ విద్య సాధన కోసం రాష్ట్ర విద్యాశాఖ అనేక కార్యక్రమాలు అమలుపరుస్తున్న విషయం మీకు తెలిసిందే. ఈ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించడానికి మానిటరింగ్ విధానాన్ని కూడా రూపొందించారు. కానీ అనేక కారణాల వల్ల మానిటరింగ్ అనేది ఆశించిన విధంగా జరగడంలేదు. ప్రస్తుత మానిటరింగ్ ఎలా ఉందో తెలుసుకుంటే ఉచిత, నిర్బంధ విద్య హక్కు చట్టం అమలును ఆశించిన విధంగా మానిటరింగ్ చేయడానికి తగిన ప్రణాళిక మనం రూపొందించుకోవచ్చు. మానిటరింగ్‌లో ఎదురయ్యే అవరోధాలు అధిగమించవచ్చు. ప్రస్తుత మానిటరింగ్ పరిస్థితి కింది విధంగా ఉంది.
- వివిధ విద్యా సంస్థలలో అమలవుతున్న విద్యాపర కార్యక్రమాల కొరకు ఆశించిన మేరకు మానిటరింగ్ జరగడంలేదు. ఒక దశ–దిశ నిర్దేశం చేసేవారు లేరు. పాఠశాలలకు, ఉపాధ్యాయులకు ఆసరా లభించడంలేదు.
- సంబంధిత శాఖలో ఇతర పనుల ఒత్తిడివల్ల మానిటరింగ్ చేయాల్సిన వ్యక్తులు పాఠశాలల సందర్శనకు, క్షేత్ర సందర్శనకు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. ఎక్కువ రోజులు, సమయం కార్యాలయాలకే పరిమితమవుతున్నారు.
- పిల్లల చదువులో నాణ్యత, నాణ్యమైన బోధన, పిల్లల అభ్యసన స్థాయిలు మెరుగుపరచడం వివిధ స్థాయిలలో ఉన్న విద్యాశాఖ అధికారుల ప్రథమ కర్తవ్యం. కానీ వారు 80–90 శాతం సమయం పరిపాలనా సంబంధిత కార్యకలాపాలకే కేటాయిస్తున్నారు. కావున క్రమంగా బోధనా నాణ్యత, ఉపాధ్యాయుల తయారీ, పిల్లల అభ్యసన స్థాయిలు రోజు రోజుకు పడిపోతున్నాయి.
- మానిటరింగ్ చేయాల్సిన మండల విద్యాధికారుల పోస్టులు, డైట్, సి.టి.ఇ.లలో లెక్చరర్ పోస్టులు అధిక సంఖ్యలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉండడం వల్ల మానిటరింగ్ జరగడం లేదు.
- కొన్ని సందర్భాలలో మానిటరింగ్ కోసం నియమితులైన వారికే మానిటరింగ్‌పై అవగాహన లేకపోవడం, మానిటరింగ్ సందర్భంలో చేయాల్సిందేమిటో తెలియకపోవడంతోపాటు విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న కొత్త పోకడలు, నాణ్యమైన బోధనా పద్ధతులపై అవగాహన లేకపోవడం.
- కొన్ని కారణాలవల్ల విద్యా కార్యక్రమాలు తమకు సంబంధించినవి కావని సమాజం భావించడం. ఫలితంగా పాఠశాల మానిటరింగ్ ప్రక్రియలో సమాజం చురుకైన పాత్ర పోషించడం లేదు.
- ఎక్కడైతే మానిటరింగ్ జరుగుతుందో అక్కడ తగిన నిర్మాణాత్మక అనుసరణీయ చర్యలు చేపట్టడం లేదు.
- మానిటరింగ్ పట్ల సరైన వైఖరి లేకపోవడం వల్ల మానిటరింగ్ ప్రాముఖ్యత, ప్రభావం గురించి సరిగా అవగాహన ఏర్పరచుకోలేకపోతున్నారు.
- మానిటరింగ్ వ్యక్తుల పనితీరును సమీక్షించే సమావేశాలు నిర్వహించకపోవడం, ఆవి పూర్తిచేయకపోవడం.
- సహచర ఉద్యోగులతో ఉన్న సత్సంబంధాలు ప్రభావితమవుతాయనే భయంతో ఆశించిన తీరులో మానిటరింగ్ చేయలేకపోవడం. పాఠశాల స్థాయిల్లో, పై స్థాయిల్లో తగిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యత వహించకపోవడం.

- మానిటరింగ్ పత్రాలు విశ్లేషణాత్మకంగా, వివరణాత్మకంగా ఉండకపోవడం.
- అనేక రకాల పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్నందువల్ల మానిటరింగ్ పలు రూపాలలో, వివిధ దశలలో ఉండడంతో దాని ప్రాముఖ్యత తగ్గడం, దేనికెవరు బాధ్యులో తేల్చుకోవడంలో గందరగోళం తలెత్తడం.

పైన పేర్కొన్న అంశాలు మానిటరింగ్ వైఫల్యాల గురించి ప్రస్ఫుటంగా చెబుతున్నాయి. ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం అమలు తీరు ఎప్పటికప్పుడు సమీక్షించి అమలులో ఎదురవుతున్న అవరోధాలను గుర్తించి వాటిని అధిగమించడానికి తగిన ప్రణాళికను రూపొందించుకుని అమలు పరచాల్సి ఉంది. ఇందుకోసం ముందుగా అసలు మానిటరింగ్ గురించి ఉచిత నిర్బంధవిద్యకు బాలల హక్కుచట్టం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏం చెబుతున్నదో తెలుసుకుందాం.

## 9.4 RTE-2005 - మానిటరింగ్ (RTE-2005 on Monitoring)

ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం-2009 నిబంధనలలో అధ్యాయం-1 సెక్షన్(2)లో "స్థానిక ప్రభుత్వం" అంటే నగర పాలక సంస్థ లేదా నగర పాలక సంఘం లేదా జిల్లా పరిషత్ లేదా నగర పంచాయితీ లేదా పంచాయతీ. ఏ పేరుతో పిలవబడినప్పటికీ బడి మీద పరిపాలనాసంబంధ నియంత్రణ కల్గిన సంస్థని సూచిస్తుంది లేదా అమలులో ఉన్న చట్ట ప్రకారం ఏదైనా గ్రామ, పట్టణ, నగరంలో స్థానిక ప్రభుత్వంగా పనిచెయ్యడానికి అధికారం పొందిన సంస్థని సూచిస్తుంది.

కావున గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీని మండలస్థాయిలో మండల పరిషత్, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్, నగరస్థాయిలో నగరపాలక సంస్థ తమ ఆధీనంలోని ప్రాంతం లేదా ఆవాస ప్రాంతంలో ఉన్న బాలలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించడానికి చట్టంలోని (సెక్షన్. 9-ఎ) ప్రకారం చదువుకోడానికి (సెక్షన్6)లో పేర్కొన్న విధంగా పరిసరప్రాంతంలో బడి అందుబాటులో ఉండేలా బాధ్యత వహించాలి. చట్టం సెక్షన్ 6లో బడిని స్థాపించే విషయమై సంబంధిత స్థానిక ప్రభుత్వ బాధ్యతను కింది విధంగా చెప్పింది.

"ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి సిఫారసు చేసిన పరిసర ప్రాంత పరిధిలో బడి లేకపోతే ఈ చట్టం అమలులోకి వచ్చిన మూడు సంవత్సరాలలోపు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం బడిని స్థాపిస్తుంది" కావున స్థానిక ప్రభుత్వం తన పరిసర ప్రాంతంలో బడిఈడు పిల్లలందరికి బడిని అందుబాటులో ఉంచి 100% నమోదుకు బాధ్యత వహించుటకు చట్టం కొన్ని సూచనలు చేసింది.

- ప్రతి స్థానిక ప్రభుత్వం చట్టం సిఫారసు చేసిన విధంగా తన పరిధిలో నివసిస్తున్న పద్నాలుగు ఏళ్లలోపు బాలలలందరి వివరాలకు చెందిన రికార్డులను నిర్వహించాలి.
- ప్రతి బాలుడు లేదా బాలిక బడిలో ప్రవేశం పొంది, పాఠశాలకు హాజరవుతూ ప్రాథమిక విద్యను పూర్తిచేసేలా పర్యవేక్షణ బాధ్యత వహించాలి.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా బడిలో చేరి ప్రాథమిక విద్యను పూర్తి చేయటంలో ఆటంకాలు లేకుండా చూడాలి.
- వలస కుటుంబాల పిల్లలకు కూడా బడిలో ప్రవేశం పొందేలా చూడడం.
- బడిలో ప్రవేశానికి ఎంపిక విధానం, కాపిటేషన్ ఫీజు/ రుసుం ఉండకుండా చూడడం.
- వయస్సు నిర్ధారణ కారణంతో బాలుడు/ బాలికకు బడిలో ప్రవేశాన్ని తిరస్కరించరాదు.
- బాల బడిలో చేరడానికి గడువు పెట్టకుండా వారు ఎప్పుడు ప్రవేశం కోరితే అప్పుడు చేర్చుకోవడం.

- తమ బిడ్డ లేదా సంరక్షణలో ఉన్న బాలుడు/ బాలికను పరిసర ప్రాంతంలోని పాఠశాలలో చేర్పించి ప్రాథమిక విద్యను అందించడం ప్రతి తల్లిదండ్రి లేదా సంరక్షకుని బాధ్యత.

కావున పైన సూచించిన చట్టంలోని నిబంధనలన్నీ పిల్లలందరు పాఠశాలలో చేరి చదువుకొనసాగించేలా ఉపాధ్యాయులు/ తల్లిదండ్రులు స్థానిక సంస్థలు బాధ్యత వహించాలని సూచించింది.

సెక్షన్-4లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం స్థానిక ప్రభుత్వ బాధ్యత అని కూడా పేర్కొంది. పై అంశాల మానిటరింగ్‌ను చేపట్టాలి.

సెక్షన్-4 ప్రకారం 6, 7 ఏళ్లు నిండిన బాలుడు / బాలిక బడిలో చేర్చకపోయినా లేదా చేర్చినా తరువాత ప్రాథమిక విద్యను పూర్తి చేయలేకపోయినా వారిని వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చుకోవాలి. తరగతికి చెందిన సామర్థ్యాల సాధన కూడా ఉపాధ్యాయుల బాధ్యతే.

అయితే ఈ విధంగా ప్రాథమిక విద్యలో ప్రవేశం పొందిన బాలలు పద్నాలుగు సంవత్సరాలు నిండిన తరవాత కూడా ప్రాథమిక విద్యను పూర్తిచేసే వరకు ఉచిత విద్యను పొందే హక్కును కలిగి ఉన్నారు.

పై నిబంధనల దృష్ట్యా ప్రతి బాలుడు / బాలిక వయస్సుకు తగ్గ తరగతిలో ప్రవేశం కోరినపుడు స్థాయికి సరిపడు సామర్థ్యాలు లేవని ప్రవేశం తిరస్కరించరాదు. ఆ బాలుడు / బాలికను వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చాలి. వీరు అభ్యసనలో అందరి పిల్లలతో కలిసి చదువుకొనసాగించడానికి వీలుగా ఆ స్థాయికి సరిపడే సామర్థ్యాలను పిల్లలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి. ఇందుకోసం నిర్ణీత సమయం కేటాయించుకొని ప్రణాళికను అమలు పరచాలి. అవసరమైన అభ్యసన సామగ్రిని పిల్లలకు అందించాలి. ఇందుకు స్థానిక ప్రభుత్వం లేదా ప్రభుత్వం పిల్లలకు కావలసిన అభ్యసనా సామగ్రి అందించే బాధ్యత తీసుకోవాలి. వీరు వయస్సుకు తగ్గ తరగతిలో నిర్ధారిత సామర్థ్యాలు కలిగి తరగతిలో కొనసాగుతున్నారా? లేదా మానిటరింగ్ చేయాలి.

సెక్షన్-18(1)లో ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో నడిచే బడి కాకుండా, సిఫారసు చేసిన విధంగా దరఖాస్తు చేసుకుని, సంబంధిత అధీకృత సంస్థ నుంచి గుర్తింపు ధృవీకరణ పత్రం పొందకుండా ఏ ఇతర బడిని స్థాపించకూడదు. పని చెయ్యనియ్యకూడదు అని స్పష్టంగా చట్టం పేర్కొంది. కావున స్థానిక ప్రభుత్వం తన పరిసరాలలో గుర్తింపు, ధృవీకరణ పత్రం లేకుండా ఎవరు కూడా బడిని స్థాపించకుండా చూడాలి. బాలబాలికలందరు గుర్తింపు, ధృవీకరణ పత్రం ఉన్న బళ్లలో చేరి ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా, కొనసాగుతూ ఉచిత ప్రాథమిక విద్య పొందేలా మానిటరింగ్ చేయాలి.

పాఠశాలలో చేరిన ప్రతి బాలుడు/ బాలికను చదువు పేరుతో దండించరాదు. వెనకబడిన వర్గాలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లల పట్ల వీరికి చదువురాదనే చులక భావంతో చూడకూడదు. వీరిని కూడా అన్ని వర్గాల పిల్లలతో సమానంగా కలిసి ఉండేలా, కూర్చొనేలా, అభ్యసన ప్రక్రియల్లో పాల్గొనేలా పాఠశాల ప్రవర్తన ఉండాలి. చట్టంలోని సెక్షన్ 17(1) ఏ బాలుడిని/ బాలికను కూడా శారీరక దండన, మానసిక వేధింపులకు గురిచేయకూడదని తెలిపింది. కావున చదువు పేరుతో, చదువుకు సంబంధించిన ఇతర కార్యక్రమాల పేర్లతో (ఎక్స్‌కర్షన్లు, ప్రాజెక్టు వర్కులు, వార్షికోత్సవాలు మొదలైనవి) ఫీజులు/డబ్బులు వసూలు చేయడం, పిల్లలు కార్యక్రమాలలో పాల్గొనుటకు ఉత్సాహం చూపినపుడు వారిని రుసుము పేరుతో పాల్గొననీయకపోవడం, అవమానపరచడం లాంటివి ఏ విద్యా సంస్థ చేయకూడదు. కావున పై విషయాలలో స్థానిక ప్రభుత్వం మానిటరింగ్ బాధ్యత వహించాలి.

పాఠశాలల్లో చేరిన పిల్లలందరు గుణాత్మక విద్యను పొందాలి. ఇందుకోసం విద్యాహక్కు చట్టం అధ్యాయం-5లోని సెక్షన్-29లో 1,2 సబ్‌సెక్షన్‌ల ద్వారా కొన్ని సూచనలు చేసింది. స్థానిక ప్రభుత్వం. గుణాత్మక విద్య అమలులో ఇవి ఏ మేరకు అమలు జరుగుతున్నాయనేది మానిటరింగ్ చేయాలి. ఉదాహరణకు సెక్షన్ 29-2ఎ లో రాజ్యాంగంలో పొందుపరచిన

విలువలకు బోధనాభ్యసన ప్రక్రియలలో ఏ మేరకు అవకాశం కల్పించబడింది? పిల్లలు ఎలాంటి విలువలు కలిగి వున్నారు? జాతీయ సంపద రక్షణలో వారి పాత్ర ఎలా ఉంది? పిల్లల వైఖరులు, అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? అనేవి పర్యవేక్షణ చేయాలి.

పిల్లలు బట్టీపట్టి చదవకుండా భయం, ఆందోళన వంటి వాటి నుండి వారిని విముక్తి చేసి వారు తమ అనుభవాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడంలో పాఠశాల తోడ్పడాలి.

సెక్షన్ 9లో క్లాజు (ఈ) ప్రకారం పద్నాలుగు సంవత్సరాల వరకు బాలలకు సంబంధించిన రికార్డులను నిర్వహించవలసిన అవసరం గురించి ఆర్‌టిఇ-2009 తెలియజేసింది. దీని ప్రకారం విద్యార్థులు పాఠశాలలో చేరినప్పటి నుండి అతనికి సంబంధించిన అన్ని విషయాలను రికార్డులలో చూపించవలసిన అవసరం ఉంది. కావున అటువంటి రికార్డులు పాఠశాలలో నిర్వహించటం జరుగుతుందో లేదో తెలుసుకోవటానికి 'మానిటరింగ్' చేయవలసిన అవసరం ఉంది. కాబట్టి ప్రతి స్థాయిలో 'రికార్డు' మరియు 'రిజిష్టర్స్' అందరూ తప్పక నిర్వహించాలి. నిర్వహణ తీరును మానిటరింగ్ చేసి వాటిని సరిగా నిర్వహించేలా చూడాలి.

మానిటరింగ్ ప్రాముఖ్యత గురించి ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం-2009 విస్పష్టంగా పేర్కొన్న విషయం మనం గమనించాం. అయితే చట్టం పేర్కొన్న విధంగా మానిటరింగ్ అమలు విధానం ఎలా ఉండాలో తెలుసుకుందాం.

## 9.5 పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు మరియు సంబంధిత వ్యక్తుల పనితీరుపై మానిటరింగ్ -విధానాలు (Monitoring the functional aspects of schools, educational institutes, offices, and related persons - procedures)

- విద్యా వ్యవస్థలో వివిధస్థాయిలలో గుణాత్మక అంశాల అమలును మానిటరింగ్ బాధ్యతను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయిలో మండల విద్యాధికారులు, డివిజన్ స్థాయిలో జిల్లా ఉప విద్యాధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా విద్యాధికారి చేపట్టాలి.
- సెక్షన్ 21లోని సబ్‌సెక్షన్ 2(ఎ) ప్రకారం సమాజం పక్షాన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) మానిటరింగ్ బాధ్యతను చేపట్టాలి.
- జిల్లా విద్యాధికారి వారంలో కనీసం 2 రోజులు ఎలిమెంటరీ పాఠశాలల పనితీరును మానిటరింగ్ చేయాలి. సందర్శించిన పాఠశాలలో గుణాత్మక అంశాలను కనీసం గంటపాటు సమీక్షించాలి. అలాగే ఇతర మానిటరింగ్ అధికారుల పరిశీలన రికార్డులను పరిశీలించాలి.
- జిల్లా ఉపవిద్యాధికారి వారంలో కనీసం 3రోజులు ఎలిమెంటరీ పాఠశాలల పనితీరును మానిటరింగ్ చేయాలి. పాఠశాల కార్యకలాపాలను, రికార్డులను నిశితంగా పరిశీలించాలి.
- జిల్లా ఉపాధ్యాయ విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ వారంలో 2 రోజులు ఎలిమెంటరీ పాఠశాలలు సందర్శించి పాఠశాలల పనితీరును మానిటరింగ్ చేయాలి. పరిశీలనలను నమోదు చేయాలి.
- మండల విద్యాధికారి వారంలో కనీసం 4 రోజులు మండల పరిధిలోని ఎలిమెంటరీ పాఠశాలల పనితీరును మానిటరింగ్ చేసి తన పరిశీలనలను నమోదు చేయాలి.
- మానిటరింగ్ బాధ్యతలు కల అధికారులందరూ మానిటరింగ్ బాధ్యతను ఇతర పనుల సాకుతో నిర్లక్ష్యం చేయరాదు. పిల్లల చదువుకు బాధ్యత వహించాలి.
- పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) విధిగా ప్రతి నెల నాల్గవ శనివారం పాఠశాలలను సందర్శించాలి. తన పరిశీలనలను నమోదు చేయాలి.

- మండల విద్యాధికారి తన పరిధిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం ప్రతి నెల మొదటి వారంలో నిర్వహించి పాఠశాలల పనితీరును సమీక్షించాలి. అలాగే జిల్లా విద్యాధికారి, జిల్లా ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ప్రతినెల 15వ తేదిన మండల విద్యాధికారులు, జిల్లా ఉప విద్యాధికారుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పాఠశాలల పరిస్థితిని సమీక్షించాలి.
- ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు నియమావళి–2010, ఆంధ్రప్రదేశ్‌లోని సెక్షన్ 3(17) ప్రకారం మండల రిసోర్సు పర్సన్ మండల స్థాయి ఎలిమెంటరీ విద్యా కార్యక్రమాలను సమన్వయిస్తూ తన పరిశీలనలను ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశంలో చర్చించడానికి సమర్పించాలి.

## 9.6 మానిటరింగ్ – విధులు – బాధ్యతలు (Monitoring - Roles and Responsibilities)

మానిటరింగ్ తదుపరి చేయాల్సిన కార్యక్రమాల (అనుసరణీయ కృత్యాలు) బాధ్యతలు, ఎవరిని ఎవరు మానిటరింగ్ చేయాలి, మానిటరింగ్ ఎప్పుడెప్పుడు, ఎక్కడ చేయాలి మొదలగు వివరాలు కింది పట్టికలో ఉన్నాయి.

| మానిటరింగ్ చేయాల్సినవారు | ఎవరిని మానిటరింగ్ చేయాలి | ఎప్పుడు | ఏ యే సంస్థలకు మానిటరింగ్‌కు పంపాలి | పాఠశాలలు/కళాశాలలు/కార్యాలయాలు సందర్శన |
|---|---|---|---|---|
| జాయింట్ డైరెక్టర్/ రాష్ట్ర స్థాయి అధికారులు | జిల్లా విద్యాధికారి | నెలకొకసారి | పాఠశాల/ఎంఆర్‌సి/ సిఆర్‌సి/ జిల్లా విద్యాశాఖ కార్యలయం ఆర్.వి.ఎమ్. ఆర్.ఎమ్.ఎస్.ఎ ప్రాజెక్టు కార్యాలయాలు | నెలకొకసారి |
| జాయింట్ డైరెక్టర్/ రాష్ట్ర స్థాయి అధికారులు | డైట్ / సిటిఇ ప్రిన్సిపాల్ ఐ.ఎ.ఎ.స్.ఇ.ప్రిన్సిపాల్ | నెలకొకసారి | పాఠశాల/ఎంఆర్‌సి/ సిఆర్‌సి/డైట్, సి.టి.ఇ., ఐ.ఎ.ఎ.స్.ఇ. | నెలకొకసారి |
| డిఇఓ, ప్రిన్సిపాల్ డైట్ / సిటిఇ / ఐ.ఎ.ఎ.స్.ఇ. | జిల్లా ఉప విద్యాధికారి | నెలకొకసారి | పాఠశాల/ఎంఆర్‌సి/సిఆర్‌సి | వారానికి 2 రోజులు |
| జిల్లా ఉప విద్యాధికారి / డిఇఓ/ప్రిన్సిపాల్ డైట్/సిటిఇ | మండల విద్యాధికారి | నెలకొకసారి | పాఠశాల/ఎంఆర్‌సి/సిఆర్‌సి | వారానికి 3 రోజులు |
| డిఇఓ/జిల్లా ఉపవిద్యాధికారి/ ప్రిన్సిపాల్ డైట్/సిటిఇ | ప్రధానోపాధ్యాయులు (స్కూల్ కాంప్లెక్సు) | నెలకొకసారి | స్కూల్ కాంప్లెక్సు పాఠశాలలు | నెలకొకసారి |
| డిఇఓ/జిల్లా ఉపవిద్యాధికారి/ ప్రిన్సిపాల్ డైట్/సిటిఇ/పాఠశాల యాజమాన్య కమిటీ | ప్రధానోపాధ్యాయులు (ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు) | నెలకొకసారి | ప్రాథమిక/ ప్రాథమికోన్నత పాఠశాలలు | వారానికి 2 రోజులు |
| ప్రధానోపాధ్యాయులు, ఎం.ఇ.ఓ./ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు/ పాఠశాల యాజమాన్యకమిటీలు/ డిఇఓ/జిల్లా ఉపవిద్యాధికారి/ ప్రిన్సిపాల్ డైట్/సిటిఇ | ఉపాధ్యాయులు | నెలకు ఒకసారి | తరగతిగది ఆచరణలు, పిల్లల విద్యా ప్రమాణాల స్థాయిలు, అమలు సహ పాఠ్యకార్యక్రమాల అమలు | వారానికి 3 లేక 4 రోజులు |

## 9.7 మానిటరింగ్ చేయాల్సిన రంగాలు/ అంశాలు – మానిటరింగ్ చేయాల్సిన అంశాలు MEO, Dy.E.O., DIET/CTE/DEO.

## (Areas and Items of Monitoring pertaiing to MEO, Dy.E.O., DIET/CTE/DEO)

సంబంధిత మానిటరింగ్ అధికారులు పాఠశాల స్థాయిలో వివిధ అంశాలను / రంగాలను మానిటరింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక క్రమబద్ధమైన, పకడ్బందీ ప్రణాళికతో, ఒక విజన్‌తో మానిటరింగ్ చేయాలి. అంశాల ప్రగతిని సమీక్షించి తన పరిశీలనలను నమోదుచేయుటకు మానిటరింగ్ ఫార్మాట్లను సిద్ధం చేసుకుని ఆయా దశలలో మానిటరింగ్ చేపట్టాలి. నమోదుచేసిన మానిటరింగ్ ఫార్మాట్లు పాఠశాలలను సందర్శించారనడానికి ఒక నిదర్శనం. ప్రతి అధికారి వీటిని పైఅధికారి తనిఖీకి సిద్ధంగా ఉంచాలి.

**పాఠశాల స్థాయిలో మానిటరింగ్ చేయాల్సిన అంశాలు/ రంగాలు:**

1. నమోదు: బడిఈడు పిల్లలందరూ (100%) పాఠశాలల్లో నమోదయ్యేలా చూడడం. బడి బయట పిల్లలు, బాలకార్మికుల వివరాలు సేకరించి సిద్ధంగా ఉంచుకోవడం, వారిని కూడా బడిలో చేర్చేందుకు ప్రయత్నించడం.
2. హాజరు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం పిల్లలందరూ పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరయ్యేలా, చదువుకొనసాగించేలా చేయడం.
3. నిలకడ: కనీసం 14 సం॥రాల వయస్సు వచ్చేసరికి ప్రతి ఒక్కరు (బాలబాలికలు) క్రమం తప్పకుండా బడికి హాజరవుతూ నిర్ధారిత తరగతులు, చదువు పూర్తిచేయడం.
4. వసతి సౌకర్యం: పాఠశాలలో కొనసాగడానికి అవసరమయ్యే ప్రాథమిక సౌకర్యాలు అంటే తరగతి గదులు, ప్రయోగశాలలు, దృశ్యశ్రవణ ఉపకరణాలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తగిన ఏర్పాట్లు, సరిపడు సంఖ్యలో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ఆటస్థలం, క్రీడా సామగ్రి మొదలగునవి సమకూర్చడం, ఉన్న వనరులు వినియోగించుకునేలా చూడడం.
5. బోధనాభ్యసన ప్రక్రియలు: ఈ ప్రక్రియ ఉపాధ్యాయుడు, పిల్లల మధ్య అర్థవంతమైన ఇంటరాక్షన్‌తో కూడి ఉండడం. ప్రస్తుతం మనం తరగతి గది నుండి ప్రజాస్వామిక సంస్కృతిని ఆశిస్తున్నాం. దీనికనుగుణమైన వాతావరణం తరగతి గదుల్లో ఉండడం. భాగస్వామ్య విధానాలను అవలంభించడం. మన తరగతి గదులలో వివిధ స్థాయిలు కలిగిన పిల్లలు ఉంటారు. ఉపాధ్యాయులు సానుకూల దృక్పథంతో పిల్లలందరి అభ్యసన అవసరాలు తీర్చడం, సమ్మిళిత విద్య అందేలా చూడడం. నల్లబల్లను ఉపయోగించి ఆసక్తికరంగా బోధించడం, చర్చలు జరపడం. కృత్యాలద్వారా, చేయడం ద్వారా, అనుభవాలద్వారా నేర్చుకోవడం.
6. ఉపాధ్యాయ తయారీ మరియు బోధనాభ్యసన సామగ్రి: ఉపాధ్యాయుల నుండి తరగతి గదుల్లో అభ్యసన మిత్ర వాతావరణం కల్పించడాన్ని మనం ఆశిస్తున్నాం. ఇందుకనుగుణంగా బోధనాభ్యసన కృత్యాలు ఉండాలి. తదనుగుణంగా ఉపాధ్యాయులందరూ పాఠ్యప్రణాళికలతో, సరైన అభ్యసన సామగ్రితో సంసిద్ధులు అయ్యేలా చూడడం. పరిసరాలలో అందుబాటులో ఉన్న ఖర్చులేని, తక్కువ ఖర్చుకల బోధనాభ్యసన సామగ్రి/ఇంటరాక్టివ్ అభ్యసన సామగ్రిని రూపొందించుకుని బోధనాభ్యసన ప్రక్రియల్లో ఉపాధ్యాయులు, పిల్లలు వినియోగించేలా చూడడం. ఈ మొత్తం ప్రక్రియలో సమాజ భాగస్వామ్యం కూడా ఉండేలా చూడడం.
7. వనరుల వినియోగం: వనరులు రెండు రకాలు– భౌతిక వనరులు, మానవ వనరులు. బోధనాభ్యసన సామగ్రి– చార్టులు, చిత్రాపటాలు, మ్యాపులు, గ్రంథాలయ పుస్తకాలు, స్నేహబాల కార్డులు, నమూనాలు, ఫ్లాష్‌కార్డులు,

కథాకార్డులు, డామినోకార్డులు, ఇవి అన్ని పాఠశాలల్లో ఉన్నాయి. వీటిని ఏ మేరకు పిల్లలు, ఉపాధ్యాయులు వినియోగించుకుంటున్నారు. సామాజిక సంస్థలు మొదలైనవి భౌతిక వనరులు అయితే అందుబాటులో ఉండే విషయ నిపుణులు (ఉపాధ్యాయేతర) అంటే వివిధ వృత్తులవాళ్లు, సామాజిక సేవా కార్యకర్తలు, రిటైర్డు ఉద్యోగులు, సమాజ సేవకులు, ప్రజాప్రతినిధులు, మొదలగువారు మానవ వనరుల కిందికి వస్తారు. ఉపాధ్యాయులు ఈ వనరులను తమ బోధనా లక్ష్యాల సాధనకు వినియోగించుకునేలా చూడడం.

8. గ్రాంటుల వినియోగం: వచ్చిన గ్రాంటుల వివరాలు, ఖర్చు మొదలగు వాటిని నోటీసు బోర్డుపై రాయాలి. గ్రాంటుల ఖర్చు కోసం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీలతో చర్చించి సంయుక్తంగా ఎలా ఖర్చుచేయాలో తీర్మానం చేయాలి. ఇవి సంబంధిత రిజిష్టర్‌లో నమోదు చేయాలి. ప్రత్యేక ఉద్దేశంతో అందించే డబ్బు మొత్తమే గ్రాంటు. పాఠశాలకు పాఠశాల గ్రాంటు, ఉపాధ్యాయ గ్రాంటు, నిర్వహణ గ్రాంటు వంటివి అందజేస్తారు. పిల్లలసర్వతోముఖాభివృద్ధికి పాఠశాలకు అందించిన గ్రాంటులను వినియోగించేలా ఉపాధ్యాయులకు తగిన సహాయ సహకారాలు అందించే బాధ్యత పాఠశాల యాజమాన్య కమిటీదే. కాబట్టి కమిటీ సభ్యులందరికీ పాఠశాలకు అందే గ్రాంటులపై పూర్తి అవగాహన ఉండాలి. పర్యవేక్షణ అధికారులు ఖర్చుపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కలిసి చేసిన తీర్మానాలు పరిశీలించాలి. కొన్న సామగ్రిని చూడాలి. నిధులు ఖర్చు చేసేటట్లు మానిటరింగ్ చేయాలి.

9. సెక్షన్ 29, సబ్‌రూలు 2(4) ప్రకారం: సంప్రదాయ పరీక్షల స్థానంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం జరిగేలా చూడడం. ప్రతి ఉపాధ్యాయుడు సి.సి.ఇ. రిజిష్టర్ మరియు క్యుములేటివ్ రికార్డ్ నిర్వహణ పర్యవేక్షించాలి. ఆధారాలు పరిశీలించాలి.

10. బాలమిత్ర వాతావరణం: బాలలందరూ ఆహ్లాదకర వాతావరణంలో చురుకుగా, వేగంగా నేర్చుకుంటారు. ఈ వాతావారణం భయరహితంగా ఉండాలి. పిల్లలతో ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ఉండాలి. ప్రస్తుత చట్టం శారీరక దండనను నిషేధించింది. అలాగే దూషించడం, కించపరచడం, మందలించడం పిల్లలను బాధిస్తాయి. పిల్లలపట్ల ఉపాధ్యాయులందరూ ప్రేమపూర్వకంగా స్నేహితుల్లా, తత్త్వవేత్తల్లా, మార్గదర్శకులుగా వ్యవహరించేలా చూడాలి. పిల్లలతో మాట్లాడాలి. వారి సమస్యలను, కోరికలను తెలుసుకోవాలి.

11. పాఠశాల యాజమాన్య సమావేశాలు/ ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల సమావేశాలు. పాఠశాలలో బాలలందరు చేసే కృత్యాలు, కనబరిచే ప్రతిభాపాటవాలు తల్లిదండ్రులకు సమాజానికి ఎప్పటికప్పుడు తెలియపర్చాలి. వేదికగా ఎస్.ఎం.సి./పి.టి.ఏ. సమావేశాలను వినియోగించుకోవాలి. పాఠశాల పారదర్శకంగా ఉంటే పాఠశాల కార్యకలాపాల్లో సమాజం చురుకుగా పాల్గొంటుంది. పాఠశాల కార్యక్రమాలు తనదిగా భావిస్తుంది. కార్యక్రమాలు మరింత బాగా నిర్వహించడాన్ని ప్రోత్సహిస్తుంది. కాబట్టి క్రమం తప్పకుండా ప్రతినెలా ఎం.ఎస్.సి. సమావేశాలు/ పి.టి.ఏ. సమావేశాలు ఆశించిన విధంగా జరిగేలా చూడడం. దీనికి ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలి. మినిట్స్ పుస్తకం నిర్వహణ పర్యవేక్షించాలి.

12. బాలబాలికలకు అందించే మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మొదలగునవి సక్రమంగా, సకాలంలో బాలలందరికి అందేలా చూడడం. అందకపోతే పై అధికారులను ఎస్.ఎమ్.సి. ద్వారా సంప్రదించాలి.

13. పాఠశాల అసెంబ్లీ, ఉత్సవాలు, పండుగలు, వినూత్న కార్యకలాపాలు మొదలగు అన్ని పాఠశాలల్లో సక్రమంగా, ఆశించిన విధంగా నిర్వహించేలా చూడడం. అంతర కర్రికులమ్ కార్యకలాపాలు జరిగేటట్లు చూడాలి.

పై అంశాలు/ రంగాలలో పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సమాజానికి ఉంది. ఇది నిరంతరం సమగ్రంగా జరగాల్సిన ఒకానొక అత్యంత కీలక ప్రక్రియ. బాగా పని చేసిన పాఠశాలలను అభినందించాలి. చేయని పాఠశాలలకు స్ఫూర్తిని కలిగించేలా కృషి చేయాలి.

**సంబంధిత అధికారులు మానిటరింగ్ చేయాల్సిన అంశాలు/ రంగాలు:**

**MEO, MRC/ Dy.EO, Division Level**

- మండలం/ డివిజన్‌లోని పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి, ప్రగతిలో ముందున్న పాఠశాలలు, వెనుకబడ్డ పాఠశాలలు.
- MEO/ Dy.EO పాఠశాలల సందర్శ, నింపబడిన మానిటరింగ్ పత్రాలు
- MRC గ్రంథాలయ నిర్వహణ, మాడ్యూల్స్ stock and issue registers
- Stock and issue registers, textbooks, equipment, furniture
- Funds utilissation - తీర్మానాలు, cash book etc.
- నెలవారీ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు – మినిట్స్ పుస్తకం
- పిల్లల అభ్యసనం, ప్రగతి కోసం MEO/ Dy.EO తీసుకొని అమలుపరుస్తున్న కార్యకలాపాలు
- రికార్డులు, రిజిష్టర్ల నిర్వహణ
- టూర్ డైరీ

**జిల్లా విద్యా శిక్షణ సంస్థ (DIET)**

- విద్యార్థుల, అధ్యాపకుల హాజరు
- ప్రీ సర్వీస్ ప్రోగ్రామ్స్ క్యాలెండర్ ప్రకారంగా అమలు
- వినూత్న కార్యక్రమాల ప్రణాళిక, అమలు
- School visits-visit reports
- Participation in review meeting
- Library వినియోగం
- Funds utilisation - students fee, govt. funds - తీర్మానాలు
- Stock and issue registers
- Staff meetings - minutes book
- Innovations
- Research studies - Action research
- Lab school activities

**జిల్లా విద్యాధికారి (DEO)**

- School visits-visit reports
- జిల్లాలో విద్యార్థుల ప్రగతి, మండల వారీగా వెనుకబడ్డ మండలాలు
- పాఠ్యపుస్తకాల సరఫరా
- జిల్లా స్థాయిలో MEO, Dy.EO లతో సమీక్షలు, minutes of the meeting
- జిల్లాలో నాణ్యమైన విద్య కొరకు తీసుకున్న నిర్ణయాలు, అమలుపరుస్తున్న కార్యక్రమాలు

- నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు
- కో కర్రికులం కార్యక్రమాల అమలు
- నూతన పాఠ్యపుస్తకాలు, కర్రికులం అమలులో తీసుకున్న చర్యలు–ఆధారాలు

## 9.8 మానిటరింగ్ సందర్భంగా పరిశీలించాల్సిన రిజిష్టర్లు, రికార్డులు – పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, MRC, DIET etc.
## (Registers and Records to be observed doing monitoring – School, School Complex, MRC, DIET etc.)

మానిటరింగ్ అధికారులు, మానిటరింగ్ చేపట్టే సందర్భంలో ముఖ్యమైన రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించాలి.

**పాఠశాల స్థాయి:**

- ఉపాధ్యాయుల హాజరు రిజిష్టరు
- పిల్లల హాజరు రిజిష్టర్లు
- నిరంతర సమగ్ర మూల్యాంకన రిజిష్టర్లు
- ఉపాధ్యాయ డైరీలు
- క్యాష్‌బుక్
- నిధులు /గ్రాంటు రిజిష్టరు, ఖర్చుకు చేసిన తీర్మానాలు, కొన్న సామగ్రి పరిశీలన
- ప్రగతి నివేదికలు, రిపోర్టులు
- వార్షిక, యూనిట్ / పాఠ్య ప్రణాళికలు
- ఎస్‌ఎంసి సమావేశాల రిజిష్టరు, మినిట్స్ బుక్
- ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశాలు రిజిష్టర్లు, మినిట్స్ బుక్
- స్టాకు రిజిష్టరు
- గ్రంథాలయ పుస్తకాల రిజిష్టర్లు మరియు స్టాక్ ఇష్యూ రిజిష్టర్
- ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ రిజిష్టరు
- పిల్లల హెల్త్‌కార్డులు మొదలగునవి
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక
- పాఠశాల కార్యకలాపాల డాకుమెంటేషన్ నివేదికలు – రిజిష్టరు

**స్కూల్ కాంప్లెక్సు:**

- గ్రాంటుల వినియోగ రిజిష్టరు, తీర్మానాలు
- క్యాష్‌బుక్
- స్టాక్ రిజిష్టరు
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల మినిట్స్ రిజిష్టరు
- సమావేశాల అజెండా, తీర్మానాల రిజిష్టరు మొదలగునవి.

**మండల వనరుల కేంద్రం:**

- టూర్ డైరీలు మరియు నింపబడిన మానిటరింగ్ పత్రాలు

- వర్క్‌డన్ స్టేట్‌మెంట్లు
- గుణాత్మక విద్యకు సంబంధించిన నివేదికలు
- ప్రధానోపాధ్యాయుల సమావేశాల రిజిష్టరు & మినిట్స్ రిజిష్టరు
- అటెండెన్స్ రిజిష్టరు
- ఎం.ఆర్.పి., ఎం.ఇ.ఓ. వారాంతపు సమీక్షా రిజిష్టర్లు
- కార్యక్రమాల డాక్యుమెంటేషన్ నివేదికలు–రిజిష్టర్లు
- ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణి రిజిష్టరు
- జనాభా రిజిష్టర్లు
- ఉపాధ్యాయుల వివరాల రిజిష్టర్లు
- శిక్షణా కార్యక్రమాల నివేదికలు
- మాడ్యూళ్ల స్టాక్ మరియు పంపిణీ రిజిష్టరు
- ప్రత్యేక అవసరాలుకల పిల్లల వివరాల రిజిష్టరు, ఉపకరణాల పంపిణీ రిజిష్టరు
- గ్రంథాలయ పుస్తకాల రిజిష్టరు
- గ్రాంటుల వినియోగ రిజిష్టరు
- స్టాక్ రిజిష్టరు
- క్యాష్‌బుక్
- వేతనాల రిజిష్టరు మొ॥వి

**జిల్లా ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థలు:**

- టూర్ డైరీలు, వర్క్‌డన్ స్టేట్‌మెంట్స్
- మానిటరింగ్ ఫార్మాట్స్ (పూరించినవి)
- మండలాలు, పాఠశాలల దత్తత తీసుకున్న లెక్చరర్ల వివరాలు
- ఉపాధ్యాయ శిక్షణల డాకుమెంటేషన్ రిజిష్టరు
- గ్రాంటుల వినియోగ రిజిష్టర్
- క్యాష్‌బుక్
- స్టాక్ బుక్ మరియు ఇష్యూ రిజిష్టర్
- హాజరు రిజిష్టర్ మొదలగునవి
- కార్యక్రమాల డాక్యుమెంటేషన్ రిజిష్టర్

## 9.9 సంస్థల మరియు వ్యక్తుల పనితీరుపై సమీక్షలు – నిర్వహణ
## (Review of performance of institutions and individuals)

సమర్థవంతంగా లక్ష్యాత్మకంగా సమీక్షలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు లక్ష్యసాధనలో ఎదరయ్యే సమస్యలను గుర్తించి వాటిని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. వాటిని అమలు చేయడానికి బాధ్యతలు పంచుకుని పనిచేస్తే తప్పకుండా లక్ష్యాలు సాధించగలం.

## స్థాయిల వారీగా పనితీరు సమీక్షలు:

| క్ర. సం. | స్థాయి | సమీక్షలో పాల్గొన-వలసిన వారు | సమావేశ అజెండా | నివేదికలు ఎవరికి సమర్పించాలి? |
|---|---|---|---|---|
| 1. | పాఠశాల - ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత | - ప్రధానోపాధ్యాయులు<br>- ఉపాధ్యాయులు<br>- ఎస్.ఎం.సి. | 1. పిల్లల ప్రగతి<br>2. నిరంతర సమగ్ర మూల్యాంకనం<br>3. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>4. పిల్లల హాజరు<br>5. పాఠ్యపథకాలు మొ॥నవి<br>6. సహపాఠ్య కార్యక్రమాల అమలు<br>7. పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నభోజనం | - క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు<br>- మండల విద్యాధికారులు<br>- ఉపవిద్యాధికారి |
| 2. | స్కూల్ కాంప్లెక్సు | - ప్రధానోపాధ్యాయులు<br>- ఉపాధ్యాయులు | 1. పిల్లల ప్రగతి<br>2. పాఠ్యపథకాలు/డైరీలు<br>3. కార్యక్రమాలఅమలు మొ॥నవి<br>4. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>5. సి.సి.ఇ.<br>6. సహపాఠ్య కార్యక్రమాల అమలు | - మండల విద్యాధికారి<br>- జిల్లా ఉపవిద్యాధికారి |
| 3. | మండలం | - కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు<br>- ప్రధానోపాధ్యాయులు<br>- మండల విద్యాశాఖ అధికారులు<br>- డైట్ లెక్చరర్స్ | 1. పాఠశాలల / పిల్లల ప్రగతి<br>2. స్కూల్ కాంప్లెక్సు సమావేశాలు<br>3. పాఠశాలస్థాయి సమావేశాలు<br>4. గ్రాంటు వినియోగం<br>5. కార్యక్రమాల అమలు మొ॥నవి<br>6. మానిటరింగ్, పాఠశాల సందర్శనలు<br>7. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>8. సి.సి.ఇ.<br>9. సహపాఠ్య కార్యక్రమాల అమలు | - జిల్లా ఉపవిద్యాధికారి<br>- జిల్లా విద్యాధికారి |
| 4. | డివిజన్ | - పాఠశాల ప్రధానోపాధ్యాయులు<br>- స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు<br>- జిల్లా ఉపవిద్యాధికార్లు<br>- డైట్ స్టాఫ్ | 1. పాఠశాలల / పిల్లల ప్రగతి<br>2. స్కూల్ కాంప్లెక్సు సమావేశాలు<br>3. పాఠశాలస్థాయి సమావేశాలు<br>4. గ్రాంటు వినియోగం<br>5. కార్యక్రమాల అమలు మొ॥నవి<br>6. మానిటరింగ్, పాఠశాల సందర్శనలు<br>7. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>8. సి.సి.ఇ.<br>9. సహపాఠ్య కార్యక్రమాల అమలు | - జిల్లా ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్<br>- జిల్లా విద్యాధికారి |
| 5. | జిల్లా | - మండల విద్యాధికారులు<br>- జిల్లా ఉపవిద్యాధికారులు<br>- జిల్లా విద్యాధికారి<br>- డైట్ స్టాఫ్ | 1. పిల్లల ప్రగతి మండలవారీగా<br>2. స్కూల్ కాంప్లెక్స్ పనితీరు<br>3. పాఠశాలల పనితీరు<br>4. కార్యక్రమాల అమలు మొ॥నవి<br>5. సందర్శనలు<br>6. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>7. సి.సి.ఇ.<br>8. సహపాఠ్య కార్యక్రమాల అమలు | - ఆర్.జె.డి.<br>- ఎస్.పి.డి.<br>- పాఠశాల విద్య డైరెక్టర్ |
| 6. | రాష్ట్రం | - జిల్లా విద్యాధికారులు<br>- ప్రిన్సిపాల్స్, డైట్<br>- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్<br>- పి.ఓ., ఆర్.వి.ఎం.,<br>- ఆర్.ఎం.ఎస్.ఎ.,<br>- ఎస్.సి.ఇ.ఆర్.టి., సంచాలకులు<br>- రాష్ట్ర పథక సంచాలకులు, ఆర్‌విఎం, ఆర్ఎంఎస్ఎ, C&DSE మొ॥వారు | 1. పిల్లల ప్రగతి జిల్లావారీగా<br>2. కార్యక్రమాల అమలు<br>3. సందర్శనలు, నివేదికలు<br>4. ప్రాబ్లమ్స్ & ఇష్యూస్<br>5. సి.సి.ఇ.<br>6. సహపాఠ్య కార్యక్రమాల అమలు | - కార్యదర్శి |

## 9.10 మానిటరింగ్ మరియు సమీక్షల నిర్వహణ – అమలుకు సూచికలు, ఆధారాలు (Monitoring and reviews - Indicators of implementation and evidence)

వివిధ స్థాయిలలో మానిటరింగ్ అధికారులు చేపట్టే మానిటరింగ్ విధానం అమలుకు సూచికలు/ ఆధారాలు కింది విధంగా ఉన్నాయి. వీటి ఆధారంగా అధికారుల మానిటరింగ్ విధివిధానాలను మూల్యాంకనం చేస్తారు. వీటి ఆధారంగా మానిటరింగ్‌కు సంబంధించిన వివిధ స్థాయిలో ఉండాల్సిన మానిటరింగ్ అధికారుల పనితీరును అంచనావేయడం జరుగుతుంది.

**అమలు సూచికలు/ ఆధారాలు:**

- అకడమిక్ గైడెన్స్ రిజిష్టరులో నమోదుచేసిన సూనచలు, సలహాలు
- పాఠశాలను సందర్శించిన వివిధ మానిటరింగ్ అధికారులచే పూరించిన మానిటరింగ్ ఫార్మాట్లు
- ఎస్.ఎం.సి. సభ్యులు/సమావేశాలకు హాజరై చేసిన తీర్మానాలు, పాఠశాల సందర్శనలో పరిశీలించిన అంశాలు, సూచనలు నమోదు చేసిన మినిట్స్ రిజిష్టర్లు
- ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమావేశాల రిజిష్టర్లు.
- మండల స్థాయిలో మండల విద్యాధికారి మానిటరింగ్ సందర్భంగా పూరించిన పాఠశాల మానిటరింగ్ పత్రాలు.
- సి.సి.ఇ. మరియు సహపాఠ్యాంశాల అమలు
- మండల స్థాయిలో మినిట్స్ రికార్డ్ చేసిన రిజిష్టర్
- మండల విద్యాధికారి తన పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు పంపించిన మినిట్స్ వివరాలు.
- సంబంధిత మానిటరింగ్ అధికారులు పూరించిన పాఠశాల/క్లష్టర్/మండల రిసోర్స్ కేంద్రం స్థాయి మానిటరింగ్ ఫార్మాట్లు, సమీక్షా సమావేశాల మినిట్స్
- సంబంధిత మానిటరింగ్ అధికారులు తాత్కాలిక టూర్ ప్రణాళికలు.
- పిల్లల ప్రగతి స్థాయిల నివేదికలు, పాఠశాల ప్రగతి నివేదికలు, క్లస్టర్, మండల నివేదికలు మొదలగునవి.
- వివిధ స్థాయిలలో క్రమం తప్పకుండా జరిగే సమీక్షా సమావేశాలు వాటి మినిట్స్ రికార్డ్ చేసి తగు చర్యల గురించి అందరికి పంపించడం. వాటి అమలు మరియు ప్రగతి తదుపరి సమావేశాలలో చర్చ.

## 9.11 ముగింపు (Conclusion)

ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009లో పేర్కొన్న అంశాల అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులతో బాటు స్థానిక సంస్థలపై ఉంది. ఆయా స్థాయిలలో పాఠశాలస్థాయి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు వివిధ దశలలో నిర్దిష్ట కాలంలో చట్టం అమలు తీరును మానిటరింగ్ చేయాలి. అనుసరణీయ చర్యలు చేపట్టాలి. ఈ మానిటరింగ్ వల్ల,

- పాఠశాల నుండి రాష్ట్రస్థాయి వరకు గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటాయి.
- చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలు/ అవరోధాలను గుర్తించడం జరుగుతుంది.
- ఉపాధ్యాయులు తరగతి గదులలో దండన రహిత, స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పగలుగుతారు. పిల్లల భావాలు, అభిప్రాయాలకు విలువనిస్తారు.
- పిల్లల చదువుతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం పెంపొందుతుంది.

- మానిటరింగ్ ఉపాధ్యాయుల పనితీరు, వృత్తిపరనైపుణ్యానికి మెరుగులు దిద్దుతోంది.
- మానిటరింగ్‌ను పకడ్బందీగా అమలుచేస్తే పిల్లల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.
- మానిటరింగ్ తదుపరి చేపట్టే సమీక్షలు, అనుసరణీయ చర్యల వల్ల ఉపాధ్యాయులు, అధికారులలో ఆత్మవిశ్వాసం పెంపొందడమేకాకుండా వారికి చక్కటి మార్గదర్శకత్వం లభిస్తుంది.

×××

## సైన్సు

సైన్సు పట్ల ఆసక్తి అంటే విజ్ఞానం పట్ల ఆసక్తి, సామాజిక ప్రగతిపట్ల ఆసక్తి, ఆధునికతపట్ల ఆసక్తి, హేతుతత్వం మీద మానవీయ దృక్పథం పట్ల ఆసక్తి, భవిష్యత్తుపట్ల మానవ మహామేథస్సు పట్ల, అపారమైన విశ్వాసమే, సైన్సుపట్ల విశ్వాసం.

ఈ ఆసక్తి పిల్లలకు సహజంగానే ఉంటుంది. ప్రశ్నించడంలో దీనిని మనం చూడొచ్చు. "ఇలా ఎందుకుంది? అలా ఎందుకు లేదు?" అనే పిల్లల శతసహస్రాధిక ప్రశ్నలు పెద్దలకు అల్పమైనవిగా, అర్థరహితమైనవిగా ఉండొచ్చు. కాని వాటిల్లోనే మానవ మేథస్సు అసలైన లక్షణం – నిరంతరాన్వేషణ తత్వం దాగి ఉంది. ఈ తత్వాన్ని మరింత పదునెక్కిస్తున్నామో, ఆటకెక్కిస్తున్నామో అన్నదే టీచర్లుగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న.

ఒక సబ్జెక్టు బాగా చెప్పడం అంటే, బాగా నేర్చుకోవడం అంటే– గీటురాయి ఆ సబ్జెక్టును ప్రేమించేలా చెయ్యడమే అని విద్యావేత్తలంటారు. మరి మానవ నాగరికతను గుహల నుంచి గ్రహాల దాకా నడిపించిన సైన్సు పట్ల మన బోధన ఎంత ప్రేమ పుట్టించగలుగుతుంది?

"సైన్సుకు హృదయం ఉంది. సైన్సుకు సగర్వ చరిత్ర ఉంది." అని సైన్సును గుర్తించి బోధిస్తే సైన్సు సాహిత్యంలా మనసును ఉద్విగ్నం చేస్తుంది. చరిత్రలా ఆవేశభరితంగా మారుస్తుంది. సైన్సు ప్రగతిలో సామాన్యుడి పాత్రను, జీవితంలో సైన్సుకు ఉన్న సజీవ సంబంధాన్ని విడమరచి చెప్పగలిగితే పిల్లలు తమ తృష్ణను సైన్సులో తీర్చుకుంటారు. తమ ప్రపంచాన్ని సైన్సులో వెతక్కుంటారు. తాము సైన్సుగా, సైన్సు తాముగా మారుతారు.

దీనిక్కావల్సింది పెద్ద పెద్ద ప్రయోగశాలలు కాదు, పరికరాలు కాదు, పరిసరాల నుంచి, జీవితాన్నించి, సైన్సును వెతికిపట్టివ్వగల సామర్థ్యం, సృజనశీలత. అతి సూక్ష్మ ప్రకృతి రహస్యాన్ని అరటిపండు వొలిచిపెట్టినట్లు నిత్యజీవితంతో రంగరించి చిన్నచిన్న ప్రయోగాలతో తెలియజెప్పగల్గడం. ఇది ఒక అన్వేషణ, ఇది ఒక కళ, ఇది ఒక శాస్త్రం, ఇదొక కర్తవ్యం, ఇదొక అపరూప బోధన రహస్యం. 'ఏకలవ్య' విద్యాసంస్థ నుంచి మనం దీనిని మనం తెలుసుకోవచ్చు. మన తరగతి గదికి అన్వయించవచ్చు. మన పిల్లల్ని సైన్సు ప్రియులుగా మార్చవచ్చు.

**– "చదువు విజ్ఞానం"**

అనేక అక్షరపూర్వ సమాజాలు, ఆదిమసమాజాలు తమ సంతతిని ఉత్తమ సాంఘిక జీవులుగా తీర్చిదిద్దడానికి అక్షరాలతో నిమిత్తం లేకుండానే ఒక అత్యుత్తమ జీవిత విధానాన్ని రూపొందించుకున్న ఉదాహరణలు మానవపరిణామ శాస్త్రంలో కోకొల్లలుగా ఉన్నాయి. విద్య అంటే ఒక తరం మరొక తరానికి జీవన సంస్కృతిని అందించడం. ఆ సంస్కృతి కేవలం అనుకరణ వల్ల అందేది కాదు. లేదా అది కేవలం మనుగడ సామర్థ్యమూ కాదు. అది కేవలం నైపుణ్యం కూడా కాదు.

అది జీవించడంలోని ఆనందాన్ని అనుభవించడాన్ని నేర్చుకోవడం. విద్య అంటే నేర్చుకోవడమెట్లానో నేర్చుకోవడమేనని మహనీయ విద్యావేత్తలంతా చెప్తూ వచ్చిందిందుకే. విద్య పిల్లవాడిలోని ఆత్మకి శిక్షణనివ్వాలనీ, అది అతని లోవెలుగుని వికసింపచేయాలనీ గాంధీజీ అనడంలోని ఉద్దేశమిదే. విద్య పిల్లవాడిని ప్రపంచ కేంద్రంలోకి తీసుకుపోగల మహత్తర ఉపకరణమనీ, సంస్కృతి అనీ గుర్తించడంతో చాలదు. అది మహనీయ మానవానందమని కూడా మనం గుర్తించాలి.

ప్లేటో సింపోజియాన్నో లేదా షేక్స్పియర్ 'కింగ్ లియర్' నాటకాన్నో చదవడంలో లేదా జపనీయ చిత్రకళనో, ఆఫ్రికన్ ఆదిమజాతుల దారు శిల్పకళనో, భారతీయ భరతనాట్యాన్నో చూడగలిగి, ఆనందించగలగడం జీవితకాల విద్యార్థికి మాత్రమే సాధ్యపడుతుంది. ఆ ఆనందానికి కేవలం వ్యక్తి మనుగడకు అవసరమైన నైపుణ్యం చాలదు. లేదా కొద్దిపాటి పరిసరాల పరిజ్ఞానమూ చాలదు. అది తననీ, ఎదటిమనిషినీ కూడా కలుపుకొని సామరస్యపూర్వకంగా తమకై తామొక ప్రపంచాన్ని నిర్మించుకోగల సంస్కృతి వల్ల మాత్రమే సాధ్యపడుతుంది.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**

నేడు గ్లోబలైజేషన్ పేరిట ప్రపంచం గ్లోబల్ కుగ్రామంగా మారిపోయిన పరిస్థితిలో ఇప్పటి విద్యా వ్యవస్థను పరిశీలించినపుడు మనకు కలిగే విస్మయాన్ని, ఆగ్రహాన్ని, సంక్షోభాన్ని వివరించడానికి ఈ మాటలు కూడా చాలవు. అయినా స్పష్టత కోసం దీన్ని మరొకసారి స్థూలంగా సంగ్రహీకరణ చెయ్యాలంటే ఇలా చెప్పవచ్చు.

- నేటి విద్య సమగ్ర విద్య కాదు. అది కేవలం నేటి మార్కెట్‌కు అనువైన రీతిలో వస్తుసేవల ఉత్పత్తిని శీఘ్రతరం చెయ్యడానికి, అధికతరం చెయ్యడానికి, లాభదాయకం చెయ్యడానికి అనువైన రీతిలో కొన్ని నైపుణ్యాల్ని ఇవ్వడం, ఉన్న నైపుణ్యాల్ని ఉన్నతీకరించడం, కొత్త నైపుణ్యాల్ని అన్వేషించడం మాత్రమే.
- దీనికీ విద్యానుభవ ప్రధాన లక్ష్యాలైన ఆత్మిక జాగృతికి, శీలనిర్మాణానికి, సహజీవన సంస్కృతికి ఏమీ సంబంధం లేదు. ఎక్కడన్నా సంబంధం ఉన్నట్లు కనిపించినా అది యాదృచ్ఛికమో లేదా ఇంకా నశించడానికి ఇచ్చగించని సంప్రదాయిక విద్యాసంస్థల అవశేషమో తప్ప మరేమీ కాదు.
- ఈ నైపుణ్యాల్ని అందించడమే నేటి విద్యా విధాన ప్రధాన లక్ష్యమని మనం అంగీకరించినా కూడా, ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో పైకి సార్వత్రికత ఉన్నట్లు కనిపిస్తున్నా, నిజానికి అది లోపల్లోపల మానవ సమాజాన్ని సుపీరియర్, ఇన్ఫీరియర్ సమూహాలుగా విడగొట్టడం తప్ప మరేమీ కాదు.
- ఈ విడదీయడం వల్ల మానవ సమాజంలో అత్యంత నిపుణులైన కొద్దిమందితో కూడిన సమూహం ఒక వైపూ, తమకు గాని, తమ సమాజాలకు గాని, తమ వస్తూత్పత్తికి గానీ, లేదా తమ సహజీవనానికి గాని ఏ మాత్రమూ ఉపయోగపడని కనీస యాంత్రిక అత్యధిక సంఖ్యాకుల సమూహం మరొకవైపూ ఏర్పడతాయి.
- విద్యని సహజీవన సంస్కృతిగా కాక నైపుణ్య సముపార్జనగా మాత్రమే పాఠశాలలూ, విద్యాలయాలూ ప్రతిపాదిస్తున్నందువల్ల మనుషులోబల్లి సహకార భావానికి బదులు అనారోగ్యకరమైన పోటీమనస్తత్వం ఏర్పడుతుంది.
- ఈ పోటీ వల్ల అత్యంత నిపుణులైన వాళ్ళకీ, ఏ మాత్రం నైపుణ్యం లేనివారికీ కూడా తమ తమ కుటుంబ సభ్యులతో, పొరుగువారితో, సహచరులతో, సాటిమనుషులతో కలిసి జీవించడమెలానో బోధపడదు.

**– వాడ్రేవు చినవీరభద్రుడు (కొన్ని కలలు – కొన్ని మెళకువలు)**